ఓమ్

విశిష్ట వేద సూక్తాలు

మంత్రకర్త :

సర్వ వ్యాపక సచ్చిదానంద సర్వేశ్వరుడు

భావార్థము:

సుమ్నార్థి

(డా॥ కోడూరి సుబ్బారావు)

సంపాదకులు

వాచస్పతి డా॥ మట్టి కృష్ణారెడ్డి. M.A.M.Ed.Ph.D. D.litt.,

గాయత్రీ ఆశ్రమ ట్రస్టు ప్రచురణ

విశిష్ట వేద సూక్తాలు

ప్రతులు : 1000

(Copy Right సర్వహక్కులు రచయితవి)

సర్వస్వామ్యములు : గ్రంథకర్తవి

దయానందాబ్దము : 197

సృష్టి సంవత్సరం : 1,96,08,53,125

విక్రమాబ్దము : 2079

కలియుగ సంవత్సరం: 5123 శుభకృత్ పుష్య శు.విదియ (25-12-2022)

మూల్యము : 120/- (తపాలా ఖర్చులు అదనము)

ప్రతులకు :

1. డా॥ కోడూరి సుబ్బారావు, వైదికవానప్రస్థాశ్రమం, హనుమాపురం(B.O.); (Via.)భువనగిరి-508117.
సెల్: 99089 94084.

2. గాయత్రీ ఆశ్రమ ట్రస్టు, ఆర్య సమాజము, 12-10-586/6,
మేడిబావి, సీతాఫలమండి, సికింద్రాబాద్-500 061.
సెల్: 98480 11073.

3. డా॥ మట్టి కృష్ణారెడ్డి, వేదధర్మ ప్రచార ట్రస్టు(రి.).,
2-27, ఆర్య సమాజ మందిరం,
బాదం కాంప్లెక్సు, చైత్యనపురి క్రాస్ రోడ్, దిల్‌సుఖ్‌నగర్.
హైదరాబాద్-60. సెల్: 94412 00322.

4. శ్రీ బాశెట్టి సత్తయ్య, జె-38, రాంగోపాల్ పేట,
సికింద్రాబాద్-500003, సెల్ : 99485 39795.

ప్రారంభ వాక్కులు

సుమారు 6 సంవత్సరాలనుండి ప్రతిరోజు కొన్ని వేద మంత్రాలకు సంక్షిప్త సరళార్థం వ్రాసి వాట్సప్ ద్వారా 25 గ్రూపులకు పంపుతున్న విషయం మీరందరెరిగినదే. వాటిని ఒక పుస్తకంగా చేసి ప్రచురిస్తే అందరికి అనుకూలంగా ఉంటుందని కొందరు మిత్రులు కోరారు. దాని కార్య రూపమే ఈ రెండు పుస్తకాలు – (1) చతుర్వేద మంత్ర రత్నాలు (2) విశిష్ట వేద సూక్తాలు.

నా ఆరోగ్యం, ఆహార విహారాలు కూడా మీరందరెరిగినదే. మూడు సంవత్సరాలుగా నా కాళ్ళల్లో శక్తి సన్నగిల్లుచున్నది. ఈ మధ్య శ్రావణ పౌర్ణమికి సికింద్రాబాద్ ఆర్య సమాజము వారు చేసిన పండిత సన్మానానికి రావలసి వచ్చింది. కొన్ని పనులుండి కొద్దిరోజులు మా గాయత్రీ ఆశ్రమ ట్రస్టులో ఉండవలసి వచ్చింది. దురదృష్టవశాత్తు నాకు వైరల్ ఫీవర్ రావటం, బాత్‌రూంలో పడిపోవడం జరిగాయి. దానితో నా శక్తి 10% శాతానికి తగ్గిపోయింది. ఇట్టి స్థితిలో ఈ 2 పుస్తకాలు ప్రచురిస్తున్నాను. మా సీతాఫలమండి ఆర్య సమాజక సభ్యులు శ్రీమాన్ డి. గంగాధర ఆర్య గారు, శ్రీమాన్ కంపిలి లక్ష్మణార్య గారు 2, 3 పర్యాయాలు ప్రూఫ్‌లు దిద్ది చాలా సహకరించారు.

శ్రీమాన్ ఆచార్య డా. మట్టి కృష్ణారెడ్డి గారు కంపోజింగ్ మరియు ప్రింటింగ్ వ్యవస్థ చేశారు. పూర్వం నా 4 పుస్తకాలకు దానం చేసిన శ్రీమాన్ M.R.K.మూర్తి రిటైర్డు ఇంజనీయరు గారే ఈ రెంటికి కూడా ముద్రణ వ్యయాన్ని దానంగా ఇచ్చి ప్రోత్సహించారు. శ్రీమతి ఎన్. జ్యోతి గారు మంత్రాలన్నింటిని చతుర్వేద సంహితనుండి మంత్రాలను గ్రహించి తప్పులు లేకుండా చక్కగా టైపు చేశారు. అట్టపైన ఒక అర్థవంతమైన ఒక ఫోటో ప్రచురించాలని సంకల్పం కలిగింది. ఈ విషయం విదుషీ సోదరి శ్రీమతి సవితా ఆచార్య గారికి తెలుపగా వారు కొన్ని ఫోటోలు పంపించి, అనుమతి కూడా తెలిపారు. ఇందరి సహకారంతో ఎట్లో ఈ రెండు పుస్తకాలను మీ ముందుకు తెస్తున్నాను.

వీరందరికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

విశిష్ట వేద సూక్తాలు

ఋగ్వేద సూక్తాలు

1. భగసూక్తము
   ఉషఃకాల ప్రార్థన
2. విష్ణు సూక్తము
3. వాగాంభ్రుణీ సూక్తము (వేదాలలో ఆదర్శ రాజ్యం)
4. నాసదీయ సూక్తము
5. రాత్రీ సూక్తము
6. ఆ నోభద్రాః సూక్తము (ప్రథమ స్వస్తి సూక్తము)
7. ప్రథమ స్వస్తి సూక్తము
8. రెండవ స్వస్తి సూక్తము
9. మూడవ స్వస్తి సూక్తము
10. నాల్గవ స్వస్తి సూక్తము
11. భిక్షు సూక్తము (అన్నదాన ప్రశంసా సూక్తము)
12. జ్ఞాన సూక్తము
13. మిత్రావరుణ సూక్తము
14. శ్రద్ధా సూక్తము
15. సూర్య సూక్తము
16. శచిపౌలోమి సూక్తము
17. ఋగ్వేదీయ శాంతి సూక్తము
18. ఋగ్వేద మృత్యు సూక్తం
19. వాయు సూక్తం
20. అఘమర్షణ సూక్తం

యజుర్వేద సూక్తాలు

21. యజుర్వేద యజ్ఞ మహిమ
22. రుద్ర నమకం (యజుర్వేద 16వ అధ్యాయం)
23. యజ్ఞ చమకం (యజుర్వేద 18వ అధ్యాయం)

అథర్వవేద సూక్తాలు

24. విజయ సూక్తం
25. కృషీవల సూక్తం
26. అథర్వ వేదీయ నక్షత్ర సూక్తము
27. జ్యేష్ఠ బ్రహ్మసూక్తము
28. కాలసూక్తం– I
29. కాలసూక్తం –II
30. వేదాలలో క్రిమినాశక సూత్రము
31. అమావాస్యేష్టి సూక్తము
32. పౌర్ణమాస్యేష్టి సూక్తము

ముద్రణ ద్రవ్యదాత తల్లితండ్రులు

తల్లి క్రీ॥శే॥ శ్రీమతి మానుకొండ
వీరరాఘవమ్మ గారు,
1917-1985

తండ్రి క్రీ॥శే॥ శ్రీ మానుకొండ
క్రిష్ణయ్య గారు
1905-1962

వీరి జ్ఞాపకార్థంగా
వేదాలలో మనోవిజ్ఞానం మానసిక చికిత్స అను ఈ గ్రంథం ముద్రించబడింది.



కుమారుడు
శ్రీ మానుకొండ రాధాకృష్ణమూర్తి

ముద్రణ ద్రవ్యదాత

శ్రీ మానుకొండ రాధాకృష్ణమూర్తిగారి సంక్షిప్త పరిచయము

శ్రీ మానుకొండ రాధాకృష్ణమూర్తిగారు గుంటూరు జిల్లాంతర్గత తెనాలి పట్టణంలో కీ.శ.1943, జూన్‌లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు స్వ॥ మానుకొండ వీరరాఘవమ్మ, స్వ॥ క్రిష్ణయ్య గార్లు.వీరు ధార్మికులు, శ్రమశీలులు, దానగుణములు గలిగిన, ఈ ఆదర్శ దంపతులకు మొత్తం 11 మంది సంతానం. వారిలో మొదటగా వరుసగా 5 గురు ఆడపిల్లలు పుట్టారు. అందులో చివరి ఇరువురు బాల్యమునందే మరణించిన తరుపరి 6వ సంతానంగా శ్రీ మానుకొండ రాధాకృష్ణ మూర్తి గారు జన్మించిరి. వీరి తరువాత ఇద్దరు మగపిల్లలు కలుగగా అందులో ఒకరు బాల్యములోనే మరణించిరి. అనంతరము ఒక ఆడపిల్ల, మరి ఇద్దరు మగపిల్లలు కలిగిరి. దురదృష్టవశాత్తు తండ్రి క్రిష్ణయ్యగారు తమ 57 సం॥ వయస్సులోనే 1962లో అకాల మృత్యువాతబడిరి. అప్పటికి రాధాకృష్ణమూర్తిగారి వయస్సు 19 సం॥లు మాత్రమే. అప్పటికి మిగిలిన నలుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలతో పెద్ద కుటుంబ బాధ్యత అంతా తల్లిగారైన వీరరాఘవమ్మగారిపై బడినది. మూర్తిగారు కుటుంబ బాధ్యతల నిర్వహణలో తల్లిగారికి సహకరిస్తూనే తన చదువును కొనసాగించిరి. తండ్రిగారి కోరికమేరకు తల్లిగారు మూర్తిగారి మెకానికల్ ఇంజినీరింగు పూర్తి అయ్యేవరకు చదివించిరి. 1967 సం॥ నాటికి B.Sc., తరువాత B.E. (Mechanical)డిగ్రీతో చదువును ముగించారు.

అనంతరము మూర్తిగారు మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్సులో ఉద్యోగము సంపాదించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంబంధిత ఆఫీసులలో పనిచేశారు. క్రమంగా సీనియర్ సైంటిస్ట్ అయ్యారు. ఆ విధముగా భారత ప్రభుత్వ రక్షణశాఖలో పని చేస్తూనే తన తమ్ముళ్ళు ముగ్గురికి వారి ఇష్టముల మేరకు సంతృప్తిగా చదివించిరి. దురదృష్టవశాత్తు తల్లిగారు తన 68 సం॥ వయస్సులో 1985 సం॥లో దివంగతులైనారు. అప్పటికి మూర్తిగారి వయస్సు 42 సం॥లు తరువాత వారు శ్రమించి 1994లో మిగిలిన ఒక చెల్లెలికి పెళ్ళిచేశారు. 'దానితో తన తండ్రిగారి చివరి కోరిక "అందరు బాగుండాలి" అనే తన కొరికను పూర్తిచేసి పితృవాక్య పరిపాలకులయినారు. మూర్తిగారు మాత్రము

నైష్ఠిక బ్రహ్మచారులుగానే ఇప్పటికి మిగిలి ఉన్నారు.

అనంతరము శ్రీ రాధాకృష్ణమూర్తిగారు తమ తల్లిదండ్రులపేరున **'మానుకొండ వీరరాఘవమ్మ మరియు క్రిష్ణయ్యగార్ల మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు'**ను 2006 సం॥లో స్థాపించిరి. అప్పటి నుండి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆ ట్రస్టు పేరుతో అనేకమందికి అనేక రకములుగా ఆర్థిక సహాయము చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా వైదిక ధర్మ ప్రచారమునకు పాటుపడుచున్న పండితులకు, సంస్థలకు ఉదారంగా చేయూత నిస్తున్నారు. వైదిక గురుకులాలకు, విద్యార్థులకు ఫీజులతో మరియు రోగులకు మందుల రూపములో సహాయము చేస్తూ ఉన్నారు. పేద వృద్ధులకు నెలవారి పించనులు గాను, కళ్ళకు ఆపరేషన్లకు గాను, ఇలా సమాజానికి సేవలందిచుచున్నారు. అంతేగాక గోదావరి కృష్ణానదుల పుష్కరాల సందర్భంగా సుమారు 27 వేలమందికి తమ తల్లిదండ్రుల పేరుమీద అన్నప్రసాద వితరణ కావించారు.

తెనాలిలో ఆర్య సమాజ భవనమునకు, నందివెలుగు వృద్ధాశ్రమమునకు, రాయపూడి వైదిక ఆశ్రమమునకు విరివిగా సాయం చేస్తున్నారు.

ఇక వారి ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పరిశీలించితే– శ్రీ రాధాకృష్ణమూర్తి గారికి 25 సం॥ల వయస్సులోనే తెనాలి పట్టణంలో 1967 సం॥లలో శ్రీ గానం రామారావు (రామదేవ్)గారి ద్వారా ఆర్య సమాజ సిద్ధాంతాలతో పరిచయం కలిగినది. ఆ వైదిక సిద్ధాంతాలు హేతుబద్ధం గానే కాక వైజ్ఞానికంగా కూడ ఉన్నాయని వీరు గ్రహించారు. శ్రీరామదేవ్‌గారే స్వయంగా, 'విద్వత్ శిరోమణి', 'షడ్దర్శనాచార్య', 'కళాప్రపూర్ణ' బిరుదాంకితులయిన పండిత గోపదేవ్‌శాస్త్రిగారితో పరిచయం చేశారు. ఆ గురుదేవుల ద్వారా వైదిక సిద్ధాంతాలను బాగుగా అవగాహన చేసుకున్నారు. వాటిపై శ్రద్ధ ఏర్పడినది. అప్పటినుండి 1996 లో శ్రీ శాస్త్రిగారు పరమపదించే వరకు తరచుగా గురువుగారిని కలుసుకుంటూ వారి జ్ఞానాన్ని మరింత విస్తృతం చేసుకున్నారు.

ప్రస్తుతం వీరు 76 సం॥ వయసులో ఆరోగ్యముగానే ఉన్నారు. హైదరాబాదునందుగల హైదర్‌నగర్ (మియాపూర్) ప్రాంతములో నివసిస్తున్నారు. ఎవరైనా మిత్రులు వారిని కలవటానికి వస్తే వారితో ఆధ్యాత్మిక, భౌతిక విషయాలు ప్రస్తావిస్తూ వైదిక సిద్ధాంతాలను సెంటిఫిక్‌గా విశ్లేషించి చెబుతూ, అవగాహన కలిగించుతూ జ్ఞాన బోధ చేసి పంపుతున్నారు.

అట్టి ఆదర్శ పురుషులకు సర్వవ్యాపక సర్వేశ్వరుడు శతాధిక ఆయువును ప్రసాదించుగాక! ఇదే ఉత్సాహంగా, మరెన్నోరకములుగా వైదిక ధర్మమునకు, సత్పాత్రులైన పేదలకు, విద్యావంతులకు సేవలందిస్తూ ఉందురుగాక! పరమాత్మ వారికి తగిన ఆయురారోగ్యములను ప్రసాదించునుగాక !

శ్రీరాధాకృష్ణమూర్తిగారితో నా స్వంత పరిచయము-అనుభవము

శ్రీమాన్ మానుకొండ రాధాకృష్ణమూర్తిగారు, ఆర్యసమాజ క్షేత్రములో ఉన్న పండితులకు, ప్రచారకులకు అందరకు తెలిసినవారే.

సుమారు 10 సం॥ క్రిందట నేను ప్రస్తుతం నివసిస్తున్న "వైదిక వానప్రస్థా శ్రమము (భువనగిరి)"నకు తన స్నేహితుడు శ్రీభావజుల సదానందాచారి గారితో కలిసి రాధాకృష్ణమూర్తిగారు రావటం జరిగినది. అప్పుడే నాకు వారితో ప్రథమ పరిచయం ఏర్పడినది. అనంతరం వారిని మా గాయత్రీ ఆశ్రమాని (సీతాఫల్‌మండి)కి వచ్చి చూసివెళ్ళమని నేను కొరడం, వారు వచ్చి వెళ్ళటం, అట్లాగే నేనును హైదర్‌నగరు హైదరాబాదులోని వారి నివాసం చూసి రావటం జరిగాయి.

ఆ పరిచయముతో వారు నావలెనే ఒంటరి జీవితం గడపటం ఇంటిపనులు, వంటపనులు-స్వయంగా చేసుకుంటూ ఆధ్యాత్మిక యౌగిక జీవితం గపడటం మొదలైన విషయాలను గుర్తించాను. దానితో నాకు వారిపై శ్రద్ధ ఏర్పడినది. వారికి కూడ నాపై అభిమానము అనుగ్రహముల కలిగాయి. దానితో నా స్వంత అవసరములను ఏదైనా ఆర్థిక సహాయము అవసరముంటే, నిస్సందేహంగా తనకు తెలుపమని అడిగిరి. తన శక్తికొలది సాయం చేస్తామన్నారు." అట్లే నాకు కంటి రెటీనా సమస్య వచ్చినప్పుడు, 2,3 పర్యాయముల ఆర్థిక సహాయము చేశారు. సమస్య కొంత ఉపశమించిన తదుపరి నా జీర్ణశక్తి చాలా ఇబ్బంది పెట్టినది. దానితో వారు మరొక సారి స్పందించి తనకు వేరేవైద్యులవలన తగ్గిన కొన్ని బాధలు సిద్ధవైద్యంతో తగ్గాయని మీరు వెంటనే బయలుదేరి వస్తే ఆ వైద్యుని వద్దకు తీసుకొని వేళతాననీ అందుకు కావలసిన ఖర్చులు అన్ని నేనే భరించుతానని కొండంత భరోసా నిచ్చారు. అన్నట్లుగానే నన్ను ఎల్లారెడ్డి గూడ హైదరాబాదులో ఆ సిద్ధవైద్యుని వద్దకు తీసివెళ్ళి మందులు ఇప్పించారు. అందుకు అవసరమయిన డాక్టరు ఫీజులు, మందుల ఖర్చులు అన్నీ ఉదారంగా వారే భరించారు.

శ్రీమాన్ యం.ఆర్.కె. మూర్తిగారు ఇది వరకు మా గాయత్రీ ఆశ్రమ ట్రస్టుకు 1. గాయత్రీ విజ్ఞానం, 2. వేదామృతము 3. వైదిక దర్శం అంటే ఏమిటి? 4. సంధ్యావందనము వైజ్ఞానిక సమాలోచనము 5. వేదాలలో మనోవిజ్ఞానం అనే 5 పుస్తకాలకు ఆర్థిక సహకారం అందించారు.

ఇవేకాక ఇంకను 4,5 రచనలు నావి ఉన్నవి. వాటికి కూడా ఆర్థిక సహాయం అందించగలనని శ్రీ మూర్తిగారు కొండంత భరోసా యిచ్చినారు. అట్టి దానశీలికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు.

సర్వవ్యాపక సర్వేశ్వరుడు వీరికి శతాధిక ఆయువును, ఆరోగ్యమును, ఉత్సాహమును ఇచ్చి కాపాడుగాక ! మరెన్నో దాన ధర్మములు చేసి పుణ్యభాగులగునట్లు ప్రేరేపించునుగాక!

ముద్రణ వ్యయ దాతకు ప్రత్యేక ధన్యవాదాలు

నాకు 2, 3 సంవత్సరాల నుండి కాళ్ళలో శక్తి సన్నగిల్లుచు వస్తున్నది. దానిని గురించి నాకు తెలిసిన హెూమియోపతి చికిత్సలు చేసుకుంటూ వస్తున్నాను. ఈ విషయం శ్రీ మూర్తిగారికి తెలుపగా వారు చైనా పద్ధతిలో ఆక్యుపంక్చర్ చికిత్స, శక్తి ప్రసారం డా॥ వెంకటేశ్వరరావు గారితో చేయించారు. మందుల ఖర్చులు, డాక్టర్ ఫీజు కూడా వారే భరించారు. కాని అది కూడా నాకు శక్తిని యివ్వలేకపోయాయి. అనంతరం నేను శ్రావణ పౌర్ణిమ రోజున సికింద్రాబాద్ ఆర్య సమాజము వారు చేసిన పండిత సన్మానానికి ఇక్కడకు – మేడిబావి ఆర్య సమాజానికి రావటం జరిగింది. సన్మాన కార్యక్రమానంతరం నాకు ఒక రకమైన వైరల్ ఫీవర్ వచ్చి శారీరక శక్తి ఒక్కసారిగా 10% తగ్గిపోయింది. ఇప్పుడు నా హెూమియో మందులతోనే చాలా నెమ్మదిగా కోలుకుంటున్నాను.

శ్రీ M.R.K. మూర్తి గారికి కూడా ఈ మధ్య ఆరోగ్యంలో ఇబ్బందులేర్పడుతున్నాయి. 2, 3 పర్యాయాలు చికిత్సాలయాలలో చేరటం, అప్పటికి ఉపశమించటం, తిరిగి అవే బాధలు రావటం జరిగింది. ఈ విషయం మేమంతా తెలుసుకొని ఆందోళన చెందాము. కాని, సర్వవ్యాపక సర్వేశ్వరుని

కృప వల్ల మిత్రులు శ్రీ సత్యప్రకాశ్ గారు, డా॥ వెంకటేశ్వరరావు గారు చౌటుప్పల్ గ్రామంలోని ఆయుర్వేద మూలికా వైద్యుని వద్దకు తీసుకువెళ్ళి వారిచ్చిన మందులు తెచ్చుకున్నారు. 10 రోజుల అనంతరం ఇప్పుడు మీకెలా ఉందని అడుగగా బాగున్నదని చాలా ఉత్సాహంగా మాట్లాడారు. మీరిదివరలో ఇచ్చిన వాగ్ధానం మేరకు ఈ రెండు పుస్తకాలకు కూడా నేను ఆర్థక సాయం చేస్తామన్నారు. చాలా సంతోషం. దైవకృప వల్ల ఈ రెండు పుస్తకాలు ప్రచురిస్తున్నాను. మరొక రెండు పుస్తకాలు వ్రాసి ఉన్నవి.

ఇట్టి విశాల హృదయులైన శ్రీ M.R.K. మూర్తి గారికి సర్వవ్యాపక సర్వేశ్వరుడు దీర్ఘ ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించునుగాక. వీరికి మా గాయత్రీ ఆశ్రమ ట్రస్టు సభ్యులు మరియు నేనును హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుచున్నాము.

"సర్వే జనాః సుఖినో భవన్తు" సర్వే సంతు నిరామయాః"

- సుమ్మార్థి

వ్యవస్థాపకుడు - **గాయత్రీ ఆశ్రమ ట్రస్టు**

ఓ3మ్ ఓ3మ్ ఓ3మ్

భగసూక్తము

ఉషఃకాల ప్రార్థన

1. ఓం ప్రాతరగ్నిం ప్రాతరిన్ద్రం హవామహే
ప్రాత ర్మిత్రావరుణా ప్రాత రశ్వినా ।
ప్రాతర్భగం పూషణం బ్రహ్మణస్పతిం
ప్రాతః సోమ ముత రుద్రం హువేమ ॥ ఋ. 7. 41. 1

భావము: ఓ అంతర్యామీ! ఈ ప్రభాత ప్రశాంత సమయాన నీ జ్ఞాన ప్రకాశాన్ని, నీ ఐశ్వర్యశక్తిని మాలోనికి ఆహ్వానించుచున్నాము. ఈ ప్రాతఃకాలాన మాకు పరమ మిత్రుడవు, శ్రేష్ఠశాసకుడవు, లోకాలోకాలు (సృష్టి ప్రళయాలు) చేయగల అశ్వినీ శక్తులు గల నిన్ను మాలోనికి సాదరంగా ఆహ్వానించుచున్నాము. భజనీయుడవు, బ్రహ్మాండ పోషకుడవు, వేదజ్ఞాన ప్రదాతవు అయిన నిన్ను స్వాగతించుచున్నాము. నీవు సత్పురుషులకు సౌమ్యుడవు. దుష్టులకు రుద్రుడవు. నీలో సహనము, మన్యువు అనంతంగా ఉన్నాయి. అట్టి దివ్యగుణయుక్త పరమేశ్వరా! నీకు మా సాదర స్వాగతం.

2. ఓం ప్రాత ర్జితం భగముగ్రం హువేమ
వయం పుత్ర మదితేర్ యో విధర్తా ।
ఆధ్రశ్చిద్యం మన్యమాన స్తురశ్చిద్
రాజాచిద్యం భగం భక్షీత్యాహ ॥ ఋ. 7. 41. 2

భావము: ఈ ప్రభాత ప్రశాంత సమయాన సదా జయశీలుడు, సర్వైశ్వర్యకర్త దుష్టులయెడ ఉగ్రుడు, ఆకాశ పుత్రునివలె భాసించు సూర్యుడిని ధరించువాడు అయిన సర్వాంతర్యామిని మాలోనికి సాదరంగా ఆహ్వానించుచున్నాము. సర్వవిధాల ధారణ చేయతగినవాడు, మాననీయుడు, శీఘ్రకారి, విశ్వ ప్రకాశకుడు, ఐశ్వర్యప్రదాత అయిన దేవదేవుని మాత్రమే మేము ఉపాసింతుము గాక! ఆ దేవుని యథార్థ స్వరూపాన్నే ఇతరులకు ఉపదేశింతుము గాక!

3. ఓం భగ ప్రణేతర్ భగ సత్యరాధో భగేమాం
ధియ ముద వాదదన్నః ।
భగ ప్ర ణో జనయ గోభిరశ్వైర్
భగ ప్రనృభిర్ నృవంతః స్యామ ॥ ఋ. 7.41.3

భావము: హే భగవాన్! పరమైశ్వర్యశాలీ! మమ్ము ఐశ్వర్యవంతుల మగుటకు ప్రేరేపింపుము. మా బుద్ధులలో వసించి ధర్మ మార్గాన ధనవంతులమగుటకు మమ్ము ప్రేరేపింపుము. పుణ్య కార్యాలను చేయ ప్రేరేపింపుము. కేవలం ధన ధాన్య సంపదలనేగాక, గో అశ్వాది సంపదలను, ఉత్తమ సంతాన సంపదను కూడా పొంద ప్రేరేపింపుము. నీ కృపవలన మేము ఉత్తమ నాయకులు గలవారమై, మేమును ఉత్తమ నాయకుల మగుదుము గాక!

4. ఓం ఉతేదానీం భగవంతః స్యామ ఉత
ప్రపిత్వ ఉత మధ్యే అహ్నామ్ ।
ఉతోదితా మఘవన్ త్సూర్యస్య
వయం దేవానాం సుమతౌ స్యామ ॥ ఋ. 7.41.4

భావము: హే మఘవన్! సకలైశ్వర్య ప్రదాతా! మేము ఈ ప్రభాత ప్రశాంత ఉపాసనా కాలంలోనూ, పూర్వాహ్నా, మధ్యాహ్నా, అపరాహ్నాకాలాల్లోనూ రోజంతా దైవీ సంపదతో వర్ధిల్లున్నట్లు అనుగ్రహింపుము. ఉదయించే సూర్యుని చూస్తూ మేమును ఉన్నతిని పొందుదుముగాక! దేవతల సుమతులలో – దివ్యగుణయుక్తులైన సాధు మహాత్ముల సత్సంగాలలో గడుపుదుముగాక! అట్టివారు ఆ సమయమున లభించకున్న మహర్షుల గ్రంథాల స్వాధ్యాయంలో గడుపుదుము గాక!

5. ఓం భగ ఏవ భగవానస్తు దేవా స్తేన వయం భగవంతః స్యామ ।
తం త్వా భగ సర్వ ఇజ్జోహవీతి స నో భగ పుర ఏతా భవేహ ॥
ఋ. 7.41.5

భావము: హే భగవాన్! సకలైశ్వర్యయుక్త పరమేశ్వరా! నీ కృపవలన మేమును దివ్యగుణాలతో దేవతలమగుదుము గాక! నిన్నుపాసించుటవల్ల మేమును సంపన్నుల మగుదుము గాక! నీవు భగవంతుడవు – సకలైశ్వర్య ప్రదాతవు కనుకనే జనులంతా

నిన్నే స్తుతిస్తారు. ప్రార్థిస్తారు. అగ్నిహెూత్రంలో ఆహుతులిస్తారు. అట్టి నీవే మాకు మార్గదర్శకుడవై సుపథాన నడిపింపుము. ఐశ్వర్యవంతులను, దివ్యగుణ సంపన్నులను చేయుము.

6. ఓం సమధ్వరాయోషసో నమన్త
దధిక్రావేవ శుచయే పదాయ ।
అర్వాచీనం వసువిదం భగం నో
రథమివాశ్వా వాజిన ఆ వహన్తు ॥ ఋ. 7.41.6

భావము: ఓ మానవులారా! ప్రభాత ఉషస్సులు వేగవంతమైన గుఱ్ఱాల వంటివి. అవి నమ్రములై మన అందరకు అనుకూలంగా ఉంటాయి. మన రమణీయ జీవన రథాన్ని మన లక్ష్యం వైపు వేగంగా తీసుకువెడతాయి.

7. ఓం అశ్వావతీ ర్గోమతీర్న ఉషాసో
వీరవతీః సదముచ్ఛన్తు భద్రాః ।
ఘృతం దుహాన విశ్వతః ప్రపీతో
యూయం పాత స్వస్తిభిః సదానః ॥ ఋ. 7.41.7

భావము: ఓ విదుషీ మహిళలారా! ఏ విధంగా అశ్వాలవలె లోకంపై ప్రసరించు ఉషస్సులు కళ్యాణకరములు, శక్తిప్రదములో ఆ విధంగా మీరు కూడా లోక కళ్యాణం చేయండి. మీరు విద్యలతో మా సభలను ప్రకాశపరచండి. శుద్ధజలములవలె మమ్ము తృప్తి పరచండి. మీరు మాకు సదా శుభములను కలిగించండి.

(భగ సూక్తము సమాప్తం)

విష్ణు సూక్తం

విష్ణువంటే వ్యాపించి ఉండేవాడని అర్థం. ఈ పదము 'విష్లృ-వ్యాప్తౌ' అనే సంస్కృత ధాతువుతో నిర్మించబడుతుంది. దీనికి 'వేవేష్టి వ్యాప్నోతి సర్వత్ర స విష్ణుః' అని మహర్షులు నిర్వచించారు. ఋగ్వేద ప్రథమ మండలంలోని 154వ సూక్తం విష్ణుసూక్తంగా ప్రసిద్ధిని పొందింది. 6 మంత్రాల ఈ సూక్తానికి ఋషి - దీర్ఘతముడు, దేవత - విష్ణువు.

ఈ సూక్తం సర్వవ్యాపక విష్ణువు యొక్క గుణకర్మ స్వభావాలను తెలుపుతుంది. ఆ సూక్తాన్ని గురించి కొద్దిగా ఆలోచిద్దాము.

1. ఓం విష్ణోర్ను కం వీర్యాణి ప్ర వోచం
యః పార్థివాని విమమే రజాంసి ।
యో అస్క భాయదుత్తరం సధస్థం
విచక్రమాణస్త్రేధోరుగాయః ॥ ఋ. 1.154.1

మహర్షులు ఉపదేశం: ఓ మానవులారా! ఈ పృథివిపై వివిధ లోకాలను, స్థలాలను, ప్రాణులను సృజించిన ఆ వ్యాపక విష్ణువే అంతరిక్ష ద్యులోకాలను, అందలి ప్రాణులను సృజించి పాలించుచున్నాడు. మరల అతడే ప్రళయకాలంలో ఈ సృష్టిని సత్త్వము, రజస్సు, తమస్సు అనబడే 3 రకాల పరమాణువులుగా మార్చుచున్నాడు. అట్టి మహిమాన్విత విష్ణువును వేదమంత్రాలతో స్తుతించండి. అందుకు అనుగుణమైన జీవితాన్ని గడపండి. మావలెనే మీరును ఇహ పర సుఖాలను పొందండి.

వివరణ: పరమేశ్వరుని గుణకర్మ స్వభావాలు వేదాలలోనే స్పష్టంగా చెప్పబడ్డాయి. ఋషులు వ్రాసిన గ్రంథాల ద్వారాను తెలుసుకోవచ్చుగాని కాలాంతరంలో స్వార్థపరులు వాటిలో కొన్ని కల్పితాలను చొప్పించారు. నేడు లోకంలో ప్రచారంలో ఉన్న స్తుతి పాఠాలలో వేద విరుద్ధ విషయాలు అనేకం ఉన్నాయి. వేదాలు స్వరయుక్తంగా కంఠస్థం చేయబడ్డాయి కనుక వాటిలో ప్రక్షిప్తాలు చేరలేదు.

2. ఓం ప్ర తద్ విష్ణుః స్తవతే వీర్యేణ మృగో న భీమః కుచరో గిరిష్ఠాః ।
యస్యోరుషు త్రిషు విక్రమణేష్వధిక్షియన్తి భువనాని విశ్వా ॥
ఋ. 1.154.2

భావము: ఓ మానవులారా! సర్వవ్యాపక విష్ణువుచే నిర్మింపబడిన మూడు కొలతలు గల ("జన్మ స్థాన నామములనే" 3 కొలతలు గల) ఈ సృష్టిని చక్కగా పరిశీలించండి. అతని సృష్టి నియమాలను ఏ ప్రాణీ ఉల్లంఘించలేదు. అతిక్రమించలేదు. దుష్టులు, కపటులు, మోసగాండ్రు ఎంతటి బలవంతులైనా, ఎక్కడ దాగివున్నా పట్టి శిక్షించును.

వివరణ: బ్రహ్మ సృష్టిని చేస్తుంటాడనీ, విష్ణువు పాలిస్తూంటాడనీ, మహేశ్వరుడు సంహరిస్తుంటాడనే కథలన్నీ కల్పితాలు. సృష్టి స్థితి లయాలు మూడింటిని చేసేది ఒకే ఒక్క దేవుడు. ఎవరి సహాయ సహకారాలు లేకుండానే సృష్టినంతటినీ చేస్తున్నాడని వేదం స్పష్టంగా చెబుతుంది.

3. ఓం ప్ర విష్ణవే శూషమేతు మన్మ గిరిక్షిత ఉరుగాయాయ వృష్ణే ।
య ఇదం దీర్ఘం ప్రయతం సధస్థమేకో విమమే త్రిభిరిత్ పదేభిః॥

ఋ. 1. 154. 3

భావము: ఓ మానవులారా! ఆ ఒక ఏకమాత్రుడగు విష్ణువే సృష్టిలోని స్థూల, సూక్ష్మ, అతిసూక్ష్మ పదార్థాలను – స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను – శరీర మనో బుద్ధులను కూడా రచించుచున్నాడు. ఇంతేగాక, ఆ మూడింటిలోను వ్యాపించి వాటిని ధరించి పాలించుచున్నాడు. అతని శక్తి సామర్థ్యాలను తెలుప మన మాటలు చాలవు. అతని శక్తి సామర్థ్యాలు అనంతం. కనుక ఓ మానవులారా! అతనినే స్తుతించండి. ప్రార్థించండి. ఉపాసించండి. అన్యుని ఉపాసించి మీ అమూల్యమైన సమయాన్ని నష్టం చేసుకోవద్దు.

4. ఓం యస్య త్రీ పూర్ణా మధునా పదాన్య
క్షీయమాణా స్వధయా మదన్తి ।
య ఉ త్రిధాతు పృథివీముత ద్యామేకో
దాధార భువనాని విశ్వా ॥ ఋ. 1. 154. 4

భావము: ఓ మానవులారా! ఈ సర్వవ్యాపక విష్ణువులోనే 3 రకాల వినాశరహిత పదార్థాలున్నాయి. అవే సత్వము, రజస్సు, తమస్సు అను 3 రకాల పరమాణువులు. ఈ మూడింటితోనే ఈ పృథివిపైనున్న పదార్థాలన్నీ సృజింపబడ్డాయి. పైన ఆకాశంలో కనబడే సూర్య చంద్ర నక్షత్రాది లోకాలలోని పదార్థాలు కూడా ఈ మూడు రకాల పరమాణువులతోనే నిర్మించబడ్డాయి. అట్టి మహిమాన్విత విష్ణువును మాత్రమే మీరు ఉపాసించండి. అన్యులను కాదు.

వివరణ: వాటినే నేటి వైజ్ఞానికులు Protons, Electrons, Neutrons అంటున్నారు. జీవాత్మ పరమాత్మల వలెనే ఇవియును నాశరహితములు. వీటి సామ్యావస్థనే ప్రకృతి అంటాయి దర్శన శాస్త్రాలు. దేవుడు వీటిని హెచ్చుతగ్గులుగా

కలిపి ఈ దృశ్యమాన ప్రపంచాన్ని నిర్మించాడంటాయి శాస్త్రాలు.

5. ఓం తదస్య ప్రియమభి పాథో అశ్యాం
నరో యత్ర దేవయవో మదన్తి ।
ఉరుక్రమస్య స హి బన్ధురిత్థా విష్ణోః
పదే పరమే మధ్వ ఉత్సః ॥ ఋ. 1. 154. 5

భావము: (ఈ మంత్రంలో వాచక లుప్తోపమాలంకారం ఉంది.)

ఏవిధంగా మానవులు సహాయపడు బంధు జనులను చూసి సంతృప్తులౌతారో; ఏవిధంగా దప్పిక గొన్న బాటసారులు జలపూర్ణమైన కూపమును – నూతిని చూసి నీరు త్రాగి తృప్తి చెందుతారో అదేవిధంగా ముముక్షువులు – ముక్తికొరకు సాధన చేస్తూ – ఈశ్వరీయ జ్ఞానమైన వేదాజ్ఞలను పాటిస్తూ తపస్సు చేస్తారో, అట్టివారు సమాధి సిద్ధిని పొంది దైవ దర్శనం చేసుకొని సంతృప్తులౌతారు. ఆనందమగ్నులౌతారు.

వివరణ: సర్వాంతర్యామియైన విష్ణువు యొక్క నిజ స్వరూపాన్ని దర్శించాలంటే అంతర్ముఖులై యోగాభ్యాసం చెయ్యవలసినదే. "ధారణా ధ్యాన సమాధు"లను సాధించవలసినదే. అప్పుడే జీవాత్మలమైన మనం మనలో వ్యాపించి ఉన్న విష్ణువును దర్శించగలం. పురాణ వర్ణిత చతుర్భుజ విష్ణువును కాదు సుమా! పరమానందాన్ని పొందాలి.

6. ఓం తా వాం వాస్తూన్యుశ్మసి గమధ్యై యత్ర
గావో భూరి సృఙ్గా అయాసః ।
అత్రాహ తదురుగాయస్య వృష్ణః
పరమం పదమవ భాతి భూరి ॥ ఋ. 1. 154. 6

భావము: ఓ యోగ శాస్త్రవేత్తలగు విద్వాంసులారా! విష్ణుపదము భూరిశృఙ్గా – అనేక కొమ్ముల వంటి ఉత్తమ తేజోమయ కిరణములు గలది. అట్టి స్థానమును (వామ్) గురు శిష్యులైన మీరిరువురును పరమ యోగులు చూపిన సాధన మార్గమునే అనుసరించండి. వారు పొందిన పరమానందాన్ని మీరును పొందండి. మీరు (అత్ర) ఈ శరీరంలోనే దానిని పొందవలెనని మేము కాంక్షించుచున్నాము.

వివరణ: మానవ జన్మను పొందిన మనం సాధించవలసినవి 4 అన్నారు ఋషులు. అవే "ధర్మ, అర్థ, కామ, మోక్షాలు" అనే చతుర్విధ పురుషార్థాలు. ఈ నాల్గింటిలోనూ సర్వదుఃఖ నివృత్తిరూప మోక్షాన్ని పొందటమే పరమ పురుషార్థం అన్నారు. కనుక, వేదాల ద్వారా ముక్తి సాధనాలేవో తెలుసుకొని సాధన చెయ్యండి. ముందుగా మహర్షి దయానంద విరచిత సత్యార్థ ప్రకాశంలోని 7, 8, 9 సముల్లాసాలను (అధ్యాయాలను) బాగుగా అధ్యయనం చెయ్యండి. అనంతరం పతంజలి విరచిత యోగదర్శనం చదువుచూ సాధన చెయ్యండి.

(విష్ణు సూక్తము సమాప్తం)

వాగాంభ్రుణీ సూక్తము

వేదాలలో ఆదర్శరాజ్యం

'అంభ్రుణి' అంటే 'అనేకములు' అని అర్థం. ఈ సూక్తం అనేకమందితో కూడిన రాజ్యసభ (Parliament) తనను గురించి తాను చెప్పుచున్నట్లున్నది. అంటే - రాజ్యసభ ఎవరెవరితో కూడి ఉండాలో సూచించుచున్నది. అనేక ప్రాంతాలలో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులతో - అనేక వాదనలతో కూడి ఉంటుంది కనుక పార్లమెంటును 'వాగాంభ్రుణీ' అంటుంది ఈ సూక్తం.

ఈ సూక్తాన్ని కొందరు వాగ్దేవిగాను (సరస్వతిగాను), మరికొందరు ముగ్గురమ్మల మూలపుటమ్మ 'దేవీ'గాను భావించి అర్థాలు వ్రాశారు. మనం మంత్రాలను పరిశీలించి చూస్తే మొదటి అభిప్రాయమే - రాజ్యసభ (Parliament) గానే అర్థం చేసుకుంటే ఎక్కువ మేలు జరుగుతుంది. సభలో ఎవరెవరు ఉండాలో తెలుస్తుంది. రాజ్యసభకు ఎట్టి అధికారాలుండాలో తెలుస్తుంది.

1. ఓం అహం రుద్రేభి ర్వసుభిశ్చరామ్యహమాదిత్యైరుత విశ్వదేవైః ।
అహం మిత్రావరుణోభా బిభర్మ్యహమిన్ద్రాగ్నీ అహమశ్వినోభా ॥

ఋ. 10. 125. 1

భావము: (అహం) రాజార్యసభ నగు నేను రుద్రులతోను, వసువులతోను, ఆదిత్యులతోను, మరియు విశ్వే దేవతలతోను కూడియున్నాను. మరియు నేను మిత్రావరణులతోను, ఇంద్రాగ్నులతోను, అశ్వనీ దేవతలిద్దరితోను కూడియున్నాను.

వివరణ: వసువులు = 12 సం. బ్రహ్మచర్య వ్రతాన్ని బూని సాంగోపాంగంగా ఒక వేదం చదువుకొన్న విద్వాంసులు.

రుద్రులు = 24 సం. బ్రహ్మచర్యాన్ని పాటించి రెండు వేదాలు చదువుకొన్న విద్వాంసులు.

ఆదిత్యులు = 36 సం. బ్రహ్మచర్యాన్ని పాటించి 4 వేదాలను చదువుకున్న విద్వాంసులు.

విశ్వే దేవతలు = సమస్త రంగాలలోని విద్యావేత్తలు, వైజ్ఞానికులు.

మిత్రా వరుణులు = జలవాయు విద్యలలో నిపుణులు.

ఇంద్రాగ్నులు = విద్యుత్ భౌతికాగ్ని రంగాలలో నిపుణులు.

అశ్వినౌ = అశ్వనీ దేవతలు – ఔషధ వైద్యులు మరియు శస్త్రచికిత్సా నిపుణులు (Physicians and Surgeons).

ఇన్నిరకాల విద్యలలో ఆరితేరినవారు కూడా రాజార్యసభలో (Parliament) ఉండాలంటున్నది ఈ మంత్రం. ఇంతేగాక మరెంతోమంది ఉండాలంటుంది ఈ వాగాంభ్రుణీయ సూక్తం. క్రమంగా తెలుసుకుందాము.

2. ఓం అహం సోమమాహనసం బిభర్మ్యహం
త్వష్టారముత పూషణం భగమ్ ।
అహం దధామి ద్రవిణం హవిష్మతే
సుప్రావ్యే యజమానాయ సున్వతే ॥ ఋ. 10. 125. 2

భావము: రాజార్యసభనగు నేను సర్వ శతృవులను సంహరించగల సోమతత్త్వమును – బల–వీర్య పరాక్రమాలను ధరించియుంటిని. ఇంతేగాక, నేను సూర్యశక్తిని (Solar Energy ని), దేశ ప్రజలను పోషించగల ధాన్య పుష్టిని, ధన కనక వస్తు వాహనాది సమస్త ఐశ్వర్యాలను కూడా ధరించియుంటిని. యజ్ఞ యాగాది క్రతువుల నొనర్చువారికి, దానశీలురకు, పరిశ్రమ శీలురకు నేను పుష్కలమైన ధనధాన్యములనిచ్చి సంతృప్తి పరచెదను.

3. ఓం అహం రాష్ట్రీ సంగమనీ వసూనాం
చికితుషీ ప్రథమా యజ్ఞియానామ్ ।

తాంమా దేవా వ్యదధుః పురుత్రా
భూరిస్థాత్రాం భూర్యావేశయన్తీమ్ ॥ ఋ. 10. 125. 3

భావము: రాజ్యసభనగు నేనే ఈ దేశమున కంతటికి స్వామినినై యున్నాను. నేనే ప్రజలనుండి పన్నుల రూపమున ధనములను సంగ్రహిస్తాను. దేశంలో ఎక్కడెక్కడ ఏఏ అవసరాలున్నాయో చక్కగా పరిశీలించి, ఆలోచించి ఆ ధనములను తగినవిధంగా ఆయా పనులకు వినియోగిస్తాను, నా సభలో విద్వాంసులు, వివేకవంతులు, యజ్ఞశీలురునైన మంత్రులు నాకు చక్కటి సూచనలిస్తారు. కార్యకర్తలు, ప్రజలు నాకు సహకరిస్తారు.

4. ఓం మయా సో అన్నమత్తి యో విపశ్యతి
యః ప్రాణితి య ఈం శృణోత్యుక్తమ్ ।
అమన్తవో మాం త ఉప క్షియన్తి శ్రుధి
శ్రుత శ్రద్ధివం తే వదామి ॥ ఋ. 10. 125. 4

భావము: ఎవరు ఈ దేశంలో పుట్టి పెరిగి అన్నజల పానీయాదులను సేవించుచున్నారో, వివేక దృష్టితో చూచుచున్నారో, వినుచున్నారో, శ్వాసించుచున్నారో వారందరి వెనుక ఉన్నది నేనే (నా రాజ్యవ్యవస్థనే). నా నుండి ఇంత ప్రయోజనం పొందుతూ కూడా నాకు విరుద్ధంగా ఆలోచించుచు, నన్ను ఆక్షేపించువారు కొందరున్నారు. ఓ శ్రోతలారా! వినుడు. మీ మంచికే నేనీ నియమాలను ఏర్పరచాను. నన్ను అర్థం చేసుకోమని సూచిస్తున్నాను.

5. ఓం అహమేవ స్వయమిదం వదామి
జుష్టం దేవేభిరుత మానుషేభిః ।
యం కామయే తంతముగ్రం కృణోమి తం
బ్రహ్మాణం తమృషిం తం సుమేధామ్ ॥

ఋ. 10. 125. 5

భావము: విద్వాంసుల చేతను, సామాన్య మానవుల చేతను సేవింపబడు రాజ్యసభ నగు నేనే మానవమాత్రులందరికి వారి వారి గుణకర్మ స్వభావాలకు తగిన విధంగా ఉపదేశిస్తాను. వారిలో కొందరు భోగ ప్రవృత్తిని విడిచి నన్ను ఆశ్రయిస్తారు. దేవయాన మార్గాన పయనిస్తారు. అట్టివారిని నేను బ్రాహ్మణులుగా

– వేద విద్వాంసులుగా, ఋషులుగా, చక్కటి మేధావులుగా తీర్చిదిద్దుతాను.

6. ఓం అహం రుద్రాయ ధనురా తనోమి
బ్రహ్మద్విషే శరవే హన్తవా ఉ ।
అహం జనాయ సమదం కృణోమ్యహం
ద్యావాపృథివీ ఆ వివేశ ॥ ఋ. 10. 125. 6

భావము: రాజ్యసభనగు నేను ఎంతటి రుద్రుల వంటి శత్రువులనైనా చీల్చి చెండాడగల బలశాలిని. అవసరమైనప్పుడు ధనుస్సును చేపట్టి శత్రువుల పీచమడిగించగలను. సర్వజన హితం కొరకు బ్రహ్మద్వేషులను – వేదాలను, జ్ఞానాన్నీ ద్వేషిస్తూ వ్యసనాలను, మూఢ నమ్మకాలను వ్యాపింప చేసేవారితో శాస్త్రార్థం చేసి తగిన విధంగా బుద్ధి చెప్పగలను. హింసకులను, పరపీడకులను హతమార్చగలను. నా సైనికశక్తి ద్యావా పృథివీ లోకాలలో విస్తరించి ఉంది. జలవాయు సేనలు (Navy & Air Force) ఎంతటి బలమైన శత్రువులనైనా ఎదుర్కొనగలవు. సదా విజయ పతాకమే నా చేతిలో ఎగురగలదు.

7. ఓం అహం సువే పితరమస్య మూర్ధన్
మమ యోనిరప్స్వన్తః సముద్రే ।
తతో వి తిష్ఠే భువనాను విశ్వోతామూం
ద్యాం వర్ష్మణోప స్పృశామి ॥ ఋ. 10. 125. 7

భావము: రాజ్యసభ నగు నేను ఈ రాజ్య శిరస్సుపై (సింహాసనంపై) కూర్చొని పరిపాలన చేయగల సమర్థులైన వ్యక్తులను ఉత్పన్నమొనర్తును. గురుకుల విద్యావ్యవస్థతో అట్టి వ్యక్తులను తయారు చేయుదును. నా అధికారం కేవలం భూభాగమునకే పరిమితం కాదు. చుట్టూ ఉండు సముద్రమునకు, అంతరిక్షమునకు కూడా విస్తరించి ఉంది. ఇంతేగాక నేను విదేశాలతో సత్సంబంధాలను ఏర్పరచుకొని విద్యా, వాణిజ్య, సాంకేతిక రంగాలలో ఖ్యాతిని గడిస్తాను. దానితో నా కీర్తి దిగంతముల వరకు వ్యాపించును గాక.

8. ఓం అహమేవ వాత ఇవ ప్ర వామ్యారభమాణా భువనాని విశ్వా ।
పరో దివా పర ఏనా పృథివ్యైతావతీ మహినా సం బభూవ ॥
ఋ. 10. 125. 8

భావము: రాజ్యసభ నగు నేను నా అద్భుత రాజనీతిజ్ఞతతో, చతురతతో వాయువువలె ప్రచండ వేగంతో ప్రపంచమంతా వ్యాపిస్తాను. ప్రపంచ కీర్తిని గడిస్తాను. ప్రపంచ గురువునై భాసిస్తాను.

మను మహర్షి చెప్పిన ఈ క్రింది మాటలు సార్థకములే కదా!

శ్లో॥ **ఏతద్దేశ ప్రసూతస్య సకాశా దగ్రజన్మనః ।**
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వ మానవాః ॥

– మను ధర్మశాస్త్రం 2.20

భావము: ఈ ఆర్యావర్త దేశమున – భారతదేశమున ఆచార్యుల నుండి ప్రపంచ దేశవాసులంతా వారి వారికి కావలసిన విద్యలను, సదాచారాన్ని గ్రహించి వారి వారి ఆచారాలను సవరించుకొందురు గాక!

(వాగాంభ్రుణీ సూక్తము సమాప్తం)

నాసదీయ సూక్తము

వేదాలలో ప్రళయ స్థితి

ప్రళయంలో ఎలా ఉంటుంది? అనే విషయం ఆధునిక వైజ్ఞానికులు పరిశోధనలు చేశారు. చాలా రకాలుగా ఊహిస్తున్నారు. కాని, పూర్ణ సత్యం వారికి బోధపడలేదు. కనుక ఈ విషయంలో సృష్టికర్త చెప్పిన వేదాన్ని ఆశ్రయించక తప్పదు.

ఈ విషయంలో ఋగ్వేద దశమ మండలంలోని 129వ సూక్తం (నాసదీయ సూక్తం) మనకు చాలా విషయాలు చెబుతుంది. వాటిని అనుసరించి పరిశోధనలు చేస్తే పూర్ణ సత్యం బోధపడుతుంది. క్రమంగా వాటిని తెలుసుకుందాము రండు.

ఈ మంత్రాలకు ఋషి : పరమేష్ఠీ ప్రజాపతిః.

దేవత : భావవృత్తమ్ (ఖగోళ వృత్తం గూర్చిన జ్ఞానం)

1. ఓం నాసదాసీన్నో సదాసీత్ తదానీం
నాసీద్రజో నో వ్యోమాపరోయత్ ।
కిమావరీవః కుహ కస్య శర్మన్నమ్భః
కిమాసీద్గహనం గభీరమ్ ॥ ఋ. 10.129.1

సృష్టికర్త ఉపదేశం:

ఓ మానవులారా! ఈ సృష్టికి పూర్వం (ప్రళయకాలంలో) అసత్‌కాని సత్‌కాని ఉండవు. అంటే – అభావంకాని, భావం కాని ఉండవు. బొత్తుగా ఏమీలేకపోవటం కాని, వ్యక్త జగత్‌కాని ఉండవు. రజస్సులు (గ్రహ ఉపగ్రహాలు) కూడా ఉండవు. అట్లే అంతరిక్షం కాని, లోక లోకాంతరాలు గాని ఉండవు. ఆకాశం గానీ, మేఘరూప జలంకాని ఉండవు. సూర్య అగ్నులు ఉండవు కనుక అంతటా గాఢాంధకారం కప్పి ఉంటుంది.

(ఆధునిక వైజ్ఞానికులును ఇట్లే చెప్పుచున్నారు)

2. ఓం న మృత్యురాసీదమృతం న తర్హి న
రాత్ర్యా అహ్న ఆసీత్ ప్రకేతః ।
ఆనీదవాతం స్వధయా తదేకం
తస్మాద్ధాన్యన్న పరః కిం చనాస ॥ ఋ. 10. 129. 2

భావము: ఓ మానవులారా! ఆ ప్రళయ సమయంలో ప్రాణులే ఉండరు కనుక మృత్యువుగాని, అమృతత్త్వంగానీ ఉండవు. సూర్యచంద్రులు ఉండరు కనుక పగలు, రాత్రి అనే వ్యవహారమే ఉండదు. అప్పుడు కంపన రహితంగా పడివున్న ప్రకృతితో కూడిన ఆ మహాన్ పరమేశ్వరుడే- ఆ ఏకేశ్వరుడే విశ్రాంతిగా ఉన్నట్లుండును. అతనితో సమానుడుగాని, అధికుడుగాని మరెవ్వరూ ఉండరు.

3. ఓం తమ ఆసీత్ తమసా గూళ్హమగ్రేऽ ప్రకేతం
సలిలం సర్వమా ఇదమ్ ।
తుచ్ఛ్యేనాభ్వపిహితం యదాసీత్
తపసస్తన్మ హినాజాయతైకమ్ ॥ ఋ. 10. 129. 3

భావము: సృష్టి రచనకు పూర్వం అంతా గాఢాంధకారంతో కప్పబడిన ప్రకృతి సూక్ష్మ పరమాణువులుగా యుండును. దానిలోనే ఈ సృష్టియంతా లీనమై (తరలంగా – జలంలో కరిగిన బెల్లంవలె) ఉండును. దానితోనే పరమేశ్వరుడు తన తపస్సుతో- సామర్థ్య- పరిశ్రమతో కార్యరూపములో వ్యక్తపరచును. అట్టి వ్యక్త ప్రకృతిని మాత్రమే మనం చూడగలుగుచున్నాము.

4. ఓం కామస్తదగ్రే సమవర్తతాధి మనసో రేతః ప్రథమం యదాసీత్ ।
సతో బన్ధుమసతి నిరవిన్దన్ హృది ప్రతీష్యా కవయో మనీషా ॥
ఋ. 10. 129. 4

భావము: ప్రారంభ స్థితిలో సృష్టి రచన చేయుటకు పరమేశ్వరుడు ఈక్షించును. అదియే సృష్టికి ప్రథమ బీజముగా నుండును. అది ప్రకృతిలో ప్రేరణను కలిగించును. పరమేశ్వరుడు తన అనంత శక్తి సామర్థ్యాలతో, తపస్సుతో (పరిశ్రమతో) ఆ పరమాణువులను వివిధ నిష్పత్తులలో మేళవించి మూలకాలుగా (Elements గా) చేయును. వాటితో మూలక సమ్మేళనాలను చేసి వివిధ పదార్థాలుగా నిర్మించును.

5. ఓం తిరశ్చీనో వితతో రశ్మిరేషామధః
స్విదాసీ దుపరి స్విదాసీత్ ।
రేతోధా ఆసన్ మహిమాన ఆసన్
త్స్వధా అవస్తాత్ ప్రయతిః పరస్తాత్ ॥ ఋ. 10. 129. 5

భావము: ఈ కారణముల రశ్మి నలువైపులా వ్యాప్తమైపోవును. పైకి, క్రిందకు కూడా వ్యాపించును. అందులోనే జీవులు తమ పూర్వ జన్మలలోని కర్మల సంస్కారములతో ఉండును. వీటినే బద్ధజీవులందురు. ముక్త జీవులు పరమేశ్వరుని తృతీయధామంలో ఆనందముతో నుందురు.

6. ఓం కో అద్ధావేద క ఇహ ప్ర వోచత్
కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః ।
అర్వాగ్దేవా అస్య విసర్జనేనా థా కో
వేద యత ఆబభూవ ॥ ఋ. 10. 129. 6

భావము: ఈ సృష్టి ఎచటనుండి వచ్చినది; ఎలా ఏర్పడినది మొదలగు విషయాలు (కః) ఆ సుఖ స్వరూపుడైన పరమాత్మకు తప్ప మరెవరికి తెలియదు. ఏలనన అప్పటికి జీవులకు శరీరాలు, ఇంద్రియాలు, మనోబుద్ధులు ఉండవు. అందుచే జీవులెవ్వరు ఎరుగగలరు? ఎవ్వరూ ఎరుగలేరని భావం. జీవులు అర్థం చేసుకోగలిగినంత జ్ఞానం మాత్రమే సృష్టికర్త తన వేదంలో బీజరూపంలో చెప్పెను. సమాధి స్థితిలోనికి వెళ్ళి దేవుని ద్వారా తెలుసుకోగల ఋషులు మాత్రమే దానిని

మరికొంత తెలుసుకోగలరని భావం.

7. ఓం ఇయం విసృష్టిర్యత అబభూవ
యది వా దధే యది వా న ।
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్
త్సో అఙ్గ వేద యది వా న వేద ॥ ఋ. 10. 129. 7

భావము: హే అంగ! జిజ్ఞాసువులైన మానవులారా! ఈ చిత్ర విచిత్రమైన సృష్టి ఎవనితో ఉత్పన్నమైనదో, ధరించబడియున్నదో, ఎవరు దీనికి అధ్యక్షులో (అధికారియో - స్వామియో) అతడే పరమవ్యోముడైన పరమేశ్వరుడు. అతనికే సృష్టి రహస్యాలు పూర్ణంగా తెలియును. మిగిలినవారికి వారి వారి బుద్ధి క్షమతలనుబట్టి కొంత కొంత అర్థమగును. పూర్ణంగా తెలియదు.

(నాసదీయ సూక్తము సమాప్తం)

వేదాలలో రాత్రీ సూక్తం

8 మంత్రాలు గల ఈ చిన్న సూక్తం రాత్రివల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తుంది. ప్రాణులు పగలంతా పరిశ్రమించి అలసి సొలసి సాయంత్రానికి తమతమ ఇళ్ళకు చేరుకుంటాయి. ఒళ్లు మరిచి నిద్రపోతాయి. ఆ నిద్రవల్ల ప్రాణులకు చాలా ప్రశాంతత కలుగుతుంది. నూతనోత్సాహం కలుగుతుంది. ఇక ఈ సూక్తం ఏమంటుందో తెలుసుకుందాము.

1. ఓం రాత్రీ వ్యఖ్యదాయతీ పురుత్రా దేవ్యఽక్షభిః ।
విశ్వా అధి శ్రియోఽధిత ॥ ఋ. 10. 127. 1

(ఆయతీ రాత్రీ దేవీ) - అదిగో రాత్రీదేవి మనను రంజింప చేయటానికి తన (అక్షభిః) నక్షత్రాలనే నేత్రాలతో వచ్చుచున్నది. అది (పురుత్రా దేవీ) సకల శ్రేష్ఠతలు గల దేవీ. దానిని మనమంతా ఉపాసింతము రండు.

వివరణ: మనను రమింపచేయటానికే పరమేశ్వరుడు రాత్రిని సృష్టించాడు. కనుక అది ఒక దేవి - దివ్యగుణాలు కలది. అది మనను నిద్రపుచ్చి సేద తీరుస్తుంది. రాత్రి వల్లనే మనం కమ్మటి కలలు కనగలుగుతాం. విచిత్రం ఏమంటే చీకటి భయంకరమైనదేయైనా అది తన నక్షత్ర నేత్రాలతో శోభాయమానంగా ఉ

ంటుంది. అంతా పగలే ఉంటే విశాల విశ్వ పరిధిని తెలుసుకోగలమా? నక్షత్రాల గతి విధులను బట్టే కాలగణన ఉంటుందంటారు జ్యోతిష్యులు. కనుక అది అవసరమే.

2. ఓం ఓర్వప్రా అమర్త్యా నివతో దేవ్యుద్వతః ।
జ్యోతిషా బాధతే తమః ॥ ఋ. 10. 127. 2

భావము: అవినాశియైన రాత్రీదేవి ముందుగా అంతరిక్షంలో పైవరకు వ్యాపిస్తుంది. తదుపరి క్రింది లోకాలలో అంతటా వ్యాపించి అన్నిటిని తన చీకటితో కప్పివేస్తుంది. అనంతరం గ్రహ నక్షత్రాల కాంతిని భూమికి తెస్తుంది. ప్రాణులను రమింపచేస్తుంది.

వివరణ: రాత్రి నశించేది కాదు. అది ఎప్పుడూ ఉంటుంది. ప్రకాశమే వస్తూ పోతూ ఉంటుంది. కనుకనే పైమంత్రం రాత్రిని అవినాశి అంటున్నది. నాసదీయ సూక్తం కూడా ఇట్లే చెబుతుంది. "తమ ఆసీత్ తమసా గూఢమగ్రే" ఋగ్వే. 10. 129. 3 అంటుంది. చీకటి భయంకరమైనదే అయినా నక్షత్రకాంతితో అంత భయంకరం కాదు.

3. ఓం నిరు స్వసారమస్కృతోషసం దేవ్యా యతీ ।
అపేదు హాసతే తమః ॥ ఋ. 10. 127. 3

భావము: రాత్రీదేవి వచ్చుచున్న తన సోదరి ఉషాదేవికి తన స్థానాన్ని ఇచ్చి తాను తొలగిపోతుంది. అంటే మన జీవన చక్రంలో సాయంత్రానికి మన ఉత్సాహం తగ్గిపోతుంది. అది రాత్రి నిద్రవల్ల మరల శక్తిని పుంజుకొంటుంది. అందుచే మనకు నిద్రలేచిన తదుపరి క్రొత్తగా ఉత్సాహం వచ్చినట్లు అనిపిస్తుందని భావం.

4. ఓం సా నో అద్య యస్యా వయం ని తే యామన్నవిక్ష్మహి ।
వృక్షేన వసతిం వయః ॥ ఋ. 10. 127. 4

భావము: పక్షి గణములు రాత్రికి తమ తమ గూళ్ళకు లేదా తాము వసించు చెట్టుపైకి చేరి విశ్రమించునట్లు మనం కూడా రాత్రికి మన గృహాలకు చేరుకొని హాయిగా విశ్రాంతి తీసుకుంటాము. నిద్రపోతాము.

"ఓ రాత్రీదేవీ! నీ ఆగమనంతో మాకు పనులనుండి, కార్యభారం నుండి

విముక్తి కలుగుతుంది. విశ్రాంతి లభిస్తుంది. కనుక నీవు రమయిత్రివి" అని భావం.

5. ఓం ని గ్రామాసో అవిక్షత ని పద్వన్తో ని పక్షిణః ।
ని శ్యేనాసశ్చిత్ + అర్థినః ॥ ఋ. 10. 127. 5

భావము: రాత్రీదేవి ఆగమనంతో గ్రామస్థులు (మనుష్యులు) అందరు విశ్రాంతిని పొందుతారు. చక్కగా నిద్రిస్తారు. అట్లే పాదచారులు, పశువులు, పక్షులు కూడా హాయిగా నిద్రించును. శీఘ్రగమనం గల శ్వేన పక్షులు (డేగలు) కూడా చక్కగా నిద్రిస్తాయి. కనుక, రాత్రి 'సుఖదాత్రి' కూడా.

వివరణ: ఈ మంత్రంలోని చివరి పదము అర్థినః. అందుచే కొందరు విద్వాంసులు అర్థం కోసం – ధనం కొరకు పరుగులు తీసేవారు కూడా అలసిపోయి నిదురిస్తారని వ్యాఖ్యానించారు. పద్యన్తః – అను పదమునకు పాదచారులు (బాటసారులు) అనియును అర్థం.

6. ఓం యావయా వృక్యం వృకం యవయస్తేనమూర్మ్యే ।
అథా నః సుతరా భవ ॥ ఋ. 10. 127. 6

భావము: ఓ రాత్రీదేవీ! మేము ఒల్లుమరిచి నిద్రించునపుడు మగ, ఆడ తోడేళ్ళవంటి అడవి జంతువులు వచ్చి మమ్ము బాధించకుండాను, దొంగలు వచ్చి దోచుకోకుండాను కాపాడు. మేము నిశ్చింతగా నిద్రపోయి గొప్ప సుఖాన్ని, ఆరోగ్యాన్ని పొందటానికి సహకరించు.

వివరణ: అంటే – రాజు లేదా ప్రభుత్వం ప్రజలు నిదురించేటపుడు వారిని అడవి జంతువులు వచ్చి బాధించకుండాను, దొంగలు వచ్చి దోచుకోకుండాను తగిన గట్టి పహారా ఏర్పాటు చేయాలని భావం. గాఢనిద్ర పోతే రోగాలు కొంత ఉపశమిస్తాయి. అనిర్వచనీయమైన సుఖానుభవం కలుగుతుంది.

7. ఓం ఉప మా పేపిశత్ తమః కృష్ణం వ్యక్తమస్థిత ।
ఉష ఋణేవ యాతయ ॥ ఋ. 10. 127. 7

భావము: గాఢాంధకారం మమ్ము అన్నివైపుల నుండి ఆక్రమించినది. ఓ ఉషాదేవీ! నీవు త్వరగా రా. మమ్ము (త్రివిధ) ఋణాల నుండి విముక్తులను

చేయి.

వివరణ: రాత్రి మూడవ జాములో అంధకారం అన్నివైపుల నుండి ఆక్రమిస్తుంది. నిద్ర గాఢంగా వస్తుంది. అలాగే ప్రొద్దెక్కే వరకు నిద్రపోవటం మంచిది కాదు. తొలి కోడి కూతతో మేలుకోవాలి. ఆ బ్రాహ్మీ ముహూర్తంలో కాలకృత్యాలు తీర్చుకొని ఉపాసనా మగ్నులం కావాలి. అనంతరం స్నానం చేసి సంధ్యాగ్నిహోత్రాలు చేసుకోవాలి.

పితరులకు (పెద్దలకు) పాదాభివందనం చేసి పితృఋణాన్ని, అగ్నిహోత్రం చేసి దేవఋణాన్ని, స్వాధ్యాయం చేసి ఋషి ఋణాన్ని తీర్చుకోవాలని భావం.

8. ఓం ఉపతే గా ఇవాకరం వృణీష్వ దుహితర్దివః ।
రాత్రి స్తోమం న జిగ్యుషే ॥ ఋ. 10. 127. 8

భావము: ఓ దివపుత్రీ– పగటి పుత్రీ – రాత్రీదేవీ! పాలిచ్చే గోవును మా ముందు పెట్టుకున్నట్లు మేము నిన్ను స్తుతించుచున్నాము. నీవు మాకు జ్ఞానమనే హవిస్సులను ప్రసాదించుము.

వివరణ: రాత్రి పగటికి పుత్రిక వంటిది. గోవు ఎలాగైతే పాలనిస్తుందో అట్లే రాత్రి జ్ఞానమనే హవిస్సులను ప్రసాదిస్తుంది. అందుకనే తెల్లవారుజామున లేచి చదువుకుంటే చదువు బాగా వస్తుందని పెద్దలంటారు.

(రాత్రీ సూక్తము సమాప్తం)

ఆ నో భద్రాః సూక్తము

వేదాలలో అక్కడక్కడ కొన్ని స్వస్తి సూక్తాలు, స్వస్తి మంత్రాలు ఉన్నాయి. వాటిలోని 10 మంత్రాలు గల ఒక చిన్న సూక్తాన్ని గురించి ఇక్కడ తెలుసుకుందాము. 'స్వస్తి' అంటే – (సు + అస్తి = స్వస్తి) మాకు అన్నీ మంచిగా జరుగును గాక, శుభంకరములే అగునుగాక అని అర్థం.

ఋగ్వేద ప్రథమ మండలంలోని 89వ సూక్తం స్వస్తి సూక్తం. స్వస్తి కొరకు పరమేశ్వరుని ఈ మంత్రాలతో ప్రార్థించమని మహర్షులన్నారు. ఈ మంత్రాల ఆది ఋషి "రాహూగణ పుత్రో గౌతమః" అంటే 'రాహూగణ' నామము గల ఋషి యొక్క పుత్రుడైన గౌతముడని అర్థం. ఆ కాలంలో గౌతమ పేరుగల మరికొందరు వ్యక్తులు ఉండి ఉండవచ్చు. వారిలో గౌతమ S/o రాహూగణ

అన్నట్లుగా ఈ సూక్తం సూచిస్తున్నది. ఈ మంత్రాలకు దేవత 'విశ్వేదేవాః'. అంటే ఈ మంత్రాలలో ఏకేశ్వరుని వివిధ నామాలు పేర్కొంటూ ప్రార్థించబడిందని అర్థం చేసుకోవాలి. అయినప్పటికి ఈ సూక్తం 'ఆనో భద్రాః క్రతవో యన్తు విశ్వతః' అనే వాక్యంతో ప్రారంభించటంవల్ల 'ఆనో భద్రాః సూక్తం' అనే పేరుతో లోకంలో ప్రచలితమయ్యింది. ఇక మనం ఈ స్వస్తి సూక్తం ఏమి చెబుతున్నదో తెలుసుకుందాము.

1. ఓం ఆ నో భద్రాః క్రతవో యన్తు విశ్వతో౽
దబ్ధాసో అపరీతాస ఉద్భిదః ।
దేవా నో యథా సదమిద్ వృధే
అసన్నప్రాయునో రక్షితారో దివేదివే ॥ ఋ. 1.89.1

భావము: హే పరమేశ్వరా! నీ కృపవలన మాకు అన్నివైపుల నుండి భద్రములైన (శుభంకరములైన) ఆలోచనలే వచ్చునుగాక. అవి ఎన్నడును అదబ్ధములు కాకుండునుగాక – అణచబడకుండునుగాక. అవి అపరీతములు కాకుండునుగాక. ఇతరులచే ఆక్రమింపబడకుండునుగాక. ఇంతేగాక, అవి ఉద్భిదములగును గాక! మొలకెత్తేవి అగును గాక! ఒక మంచి ఆలోచన మరికొన్ని మంచి ఆలోచనలకు బీజమగును గాక. దేవతలు – విద్వాంసులు మాకు ఎల్లప్పుడును మా ఉన్నతి కొరకే ఉపదేశింతురుగాక. ప్రాకృతిక శక్తులన్నియు మమ్ము దినదినము రక్షించుచుండునుగాక. అనుకూలముగా నుండునుగాక.

2. ఓం దేవానాం భద్రా సుమతిరృజూయతామ్
దేవానాం రాతిరభి నో ని వర్తతామ్ ।
దేవానాం సఖ్యముప సేదిమా వయం
దేవా న ఆయుః ప్ర తిరన్తు జీవసే ॥ ఋ. 1.89.2

భావము: ఓ సర్వేశ్వరా! నీ కృపవలన దేవతల – వేద విద్వాంసుల భద్రమైన శుభప్రదమైన సుమతి – సద్బుద్ధి మమ్ము ఋజువర్తనులుగా – నిజాయితీ పరులుగా చేయునుగాక. దేవతల – త్యాగ పురుషుల దాన ప్రవృత్తి మావైపునకు మరలి మమ్ము దానశీలురను చేయునుగాక. మేము సదా దేవతల – దివ్యగుణాలు కలవారి సఖ్యతలో నుందుముగాక. మేము దేవతల – సదాచారపరుల జీవన సరళిని

అనుసరిస్తూ మేమును దీర్ఘకాలము జీవింతుము గాక.

3. ఓం తాన్ పూర్వయా నివిదా హూమహే
వయం భగం మిత్రమదితిం దక్షమస్రిధమ్ ।
అర్యమణం వరుణం సోమమశ్వినా
సరస్వతీ నః సుభగా మయస్కరత్ ॥ ఋ. 1. 89. 3

భావము: హే పరమేశ్వరా! నీ కృప వలన పూర్వ విద్వాంసులు ఏవిధంగా వేదాలను అధ్యయనం మనన చింతనలు చేసి వివిధ జ్ఞాన విజ్ఞానాలను పొందిరో అట్లే, మేమును పొందుదుముగాక. మేము ముందుగా జీవన నిర్వహణకు అవసరమైన ఐశ్వర్యాలను పొందుదుముగాక. వేదమార్గంలో జీవిస్తూ అందరకు మిత్రులము, సమస్త విద్యల ప్రకాశకులము, కార్య నిర్వహణలో దక్షులము, అహింసకులము అగుదుము గాక. న్యాయకారులము, గుణవంతులము, లభించినవాటిని సద్వినియోగ పరచువారము అగుదుముగాక. వివిధ విద్యలను మేము చదువుచు ఇతరులచే చదివించుచు సరస్వతులమగుదుము గాక.

4. ఓం తన్నో వాతో మయోభు వాతు భేషజం
తన్మాత పృథివీ తత్పితా ద్యౌః ।
తద్ గ్రావాణః సోమసుతో మయోభువస్తదశ్వినా
శృణుతం ధిష్ణ్యా యువమ్ ॥

ఋ. 1. 89. 4

భావము: ఓ అశ్వినులారా! వేదవిద్యలను బోధించు విద్వాంసులారా! విజ్ఞానవేత్తలారా! గొప్ప సుఖమును, ఆరోగ్యమును కలిగించు ప్రాణాయామాది వాయువిద్యలను మాకు ఉపదేశింపుడు. (నేర్పుడు). అట్లే, సర్వవిధ రోగాలను, దుఃఖాలను పోగొట్టు ఓషధుల జ్ఞానాన్ని మాకు బోధించండి. ఈ భూమాత మాకు తల్లి వంటిది. సూర్యుడు (ద్యులోకము) మాకు తండ్రివంటివాడు. వీటినుండి రసాలను – ప్రయోజనాలను ఎట్లు పొందగలమో ఉపదేశించండి. గ్రావాణాల నుండి – మేఘాల నుండి రసమును – జలమును ఎట్లు పొందగలమో తెలుపండి. వాటిద్వారా మేము స్వస్తిని, శాంతిని ఎట్లు పొందగలమో వివరించండి.

5. ఓం తమీశానం జగతస్తస్థుషస్పతిం ధియం
జిన్వమవసే హూమహే వయమ్ ।
పూషా నో యథా వేదసామసద్ వృధే
రక్షితా పాయురదబ్ధః స్వస్తయే ॥ ఋ. 1.89.5

భావము: ఓ ధార్మిక మిత్రులారా! జీవన ఒడిదుడుకు లేర్పడినపుడు ఆ కష్ట సమయంలో మనం జగతః తస్థుషః పతియైన – స్థావర జంగమ జగత్పతియైన ఈశుని – జగన్నియామకుని శరణు వేడెదము రండు. అప్పుడతడు అవతారమెత్తి రాడు. మన బుద్ధులలో ఆ కష్టముల తరించగల జ్ఞానమును ప్రకాశ పరచును. మన కర్మలను చక్కగా ప్రేరేపించును. మనకు శారీరక పుష్టిని, ధనపుష్టిని కలిగించును. మనకు రక్షకుడై నిలుచును. మనకు స్వస్తిని సుఖశాంతులను ప్రసాదించును.

6. ఓం స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥
ఋ. 1.89.6

భావము: స్వస్తినః ఇన్ద్రః వృద్ధశ్రవాః = గొప్ప కీర్తిగల ఇంద్రుడు – పరమైశ్వర్య కర్తయైన పరమేశ్వరుడు మాకు స్వస్తిని – శుభములను కలిగించునుగాక.

స్వస్తి నః పూషా విశ్వవేదాః = ప్రాణులన్నిటిని పోషించు ఆ పూషా పరమేశ్వరుడు మాకు సర్వ పదార్థ జ్ఞానాన్ని ప్రసాదించి మాకు స్వస్తిని – విశేష సుఖాలను ప్రాప్తింప చేయును గాక.

స్వస్తి నః తార్క్ష్యః అరిష్టనేమిః = దుఃఖసాగరాన్నుండి తరింపచేయు ఆ అరిష్టనేమి – అప్రతిహతగతిగల దేవదేవుడు మమ్ము వినాశము కాకుండా రక్షించునుగాక.

స్వస్తి నః బృహస్పతిః + దధాతు = బృహస్పతియైన పరమేశ్వరుడు తన వేదజ్ఞానాన్ని ఇచ్చి మమ్ము సదా కాపాడుచుండును గాక.

7. ఓం వృషదశ్వా మరుతః పృశ్నిమాతరః
శుభంయావానో విదథేషు జగ్మయః ।

అగ్ని జిహ్వా మనవః సూరచక్షసో
విశ్వే నో దేవా అవసా గమన్నిహ ॥ ఋ. 1.89.7

భావము: హే పరమేశ్వరా! నీ కృపవలన మా వృషదశ్వులు - సేనలోని వీరాధివీరులు మమ్ము శత్రువులనుండి రక్షింతురు గాక. మా వేద విద్వాంసులు మాచే వివిధ యజ్ఞ యాగాదులను చేయించి వాయువులను శుద్ధపరతురుగాక. మాకు శుభములను కలిగింతురుగాక. మాచే దాన ధర్మాది పరోపకార కార్యాలు చేయించి మమ్ము పరమాత్మునివైపు నడిపింతురు గాక.

8. ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవా భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరఙ్గైస్తుష్టువాంసస్తనూభిర్వ్యశేమహి దేవహితం యదాయుః ॥
ఋ. 1.89.8

భావము: భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః = హే పరమేశ్వరా! నీ కృపవలన మా చెవులతో సదా భద్రములనే - శుభంకరములనే విందుముగాక. వేదాది సత్యశాస్త్రాల అధ్యయన అధ్యాపనములనే తరచుగా విందుము గాక.

భద్రం పశ్యేమ + అక్షిభిః యజత్రాః = మా కళ్ళతో సదా భద్రములనే చూతుముగాక. మా శరీరానికి, ఆత్మకు ప్రసన్నత కలిగించు వాటినే చూతుము గాక. (ఇతరములను చూడకుందుము గాక)

స్థిరైః + అంగైః తస్థు + వాంసః + తనూభిః = స్థిరమైన దృఢమైన అంగములతో కూడిన శరీరంలో నీ వేదాజ్ఞలను పాలించుచు నిన్ను స్తుతింతుము గాక.

దేవహితం యదాయుః = దేవతలకు - విద్వాంసులకు హితమైన పూర్ణాయువును అనుభవింతుము గాక. ధర్మార్థ కామ మోక్షాలు నాల్గింటిని ఈ జన్మలోనే సాధింతుము గాక.

9. ఓం శతమిన్ను శరదో అన్తి దేవా
యత్రా నశ్చక్రా జరసం తనూనామ్ ।
పుత్రాసో యత్ర పితరో భవన్తి మా
నో మధ్యా రీరిషతాయుర్గన్తోః ॥ ఋ. 1.89.9

భావము: ఓ దేవతలారా! విద్వాంసులారా! మీవలె మా పుత్ర పుత్రికలు కూడా బాల్యంలోనే సకల విద్యలను నేర్చి విద్యా వృద్ధులగునట్లు వారికి వివిధ విద్యలను సరళంగా బోధింపుడు. మీవలెనే వారును సదాచారపరులై నూరు శరత్తుల జీవితము ననుభవించి కృతార్థులగునట్లు వారిని తీర్చిదిద్దుడు. మాకు స్వస్తిని - శుభములను కలిగింపుడు.

10. ఓం అదితిర్ద్యౌరదితిరన్తరిక్షమదితిర్మాతా స పితా స పుత్రః ।
విశ్వే దేవా అదితిః పఞ్చ జనా అదితిర్జాతమదితిర్జనిత్వమ్ ॥

ఋ. 1. 89. 10

భావము: ఓ సర్వవ్యాపక సచ్చిదానంద సర్వేశ్వరా! సృష్టిలో నీవు (దేవుడవు), మేము (జీవులము) మరియు మూల ప్రకృతి (పరమాణువులు) మాత్రమే అనాదులు. అవినాశులు. అయినప్పటికి ప్రవాహరూపంలో సృష్టిలోని కార్య పదార్థాలు కూడా అదితులేనని ఈ మంత్రం ద్వారా చెప్పుచున్నావు.

ద్యులోకము, అంతరిక్షము అదితులు ఇవి మరల మరల ఏర్పడతాయి. మాతా పితలు పుత్రులును అదితులే. మరల మరల జన్మిస్తూనే ఉంటారు. విశ్వే దేవతలు - సృష్టిలోని దివ్యగుణాలు గల పదార్థాలన్నీ అదితులే. ఇవియును మరల మరల సృజింపబడుతూనే ఉంటాయి. పంచజనులు - పంచేంద్రియాలును అదితులే. ఇంతవరకు పుట్టినవి పుట్టబోవునవియును అదితులే. ఇవన్నియు మాకు స్వస్తిని కలిగించును గాక.

(అదితి అంటే - రెండుగా కానిది, అవినాశి అని అర్థం)

(ఆ నో భద్రాః సూక్తము సమాప్తం)

ప్రథమ స్వస్తి సూక్తం

నాలుగు వేదాలలోను అగ్నిసూక్తాలు అనేకం ఉన్నాయి. మొదటి సూక్తమైన ఋగ్వేదం అగ్నిసూక్తంతోనే ఆరంభమౌతుంది. వాటిలో ఋగ్వేద దశమ మండలంలోని 7వ సూక్తాన్ని గురించి ఇక్కడ తెలుసుకుందాము. ఇచట 'అగ్ని' అంటే అగ్నినామక సర్వవ్యాపక సర్వేశ్వరుడు. దేవదేవునకు గల అనేక నామములలో అగ్ని అనే నామము ఒకటి. ఈ పదము "అఞ్చు - గతి పూజనయోః" అనే ధాతువుతో నిర్మింపబడుతుంది. కనుక గతి కలిగినది మరియు పూజించతగినది

– అని రెండు అర్థాలు అగ్నిలో ఉంటాయి. వైదిక శాస్త్రాలలో గతికి మూడు అర్థాలు చెప్పబడ్డాయి – (జ్ఞానం, గమనం, ప్రాప్తి అని).

జ్ఞాన పూర్వకమైన గమనంతో – సాధనతో ప్రాప్తించ తగినవాడు కనుక పరమాత్మకు అగ్ని అనే నామము వచ్చిందని మహర్షి దయానందుల వారు వివరించారు. అట్టి అగ్నిని – పరమాత్మను దేనికొరకు ప్రార్థించాలో ఈ సూక్తంలోని మంత్రాలు చెబుతాయి. క్రమంగా తెలుసుకుందాము.

1. ఓం అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజమ్ ।
హోతారం రత్నధాతమమ్ ॥ ఋ. 1. 1. 1

భావము: ఓ అగ్నీ! అనంత జ్ఞాన కర్మలు గల పూజనీయ పరమేశ్వరా! నీవు పురోహితుడవు. మేము కోరకుండానే మా హితమును చేయు ఆప్తుడవు. సృష్టి స్థితి లయ రూప యజ్ఞము చేయు యజ్ఞ దేవుడవు. సృష్టిలో ఋతుచక్రము నేర్పరచిన ఋత్విజుడవు. జీవులు మనోవాక్కాయములతో చేయు కర్మలకు అత్యంత న్యాయంగా ఫలాలనిచ్చు హోతవు కూడా నీవే. ఇట్టి అనేకానేక సుగుణ రత్నాలను ధరించిన పరమాత్మవు. కనుక, ముందుగా నిన్నే స్తుతింతుము గాక. నీ వేదాజ్ఞలను పాలింతుము గాక.

2. ఓం అగ్నిః పూర్వేభిరృషిభిరీడ్యో నూతనైరుత ।
స దేవా ఏహ వక్షతి ॥ ఋ. 1. 1. 2

భావము: ఓ అగ్నినామక పరమేశ్వరా! దివ్యగుణ యుక్తుడవైన నిన్ను పూర్వ ఋషులంతా కీర్తించారు. ఆది ఋషులైన అగ్ని వాయు ఆదిత్య అంగిరసులు, వేదాల అంగ ఉపాంగాలను రచించిన ఋషులు నిన్నెంతగానో కీర్తించారు. అనంతరం వచ్చుచున్న నూతన ఋషులు కూడా నిన్నే కీర్తించుచున్నారు. (సః ఏవ దేవాన్ ఆ వక్షతి) = అట్టి ఆ దేవదేవుని ఈ మానవ శరీరంతోనే దివ్యగుణ యుక్తులైన దేవతలు – ఉపాసకులు సాధన చేసి పొందగలరు. వేరే శరీరాలతో కాదు.

3. ఓం అగ్నినా రయిమశ్నవత్ పోషమేవ దివే దివే ।
యశసం వీరవత్తమమ్ ॥ ఋ. 1. 1. 3

భావము: అగ్నినామక పరమేశ్వరుని ద్వారా సృజింపబడిన పంచభూతాల ద్వారానే మనకు వివిధ ధనాలు లభించుచున్నవి. దిన దినము మన శరీరాలు పోషింపబడుచున్నవి. కనుక మనం వాటిని సద్వినియోగపరచుకొని ఉత్తమోత్తమ కీర్తిని పొంద యత్నించాలి. ఉత్తమ శాకాహారంతో శరీరాన్ని, స్వాధ్యాయ సత్సంగాలు చేస్తూ మనోబుద్ధులను పోషించుకోవాలి. ఉపాసన చేస్తూ ఆత్మజ్ఞానాన్ని, ఆత్మ బలాన్ని పెంచుకోవాలి. జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

4. ఓం అగ్నే యం యజ్ఞమధ్వరం విశ్వతః పరిభూరసి ।
స ఇద్దేవేషు గచ్ఛతి ॥ ఋ. 1. 1. 4

భావము: ఓ అగ్నినామక పరమేశ్వరా! నీవు సృష్టిలో అంతటా వ్యాపించియుండి సృష్టిరూప అధ్వర యజ్ఞమును- ఎంతమాత్రం హింసలేని యజ్ఞమును చేయుచున్నావు. ఆ అధ్వరమునే వేదం ద్వారా మాకు ఉపదేశించినావు. అందుచేతనే వేద విద్వాంసులు అధ్వర యజ్ఞాన్ని వారు స్వయంగా ఆచరింతురు. ఉపదేశింతురు. ప్రజలచే చేయింతురు. హింసతో కూడిన యజ్ఞములు తామస యజ్ఞాలు. వాటివల్ల పుణ్యం కలుగకపోగా పాపమే వచ్చును. వివరాలకు భగవద్గీత 17వ అధ్యాయంలో చూడండి.

5. ఓం అగ్నిర్హోతా కవిక్రతుః సత్యశ్చిత్రశ్రవస్తమః ।
దేవో దేవభిరా గమత్ ॥ ఋ. 1. 1. 5

భావము: ప్రకాశ స్వరూపుడైన అగ్నినామక పరమేశ్వరుడు హోతా - కర్మ ఫలదాత. కవిక్రతుః - సర్వజ్ఞుడు. సృష్టి రచయిత మరియు వేద రచయిత. సత్యః - సత్య స్వరూపుడు. త్రికాలములందును అతని ఉనికి ఏకరసము. చిత్ర శ్రవస్తమః - అతని గుణగానము చిత్రాతి చిత్రము. శ్రవణానందకరము. అది విద్వాంసులకు జ్ఞానదాయకము. ఆనందదాయకము.

6. ఓం యదఙ్గ దాశుషే త్వమగ్నే భద్రం కరిష్యసి ।
తవేత్ తత్ సత్యమఙ్గిరః ॥ ఋ. 1. 1. 6

భావము: ఓ అగ్నినామక పరమేశ్వరా! నీవు మాకు అంగమువలె - శరీరాంగము వలె అత్యంత సన్నిహితంగా ఉన్న పరమ మిత్రుడవు. ఏ అనన్య భక్తులు సదా సత్కర్మలు చేస్తూ ఆ కర్మల ఫలాన్ని నీకర్పించుచుందురో వారికి

నీవు భద్రములనే చేయుచుందువు.

ఓ అగ్నీ! నీవు అంగిరుడవు కూడా. విశ్వమంతటిలోను, మా శరీరాంగాలలోను, జీవాత్మలమైన మాలో కూడా వ్యాపించి ఉండి అన్నిటికి శక్తినిచ్చుచున్న అంగిరుడవు. అట్టి నిన్ను మేము శరణు వేడుకుంటున్నాము.

7. ఓం ఉపత్వాగ్నే దివే దివే దోషావస్తర్ధియా వయమ్ ।
నమో భరన్త ఏమసి ॥ ఋ. 1. 1. 7

భావము: ఓ అగ్నీ! సర్వాంతర్యామీ! నీవే మాకు ఉపాసించ యోగ్యమగు దేవదేవుడవు. కనుక, మేము (దివే దివే) దినదినము ప్రతిదినము (దోషావస్తః) రాత్రి పగలు సర్వకాలంలోను, సర్వత్రా నీ ఉనికిని గుర్తిస్తూ ఎపుడును, ఎచటను ఎట్టి పాపకార్యమును చేయకుందుముగాక. విశేషంగా ఉదయం సాయం సంధ్యా సమయాలలో అంతర్ముఖులమై నిన్ను ధ్యానింతుముగాక. నీవు మా బుద్ధులను జ్ఞాన తేజస్సుతో నింపుదువు గాక. మేము అభ్యుదయ నిశ్శ్రేయసములు రెంటిని పొందుదుము గాక.

8. ఓం రాజన్తమధ్వరాణాం గోపామృతస్య దీదివిమ్ ।
వర్ధమానం స్వే దమే ॥ ఋ. 1. 1. 8

భావము: ఓ అగ్నినామక సర్వాంతర్యామీ! వేద విహిత సత్కర్మలతోను, అధ్వర యజ్ఞయాగాదులతోను రాజన్తులైన - ప్రకాశవంతులైన నీ భక్తులు నీ ముక్తిధామమును చేరుకొందురు. త్రివిధ దుఃఖాలనుండి అత్యంత నివృత్తిని పొందుదురు. నీలో స్వేచ్ఛగా విహరించుచు నీనుండి వేదజ్ఞానాన్ని, ఆనందాన్ని పొందుచూ వర్ధిల్లుచుందురు. కనుక మేమును నీ ముక్తి ధామమును చేర పూర్ణ ప్రయత్నం చేయుదుము గాక.

9. ఓం స నః పితేవ సూనవేఽగ్నే సూపాయనో భవ ।
స చ స్వా నః స్వస్తయే ॥ ఋ. 1. 1. 9

భావము: ఓ అగ్నినామక అంతర్యామీ! మంచి తండ్రి తన సంతానానికి సులభప్రాప్యుడగునట్లు మాకు నీవు తేలికగా లభించువాడవు కమ్ము. "త్వం హి నః పితా వసో త్వం మాతా" అంటూ మేము నీ చెంతకు తేలికగా చేరెదము గాక.

నీవు మాకు స్వస్తిని - శుభములను కలిగింపుము. ఏవి మాకు భద్రములో, ఉన్నతిని కలిగించునో, నిన్ను చేరుటకు తోడ్పడునో అట్టి సుఖ సాధనాలను మాకు ప్రసాదింపుము. నీకివే మా శత సహస్ర వందనాలు.

ప్రథమ స్వస్తి సూక్తం సమాప్తం

రెండవ స్వస్తి సూక్తము

నాలుగు వేదాలలోను అగ్నిసూక్తాలు అనేకం ఉన్నాయి. మొదటి సూక్తమైన ఋగ్వేదం అగ్నిసూక్తంతోనే ఆరంభమౌతుంది. వాటిలో ఋగ్వేద దశమ మండలంలోని 7వ సూక్తాన్ని గురించి యిక్కడ తెలుసుకుందాము. ఇచట 'అగ్ని' అంటే - అగ్నినామక సర్వవ్యాపక సర్వేశ్వరుడు. దేవదేవునకు గల అనేక నామములలో 'అగ్ని' అనే నామము ఒకటి. ఈ పదము "అఞ్చు - గతి పూజనయోః" అనే ధాతువుతో నిర్మింపబడుతుంది. కనుక గతి కలిగినది మరియు పూజించదగినది - అని రెండర్థాలు అగ్నిలో ఉంటాయి. వైదిక శాస్త్రాలలో గతికి "జ్ఞానం, గమనం, ప్రాప్తి" అని అర్థాలు చెప్పబడ్డాయి.

జ్ఞాన పూర్వకమైన గమనంతో - సాధనతో ప్రాప్తించతగినవాడు కనుక పరమాత్మకు 'అగ్ని' అనే నామము వచ్చిందని మహర్షి దయానందుల వారు వివరించారు. అట్టి అగ్నిని - పరమాత్మను దేనికొరకు ప్రార్థించాలో ఈ సూక్తంలోని మంత్రాలు చెబుతాయి. క్రమంగా తెలుసుకుందాము.

1. ఓం స్వస్తి నో దివో అగ్నే పృథివ్యా విశ్వాయుర్ధేహి యజథాయ దేవ ।
సచేమహి తవ దస్మ ప్రకేతైరురుష్యా ణ ఉరుభిర్దేవ శంసైః ॥

ఋ. 10.7.1

భావము: ఓ అగ్నీ - పూజనీయ పరమేశ్వరా! నీ కృపవలన మాకు ఈ ద్యు పృథివీలోకాలు శుభంకరములగును గాక. మా శరీరాలకు వలయు అన్న పానీయాలను, అగ్నిహోత్ర కార్యానికి వలయు ఘృత ఓషధాదులను ప్రసాదింపుము. మేము సత్కర్మలు చేసి పుణ్యము నార్జించుకొనుటకు వలయు సకల సాధనాలను ప్రసాదించుము.

ఓ దస్మ దర్శనీయ దేవా! గొప్పవైన నీ రక్షణ సాధనాలతో సదా మమ్ము

రక్షించు.

2. ఓం ఇమా అగ్నే మతయస్తుభ్యం జాతా
గోభిరశ్వైరభి గృణన్తి రాధః ।
యదా తే మర్తో అను భోగమానడ్వసో
దధానో మతిభిః సుజాత ॥ ఋ. 10.7.2

భావము: ఓ అగ్నినామక పరమేశ్వరా! మా స్తుతి ప్రార్థనలన్నీ నీ కొరకే అగును గాక. మా ఈ గోవులు, అశ్వములు, ధనములు అన్నీ నీవు ప్రసాదించినవే. వీటన్నిటిని మేము నిన్ను చేరుటకే వినియోగించుకొందుముగాక. అట్టి యజ్ఞశీలురకే – పరోపకార పరాయణులకే నీ జ్ఞాన విజ్ఞానాలు లభిస్తాయి. అట్టివారే నిన్ను చేరి ఆనందమగ్నులౌతారు. కనుక మా సంపదలన్నీ నీ ప్రాప్తికొరకే అగును గాక.

3. ఓం అగ్నిం మన్యే పితర మగ్నిమాపిమగ్నిం
భ్రాతరం సదమిత్ సఖాయమ్ ।
అగ్నేరనీకం బృహతః సపర్యం దివి
శుక్రం యజతం సూర్యస్య ॥ ఋ. 10.7.3

భావము: ఓ అగ్నినామక పరమేశ్వరా! నీవే నాకు నిజమైన తల్లివి, తండ్రివి అని నమ్మెదును గాక. బంధువు, భ్రాతవు కూడా నీవే. సఖుడవు, సద్గురుడవు కూడా నీవే. ఆకాశంలో గొప్పదైన తన ప్రకాశంతో వెలుగొందుచున్న ఈ సూర్యుని కన్నను నీ తేజమే గొప్పది. మేము ఈ ప్రపంచపు మాయలో పడి నీ ఉపాసనను విడువకుందుముగాక. అన్యుల నుపాసింపకుందుము గాక.

4. ఓం సిధ్రా అగ్నే ధియో అస్మే సనుత్రీర్యం
త్రాయసే దమ ఆ నిత్యహోతా ।
ఋతావా స రోహిదశ్వః పురుక్షుర్ద్యుభిరస్మా
అహభిర్వామమస్తు ॥ ఋ. 10.7.4

భావము: ఓ అగ్నినామక పరమేశ్వరా! మా యొక్క బుద్ధులను, కర్మలను పవిత్ర పరచి అవి ఫలదాయకమగునట్లు అనుగ్రహింపుము. నిత్యం నియమంగా నిన్ను ఉపాసించువారు, నిత్యాగ్నిహోత్రులు సత్య జ్ఞానము, సత్యకర్మలు కలవారై పశువులను, ధన ధాన్యాలను నిరంతరము పొందుచుందురు. నూతన తేజస్సుతో

వర్ధిల్లుచుందురు. కనుక మేము నిన్నే ఉపాసింతుము గాక.

5. ఓం ద్యుభిర్హితం మిత్రమివ ప్రయోగం
ప్రత్నమృత్విజమధ్వరస్య జారమ్ ।
బాహుభ్యామగ్నిమాయవో౽జనన్త
విక్షు హోతారం న్యసాదయన్త ॥ ఋ. 10. 7. 5

భావము: ఎవరు దేవుడిచ్చిన రెండు చేతులతో నిత్యాగ్నిహోత్రులౌతారో, చేతులెత్తి నమస్కరిస్తారో, పరోపకార పరాయణులౌతారో వారికి ఆ అగ్నిహోత్రం ఋతువులను సానుకూల పరుస్తుంది. దీర్ఘ ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుంది. అట్టివారిలోనే పరమేశ్వరుడు జ్ఞానజ్యోతిని ప్రకాశపరుస్తాడు. ఆనందాన్ని ప్రసాదిస్తాడు.

6. ఓం స్వయం యజస్వ దివి దేవ
దేవాన్ కిం తే పాకః కృణుపదప్రచేతాః ।
యథాయజ ఋతుభిర్దేవ దేవానేవా
యజస్వ తన్వం సుజాత ॥ ఋ. 10. 7. 6

భావము: హే దేవా! సృష్టిరూప దివ్య యజ్ఞంలో నీవు స్వయంగానే ప్రకృతి పరమాణువులను మేళవించి ఈ అద్భుతాద్భుతమైన సృష్టిని చేసితివి. అట్లే, మా ఈ శరీరాలను నిర్మించుచున్నావు. అట్టి నీవు ఋతువుల అనుకూలత కొరకు ఈ యజ్ఞక్రియను నిర్మించినావు. ఉపదేశించినావు. మూఢులము, దుఃఖపీడితులమునైన మేము నిన్నెంతని స్తుతించగలము? మా శక్తి కొలది నీవు ఉపదేశించిన యజ్ఞక్రియను చేయ ప్రయత్నించెదము, అనుగ్రహించి రక్షించుము.

7. ఓం భవా నో అగ్నే౽వితోత గోపా
భవా వయస్కృదుత నో వయోధాః ।
రాస్వా చ నః సుమహో హవ్యదాతిం
త్రాస్వోత నస్తన్వో అప్రయుచ్ఛన్ ॥ ఋ. 10. 7. 7

భావము: ఓ అగ్నీ! ప్రకాశ స్వరూప పరమేశ్వరా! నీవే మాకు రక్షకుడవు, పాలకుడవు, ప్రాణదాతవు. కరుణించి మాకు వలయు అన్న పానీయాది భోగ్య

పదార్థాలను ప్రసాదింపుము. నీవు ఉపదేశించిన యజ్ఞక్రియకు వలయు ఘృతాది హవ్యములను ప్రసాదించి మమ్ము రక్షించు. నీ కివే శత సహస్ర వందనాలు.

రెండవ స్వస్తి సూక్తం సమాప్తం

మూడవ స్వస్తి సూక్తం

ఉపోద్ఘాతం:

పూర్వం చెప్పినట్లుగా స్వస్తి అంటే - (సు+అస్తి) మాకు అన్నీ మంచిగానే జరగాలనీ, శుభంకరములే కావాలనీ అందుకు తగిన ప్రయత్నం చేస్తూ దేవుని ప్రార్థించటం. వీటిలో రెండవ స్వస్తిసూక్తం ఆనోభద్రాః సూక్తంగా ప్రచలితమయ్యింది.

ఋగ్వేద పంచమ మండలంలోని 15 మంత్రాలు గల ఈ 51వ సూక్తానికంతకీ సస్త్యాత్రేయుడు (స్వస్తి + ఆత్రేయుడు) ఋషిగా పేర్కొనబడింది. అంటే - వేదకాలం నాటి ఆత్రేయుడనే నామం గల ఈ ఋషి ఈ సూక్తాన్ని బాగా అధ్యయన మనన చింతనలు చేస్తూ అష్టాంగ యోగసాధన చేశాడు. క్రమంగా యోగంలో 8వ అంగమైన సమాధి స్థితిని పొంది పరమేశ్వరుని ద్వారా ఈ మంత్రార్థాలను సాక్షాత్కారం చేసుకున్నాడు. ఆ అర్థాలను సామాన్య ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆనాడు ఆత్రేయుడనే పేరుగల మరికొందరు ఋషులుండి ఉండవచ్చును. అందుచే స్వస్తి మంత్రాల అర్థాలను ప్రచారం చేసిన ఆది ఋషిగా ఈయనను స్వస్త్యాత్రేయ ఋషిగా పేర్కొనటం జరిగి ఉండవచ్చు.

ఈ మంత్రాలన్నిటికి "దేవత - విశ్వేదేవాః" గా పేర్కొనటం జరిగింది. అంటే - ఈ మంత్రాలలో చాలా దైవీశక్తులు పేర్కొనబడ్డాయి. అందుచే ఏ మంత్రాలలో ఏఏ దైవీశక్తులు పేర్కొనబడ్డాయో అవే ఆ మంత్రాలలోని విషయంగా (Subject matter గా) గుర్తించాలని భావం.

1. ఓం అగ్నే సుతస్య పీతయే విశ్వైరూమేభిరా గహి ।
దేవేభిర్ హవ్యదాతయే ॥ ఋ. 5. 51. 1

భావము: ఓ యజ్ఞాగ్నీ! విద్వాంసులచే నిష్పాదితమైన సోమరసమును పానమొనర్చుటకు రమ్ము. దానిని నీవు జీర్ణం చేసి - భస్మం చేసి, సూక్ష్మ అణువులుగా

చేసి మిగిలిన జడదేవతలన్నిటికి అందించుటకు రమ్ము. అందరికీ స్వస్తిని – శుభాలను కలిగించుము.

2. ఓం ఋతధీతయ ఆ గత సత్యధర్మాణో అధ్వరమ్ ।
అగ్నేః పిబత జిహ్వయా ॥ ఋ. 5. 51. 2

భావము: ఓ ఋతధీతలైన – సత్యధారణ చేయువారైన విద్వాంసులారా! మీరు సత్యధర్మం కొరకు ఈ అధ్వరమును – హింసారహిత యజ్ఞమును మాచే చేయించుడు. ఆ అగ్ని జిహ్వలనుండి – శిఖల నుండి వెలువడు ఆరోగ్యకర వాయువులను మీరును సేవింపుడు. మా అందరకు స్వస్తిని కలిగింపుడు.

3. ఓం విప్రేభిర్విప్ర సన్త్య ప్రాతర్యావభిరా గహి ।
దేవేభిః సోమపీతయే ॥ ఋ. 5. 51. 3

భావము: ఓ యజ్ఞాగ్నీ! ఈ ప్రాతఃకాల సమయంలో మిగిలిన దేవతలతో గూడి సోమరసమును పానం చేయుటకు నిన్ను ఆహ్వానిస్తున్నాను. విప్రేభిః– విప్రులైన శ్రేష్ఠ వేద విద్వాంసులను కూడా సాదరంగా ఆహ్వానిస్తున్నాను. మీరంతా నాతో శాస్త్రోక్తంగా అగ్నిహోత్ర కార్యాన్ని చేయించి, సోమరసాన్ని పానం చేయించండి. మిమ్ము సాదరంగా ఆహ్వానిస్తున్నాను.

4. ఓం అయం సోమశ్చమూ సుతో౾మత్రే పరి షిచ్యతే ।
ప్రియ ఇన్ద్రాయ వాయవే ॥ ఋ. 5. 51. 4

భావము: నేను సోమలతాది పెక్కు బలకర మూలికలతో నిష్పన్నం చేసిన రసాన్ని ఒక పెద్ద పాత్రలో నింపి ఉంచాను. దీనితో విద్వాంసులు శాస్త్రోక్తంగా నాచే సోమయాగాన్ని నిర్వర్తింపచేయుదురుగాక. అట్టి హోమము నుండి వెలువడిన వాయువులు అంతరిక్షస్థ వాయువులతో కలిసి దానిని ఐశ్వర్యవంతముగా – ఆరోగ్యాన్ని, పుష్టిని కలిగించు వాయువుగా చేయును గాక. అట్టి వాయువును సేవించిన విద్వాంసులు, సైనికులు మాకు వివిధ ఐశ్వర్యాలను – సంపదలను ప్రాప్తింపచేయుదురు గాక.

5. ఓం వాయవా యాహి వీతయే జుషాణో హవ్యదాతయే ।
పిబా సుతస్యాన్ధసో అభి ప్రయః ॥ ఋ. 5. 51. 5

భావము: ఓ పరమ బలయుక్త వాయు దేవతా! నేను తలపెట్టిన సోమయాగానికి నిన్ను సాదరంగా ఆహ్వానిస్తున్నాను. సోమరసాన్ని నీవు తృప్తిగా పానం చేయుము. నీవు హవ్యవాహనుడవు. హవ్యదాతవు కూడా. మేము యజ్ఞాగ్నిలో అర్పించు ఆహుతిని మిగిలిన జడ దేవతలకు, ప్రాణులకు అందజేయగల సమర్థుడవు. కనుక, నీవు అన్ని ప్రాణులకు యథాయోగ్యంగా అందచేసి సహకరించగోరుచున్నాను.

6. ఓం ఇన్ద్రశ్చ వాయవేషాం సుతానాం పీతిమర్హథః ।
తాంజుషేథామ్ + అరేపసావభి ప్రయః ॥

ఋ. 5. 51. 6

భావము: ఓ వాయుదేవతా! ఈ యజ్ఞాగ్ని నుండి వెలువడు ఆరోగ్యకర, పుష్టికర వాయువులను నీలో కలుపుకొని ముందుగా రాజులకు, సేనాపతులకు యథాయోగ్యంగా పంచిపెట్టుము. అనంతరం ముఖ్యులైన పెద్దలందరకు అందజేయుము. మాకు స్వస్తిని కలిగించుము.

7. ఓం సుతా ఇన్ద్రాయ వాయవే సోమాసో దధ్యాశిరః ।
నిమ్నం న యన్తి సిన్ధవోఽభి ప్రయః ॥ ఋ. 5. 51. 7

భావము: ఓ మానవులారా! నదులు ఏవిధంగా నిమ్న స్థలాలకు ప్రవహిస్తూ ఉంటాయో అట్లే మీ సంపదలు, సోమలతాది పుష్టికర పదార్థాలు శ్రేష్ఠ పురుషులకు ప్రవహింపచేయండి. సత్పాత్రులకు విరివిగా దాన ధర్మాలు చెయ్యండి. తద్వారా మీకు స్వస్తి కలుగుతుంది. పుణ్యం వస్తుంది. ఇంతకన్న ఉత్తమ జన్మ వస్తుంది.

8. ఓం స జూర్విశ్వేభిర్దేవేభిరశ్విభ్యాముషసా సజూః ।
ఆ యాహ్యగ్నే అత్రివత్ సుతే రణ ॥ ఋ. 5. 51. 8

భావము: ఓ యజ్ఞాగ్ని వంటి పవిత్రకర విద్వాంసులారా! అగ్నియొక్క సూక్ష్మమైన తత్త్వం సృష్టిలోని అన్ని పదార్థాలలోను వ్యాపించి ఉంది. భూజలములలోను, వాటినుండి ఏర్పడిన వివిధ పదార్థాలలోను అది సూక్ష్మంగా దాగి వుంది. దానితో మీరు లోక కల్యాణం కొరకు వైజ్ఞానిక ఆవిష్కారాలు చేయండి. తద్వారా అందరికి స్వస్తి కలుగుతుంది.

9. ఓం సజూర్మిత్రావరుణాభ్యాం సజూః సోమేన విష్ణునా ।
ఆ యాహ్యగ్నే అత్రివత్ సుతే రణ ॥ ఋ. 5. 51. 9

భావము: ఓ అగ్నీ! చతుర్వేదవేత్తా! నీవు మిత్రావరుణులతో కలిసి రమ్ము – ప్రాణ ఉదాన వాయువుల విజ్ఞానాన్ని బోధించ రమ్ము. ఇంతేగాక, నీవు మాకు సోమ విష్ణువుల – చంద్ర ఆకాశాల జ్ఞానాన్ని కూడా కలిగించ విచ్చేయుము. ఆ జ్ఞాన విజ్ఞానాలతో మేము విశేష సుఖాల ననుభవించగోరుచున్నాము. వీటితోబాటు ఈ సృష్టిరూప సుతునిలో అత్రివలె వ్యాపించియున్న ఆ పరమ సత్యాన్ని – సర్వవ్యాపక సర్వేశ్వరుని గూర్చిన జ్ఞానాన్ని కూడా బోధించి మమ్ము కృతార్థుల చేయ రమ్ము.

వివరణ: అగ్ని పదము ఆధ్యాత్మికార్థంలో పరమేశ్వరునికి వర్తిస్తుంది. ఆధి భౌతికార్థంలో (ప్రాణుల పరంగా) విద్వాంసులకు, మార్గదర్శకులకు, రాజులకు, సేనాపతులకు ఇది వర్తిస్తుంది. వీరంతా మనకు మార్గదర్శకులే కదా! (అగ్నిః కస్మాత్ – అగ్రణీర్భవతి – నిరుక్తం)

10. ఓం సజూరాదిత్యైర్వసుభిః సజూరిన్ద్రేణ వాయునా ।
ఆ యాహ్యగ్నే అత్రివత్ సుతే రణ ॥ ఋ. 5. 51. 10

భావము: ఓ అగ్నీ! చతుర్వేదవేత్తా! నీవు ఆదిత్యులతో వసువులతో కలిసి రమ్ము. మాకు ద్వాదశాదిత్యుల జ్ఞానాన్ని, అష్టవసువుల జ్ఞానాన్ని కలిగించ రమ్ము. ఇంతేగాక, వాయువు వంటి బలమైన ఇంద్రుని గూర్చిన – జీవుని గూర్చిన జ్ఞానాన్ని కూడా బోధించి మమ్ము జ్ఞానవంతుల చేయ రమ్ము. ఈ జ్ఞాన విజ్ఞానాలతో మేము విశేష సుఖాల ననుభవించ గోరుచున్నాము. వీటితోబాటు ఈ సృష్టిరూప సుతునిలో అత్రివలె వ్యాపించియున్న ఆ పరమ సత్యాన్ని – సర్వవ్యాపక సచ్చిదానంద పరమేశ్వరుని గూర్చిన జ్ఞానాన్ని కూడా బోధించి మమ్ము కృతార్థుల చేయ రమ్ము. మాకు స్వస్తిని కలిగించుము.

11. ఓం స్వస్తినో మిమీతామశ్వినా
భగః స్వస్తి దేవ్యదితిరనర్వణః ।
స్వస్తి పూషా అసురో దధాతు
నః స్వస్తి ద్యావాపృథివీ సుచేతునా ॥ ఋ. 5. 51. 11

భావము: ఓ పరమేశ్వరా! నీ కృపవలన సృష్టిలోని అశ్వినులు - సూర్యచంద్రులు, ప్రాణాపానములు, అధ్యాపకోపదేశకులు (Teachers and Preachers) మాకు స్వస్తిని చేకూర్తురు గాక. మా భగములు - సంపదలు మాకు స్వస్తిని కలిగించును గాక. వ్యసనపరులను చేయకుండును గాక. దేవీ అదితి - దివ్య గుణాలు గల వేదమాత, భూమాతలు మాకు నిశ్చలమైన స్వస్తిని కలిగింతురు గాక. పూషా - పుష్టిని కలిగించు మేఘాలు సమయానుకూలంగా వర్షించి మాకు ప్రాణదానము చేయును గాక. ద్యావా పృథివీలోకాలు మంచి చైతన్యము నిచ్చి మాకు స్వస్తిని కలిగించును గాక.

12. ఓం స్వస్తయే వాయుముప బ్రవామహై
సోమం స్వస్తి భువనస్య యస్పతిః ।
బృహస్పతిం సర్వగణం స్వస్తయే
స్వస్తయ ఆదిత్యాసో భవన్తు నః ॥ ఋ. 5. 51. 12

భావము: సమస్త దేవతా గణములకు పతివైన ఓ బృహస్పతీ! పరమేశ్వరా! స్వస్తికొరకు మేము వాయు విద్యలను - ప్రాణాయామాది విద్యలను ఆహ్వానింతుము గాక. వాటిని చక్కగా నేర్చుకొని, నియమంగా అభ్యసింతుముగాక! అట్లే, సౌమ్యుడైన సోముని - చంద్రుని, భువనములకు (గ్రహ కుటుంబానికి) పతియైన సూర్యుని ఆహ్వానింతుము గాక! ఆయా విద్యా విజ్ఞానాలను పొందుదుము గాక. ఆదిత్య బ్రహ్మచారులను - నాలుగు వేదాలను చక్కగా అభ్యసించిన పూర్ణ విద్వాంసులను ఆహ్వానించి వారి ఉపదేశముల ననుసరిస్తూ జీవింతుము గాక! స్వస్తిని - సుఖశాంతులను పొందుదుముగాక.

13. ఓం విశ్వే దేవా నో అద్యా స్వస్తయే వైశ్వానరో వసురగ్నిః స్వస్తయే ।
దేవా అవన్త్వృభవః స్వస్తయే స్వస్తి నో రుద్రః పాత్వంహసః ॥
ఋ. 5. 51. 13

భావము: హే పరమేశ్వరా! నీ కృపవలన సమస్త దేవతలు - విద్యా విజ్ఞాన రంగాలలోని సమస్త విద్వాంసులు మాకు నేడే స్వస్తిని చేకూర్తురు గాక. అట్లే, వైశ్వానరాగ్ని (పాచకాగ్ని) మా శరీరాలలో స్థిరంగా ఉంటూ మేము సేవించు ఆహార పానీయాదులను చక్కగా పచనం చేసి మమ్ము శక్తివంతులను చేయును

గాక. మా ఋభు దేవతలు – స్థిరంగా ప్రకాశించు సూర్య విద్యుదాగ్నులు మాకు కల్యాణము చేకూర్తురు గాక. మా రుద్ర దేవతలు – దుష్టులను దండించి రోదింపచేయు పాలకులు మమ్ము పాపులనుండి, పాపములనుండి రక్షింతురు గాక.

14. ఓం స్వస్తి మిత్రావరుణా స్వస్తి పథ్యే రేవతి ।
స్వస్తిన ఇన్ద్రశ్చాగ్నిశ్చ స్వస్తినో అదితే కృధి ॥

ఋ. 5. 51. 14

భావము: హే ప్రభో! సర్వ సంరక్షకా! నీ కృపవలన మిత్రా వరుణులు – ప్రాణాపానములు మాకు అనుకూలంగా ఉంటూ స్వస్తిని – శుభములను కలిగించును గాక. మార్గాలలో స్వేచ్ఛగా విహరించుచు ఐశ్వర్యాలనిచ్చుచుండు గోమాతలు మాకు స్వస్తిని కలిగించును గాక. ఇంద్రాగ్నులు – సూర్యుడు మరియు అగ్ని మాకు సహకరించి స్వస్తిని కలిగించును గాక. అదితి – అఖండనీయ పరమేశ్వరుడు, వేదము, పృథివి మాకు సదా స్వస్తిని కలిగించును గాక.

15. ఓం స్వస్తి పంథామను చరేమ సూర్యాచన్ద్రమసావివ ।
పునర్దదతాఘ్నతా జానతాం సం గమేమహి ॥

ఋ. 5. 51. 15

భావము: హే సర్వవ్యాపక సచ్చిదానంద సర్వేశ్వరా! మేము నీ వేదాజ్ఞలను పాలించుచు సూర్యచంద్రులవలె స్వస్తి పథమున – కల్యాణకర మార్గమున జీవనయాత్ర గడుపుదుము గాక. మరల మరల సత్పాత్రులకు దానం చేయుచు, ఒకరి నొకరము సరిగా అర్థం చేసుకుంటూ సామాజిక జీవనం గడుపుదుముగాక. ఏ ప్రాణిని హింసించకుందుము గాక. రామకృష్ణాది ఆదర్శ పురుషుల ననుసరిస్తూ విద్వాంసుల సాంగత్యంలో నుందుము గాక. మేము అభ్యుదయ నిశ్శ్రేయసాల రెంటిని ఈ జన్మలోనే సాధించ పూర్ణ పురుషార్థం చేయుదము గాక. అని సదా సంకల్పం చేస్తూ ప్రయత్నం చేసేవారికి తప్పక స్వస్తి కలుగుతుంది. వారు అభిరుచి కలిగిన విషయాలలో ఉన్నతి కలుగుతుంది.

మూడవ స్వస్తి సూక్తం సమాప్తం

నాల్గవ స్వస్తి సూక్తం

1. ఓం పరావతో యే దిధిషన్త ఆప్యం మను
ప్రీతాసో జనిమా వివస్వతః ।
యయాతేర్యే నహుష్యస్య బర్హిషి
దేవా ఆసతే తే అధి బ్రువన్తు నః ॥ ఋ. 10.63.1

భావము: ఎవరు మానవ మాత్రులందరిని ప్రేమిస్తారో, దూరదూర దేశాలనుండి ఈ యజ్ఞసభకు విచ్చేసిరో, యజమానులపట్ల, యజ్ఞము నిర్వహించువారి పట్ల బంధుత్వ భావం కలిగియుంటారో, యజమానుల జన్మములను – వంశ క్రమమును ప్రశంసిస్తారో, యజ్ఞ నియమాలను పాటిస్తారో అట్టి మహానుభావులంతా మాకు వేదోపదేశాలు చేయుదురు గాక. మాకు స్వస్తి మార్గాన్ని ఉపదేశింతురు గాక.

2. ఓం విశ్వా హి వో నమస్యాని వన్ద్యా
నామాని దేవా ఉత యజ్ఞియాని వః ।
యే స్థ జాతా అదితేరద్భ్యస్పరి యో
పృథివ్యాస్తే మ ఇహ శ్రుతా హవమ్ ॥

ఋ. 10.63.2

భావము: మేము ఈ బృహద్యజ్ఞానికి వాయు వాదిత్యాది సమస్త ప్రాకృతిక దేవతలను ఆహ్వానిస్తున్నాము. వాటికి తగిన ఆహుతులనిచ్చి సత్కరిస్తాము. వాటి తేజము, ప్రభావము ప్రశంసనీయమైనది. యజ్ఞార్హమైనది. భూ అంతరిక్ష ద్యుస్థానాల నుండి జన్మించిన అన్ని దేవతలను గూర్చిన జ్ఞాన విజ్ఞానాలను ఈ యజ్ఞ సభకు విచ్చేసిన విద్వాంసులు మాకు ఉపదేశింతురు గాక. మమ్ము స్వస్తి పథమున నడిపింతురు గాక.

3. ఓం యేభ్యో మాతా మధుమత్ పిన్వతే
పయః పీయూషం ద్యౌరదితిరద్రిబర్హాః ।
ఉక్థశుష్మాన్ వృషభరాన్ స్వప్నసస్తాం
ఆదిత్యా అను మదా స్వస్తయే ॥ ఋ. 10.63.3

భావము: ఓ మానవులారా! ఏ శ్రేష్ఠ మానవుల కొరకు ఈ భూమాత మధుమతియై అనేక ఫల శాక ధాన్యాదుల నిచ్చుచున్నదో, ద్యు అంతరిక్ష లోకాలు మేఘాలతో నిండి అమృత వర్షాలు కురిపించుచున్నవో అట్టి ఆదిత్య బ్రహ్మచారులను – నాలుగు వేదాలను చక్కగా అధ్యయనం చేసిన వారిని ఆహ్వానించి వారి ఉపదేశాలను శ్రద్ధగా విని ఆచరించండి. అప్పుడే మీకు స్వస్తి కలుగుతుంది. మీ కర్మలు దోషరహితమై మీకు అన్నీ శుభములే కలుగుతాయి.

4. ఓం నృచక్షసో అనిమిషన్తో అర్హణా
బృహద్దేవాసో అమృతత్వమానశుః ।
జ్యోతీరథా అహిమాయా అనాగసో
దివో వర్ష్మాణం వసతే స్వస్తయే ॥ ఋ. 10.63.4

భావము: ఎవరు నృచక్షులో – నేతలను చక్కగా నిరీక్షిస్తూ వారికి మార్గదర్శనం చేయుచుందురో, అనిమిషన్తులో – కంటిపై రెప్పవేయక సదా జాగరూకులై యుందురో అట్టి పూజార్హులైన గొప్ప విద్వాంసులే అమరత్వాన్ని – ముక్తిని పొందగలరు. వారు జ్యోతీరథంపై ఆరోహించి – జ్ఞానరథంపై ఆసీనులై, పాపరహితులై దివం యొక్క ఉన్నత స్థానానికి చేరుదురు. కనుక, స్వస్తిని కోరు మనమును వారి మార్గాన్ని అనుసరిస్తూ జీవనయాత్ర గడపాలి.

5. ఓం సమ్రాజో యే సువృధో యజ్ఞమాయయుర
పరిహ్వృతా దధిరే దివి క్షయమ్ ।
తా అవివాస నమసా సువృక్తిభిర్మహో
ఆదిత్యా అదితిం స్వస్తయే ॥ ఋ. 10.63.5

భావము: ఆదిత్య – నైష్ఠిక బ్రహ్మచారులు చక్రవర్తులవలె సన్మానించ తగినవారు. వారు సదా పరోపకారక కార్యములనే చేయుచుందురు. తమ ఆధ్యాత్మిక యున్నతికై యత్నించుటయేకాక పరుల యున్నతికై పాటుపడుదురు. వారు కపటులు కారు. ఋజు వర్తనులు. అందుచే వారిని సాదరంగా ఆహ్వానించి, భక్తి శ్రద్ధలతో నమస్కరించి తగిన భోజనాదుల నొసంగవలెను. సమీపమున కూర్చుండి ధర్మ సందేహముల నడిగి తెలిసికొని వారు సూచించినట్లు నడుచుకోవాలి. అప్పుడే స్వస్తి కలుగుతుంది.

6. ఓం కో వః స్తోమం రాధతి యం జుజోషథ
విశ్వే దేవాసో మనుషో యతిష్ఠన ।
కోవోఽ_ధ్వరం తువిజాతా అరం
కరద్ యో నః పర్షదత్యం హః స్వస్తయే ॥

ఋ. 10.63.6

భావము: ఓ మననశీల మానవులారా! ఎవరు మీ కొరకు ఋగ్వేదాది స్తుతి సమూహమును – నిర్మించెనో ఆ సుఖ స్వరూప పరమాత్మను కీర్తింపుడు – ఆ వేదాలను అధ్యయన మనన చింతన పరీక్షణలను చేయుడు. అందువల్ల ఓ తువిజాతులైన మానవులారా! అనేక జన్మలనెత్తు జీవులారా! మీకొరకే అతడు ఈ అధ్వరములను హింసారహిత యజ్ఞ యాగాదులను సృజించినాడు. అవి మిమ్ము పాపములనుండి విముక్తులను చేసి దుఃఖసాగరమును తరింపచేస్తాయి. అందువల్ల మీకు స్వస్తి – శుభము కలుగుతుంది.

7. ఓం యేభ్యో హోత్రాం ప్రథమా మాయేజు
మనుః సమిద్ధాగ్నిర్మనసా సప్త హోతృభిః ।
త ఆదిత్యా అభయం శర్మ యచ్ఛత
సుగా నః కర్త సుపథా స్వస్తయే ॥ ఋ. 10.63.7

భావము: ఓ సర్వాంతర్యామీ! ప్రాపంచిక పదార్థాల శుద్ధి కొరకు నీవుపదేశించిన అగ్నిహోత్ర కార్యాన్ని మేము సప్తహోతల సహకారంతో పంచ జ్ఞానేంద్రియాల మరియు మనోబుద్ధుల సహకారంతో చక్కగా చేయుదుము గాక. నాలుగు వేదాలను చక్కగా అధ్యయనం చేసిన ఆదిత్య బ్రహ్మచారులు నీ వేద సందేశాన్ని మాకు వివరించి చెప్పుదురు గాక. మా జీవన మార్గాన్ని సుగమం చేయుదురు గాక. స్వస్తికొరకు మేము ఆ సుపథమున పయనింతుము గాక.

8. ఓం య ఈశిరే భువనస్య ప్రచేతసో
విశ్వస్య స్థాతుర్జగతశ్చ మన్తవః ।
తే నః కృతాదకృతాదేనసస్పర్యద్యా
దేవాసః పిపృతా స్వస్తయే ॥ ఋ. 10.63.8

భావము: ప్రచేతసులు – ఉత్కృష్టజ్ఞానము, విశాల హృదయము గల మననశీలురు ఈ సమస్త స్థావర జంగమ లోకములను చక్కగా పాలించగలుగుదురు. మానవ సమాజమును సరియైన మార్గములో నడుపగలరు. హే పరమేశ్వరా! నీ కృపవలన మాకట్టి రాజులు – పాలకులు లభింతురు గాక. మమ్ము కృత అకృత పాపములబడి దుఃఖముల బడకుండా శాసింతురు గాక. మాకు స్వస్తిని కలిగింతురు గాక.

వివరణ: కృత పాపము లంటే – శరీరంతో చేసిన పాపములు, దొంగతనము, వ్యభిచారము, హత్యలు మొ.నవి. అకృత పాపములంటే – మనసులోని పాపపు ఆలోచనలు.

9. ఓం భరేష్విన్ద్రం సుహవం హవామహేఽం
హోముచం సుకృతం దైవ్యం జనమ్ ।
అగ్నిం మిత్రం వరుణం సాతయే భగం
ద్యావాపృథివీ మరుతః స్వస్తయే ॥ఋ. 10.63.9

భావము: మాదేశంపై శత్రువులు దాడి చేసినపుడు లేదా దేశంలో ఏదైనా సంకటం ఏర్పడినపుడు అందుకు తగిన బలవంతులైన మిత్రదేశాల సహకారాన్ని ఆహ్వానింతుము గాక. కోరుదుము గాక. అట్లే, పాపమోచకులు, సుకృతులు అయిన దివ్యజనులను – మంత్రులను ఆహ్వానించి వారి సూచనలను, సలహాలను తీసుకొందుము గాక. అగ్ని మిత్ర వరుణ విద్యల నెరిగిన వారిని, సాతకులను – ఆహార భండాగార అధికారులను ఆహ్వానింతుము గాక. ద్యు పృథివీలోక విజ్ఞాన వేత్తలను, వాటి మధ్య సంచరించు మరుత్ వైజ్ఞానికులను – వాయు విద్యల నెరిగిన వారిని ఆహ్వానింతుము గాక. అవసరమైన వారందరి సహకారాన్ని కోరుతూ సంకటములనుండి విడివడి స్వస్తిని – సుఖశాంతులను పొందుదుము గాక.

వివరణ: అగ్ని మిత్ర వరుణ విద్యలంటే – అగ్ని వాయు జల విద్యల నెరిగిన వైజ్ఞానికులు (Engineers).

10. ఓం సుత్రామాణం పృథివీం ద్యామనేహసం
సుశర్మాణమదితిం సుప్రణీతిమ్ ।

దైవీం నావం స్వరిత్రామనాగసమస్రవన్తీ
మా రుహేమా స్వస్తయే ॥ ఋ. 10.63.10

భావము: ఓ మానవులారా! శత్రువులు భూమార్గంనుండియే కాక సముద్రమార్గము నుండి కూడా దాడి చేయవచ్చును. కనుక ఆ సమయంలో నౌకాయుద్ధం చెయ్యవలసి వస్తుంది. అప్పుడు మీ యుద్ధనౌకలు ఈ క్రింది విధంగా బలిష్టంగా ఉండాలి.

సుత్రామాణం = చక్కటి అధునాతన ఆయుధాలతో తగిన రక్షణ సాధనాలతో ఉండాలి. **పృథివీం =** అవి విశాలమైనవిగా ఎక్కువ సైనికులు గలవిగా ఉండాలి. **ద్యామ్ =** అందు అవసరమైతే ఆకాశమార్గమున వెళ్ళగలుగు హెలికాప్టర్‌లు కలిగి ఉండాలి. **అనేహసం =** అవి దోషరహితంగా – ఇబ్బంది పెట్టని యంత్రాలు కలిగి ఉండాలి. **సుశర్మాణం =** అవి మంచి సుఖము నిచ్చేవిగా కూడా ఉండాలి. **సుప్రణీతిం =** అవసరాన్నిబట్టి దూరంగా తీసుకువెళ్ళగలిగేవిగా ఉండాలి. **దైవీం స్వరిత్రామ్ =** దివ్యమైనవిగా శత్రు సంకటములనుండి కాపాడేవిగా ఉండాలి. **అనాగసం అస్రవంతీమ్ =** అవి చిల్లులు పడి మునిగిపోయేవిగా ఉండకూడదు. **ఆరుహేమా స్వస్తయే =** స్వస్తి కొరకు – విజయం కొరకు అట్టి సకల రక్షణ ఏర్పాట్లు గల నౌకలను అధిరోహించండి.

11. ఓం విశ్వే యజత్రా అధివోచతోతయే
త్రాయధ్వం నో దురేవాయా అభిహ్రుతః ।
సత్యయా వో దేవహూత్యా హువేమ
శృణ్వతో దేవా అవసే స్వస్తయే ॥ ఋ. 10.63.11

భావము: విశ్వే యజత్రా అధివోచత+ఊతయే = ఓ సమస్త యజనీయ దేవతలారా! పూజింపతగిన విద్వాంసులారా! దేనివల్ల మాకు రక్షణ కలుగునో అట్టి రాజనీతిని మాకు ఉపదేశించండి. **త్రాయధ్వం నః + దూరేవాయాః అభిహృతః =** మమ్ము దుష్టులనుండి, దుర్గతి నుండి రక్షించండి. **సత్యయా వః దేవ+హూత్యా హువేమ =** మేము సత్యవాక్కులతో మిమ్ము సాదరంగా ఆహ్వానిస్తున్నాము. **శృణ్వతో దేవా అవసే స్వస్తయే =** మా ఈ ప్రార్థనల నాలకించి మమ్ము రక్షించి కాపాడండి. మాకు స్వస్తిని కలిగించండి. విజయాన్ని కలిగించండి.

12. ఓం అపామీవామప విశ్వామనాహుతి
మపారాతిం దుర్విదత్రామఘాయతః ।
ఆరే దేవా ద్వేషో అస్మద్యుయోతనోరు
ణః శర్మ యచ్ఛతా స్వస్తయే ॥ ఋ. 10.63.12

భావము: ఓ దేవతలారా! దివ్యగుణాలు గల వైద్య విద్వాంసులారా! మాలోని రోగాలను, అందువల్ల కలిగే బాధలను దూరం చెయ్యండి. మాలోని అనాహుతి భావాలను – యజ్ఞంలో ఆహుతులివ్వని ప్రవృత్తిని పోగొట్టి మాచే దైనిక యజ్ఞాలను, విశేష యజ్ఞాలను విరివిగా చేయించండి. అట్లే, మాలోని అరాతి భావాన్ని – దానధర్మాలు చేయని పిసినారితనాన్ని తొలగించి మాచే దానధర్మాలు చేయించండి. దుష్టబుద్ధిని, పాపభావాలను వెళ్ళగొట్టి మాకు గొప్పదైన సాత్త్విక సుఖాన్ని, స్వస్తిని కలిగించండి.

13. ఓం అరిష్టః స మర్తో విశ్వ ఏధతే
ప్ర ప్రజాభిర్జాయతే ధర్మణస్పరి ।
యమాదిత్యాసో నయథా సునీతిభి
రతి విశ్వాని దురితా స్వస్తయే ॥ ఋ. 10.63.13

భావము: శారీరకంగాను, మానసికంగాను ఆరోగ్యవంతుడైన వ్యక్తియే తన లక్ష్యంవైపు పరుగిడగలుగును. అన్నిటిని పొందగలుగును. ఎవరు ఆదిత్య బ్రహ్మచారుల – చతుర్వేద వేత్తల ఉపదేశాలను వింటూ, వారు సూచించిన మార్గంలో నడుస్తారో వారే ధర్మాత్ములై ఉత్తమ సంతానాన్ని పొందగలరు. సమస్త దుఃఖాలను, ఆటంకాలను అధిగమించి స్వస్తిని పొందగలరు. సుఖశాంతులను, శుభాలను పొందగలరు.

14. ఓం యం దేవాసో౽వథ వాజసాతౌ యం
శూరసాతా మరుతో హితే ధనే ।
ప్రాతర్యావాణం రథమిన్ద్ర సానసి
మరిష్యన్తమా రుహేమా స్వస్తయే ॥ ఋ. 10.63.14

భావము: అన్నాది భోగ్య పదార్థాలతో విద్వాంసులు ఏ శరీరాన్ని చక్కగా

పోషించుకుంటూ యోగసాధన చేస్తారో, శూరవీరులు కదనరంగాన తమ పరాక్రమాన్ని చూపుతూ దేశరక్షణ చేయటానికి ఏ శరీరాన్ని వ్యాయామాదులతో బలపరచుకుంటారో అట్టి ఈ మానవ శరీరం అద్భుతమైన గొప్ప ప్రయాణ సాధనం (వాహనం). దీనితో ఇహపర లోకాలు రెంటినీ సాధించవచ్చు. ఇహలోకాన అభ్యుదయాన్ని పరలోకాన నిఃశ్రేయసాన్ని – ముక్తిని సాధించవచ్చు. ఈ శరీరం ఇంద్రునకు – ఇంద్రియాధిపతియైన జీవునకు ప్రాతఃకాలాన పడకనుండి లేవగానే అధిరోహించవలసిన మొట్టమొదటి ప్రాతర్యావాణరథం. కనుక ఓ మానవులారా! దైవదత్తమైన ఈ మానవ శరీరాన్ని చక్కగా పోషించుకోండి. అలంకరించుకోండి. రక్షించుకోండి. విరిగిపోకుండా – రోగాల బారినపడి మంచాన పడకుండా కాపాడుకోండి. స్వస్తి కొరకు ఇంతకన్న గొప్ప వాహనం మరొకటి లేదు.

15. ఓం స్వస్తి నః పథ్యాసు ధన్వసు
స్వస్త్యప్సు వృజనే స్వర్వతి ।
స్వస్తి నః పుత్రకృథేషు యోనిషు
స్వస్తి రాయే మరుతో దధాతన ॥ ఋ. 10.63.15

భావము: ఓ సర్వాంతర్యామీ! నీ కృపవలన మా ప్రయాణ మార్గాలన్నీ మాకు స్వస్తిని కలిగించునవియే అగును గాక. ధన్వములలో – ఎడారులలో – మరుభూములలో ఏ మార్గాన్ని అనుసరించి వెళ్ళాలో తెలియక తికమక పడుచుందుము. అప్పుడు మా బుద్ధులను ప్రేరేపించి మాకు స్వస్తి మార్గమును తెలుపుము. అట్లే, పెద్ద పెద్ద జలమార్గాలలోను, సముద్రాలలోను, ఆకాశ మార్గాలలోను కొన్ని చిక్కులు ఏర్పడుచుండును. వాటిని అధిగమించు బుద్ధిని ప్రసాదింపుము. తల్లి గర్భం నుండి బయటపడే యోనిమార్గంలోను మాకు ఇక్కట్లు కలుగకుండా కాపాడు. ఇవన్నీ భౌతిక మార్గాలు. నీ వేదజ్ఞాన వెలుగులో ఈ మార్గాలను సుగమం చేసుకోగలము. కాని ధనప్రాప్తికి – ఐశ్వర్యాల ప్రాప్తికి యత్నించేటప్పుడు మాలోని కోరికలు మమ్ము పెడత్రోవ పట్టించే ప్రమాదం ఉంది. కనుక ఓ అంతర్యామీ! అప్పుడు నీ సహాయం అనివార్యం. "అగ్నే! నయ సుపథారాయే" ఓ ప్రకాశ స్వరూప పరమేశ్వరా! మమ్ము సుపథమున నడిపించి మాకు స్వస్తిని కలిగించు. నీకివే మా శత సహస్ర వందనాలు.

16. ఓం స్వస్తిరిద్ధి ప్రపథే శ్రేష్ఠా
రేక్ణస్వత్యభి యా వామమేతి ।
సా నో అమా సో అరణే ని పాతు
స్వావేశా భవతు దేవగోపా ॥ ఋ. 10.63.16

భావము: హే సర్వాంతర్యామీ! నీ కృపవలన మేము వసించు ఈ భూమాత మాకు స్వస్తిని కలిగించును గాక. రేక్ణస్వతి యగును గాక. ధన ధాన్యాలతో, పాడి పంటలతో శోభాయమానము, సుఖదాయకము అగును గాక. మేము పయనించు మార్గములన్నీ సుఖశాంతులను కలిగించును గాక. మాతృదేశమే మాకు స్వగృహమగును గాక. అది విద్వాంసుల ప్రబోధములతో వీరులచే, వైజ్ఞానికులచే రక్షింపబడుచు మమ్ము స్వస్తి పథమున నడుపును గాక.

17. ఓం ఏవా ప్లతేః సూనురవీవృధద్వో
విశ్వ ఆదిత్యా అదితే మనీషీ ।
ఈశానాసో నరో అమర్త్యేనాస్తావి
జనో దివ్యో గయేన ॥ ఋ. 10.63.17

భావము: ఓ ఆదిత్య నామక చతుర్వేద వేత్తలారా! ఓ అదితా నామక చతుర్వేద విదుషీమణులారా! మీ మానస పుత్రులమైన మేము మిమ్ము భోజనాదులతో తృప్తిపరచి, అతిథి సేవచేసి మీ ఉపదేశాలను వినగోరుచున్నాము. మా ప్రార్థనలను మన్నించి మమ్ము అనుగ్రహించండి. మీ వంటి జీవన్ముక్తుల వాక్కులనుండి పరమేశ్వర స్తుతులను - గుణకర్మ స్వభావాలను వినగోరుచున్నాము. కనుక కరుణించి వినిపించి బోధించి మాకు స్వస్తిని కలిగించండి.

నాల్గవ స్వస్తి సూక్తం సమాప్తం

ధన అన్నదాన ప్రశంసా సూక్తము

(భిక్షు సూక్తము)

ఋగ్వేద దశమ మండలములోని 9 మంత్రాలు గల 117వ సూక్తం లోకంలో భిక్షు సూక్తంగా ప్రసిద్ధిని పొందింది. ఈ 9 మంత్రాలకు ఋషి - భిక్షు నామక ఋషి. దేవత - ధన అన్నదాన ప్రశంసా. ఈ మంత్రాలలో సృష్టికర్త మానవులకు

దానం చెయ్యమని ఉపదేశిస్తున్నాడు.

1. ఓం న వా ఉ దేవాః క్షుధమిద్వధం
దదురుతాశితముప గచ్ఛన్తి మృత్యవః ।
ఉతో రయిః పృణతో నోప దస్యత్యుతాపృణన్
మర్డితారం న విన్దతే ॥ ఋ. 10. 117. 1

భావము: ఓ మానవులారా! ఆకలి కారణంగా దేవతలు (ప్రాకృతిక శక్తులు) ఎవరినీ చంపటంలేదు. కడుపునిండా తిన్నవాడు కూడా చనిపోవటం మనం చూస్తున్నాము కదా! కనుక, ఆకలిగొన్న భిక్షకునికి తప్పక అన్నంపెట్టి ఆదరించండి. దానాలు చేసినంత మాత్రాన ఎవరూ దరిద్రులు కారు. దానం చేయని పిసినారులు మరుజన్మలో సుఖాలను పొందలేరు.

2. ఓం య ఆధ్రాయ చకమానాయ
పిత్వోఽన్నవాన్త్సన్ రఫితాయోపజగ్ముషే ।
స్థిరం మనః కృణుతే సేవతే పురోతో
చిత్ స మర్డితారం న విన్దతే ॥ ఋ. 10. 117. 2

భావము: ఓ మానవులారా! అన్న సమృద్ధి గలవారి యింటికి అన్నార్తుడు లేదా అశక్తుడు, దుర్బలుడు, దరిద్రుడు, వచ్చి భిక్ష అడిగితే లేదనకండి. మీ శక్తికొలది అన్నం పెట్టి పంపండి. ఆకలి గొన్నవాని ఎదుట అతనికి పెట్టక ఉత్తమ పదార్థాలను భుజించువాడు పాపి అగును. అతడు ఉన్నతిని పొందకపోగా తన సుఖాలను పోగొట్టుకుంటాడు. ప్రజల ఆదరణను కోల్పోతాడు.

3. ఓం స ఇద్భోజో యో గృహవే దదాత్యన్న
కామాయ చరతే కృశాయ ।
అరమస్మై భవతి యామహూతా
ఉతాపరీషు కృణుతే సఖాయమ్ ॥ ఋ. 10. 117. 3

భావము: ఓ మానవులారా! అర్హులైనవారికి అన్నంపెట్టి ఆదరించువారే నిజమైన దాతలు, కరువు పీడితులకు, వరదలలో, తుఫానులలో, ఆపదలలో అన్నీ పోగొట్టుకున్నవారిని తప్పక ఆదరించాలి. దీనినే అన్నదాన యజ్ఞం అంటారు. అట్టి యజ్ఞం చేయువారికి పుష్కలమైన యజ్ఞఫలాలు లభిస్తాయి. లోకంలో సన్మానం

కలుగుతుంది. శత్రువులు కూడా అతనికి మిత్రులౌతారు.

4. ఓం న స సఖా యో న దదాతి సఖ్యే
సచాభువే సచమానాయ పిత్వః ।
అపాస్మాత్ ప్రేయాన్న తదోకో
అస్తి పృణన్తమన్యమరణం చిదిచ్ఛేత్ ॥ ఋ. 10. 117. 4

భావము: ఒక మిత్రుడు ఆర్థిక ఇబ్బందులలో ఉన్నపుడు కలిగినవాడు తప్పక సాయం చెయ్యాలి. లేకున్న అతడు మిత్రుడే కాదు. ఏ మిత్రుని గృహం నుండి అతడు నిరాశపరుడై తిరిగి వెళ్ళిపోతాడో ఆ గృహం గృహమే కాదు. అది ఒక ఊతిబండ. అట్టి నిరాశపడిన మిత్రుడు మరో ధనిక మిత్రుని యాచించగలడు. తన ఆర్థిక ఇబ్బందులను సరిచేసుకోగలడు. కనుక యోగ్య మిత్రునకు తప్పక సాయం చెయ్యాలి.

5. ఓం పృణీయాదిన్నాధమానాయ తవ్యాన్
ద్రాఘీయాంసమను పశ్యేత పన్థామ్ ।
ఓ హి వర్తన్తే రథ్యేవ చక్రాఽన్యమన్యముప
తిష్ఠన్త రాయః ॥ ఋ. 10. 117. 5

భావము: ధనవంతులు యాచించు పేదలకు దానం చేసి పుణ్యం సంపాదించుకోవాలి. అభివృద్ధి చెందుచున్నవాడు కూడా శక్తికొలది దానం చేస్తూ ఉండాలి. ఏలనంటే ఈ ధనం రథచక్రం వంటిది. ఇప్పుడు నీవద్ద ఉన్నది కాలక్రమంలో మరొకని చెంతకు చేరగలదు. ఆ ధనం నీ చేతిలో ఉన్నపుడే దానాలు చేస్తూ పుణ్యాత్ముడు కావాలి.

6. ఓం మోఘమన్నం విన్దతే అప్రచేతాః
సత్యం బ్రవీమి వధ ఇత్స తస్య ।
నార్యమణం పుష్యతి నో సఖాయం
కేవలాఘో భవతి కేవలాదీ ॥ ఋ. 10. 117. 6

భావము: ఓ మానవులారా! కొందరు పనిచేసుకొని జీవించగలవారు కూడా సోమరులై పరుల అన్నాన్ని యాచిస్తారు. అట్టివారికి దానంచేస్తే వారు మరింత

సోమరులౌతారు. అట్టి సోమరులకు వారి సోమరితనమే మృత్యువవుతుంది. ఇది సత్యం.

కొందరు ధనవంతులు పేదలకు పెట్టక తానొక్కడే తింటూ ఉంటాడు. అట్టివారు ఉన్నతిని పొందలేరు. ఇంతేగాక, వారు సన్మిత్రులను కూడా పొందలేరు. ఎవరు పంచమహా యజ్ఞాలను – సంధ్య, హవనము, పితృయజ్ఞము, బలివైశ్వదేవ యజ్ఞము, అతిథి యజ్ఞము చేయక తానొక్కడికొరకే వండుకొని తినువాడు అన్నాన్నికాక పాపాన్నే తిన్నవాడగును.

7. ఓం కృషన్నిత్ఫాల ఆశితం కృణోతి
యన్నధ్వానమప వృఙ్క్తే చరిత్రైః ।
వదన్ బ్రహ్మావదతో వనీయాన్
పృణన్నాపిరపృణన్తమభి ష్యాత్ ॥ ఋ. 10. 117. 7

భావము: పొలంలో నాగలిని లోతుగా గుచ్చి కష్టపడుతూ భూమిని దున్నే రైతుకు ఆ నాగలియే సమృద్ధిగా అన్నం పెడుతుంది. పుష్కలమైన పంటనిస్తుంది. దారిలో నిలబడి ఆలోచించే వ్యక్తికన్న నడిచే వ్యక్తే గమ్యానికి చేరుకొంటాడు. సోమరునిగా కూర్చున్న విద్వాంసునికన్న వేదోపదేశాలు చేసే విద్వాంసుడే ఎంతో ఉన్నతుడు. కనుక దానం ఇవ్వగల వ్యక్తి ఇస్తూ ఉండటమే ఉత్తమం. కూడబెట్టి చావడం మంచిది కాదు.

8. ఓం ఏకపాద్భూయో ద్విపదో విచక్రమే
ద్విపాత్ త్రిపాదమభ్యేతి పశ్చాత్ ।
చతుష్పాదేతి ద్విపదామభిస్వరే
సంపశ్యన్ పఙ్క్తీరుపతిష్ఠమానః ॥ ఋ. 10. 117. 8

భావము: ఒక పాదం ధనం గల (కొంత ధనం గల) ధనికుడు దానిని రెండింతలు చేయ యత్నిస్తాడు. ఆ తరువాత అతడు దానిని మూడంతలు, నాలుగింతలు చేయ చాలా శ్రమపడతాడు. ఈవిధంగా అతని ధనదాహం పెరుగుతూనే ఉంటుంది. ఏదో ఒకనాడు ఆ ధనమంతా ఇక్కడనే వదిలి పరలోకానికి వెళ్ళిపోతాడు. మరొక జన్మలోనికి వెళ్ళిపోతాడు. ఈ ధనం అతనివెంట పోదు

కదా! ఓ మానవులారా! నేను మీకు మానవ జన్మనిచ్చింది కేవలం ధనం కూడ బెట్టడానికి కాదు. ఆత్మజ్ఞానాన్ని పొంది అమరత్వాన్ని పొంద యత్నించటానికి తస్మాత్ జాగ్రత్త.

9. ఓం సమౌ చిద్ధస్తౌ న సమం వివిష్టః
సంమాతరా చిన్న సమం దుహాతే ।
యమయోశ్చిన్న సమా వీర్యాణి
జ్ఞాతీ చిత్ సన్తౌ న సమం పృణీతః ॥ ఋ. 10.117.9

భావము: ఓ మానవులారా! చూడటానికి మీ రెండు చేతులు సమానంగా ఉన్నా రెండిటిలో శక్తి సమానంగా ఉండదు. ఒకే ఆవుకు పుట్టిన రెండు పెయ్యదూడలు సమానంగా పాల నివ్వవు. అట్లే, కవల పిల్లలలో కూడా దానశీలత సమానంగా ఉండదు. కనుక మీరు ఇతరులతో పోల్చుకోక వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చేస్తూ ఆత్మోన్నతిని పొందాలి.

(భిక్షు సూక్తము సమాప్తం)

జ్ఞాన సూక్తం

ఋగ్వేద దశమ మండలంలోని 11 మంత్రాలు గల 71వ సూక్తానికి దేవత 'జ్ఞానమ్'. అందుచే దీనిని జ్ఞానసూక్తం అనవచ్చు. ఈ మంత్రాలలో – సృష్ట్యాదిలో భాష, జ్ఞానం ఎలా ఉత్పన్నమై వికసించిందో, దీనిని మనం ఎలా ఉపయోగించుకుంటే మనకు ఉన్నతి కలుగుతుందో మొదలగు విషయాలు వివరించబడ్డాయి. ఇందు మొదటి మంత్రం విశేషంగా వాక్కులు (మాటలు పదములు), వాక్యాలు స్వరపేటిక నుండి పరమేశ్వరుని ప్రేరణ వల్లనే ఉచ్చరించబడ్డాయి అంటుంది. క్రమంగా తెలుసుకుందాము రండు.

1. ఓం బృహస్పతే ప్రథమం వాచో అగ్రం
యత్+ప్రైరత నామధేయం దధా నాః ।
యదేషాం శ్రేష్ఠం యదరి ప్రమాసీత్వేణా
యదేషాం నిహితా గుహావిః ॥ ఋ. 10.71.1

భావము: బృహస్పతియైన సర్వవ్యాపక సర్వేశ్వరుడు ఆదిఋషుల వాక్కుకు

మూలమైన స్వరపేటిక (Larynx) ను ప్రేరేపించి మాటలను పలికించెను. వేద పదములతో ప్రపంచ పదార్థాలకు నామకరణం చేయించెను. గాలికి వాయువనీ, నీటికి ఆపః అనీ పేర్లను పలికించెను. అంతర్యామిచే ప్రేరేపింపబడిన ఆ ప్రథమ వాణి సర్వశ్రేష్ఠమైనది. ఏవిధమైన ఉచ్ఛారణ దోషాలు గానీ, పొరబాట్లు గానీ లేనిది. అది ఆది ఋషుల బుద్ధి గుహలో నిహితమై యున్నదే.

2. ఓం సక్తుమివ తితఉనా పునన్తో యత్ర
ధీరా మనసా వాచ మక్రత ।
అత్రా సఖాయః సఖ్యాని జానతే
భద్రైషాం లక్ష్మీర్నిహితాధి వాచి ॥ ఋ. 10. 71. 2

భావము: సత్తుపిండిని జల్లెడ పట్టి పొల్లును, బరకను తొలగించునట్లు జ్ఞానయుక్తమైన బుద్ధితో ధీరులు (బుద్ధిమంతులు) వ్యర్థం – అప్రియ వాక్కులను వదిలి మధురముగా భాషింతురు. అట్టి వాక్కునందే సన్మిత్రులు మిత్రతను దర్శింతురు. భద్రమైన లక్ష్మి (ఐశ్వర్యం) మధురమైన వాక్కునందే ఉంటుంది.

3. ఓం యజ్ఞేన వాచః పదవీయ మాయన్
తామన్వ విన్దన్ + ఋషిషు ప్రవిష్టామ్ ।
తామాభృత్యా వదధుః పురుత్రాతాం
సప్తరేభా అభి సం నవన్తే ॥ ఋ. 10. 71. 3

భావము: ఆ పవిత్రాంతఃకరణులైన ఋషులకు వాక్కును ఎలా ప్రయోగించాలో చక్కగా తెలుసు. వారు వాక్కును యజ్ఞంగా భావించి ప్రయోగిస్తారు. గురు శిష్యపరంగా లోకంలో వ్యాపింపచేస్తారు. ఆ వేదవాక్కులు గాయత్ర్యాది సప్త ఛందస్సులలో ఉంటాయి.

4. ఓం ఉత త్వః పశ్యన్ న దదర్శ వాచముత
త్వః శృణ్వన్ న శృణోత్యేనామ్ ।
ఉతో త్వస్మై తన్వం విసస్రే జాయేవ
పత్య ఉశతీ సువాసాః ॥ ఋ. 10. 71. 4

భావము: వేదార్థాన్ని గ్రహించలేనివారు వేద పండితులను చూస్తూ కూడా చూడనట్లే. వేద పాఠాలను వింటూ కూడా విననట్లే. కాని, వేదార్థాన్ని గ్రహించగల

వ్యాకరణ విద్వాంసులకైతే పతివ్రతా స్త్రీ తన పతి ఎదుట తన శరీరాన్ని ప్రకటపరచునట్లు వేదవాణి తన గూఢార్థాన్ని ప్రకట పరుస్తుంది. అట్టివారు ఈ సృష్టిని సరిగా అర్థం చేసుకోగలుగుతారు.

5. ఓం ఉతత్వం సఖ్యే స్థిరపీతమాహుర్నైనం
హిన్వన్త్యపి వాజినేషు ।
అధేన్వా చరతి మాయయైష వాచం
శశ్రువాం అఫలామ్+అపుష్పామ్ ॥ ఋ. 10.71.5

భావము: విద్వాంసుల సదస్సులో ఒకనికి వక్త యొక్క విద్వత్తు గంభీరత అర్థమౌతుంది. వ్యవహారంలో అతని అనుభవం వ్యక్తమౌతుంది. ఎవరు వేదార్థాన్ని శ్రవణ మనన నిధి ధ్యాసల ద్వారా సాక్షాత్కరించుకుంటారో వారే వేద ఫలాలను పొందగలుగుతారు. కేవలం వాగాడంబరత వల్ల ఆ వేద ఫల పుష్పాలను పొందలేరు.

6. ఓం యస్తిత్యాజ్య సచివిదం సఖాయం
న తస్య వాచ్యపి భాగో అస్తి ।
యదీం శృణోత్యలకం శృణోతి నహి
ప్రవేద సుకృతస్య పన్థామ్ ॥ ఋ. 10.71.6

భావము: ఎవరు ఆప్తమిత్రుని వంటి వేదముల స్వాధ్యాయాన్ని అర్థ తాత్పర్యాలతో కూడిన చక్కని మహర్షుల భాష్యాలను చదవటం విడిచి పెడతారో వారికి వేదవాణులు ఏ మంచి ఫలితాలను ఇవ్వలేవు. అట్టివారు వ్యర్థంగానే వేద శ్రవణం చేయుచుందురు. ఎందుచేతననగా వారు సుకృతుల మార్గాన్ని విడిచి పెట్టినారు కనుక.

కేవలం సస్వర వేద పాఠాలను శ్రవణం చేసినంత మాత్రాన సరిపోదు. వాటిపై మహర్షులు వ్రాసిన భాష్యాలను చదువుచు చదివించుచు, వింటూ వినిపిస్తూ మనన చింతనలు చెయ్యాలని భావం.

7. ఓం అక్షణ్వన్తః కర్ణవంతః సఖాయో
మనోజవేష్వసమా బభూవుః ।
అదఘ్నాస ఉపకక్షాస ఉ త్వే హ్రదా
ఇవ స్నాత్వా ఉ త్వే దదృశ్రే ॥ ఋ. 10.71.7

భావము: సమానమైన నేత్ర కర్ణేంద్రియాలు కలిగిన పరస్పర మిత్రులలో కూడా జ్ఞానం సమానంగా ఉండదు. అందరికీ మనో బుద్ధులున్నా అందరి ఆలోచనలు ఒకటిగా నుండవు. జ్ఞానాన్ని జలాశయాలతో పోలిస్తే కొందరి జ్ఞానం నోటివరకు వచ్చే లోతుగా ఉంటుంది. మరికొందరి జ్ఞానం కంటివరకు వచ్చే లోతుదిగా ఉంటుంది. అరుదుగా కొందరి జ్ఞానమయితే అంతుబట్టని లోతుగల అఖాత జలాశయాలవలె ఉంటుంది.

వివరణ: జ్ఞానంలో ఈ హెచ్చుతగ్గులకు కారణం వారు పూర్వజన్మలలో జ్ఞాన పిపాసతో చేసిన కృషి సాధన కారణంగా ఉంటాయి.

8. ఓం హృదా తష్టేషు మనసో జవేషు
యద్బ్రాహ్మణాః సంయజన్తే సఖాయః ।
అత్రాహ త్వం వి జహుర్వేద్యాభిరోహబ్రహ్మాణో
వి చరన్త్యు త్వే ॥ ఋ. 10. 71. 8

భావము: ఎప్పుడైతే బ్రాహ్మణులు (వేద విద్వాంసులు) హృదయంతో - మనస్సుతో, బుద్ధితో చక్కగా ఆలోచించి మనోవేగములను - ఆలోచనా తరంగాలను తెలుసుకోదలచిన పదార్థంపై (విషయంపై) కేంద్రీకృతం చేస్తారో అప్పుడు వారికా పదార్థ విజ్ఞానం అవగతమౌతుంది.

కాని, కొందరు విజహులు - మూర్ఖులు - నాస్తికులు ఆ జ్ఞానాన్ని అందుకోలేక నమ్మకంలేక విడిచి పెడతారు. శ్రద్ధాలురు ఆ జ్ఞానాన్ని అనుసరించి ఉన్నతిని పొందుతారు.

9. ఓం ఇమే యే నార్వాఙ్న పరశ్చరన్తి న
బ్రాహ్మణాసో న సుతేకరాసః ।
త ఏతే వాచమభిపద్య పాపయా
సిరీస్తన్త్రం తన్వతే అప్రజజ్ఞయః ॥ ఋ. 10. 71. 9

భావము: ఎవరు ఇహలోక పరలోక విద్యలలో నిపుణులు కారో మరియు పరా అపరా విద్యల నెరుగకుందురో, వేద విద్యలలో పారంగతులు కారో మరియు పంచమహా యజ్ఞాది కర్మకాండల నెరుగకుందురో అట్టి వారంతా ఏ రకమైన ఉన్నతిని పొందలేరు. వారు పొలములలో, పరిశ్రమలలో శ్రామికులుగా నగుదురు.

10. ఓం సర్వే నన్దన్తి యశసాగతేన సభాసాహేన సఖ్యా సఖాయః ।
కిల్బిషస్పృత్ పితుషణిర్హ్యేషామరం హితో భవతి వాజినాయ ॥
ఋ. 10.71.10

భావము: సరియైన వేదజ్ఞానము కలిగినవారు పరస్పరం మిత్రులగుదురు. సభలలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ యశస్సును, ఆనందమును పొందుదురు. ఇట్టివారు ప్రజలకు అన్నము నిచ్చువారు అగుదురు. అనగా కూడు, గుడ్డ, నీడ పొందు మార్గముల చూపువారు అగుదురు. వారి అభావమును, అజ్ఞానమును దూరం చేసి జ్ఞానమును, స్వయం సమృద్ధిని ఉపదేశింతురు.

11. ఓం ఋచాం త్వః పోషమాస్తే పుపుష్వాన్
గాయత్రం త్వో గాయతి శక్వరీషు ।
బ్రహ్మా త్వో వదతి జాతవిద్యాం యజ్ఞస్య
మాత్రాం వి మిమీత ఉ త్వః ॥ ఋ. 10.71.11

భావము: పెద్ద పెద్ద యజ్ఞాలను నిర్వహించునపుడు నలుగురు ఋత్విజులు అవసరమగుదురు. వారి వారి బాధ్యతలు ఈ విధముగా నుండును.

(1) **మొదటివాడు హోత –** ఇతడు ఋగ్వేద మంత్రాలను పఠించుచు వాని ప్రయోగమును పుష్టి పరచును.

(2) **రెండవవారు ఉద్గాత.** వీరు శక్వరీ ఋచలతో సామగానము చేయుదురు. వీరు సామవేదీయులు.

(3) **మూడవ వ్యక్తి అధ్వర్యుడు.** వీరు యజ్ఞము యొక్క పరిమాణమును, ఆహుతుల పరిమాణమును నిర్ణయిస్తూ యజ్ఞకార్యాన్ని నిర్వహించుచుందురు. వీరిని యజుర్వేదీయులందురు.

(4) **నాల్గవవారు బ్రహ్మ.** వీరు అధ్యక్షులుగా ఉంటూ మిగిలినవారి క్రియలను, కర్తవ్యాలను పర్యవేక్షిస్తూ పొరబాట్లు రాకుండా హెచ్చరించుచుందురు. వీరు చతుర్వేద పారంగతులై ఉందురు.

అంటే – చతుర్వేద వాణులు యజ్ఞాది కర్మకాండలలో కూడా అవసరమగునని భావం.

(జ్ఞాన సూక్తము సమాప్తం)

మిత్రావరుణ సూక్తం

1. ఓం ఈజానమిద్ ద్యౌర్గూర్తావసురీజానం భూమిరభి ప్రభూషణి ।
ఈజానం దేవవశ్వినావభి సుమ్నైరవర్ధతామ్ ॥

ఋ. 10. 132. 1

భావము: (ఈజానమ్ + ఇత్) శ్రద్ధాభక్తులతో యజ్ఞ యాగాదులు చేయువారినే (ద్యౌః + గూర్తావసుః) ద్యులోకము సంపదలను చేతబట్టుకొని ఆహ్వానించును. సమయానుకూల వర్షాలు కురిపించి సమృద్ధిగా పాడిపంటల నిచ్చును. (ఈజానమ్ భూమిః ప్రభూషణి) – యజ్ఞములు చేయువారికే భూమాత వలసినంత శక్తి సామర్థ్యాలనిచ్చును. (ఈజానమ్ దేవౌ అశ్వినౌ) యజ్ఞముల నొనర్చువారికి జంట దేవతలైన అశ్వినులు – దిన రాత్రులు, ప్రాణాపానములు, సూర్య వాయువులు (సుమ్నైః + వర్ధతామ్) అనేక సుఖముల నిచ్చును.

వివరణ: యజ్ఞ యాగాదులవల్ల త్రిలోకాలలో ఉండే దేవతలు – భూ అంతరిక్ష ద్యులోకాలలో ఉండే జడ దేవతలు సంస్కరింపబడతాయి. శుద్ధి చేయబడతాయి. భగవద్గీతలో 3వ అధ్యాయం 10 నుండి 16 శ్లోకాలలో చెప్పినట్లు యజ్ఞాలవల్ల సకల సుఖాలు లభిస్తాయి.

2. ఓం తావాం మిత్రావరుణా ధారయత్
క్షితీ సుషుమ్నేషితత్వతా యజామసి ।
యువోః క్రాణాయ సఖ్యైరభి ష్యామ రక్షసః ॥ఋ. 10. 132. 2

భావము: ఓ మానవులారా! మిత్రా వరుణులుగా చెప్పబడు ప్రాణాపానములు బలపడుటకు అగ్నిహోత్రంలో తగిన హవిస్సుల నర్పించండి. అవి రెండూ మీకు దీర్ఘ ఆయురారోగ్య ఐశ్వర్యాల నిస్తాయి. (సుషుమ్నాః) తద్వారా మీకు సకల సుఖాలు ప్రాప్తిస్తాయి. ఇంతేగాక, అవి (అభిష్యామ రక్షసః) మీ శరీర మనస్సులలోని రాక్షసశక్తులను పరాజయం పాలుచేస్తాయి. శారీరక మానసిక రోగాలను పోగొట్టి చక్కటి ఆరోగ్య భాగ్యాన్ని కలిగిస్తాయి.

వివరణ: ఆయుర్వేద ప్రకారం మనం పీల్చే గాలిలోని ప్రాణవాయువు

(ఆక్సిజన్) మన శరీరంలో 5 ముఖ్యమైన పనులను నిర్వర్తిస్తుంది. వీటినే పంచ ప్రాణాలంటారు.

(1) ప్రాణము: ఇది మన శరీరాన్ని జీవింప చేస్తుంది. ఆహార పానీయాలను కడుపులోనికి, గాలిని ఊపిరితిత్తులలోనికి చేరవేస్తుంది.

(2) అపానము: ఇది మన శరీరంలో తయారయ్యే మాలిన్యాలను మల మూత్ర స్వేదాదుల ద్వారా బయటకు త్రోసివేస్తుంది.

(3) వ్యానము: శరీరంలో అంతటా నాడీమండలం ద్వారా వ్యాపించి అవయవాలన్నిటిని పనిచేయిస్తుంది.

(4) ఉదానము: ఆహార పానీయాలను జీర్ణం చేస్తుంది.

(5) సమానము: ఆహార సారాన్ని (Lymph ను) శరీర భాగాల కన్నిటికి రక్తనాళాల ద్వారా చేరవేస్తుంది.

3. ఓం అధా చిన్ను యద్దిధిషామహే వామభి
ప్రియం రేక్ణః పత్యమానాః ।
దద్వాన్ వా యత్ పుష్యతి రేక్ణః
సమ్వారన్ నకిరస్య మఘాని ॥ ఋ. 10. 132. 3

భావము: ఓ మానవులారా! మీరెప్పుడు వరింపదగిన మిత్రావరుణుల కొరకు- ప్రాణాపానముల కొరకు తగిన ఆహార పానీయాలను సేవిస్తూ తగిన మూలికలతో అగ్నిహోత్రంలో ఆహుతులిస్తారో అపుడు అవి బలపడి సమర్థవంతంగా పనిచేస్తాయి. తద్వారా ఐశ్వర్యాలు లభిస్తాయి. అవి తరిగిపోకుండా కూడా ఉంటాయి.

4. ఓం అసావన్యో అసుర సూయత ద్యౌస్త్వం
విశ్వేషాం వరుణాసి రాజా ।
మూర్ధా రథస్య చాకన్నైతావతైనసాన్తక ధ్రుక్ ॥

ఋ. 10. 132. 4

భావము: దివ్యగుణయుక్తమైన ఓ అదితే! ప్రకృతి మాతా! నీవు విశేషంగా అన్నిటికి ఆధారమగుచూ ప్రాణదాతగా నున్న ఈ సూర్యుని ఉత్పన్నం చేశావు.

అట్లే, యజ్ఞాగ్నిలో వేయబడిన హవిస్సులను గ్రహించి అన్ని భూతములకు అందించు వరుణరాజును – వాయువును సృష్టించినావు. నీకు మా ధన్యవాదాలు. ఈ యజ్ఞం (అగ్నిహోత్రం) మాలోని దోషాలను, కష్టాలను తొలగించు పవిత్ర సాధనం. దీనియందు లేశమాత్రమైనా దోషంలేదు. అట్టి యజ్ఞాన్ని మేము నిత్యం శ్రద్ధాభక్తులతో చేయుదుము గాక. పంచ భూతాలను పవిత్రం చేయుదుము గాక.

వివరణ: వేద పదములు అనేక అర్థాలను బోధిస్తాయి. ఈ మంత్రంలో సూర్యుని మిత్ర పదంతోను, వాయువును వరుణ పదంతోను పేర్కొనటం జరిగింది. రాబోయే మంత్రాలలోను ఇట్లే.

5. ఓం అస్మిన్త్స్వ౨ తచ్ఛకపూత ఏనో
హితే మిత్రే నిగతాన్ హన్తి వీరాన్ ।
అవోర్వా యద్ధాత్ తనూష్వవః
ప్రియాసు యజ్ఞియాస్వర్వా ॥ ఋ. 10. 132. 5

భావము: ఓ మానవులారా! పెద్ద పెద్ద యాగాలలో మిత్రావరుణులిరువురికి ఆహుతులివ్వవలసి ఉంటుంది. కేవలం మిత్రునికే – సూర్యునికే ఆహుతులిస్తే యజ్ఞకర్తకు, అతని అనుచరులకు కొంత హాని కలుగవచ్చు. కనుక పెద్ద పెద్ద యాగాలు చేయ తలపెట్టినప్పుడు యజ్ఞ విజ్ఞానం బాగా తెలిసిన వారి అధ్యక్షతలో చేయవలసి ఉంటుంది.

వివరణ: ప్రాచీన శాస్త్రాలలో అశ్వమేధ రాజసూయాది వివిధ యాగాల విధి విదానాలు విస్తారంగా ఉంటాయి. కనుక యాజ్ఞిక విద్వాంసుల అధ్యక్షతలో అవి జరగాలి. గృహస్థులు చేయవలసిన దైనిక అగ్నిహోత్రానికి ఇన్ని ఏర్పాట్లక్కరలేదు. మహర్షి దయానంద సరస్వతిగారు సూచించిన విధిని అనుసరిస్తే చాలు.

6. ఓం యువోర్హి మాతాదితిర్విచేతసా ద్యౌర్న
భూమిః పయసా పుపూతని ।
అవ ప్రియా దిదిష్టన సూరో నినిక్త రశ్మిభిః ॥

ఋ. 10. 132. 6

భావము: విశేషంగా గుర్తుంచుకొనదగిన మిత్రా వరుణులకు – సూర్య

వాయువులకు అఖండనీయమైన పృథివి తల్లియై ఉంది. అది ద్యులోకము వలె అనేక రసముల నుత్పన్నము చేయుచు ప్రాణికోటిని కాపాడుచున్నది. సూర్యరశ్మి పవిత్ర మగుచున్నది.

7. ఓం యువం హ్యప్నరాజావసీదతం
తిష్ఠద్రథం న ధూర్షదం వనర్షదమ్ ।
తా నః కణూకయన్తీర్నృమేధస్త్రే
అంహసః సుమేధస్త్రే అంహసః ॥ ఋ. 10.132.7

భావము: ఓ మిత్రావరుణులారా! సూర్య వాయువులారా! మీరు ఈ సృష్టిలో ఉత్తమ స్థానాన్ని అధిరోహించి మహారాజులవలె విరాజిల్లుచున్నారు. మీరిరువురు ఉత్తమ అశ్వాలతో కూర్చిన రథముల నధిరోహించండి. ఓ సూర్య దేవతా! నీవు ద్యులోకంలో స్థిరంగా వుంటూ మాపై దాడిచేయుచున్న క్రిములను సంహరిస్తూ మమ్ము కాపాడుతూ ఉండమని వేడుకుంటున్నాము. ఓ వాయు దేవతా! నీవు వనాలలో సంచరిస్తూ మాకొరకు ఔషధాలను తీసుకువచ్చి మాలోని పాపాలను – రోగాలను, బాధలను పోగొట్టి మమ్ము స్వస్థపరచుమని ప్రార్థిస్తున్నాము.

(మిత్రావరుణ సూక్తం సమాప్తం)

వేదాలలో శ్రద్ధా సూక్తము

(శ్రత్ + ధా = శ్రద్ధా) వైదిక నిఘంటువు ననుసరించి శ్రద్ధా అంటే సత్యాన్ని ధరించటం. ముందుగా సత్యా సత్యాలను బాగుగా విచారణ చేసి సత్యాన్ని గ్రహించాలి. ఆ గ్రహించిన సత్యాన్ని దృఢంగా పట్టుకొని నిష్ఠతో ఆచరించటాన్ని శ్రద్ధా అంటారు. "శ్రద్ధయా సత్యమాప్యతే" అంటుంది యజుర్వేదం (19.30). శ్రద్ధ ఏర్పడితే అనుకున్నది సాధించగలుగుతారు. ఇంతేగాక, ఆ శ్రద్ధ సత్యస్వరూప పరమాత్మ సాక్షాత్కారాన్ని కూడా కలిగిస్తుంది. ఋగ్వేదీయ (10.151) శ్రద్ధాసూక్తం ఇంకా ఏమంటున్నదో తెలుసుకుందాము.

(5 మంత్రాలు గల ఈ శ్రద్ధా సూక్తానికి ఋషి – శ్రద్ధాకామాయనీ, దేవత – శ్రద్ధా. ఈ మంత్రాలు శ్రద్ధను ఒక దేవతగా పేర్కొంటూ అది మాకు ప్రియాన్ని, హితాన్ని కలిగించమని కోరుకుంటాయి.)

1. ఓం శ్రద్ధయాగ్నిః సమిధ్యతే శ్రద్ధయా హూయతే హవిః ।
శ్రద్ధాం భగస్య మూర్ధని వచసా వేదయామసి ॥

ఋ. 10. 151. 1

భావము: అగ్నిహోత్రం వల్ల కలిగే అనేక ప్రయోజనాలను గురించి చక్కగా తెలుసుకొని శ్రద్ధతో యజ్ఞకుండంలో సమిధలను పేర్చుకొని విధి పూర్వకంగా అగ్న్యాధానం చెయ్యాలి. అనంతరం ఆవునేతితోను, ఋతువులనుబట్టి సేకరించుకున్న మూలికలతోను, స్థాలీపాకాదులతోను విధి పూర్వకంగా ఆహుతుల నివ్వాలి. యజ్ఞకార్యంలో శ్రద్ధ శిరస్సుగా ఉంటుంది. అది ఐశ్వర్య ప్రదాయని కూడా. వేదమంత్రాలను ఉచ్ఛస్వరంతో పఠిస్తూ శ్రద్ధతో ఆహుతులనివ్వాలి.

2. ఓం ప్రియం శ్రద్ధే దదతః ప్రియం శ్రద్ధే దిదాసతః ।
ప్రియం భోజేషు యజ్వస్విదం మ ఉదితం కృధి ॥

ఋ. 10. 151. 2

భావము: ఓ శ్రద్ధా! దాతలకు, దాన ప్రవృత్తి గలవారికి నీవు ప్రియాన్ని చేకూర్చు. వారికి ఉన్నతిని కలిగించు. దానాన్ని గ్రహించి అనుభవించువారికి కూడా ప్రియాన్ని, హితాన్ని కలిగించు. యజ్ఞకర్తలకు నా ఈ వాక్కులు ప్రియాన్ని కలిగించును గాక. వారిని యజ్ఞశీలురను చేయునుగాక.

3. ఓం యథా దేవా అసురేషు శ్రద్ధాముగ్రేషు చక్రిరే ।
ఏవం భోజేషు యజ్వస్వస్మాకముదితం కృధి ॥

ఋ. 10. 151. 3

భావము: ఓ శ్రద్ధాదేవీ! ఏవిధంగా విద్వాంసులు ఉగ్రులు, శక్తిశాలురు అయిన వీరులపై విశ్వాసాన్ని కలిగి ఉంటారో, వీరు తప్పక దుష్టులను జయించగలరను నమ్మకాన్ని కలిగి ఉంటారో, అట్లే, యజ్ఞకర్తలయందు మేము వారి ఆకాంక్షలను సఫలము చేయగలమను విశ్వాసాన్ని కలిగింపుము. దానితో వారు యజ్ఞశీలురై – పరోపకార పరాయణులౌతారు. తద్వారా లోక కళ్యాణం జరుగుతుంది.

4. ఓం శ్రద్ధాం దేవా యజమానా వాయుగోపా ఉపాసతే ।
శ్రద్ధాం హృదయ్య యాకూత్యా శ్రద్ధయా విన్దతేవసు ॥

ఋ. 10. 151. 4

భావము: విద్వాంసులు మరియు వాయువు వంటి బలశాలురు మరియు వీరిద్దరిచే రక్షింపబడు యజ్ఞకర్తలు నిత్యం శ్రద్ధను ఉపాసిస్తారు. స్తుతి ప్రార్థనలను చేస్తారు. శ్రద్ధ ఏర్పడినవారు ఆ శ్రద్ధతోనే వసువులను - వివిధ సంపదలను పొందుతారు.

(కనుక మనం కూడా మనలో శ్రద్ధను పెంపొందింపచేసుకొంటే సంపదలను పొందవచ్చు.)

5. ఓం శ్రద్ధాం ప్రాతర్హ వామహే శ్రద్ధాం మధ్యందినం పరి ।
శ్రద్ధాం సూర్యస్య నిమ్రుచి శ్రద్ధే శ్రద్ధాపయేహ నః ॥

ఋ. 10. 151. 5

భావము: మేము ప్రాతఃకాలంలో శ్రద్ధను మాలోనికి ఆహ్వానింతుము గాక. అట్లే, మధ్యాహ్నమందును, సూర్యాస్త సమయమందును కూడా శ్రద్ధను మాలోనికి ఆహ్వానింతుము గాక. ఆ శ్రద్ధయే మాకు సత్య స్వరూప పరమాత్మ సాక్షాత్కారాన్ని కలిగించును గాక. అస్తు.

(శ్రద్ధా సూక్తము సమాప్తం)

వేదాలలో సూర్య సూక్తాలు

ఉపోద్ఘాతము:

సూర్య పదము 'సృ-గతౌ' అనే సంస్కృత మూల ధాతువుతో నిర్మింపబడుతుందని ఋషులన్నారు. గతికి "జ్ఞానము, గమనము, ప్రాప్తి" అనే 3 అర్థాలుంటాయి. కనుక అనంత జ్ఞానం, అనంత క్రియలు, అందరిచే ప్రాప్తింపతగిన ఆనంద స్వరూపుడు కనుక ఆధ్యాత్మికార్థంలో ఈ సూర్య పదము సర్వాంతర్యామియైన పరమేశ్వరునికి వర్తిస్తుంది. ఆధి భౌతికార్థంలో రాజులకు, మార్గదర్శకులకు ఇది వర్తిస్తుంది. ఆధి దైవికార్థంలో ఆకాశంలో దేదీప్యమానంగా ప్రకాశించే భౌతిక సూర్యునికి ఇది వర్తిస్తుంది. ఈ ఋగ్వేద దశమ మండలంలోని

37వ సూక్తానికి భౌతిక సూర్యుని పరంగా అర్థం వ్రాయుచున్నాము.

సూర్య సూక్తం

(ఋగ్వేద దశమ మండలంలోని 37వ సూక్తం)

1. ఓం నమో మిత్రస్య మరుణస్య చక్షసే
మహో దేవాయ తదృతం సపర్యత ।
దూరేదృశే దేవజాతాయ కేతవే
దివస్పుత్రాయ సూర్యాయ శంసత ॥ ఋ. 10. 37. 1

భావము: ఓ మానవులారా! మిత్రావరుణులను – జల వాయువులను ప్రకాశపరచువాడును, అనేక దివ్యగుణాలు కలవాడును, దివస్పుత్రుని (ద్యులోక పుత్రుని – సూర్యుని) మీరు నిత్యం అగ్నిహోత్రం ద్వారా సపర్యత = సేవించండి.

"ఓం సూర్యో జ్యోతిః సూర్యః స్వాహా" మొదలైన మంత్రాలతో ఆహుతులివ్వండి. సూర్యుని ద్వారా లభించు విశేష లాభాలను పొందండి.

2. ఓం సా మా సత్యోక్తిః పరి పాతు విశ్వతో
ద్యావా చ యత్ర తతనన్నహాని చ ।
విశ్వమన్యన్ని విశతే యదేజతి విశ్వాహాపో
విశ్వాహోదేతి సూర్యః ॥ ఋ. 10. 37. 2

భావము: నేను పలికిన సత్యవాక్కులు నన్ను అనివైపుల నుండి రక్షించును గాక. ఏ సత్య స్వరూప పరమాత్ముని నియమంతో పృథివీ ద్యులోకాలు, దివారాత్రులు, సృష్టి ప్రళయాలు నియమంగా ఏర్పడుచున్నవో ఆ సత్యసూర్యుని (పరమాత్ముని) శాసనంతోనే నిత్యం ఈ సూర్యుడు ఉదయించుచున్నాడు.

3. ఓం న తే అదేవః ప్రదివో ని వాసతే
యదేతశేభిః పతరై రథర్యసి ।
ప్రాచీనమన్యదను వర్తతే రజ ఉదన్యేన
జ్యోతిషా యాసి సూర్య ॥ ఋ. 10. 37. 3

భావము: ఎపుడు సూర్యుడు అశ్వముల వంటి వేగవంతమైన కిరణములతో రథముపై కూర్చొని తూర్పున ఉదయించునో అపుడు ఆ భూభాగమున చీకటులు

పారిపోవును. వెలుగులు ప్రసరించును. ఎపుడు సూర్యుడు ప్రతీచీ దిక్కునకు (పడమటి దిక్కునకు) చేరునో అపుడు భూమి వెనుక భాగమును ప్రకాశపరచును.

4. ఓం యే న సూర్య జ్యోతిషా బాధసే
తమో జగచ్చ విశ్వముదియర్షి భానునా ।
తేనాస్మద్విశ్వామనిరామనాహుతి
మపామీవామప దుష్వప్నం సువ ॥ ఋ. 10. 37. 4

భావము: సూర్యుడు తన ఏ తేజముతో అంధకారాన్ని పారద్రోలి లోకాలను ప్రకాశపరుస్తాడో ఆ తేజముతోనే ప్రాణుల జల, అన్న అభావాలను (లోటుపాట్లను) దూరం చేసి పుష్కలమైన అన్న, జలాలను ప్రసాదిస్తాడు.

ఎట్లంటే – సూర్యుడు తన తేజస్సుతో సముద్ర జలాలను తపింపచేసి మేఘాలను నిర్మించి భూమిపై వర్షింపచేస్తాడు. దానితో ప్రాణుల మనుగడకు అవసరమైన అన్న, జలాలు లభిస్తాయి.

5. ఓం విశ్వస్య హి ప్రేషితో రక్షసి వ్రత
మహేళయన్నుచ్చరసి స్వధా అను ।
యదద్య త్వా సూర్యోపబ్రవామహై తం
నో దేవా అను మంసీరత క్రతుమ్ ॥

ఋ. 10. 37. 5

భావము: ఓ సూర్యుడా! నీవు ప్రేషితుడవు. భక్తులచే తెలిసికొనదగినవాడవు. కోరతగినవాడవు. మేము అగ్నిహోత్రంలో ఆహుతులిచ్చుచున్నపుడు యజ్ఞ విధ్వంసక శక్తులనుండి రక్షించువాడవు. ఆ ఆహుతులను పైలోకాలకు వ్యాపింపచేయువాడవు. మా ఈ స్తుతులను విద్వాంసులు కూడా స్వీకరించి అనుసరించెదరు గాక.

6. ఓం తం నో ద్యావాపృథివీ తన్న ఆప
ఇన్ద్రః శృణ్వన్తు మరుతో హవం వచః ।
మా శూనే భూమ సూర్యస్య సందృశి
భద్రం జీవన్తో జరణామశీమహి ॥ ఋ. 10. 37. 6

భావము: సూర్య సంబంధమైన మా ఈ స్తుతులను ద్యులోక భూలోకములు, జల వాయువులు, మరుద్గణములు అన్నియు స్వీకరించును గాక. మేము సూర్యమిత్రుని దినదినము చూచుచు దీర్ఘ జీవనమును పొందుదుము గాక. ఉత్సాహంగా ఉత్తమ జీవితాన్ని గడుపుదుము గాక. పూర్ణ పురుషార్థం చేస్తూ ధర్మార్థ కామ మోక్షాలను సాధింతుము గాక.

7. ఓం విశ్వాహా త్వా సుమనసః సుచక్షసః
ప్రజావన్తో అనమీవా అనాగసః ।
ఉద్యన్తం త్వా మిత్రమహో దివేదివే
జ్యోగ్జీవాః ప్రతి పశ్యేమ సూర్య ॥ ఋ. 10. 37. 7

భావము: "మేము సుమనస్కులుగా (ఉత్తమ మనస్సు గలవారముగా) సుచక్షులుగా (పవిత్ర దృష్టి గలవారముగా), సుసంతానవంతులముగా, నిరపరాధులముగా ఆదర్శ జీవితం గడుపుదుముగాక. దినదినము ఉదయించుచున్న సూర్యుని చూస్తూ దీర్ఘకాలం జీవింతుము గాక. సదా సత్కర్మలు చేస్తూ పుణ్యజీవుల మగుదుము గాక." అని సంకల్పించుకుంటూ ఆ విధంగా జీవించాలి.

8. ఓం మహి జ్యోతిర్బిభ్రతం త్వా విచక్షణ
భాస్వన్తం చక్షుషేచక్షుషే మయః ।
ఆరోహన్తం బృహతః పాజసస్పరి వయం
జీవాః ప్రతి పశ్యేమ సూర్య ॥ ఋ. 10. 37. 8

భావము: ఓ సూర్యుడా! నీ కృపవలన దీర్ఘాయువును పొందిన మేము మహిమాన్వితమగు నీ ప్రకాశమును ధారణ మొనర్తుము గాక. నీవు సర్వప్రాణుల నేత్రములకు జ్యోతిని ప్రసాదించు దృష్టిదాతవు. మహాశక్తిశాలివి. కాలాశ్వము నధిరోహించి వచ్చు నిన్ను ప్రతి ఉదయము దర్శింతుము గాక. నీకు కృతజ్ఞతలను తెలుపుకొందుము గాక.

9. ఓం యస్య తే విశ్వా భువనాని కేతునా
ప్ర చేరతే ని చ విశన్తే అక్తుభిః ।
అనాగాస్త్వేన హరికేశ సూర్యాఽహ్నాహ్నా
నో వస్యసావస్యసోదిహి ॥ ఋ. 10. 37. 9

భావము: ఓ సూర్యదేవా! నీ దేదీప్యమాన ప్రకాశంలో ప్రాణులు తమ కార్యాలను చక్కగా నెరవేర్చుకుంటాయి. నీ అస్తమయంతో అవన్నీ చక్కగా నిద్రపోయి సేద తీర్చుకుంటాయి. మరునాటికి నూతనంగా చైతన్యాన్ని ఉత్సాహాన్ని పొందుతాయి. నీ ఉదయము, అస్తమయము రెండూ కూడా దోషరహితమైనవే. మాకు మేలు చేసేవే. కనుక నీవు మరల మరల హరికేశములతో – దివ్య తేజస్సుతో ఉదయించి వచ్చుచుండుము. దినదినము మా సౌకర్యాలను మెరుగుపరుస్తూ మమ్ములను ఆనందపరచుము. ఆశీర్వదించుము.

10. ఓం శం నో భవ చక్షసా శం నో అహ్నా
శం భానువా శం హిమా శం ఘృణేన ।
యథా శమధ్వంచమసద్ దురోణే
తత్ సూర్య ద్రవిణం ధేహి చిత్రమ్ ॥ ఋ. 10. 37. 10

భావము: సూర్యుడు తన దివ్య తేజస్సుతో మాకు కల్యాణ ప్రదుడగును గాక. మా నేత్రములకు హితము చేయును గాక. ప్రతిదినము మాకు మేలుచేయువాడే అగును గాక. తన ఘృణముతో – ఉష్ణముతో కూడ మాకు మేలు చేసేవాడే అగును గాక. మేము పయనించు మార్గాలలోను, గృహ కార్యాలలోను మాకు స్వస్తినే – శుభమునే కలిగించును గాక. (చిత్రం ద్రవిణం ధేహి) – మాకు మేలు చేసే వివిధ ద్రవిణాలను – సంపదలను ప్రసాదించును గాక.

11. ఓం అస్మాకం దేవా ఉభయాయ జన్మనే
శర్మ యచ్ఛత ద్విపదే చతుష్పదే ।
అదత్ పిబదూర్జయమానమాశితం
తదస్మే శంయోరరపో దధాతన ॥ ఋ. 10. 37. 11

భావము: ఓ సూర్యదేవా! నీవు ఈ ప్రాకృతిక పదార్థాలన్నిటికి రాజువి. కనుక ఓ దేవా! ఈ సృష్టిలోని పదార్థాలన్నీ మా ద్విపాదులైన మా సంతానానికి, పరివారానికి మరియు చతుష్పాదులైన గో అశ్వాదులకు సుఖము నిచ్చునవిగా చేయుము. మేము సేవించు ఆహార పానీయాలన్నీ మాకు బలాన్ని, సుఖాన్ని ఇచ్చునవిగా చేయుము.

12. ఓం యద్వో దేవాశ్చకృమ జిహ్వయా గురు
మనసో వా ప్రయుతీ దేవహేళనమ్ ।
అరావా యో నో అభి దుచ్ఛునాయతే
తస్మిన్ తదేనో వసవో ని ధేతన ॥

ఋ. 10. 37. 12

భావము: ఓ వసునామక విద్వాంసులారా! ప్రాకృతిక విజ్ఞాన వేత్తలారా! మా పూర్వ తప్పిదాల కారణంగా ఈ ప్రాకృతిక వసువులు – పృథివ్యాపస్తేజో వాయురాకాశాలు అప్పుడప్పుడు మాకు కష్టాలను, బాధలను కలిగించుచున్నవి. అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, తుఫానులు, ఉప్పెనలు మొదలైనవి కలిగించుచున్నవి. వాటినుండి మమ్ము రక్షించండి. తగిన విధంగా ఉపదేశించండి. హెచ్చరించండి. నివారణోపాయాలు తెలుపండి.

ఓ విద్వాంసులారా! మేము మనోవాక్కాయాలతో మీ యెడ చేసిన అవహేళనలను మన్నించండి. హే పరమేశ్వరా! సర్వాంతర్యామీ! మాకు సద్బుద్ధిని ప్రసాదించి రక్షించు. నీ కృపవల్ల మాలో పాపులు, అదానశీలురు, స్వార్థపరులు, ద్రోహులు ఉండకుందురు గాక.

(సూర్య సూక్తం సమాప్తం)

శచీ పౌలోమి సూక్తం (ఆదర్శ మహారాణి)

ఋగ్వేద దశమ మండలంలోని 159 సూక్తానికి ఋషి మరియు దేవత కూడా శచీ పౌలోమియే. వైదిక కాలంనాటి ఈ వీర విదుషీమణి చరిత్ర ఏమిటో తెలియదు. ఈమె ఈ సూక్తాన్ని లోతుగా అధ్యయనం చేశారు. మనన చింతనలు చేసి యోగసాధన చేస్తూ సమాధి స్థితిలోనికి వెళ్ళారు. అంతరాత్మను దర్శించి ఈ మంత్రాల అంతరార్థాన్ని గ్రహించి లోకంలో ప్రచారం చేశారు. అందుచే అప్పటినుండి ఇప్పటివరకు ఈ సూక్తానికి ఆమె పేరునే ఋషిగా (ఋషికగా) పేర్కొంటూ వస్తున్నారు. దేవతగా కూడా ఆమె పేరునే చెబుతూ వస్తున్నారు. ఇక మనం మంత్రాలలో గల అర్థాన్ని తెలుసుకుందాము.

1. ఓం ఉదసౌ సూర్యో అగాదుదయం మామకో భగః ।
అహం తద్విద్వలా పతిమభ్యసాక్షి విషాసహిః ॥

ఋ. 10. 159. 1

భావము: నేను ఈ రాజ్యానికి మహారాణిని. అదిగో తూర్పున సూర్యుడు ఉదయించి పైపైకి ఎగ్రబ్రాకుచున్నాడు. అటులనే నా సౌభాగ్యాన్ని కూడా ఉదయింపచేయుచున్నాడు. నేను నాకు తగిన పతిని పొందినాను. నేను వీరవనితను కూడా. ఎంతటి శత్రువులనైనా చీల్చి చెండాడి వారిని పరాజితులను చేయగలను. నేను వీర మహారాణిని.

2. ఓం అహం కేతురహం మూర్ధాఽహముగ్రా వివాచనీ ।
మమేదను క్రతుం పతిః సేహానాయా ఉపాచరేత్ ॥

ఋ. 10. 159. 2

భావము: మహారాణి నగు నేను కేతువును – జ్ఞాన ధ్వజాన్ని – జ్ఞానవతిని. మూర్ధా – అందరికి మస్తకము వంటిదానను. నేను ఉగ్రావివాచనీని నేను మూర్ఖ పండితులతో శాస్త్రార్థాలు చేసి ఓడించగల విదుషీమణిని. నేను ఉగ్రురాలినే కాక, మధురభాషిణిని కూడా. నా సంగతి నెరిగిన నా పతి నా యిష్టానుసారము నడుచుకొనునుగాక. నన్ను వ్యతిరేకించువారెవ్వరును లేరు. నేను స్వతంత్రురాలను.

3. ఓం మమ పుత్రాః శత్రుహణోఽథోమే దుహితా విరాట్ ।
ఉతాహమస్మి సంజయా పత్యౌ మే శ్లోక ఉత్తమః ॥

ఋ. 10. 159. 3

భావము: మహారాణి నగు నా పుత్రులు శత్రుంజయులు. అంతః శత్రువులైన కామక్రోధాదులను, బహిశ్శత్రువులైన దుష్టులను, దుర్మార్గులను, ఆక్రమ వ్యాపారులను అణచగల సమర్థులు. ఎట్టి విదేశీ దురాక్రమణనైనను ఎదుర్కొని దేశమును రక్షించగల ఆర్య వీరులు. నా పుత్రి విశ్వవందిత, సకల సద్గుణ సుభూషిత పురంధ్రి – గృహ సామ్రాజ్యమునేగాక చక్రవర్తి రాజ్యము నేలగల సామ్రాజ్ఞి. నేను వారినట్లు తీర్చిదిద్దిన వీరమాతను. నా పతి హృదయమున నా కీర్తి మహోన్నతము. వీరమాతను చూచి ఏ పతి సంతసించకుండును? కీర్తించకుండును?

4. ఓం యేనేన్ద్రో హవిషా కృత్వ్యభవద్ద్యుమ్న్యుత్తమః ।
ఇదం తదక్రి దేవా అసపత్నా కిలాభువమ్ ॥

ఋ. 10.159.4

భావము: ఎటువంటి ఆహార పానీయాల ద్వారా శారీరక శక్తిని, బౌద్ధిక శక్తిని పొంది రాచకార్యాలన్నీ సమర్థవంతంగా చేయగలరో అట్టి ఆహార పానీయాలనే నేనును సేవింతును. ఓ విద్వాంసులారా! మరేవైనా విశేష సూచనలున్న తెలిపిన వాటినన్నిటిని పాటించి శక్తిమంతురాలనగుదును. అసపత్నురాల నగుదును - శత్రువుల నందరిని సంహరించి శత్రురహితురాల నగుదును.

5. ఓం అసపత్నా సపత్నఘ్నీ జయన్త్యభిభూవరీ ।
అవృక్షమన్యాసాం వర్చో రాధో అస్థేయసామివ ॥

ఋ. 10.159.5

భావము: మహారాణి నగు నేను అసపత్నా - శత్రురహితురాలను. సపత్నీఘ్నీ - శత్రు సంహారిణిని. నేను జయన్తిని - సదా జయశీలిని. ఉత్తమ భవిష్యత్తు గలదానను. ఎటువంటి శక్తివంతులైన శత్రువులనైనా సంహరించగలను. వారి తేజాన్ని ఐశ్వర్యాలను నేను స్వాధీనపరచుకొందును.

6. ఓం సమజైషమిమా అహం సపత్నీరభిభూవరీ ।
యథాహమస్య వీరస్య విరాజాని జనస్య చ ॥

ఋ. 10.159.6

భావము: మహారాణి నగు నేను శత్రువులను పరాజితుల చేయగల ఈ వీర పురుషులందరికంటెను మిన్నయగుదును గాక. వీరాధివీరుడైన నా పతికి తగిన వీరపత్ని నగుదును గాక. ప్రజల మన్ననలను పొందెదనుగాక.

(శచీ పౌలోమి సూక్తం సమాప్తం)

వేదాలలో శాంతి సూక్తాలు

నాలుగు వేదాలలోను శాంతిని కోరే మంత్రాలు చాలానే ఉన్నాయి. కొన్ని ప్రత్యేక శాంతి సూక్తాలు కూడా ఉన్నాయి. వాటిలో మొదటి శాంతి సూక్తాన్ని గురించి ఇక్కడ తెలుసుకుందాము.

వైదిక వ్యాకరణాన్ననుసరించి 'శాంతి' పదము 'శము-ఉపశమే' అనే సంస్కృత మూల ధాతువుతో ఏర్పడుతుంది. కనుక శాంతి అంటే ఉపశమనం

(Relief) అని అర్థం. మనిషి బాధలలో, కష్టాలలో ఉన్నపుడు, ప్రాకృతిక ఉపద్రవాలు సంభవించినపుడు వాటినుండి ఉపశమనాన్ని కోరుకుంటాడు. ప్రార్థిస్తాడు. మ్రొక్కుకుంటాడు. వీటితోబాటు తనవంతు ప్రయత్నం కూడా చెయ్యాలి. అప్పుడే ఉపశమనం కలుగుతుంది. లేకుంటే అంతగా ఫలితం కలుగదు. ఈ వేదమంత్రాలలో అటువంటి ప్రేరణ ఉంటుంది. క్రమంగా తెలుసుకుందాము రండు.

ఋగ్వేద సప్తమ మండలంలోని 35వ సూక్తం శాంతి సూక్తం. 15 మంత్రాలు గల ఈ సూక్తానికి వశిష్టుడు ఋషి. ఇతడు రామాయణ కాలంనాటి వశిష్టుడు కాదు. వేదకాలం నాడు వశిష్ట నామం కలిగిన మరియొక ఋషి ఉండేవాడని అర్థం చేసుకోవాలి. ఏలనంటే – రామాయణం జరిగింది త్రేతాయుగంలో కదా! కనుక మొదటి కృతయుగం (సత్యంయుగం) నాటి ఋషియై యుంటాడు. ఈ మంత్రాల దేవత 'విశ్వేదేవాః' అంటే ఏ మంత్రంలో ఏ ప్రాకృతిక దేవతను గురించి చెప్పబడిందో ఆ మంత్రానికి అదే దేవత అని అర్థం చేసుకోవాలి.

ఋగ్వేదీయ శాంతి సూక్తం ప్రారంభం.

ఋగ్వేదీయ శాంతి సూక్తము (శాంతికరణం – I)

1. ఓం **శం న ఇన్ద్రాగ్నీ భవతామవోభిః శం**
న ఇన్ద్రావరుణా రాతహవ్యా ।
శమిన్ద్రాసోమా సువితాయ శం యోః
శం న ఇన్ద్రాపూషణా వాజసాతౌ ॥ ఋ. 7. 35. 1

భావము: ఓ సర్వవ్యాపక సర్వేశ్వరా! నీ కృపవలన ఇంద్రాగ్నులు (విద్యుత్తు మరియు భౌతికాగ్ని) జీవిత సమరంలో మాకు తమ రక్షణ సాధనాలతో వచ్చి రక్షించును గాక. ఇంద్రావరణులు (విద్యుత్ మరియు జలము) మాకు సుఖకారక పదార్థాలనిచ్చి కాపాడునుగాక. ఇంద్రా సోములు (విద్యుత్తు మరియు సోమలతాది ఔషధాలు) మాకు చక్కటి ఆరోగ్యాన్నిచ్చి కాపాడునుగాక. ఇంద్రా పూషణులు (విద్యుత్తు మరియు పూషణులు) – పుష్టికారక ఆహార పదార్థాలు మాకు పుష్టిని, బలాన్ని యిచ్చి రక్షించునుగాక.

వివరణ: ఇంద్ర పదము "ఇది - పరమైశ్వర్య" అనే సంస్కృత మూల ధాతువుతో నిర్మించబడుతుంది. కనుక ఇంద్రుడంటే ఐశ్వర్యము, ఐశ్వర్యవంతుడు, ఐశ్వర్యవంతమైనది అనే అర్థాలలో ప్రయోగించబడుతుంది. సృష్టి అంతా పరమేశ్వరుని ఐశ్వర్యమే కనుక ఆధ్యాత్మికార్థంలో ఈ పదము పరమేశ్వరునికి వర్తిస్తుంది. ఆధి భౌతికార్థంలో ఇది ఐశ్వర్యవంతులకు, రాజుకు, కొన్ని సందర్భాలలో సేనాధిపతికి వర్తిస్తుంది. ఆధి దైవికార్థంలో భౌతిక సంపదలకు వర్తిస్తుంది. ఇంతేగాక వేదశాస్త్రాలలో ఇది మేఘాలలో ఉండే మెరుపుకు ప్రయోగించబడింది. వైజ్ఞానికంగా ధన విద్యుత్ కలిగిన మేఘాలు, ఋణ విద్యుత్ కలిగిన మేఘాలు పరస్పరం దగ్గరగా వచ్చినపుడు ధన విద్యుత్ ఋణ విద్యుత్ మేఘాలవైపు ఉరికి సమరసం అవుతాయట. ఆ మెరుపు నుండి మనం విద్యుత్‌ను సేకరించగలిగితే చాలా విద్యుత్ లభిస్తుందట. మనకిప్పుడు విద్యుత్తువల్ల చాలా చాలా పనులౌతున్నాయి కదా! చాలా ఐశ్వర్యం లభిస్తున్నది కదా! అందుచే వేదాలలో విద్యుత్తును ఇంద్రుడుగాను, ఇంద్ర దేవతగాను చెప్పబడింది.

2. ఓం శం నో భగః శము నః శంసో అస్తు
శం నః పురంధిః శము సన్తు రాయః ।
శం నః సత్యస్య సుయమస్య శంసః
శం నో అర్యమా పురుజాతో అస్తు ॥

ఋ. 7. 35. 2

భావము: ఓ సర్వాంతర్యామీ! నీ కృప వలన భగుడు - ప్రాతఃకాలీన సూర్యరశ్మి మాకు సుఖశాంతులను ప్రసాదించును గాక. ఉపదేశాలు, ప్రశంసలు మాకు శాంతిని కలిగించుగాక. మా పురంధులు - శ్రేష్ట బుద్ధులు చక్కగా పనిచేసి మాకు సుఖశాంతుల నిచ్చుగాక. రయలు - వివిధ ఐశ్వర్యాలు మాకు శాంతినిచ్చును గాక. మా సత్యమునకు సంబంధించిన న్యాయవాదులు మాకు శాంతిని కలిగింతురు గాక. మా న్యాయమొనర్చు పురుషులు - న్యాయాధీశులు, రాజులు మిక్కిలి ప్రసిద్ధులగుదురు గాక.

వివరణ: సామాన్యంగా 'భగః' అంటే ఐశ్వర్యమని అర్థం. ఇదే మంత్రంలో 'రాయః' అనే పదము వచ్చింది కనుక కొందరు విద్వాంసులు దీనికి 'తస్య (భగస్య)

కాలః ప్రాగుత్సర్పణాత్' అని నిర్వచించారు. అంటే – ప్రాతఃకాలీన సూర్య కిరణాలు అనేక రోగాలను పోగొడతాయని అర్థం. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అని పెద్దలంటారు కదా! మంత్రంలోని 'శంయోః' పదమునకు యాస్క మహర్షి 'శమనం చ రోగాణాం యావనం చ భయానామ్' (నిరుక్తం 4.21) అని నిర్వచించారు. అంటే మా రోగాదులు, భయాలు తొలగింప చేయమని ప్రార్థన. ఈవిధంగా వేద భాష చాలా లోతైన అర్థాలను కలిగి ఉంటుంది.

3. ఓం శం నో ధాతా శము ధర్తానో అస్తు
శం న ఉరూచీ భవతు స్వధాభిః ।
శం రోదసీ బృహతీ శం నో అద్రిః
శంనో దేవానాం సుహవాని సన్తు ॥ ఋ. 7.35.3

భావము: ధాతా – అందరిని, అన్నింటిని ఉత్పన్నం చేసి ధరించు పరమాత్మ మరియు ధర్తా – ఈ భూమిని తన ఆకర్షణశక్తితో ధారణ చేయుచున్న సూర్యుడు మాకు సుఖశాంతులను ప్రసాదింతురు గాక. ఉరూచీ – అతి విశాలమైన ఆకాశము, ఈ భూమి మాకు అన్న జలముల నిచ్చి కాపాడును గాక. వేద విద్వాంసుల సుహవాని – సుమధురం ఉపదేశాలు మాకు శాంతి దాయకములగును గాక.

వివరణ: (1) ధాతా సర్వస్య విధాత (నిరుక్తం 13.10)

(2) రోదసీ ద్యావా పృథివీ నామ (నిఘంటు 3.30)

(3) అద్రి మేఘనామ (నిఘంటు 1.10.1)

ఈ ప్రమాణాల వల్ల పై అర్థం వ్రాయబడింది.

4. ఓం శం నో అగ్నిర్జ్యోతిరనీకో అస్తు
శం నో మిత్రావరుణావశ్వినా శమ్ ।
శం నః సుకృతాని సన్తు శం న
ఇషిరో అభి వాతు వాతః ॥ ఋ. 7.35.4

భావము: ఓ సర్వాంతర్యామీ! నీ కృపవలన ప్రకాశమే తన బలముగా గల అగ్ని మాకు శాంతిదాయకమగును గాక. మిత్రావరుణులు – ప్రాణాపాన వాయువులు, అశ్వినులు – సూర్యచంద్రులు మాకు శాంతి నిత్తురు గాక. సుకృతుల

– ఆదర్శ పురుషుల సుకృతాలు మార్గదర్శకమై మాకు మేలు చేయును గాక. గమనశీల వాయువు మాకు శాంతి కలుగునట్లు వీచును గాక.

5. ఓం శం నో ద్యావాపృథివీ పూర్వహూతౌ
శమన్తరిక్షం దృశయేనో అస్తు ।
శం న ఓషధీర్వనినో భవన్తు శం
నో రజసస్పతిరస్తు జిష్ణుః ॥ ఋ. 7. 35. 5

భావము: హే సర్వవ్యాపక సర్వేశ్వరా! నీ దయవలన ఈ ఉషోదయ సమయంలో ప్రకాశ అంధకారాల సంయోగకాలంలో శోభాయమానమైన అంతరిక్షం మాకు శాంతినిచ్చును గాక. ఓషధీ వనస్పతులు మరియు గ్రహ ఉపగ్రహాల రక్షకుడైన జిష్ణువు (సూర్యుడు) మాకు శాంతినిచ్చును గాక.

వివరణ: పూర్వహూతి పదము సామాన్యంగా ఉషా దేవతగా గల మంత్రాలలో కనబడుతుంది. రాత్రివేళలలోని నిశ్శబ్దత ఉషోదయంతో క్రమంగా పక్షుల కిలాకిలారావాలతో, ఆవుదూడల అరుపులతో, మానవుల అలికిడితో భంగం అవుతుంది. దానిని ఈ మంత్రం పూర్వహూతి అంటున్నది.

ఒక పంటనిచ్చి ఎండుపోవు వరి, గోధుమ మొదలగు వాటికి ఓషధులనీ, పుష్పాలు రాకుండానే కాండమునకు కాయు మేడి, అత్తి, పిప్పళ్ళు మొదలగు వాటిని వనస్పతులని మన వేదశాస్త్రాలలో పేర్కొనబడ్డాయి.

ముఖ్య గమనిక: వేదాలలోని శాంతి సూక్తాలు సృష్టిలోని జడ దేవతలలో (ప్రాకృతిక దేవతలలో) ఉపద్రవాలు కలుగకుండా శాంతిదాయకములు కావాలని ప్రార్థనలుగా ఉన్నాయి. కనుక వీటికి ఆధిదైవికార్థాలు వ్రాయబడుతున్నాయి.

6. ఓం శం న ఇన్ద్రో వసుభిర్దేవో అస్తు
శమాదిత్యేభిర్వరుణః సుశంసః ।
శం నో రుద్రో రుద్రేభిర్జలాషః శం
న స్త్వష్టా గ్నాభిరిహ శృణోతు ॥ ఋ. 7. 35. 6

(ఆధి దైవికార్థం)

భావము: హే సర్వవ్యాపక సర్వేశ్వరా! నీ అనుగ్రహం వల్ల దివ్యగుణ

యుక్తుడైన ఇంద్రుడు (విద్యుత్తు) వసువులతో కలిసి (మరుత్ వాయువులతో కలిసి) మాకు శాంతి చేకూర్చును గాక. వరుణుడు (సంవత్సరం) తన ఆదిత్యులతో కలిసి (12 నెలలతో కలిసి) మాకు శాంతిదాయక మగును గాక. రుద్రుడు (జీవాత్మ) తన సహచరులైన రుద్ర దేవతలతో కలిసి మాకు జలాషుడగును గాక - దుఃఖ నివారకుడగును గాక. త్వష్టా - తన ప్రకాశంతో సృష్టిలోని వివిధ రూపాలను, రంగులను చూపునట్టి సూర్యుడు తన గ్నాభులతో- గతిశీలమైన తన రశ్ములతో కలిసి మాకు ప్రాప్తించును గాక.

పై అర్థాలకు శాస్త్ర ప్రమాణాలు

1. **వసురన్తరిక్షసత్** (యజుర్వేదము 12.14)

   అస్య మన్త్రస్య వ్యాఖ్యానే వాయుర్వై వసురన్తరిక్షసత్ (శతపథ 6.7.3.11)

2. **వరుణ ఆదిత్యై రుదక్రమాత్** (ఐతరేయ బ్రాహ్మణం 4.1.4.10); **కతమ ఆదిత్యా ఇతి? ద్వాదశమాసః సంవత్సరస్య** (శతపథ 11.6.3.8)

3. **రుద్ర దేవత లెవరు?** దశవిధ ప్రాణాలు మరియు జీవాత్మ. ఇవి శరీరాన్ని వదిలిపెట్టి వెళ్ళేటప్పుడు అందరిని ఏడిపిస్తాయి కనుక (రుద - రోదనే) (సత్యార్థ ప్రకాశం)

4. **దేవతల గణన:**

ద్వాదశాదిత్యులు	-	12
ఏకాదశ రుద్రులు	-	11
అష్ట వసువులు	-	8
విద్యుత్ యజ్ఞశ్చ	-	2
		33 (సత్యార్థ ప్రకాశం)

7. ఓం శం నః సోమో భవతు బ్రహ్మ శం
నః శం నో గ్రావాణః శము సన్తు యజ్ఞాః ।
శం నః స్వరూణాం మితయో భవన్తు

శం నః ప్రస్వః శమ్వస్తు వేదిః ॥ ఋ. 7.35.7

భావము: ఓ సర్వవ్యాపక సర్వేశ్వరా! వేదాలలో నీవు అనేక రకాల యజ్ఞాల గురించి, వాటివల్ల కలిగే ప్రయోజనాలను గురించి సూచించియున్నావు. వాటిని మేము చక్కగా నిర్వహించగల సామర్థ్యమును కూడా ప్రసాదింపుము. బ్రాహ్మణాది గ్రంథాలలో మహాఋషులు వాటి విధి విధానాలను గురించి తెలిపియున్నారు. మేము వాటిని అనుసరిస్తూ బహుళ ప్రయోజనాలను పొందుదుముగాక. యజనీయ పదార్థాలలో ముఖ్యమైన ఘృత సోమలతాది ఓషధులు, బ్రహ్మ అందుకు తగిన వేద మంత్రాలు, యజ్ఞవేది నిర్మాణమునకై వినియోగించు గ్రావాణములు - ఇటుకలు, యజ్ఞశాల నిర్మాణమునకు ఉపయోగించు స్వరూణాం మితయః - స్తంభములు, వాటి కొలతలు అన్నియు మాకు సుఖశాంతులను కలిగించునవియే అగును గాక. అట్లే ప్రస్వములు - మిగిలిన మూలికలు, వేది - యజ్ఞవేది ఇవియన్నియు నీ దయవల్ల మాకు శాంతి నిచ్చునివియే అగును గాక.

8. ఓం శం నః సూర్య ఉరుచక్షా ఉదేతు
శం నశ్చతస్రః ప్రదిశో భవన్తు ।
శం నః పర్వతా ధ్రువయో భవన్తు
శం నః సిన్ధవః శము సన్త్వాపః ॥ ఋ. 7.35.8

భావము: ఓ సర్వాంతర్యామీ! నీ కృపవలన ఆకాశమున మిక్కిలిగా ప్రకాశించుచున్న సూర్యుడు, నాలుగు దిక్కులు, నాలుకు (ప్రదిశః) మూలలు మాకు శాంతినిచ్చునవి అగును గాక. పర్వతములన్నీ స్థిరంగా ఉండును గాక. సముద్రాలు, వాపీకూప తటాకాది జలాశయాలు స్థిరముగా నుండును గాక.

వివరణ: భూకంపములు, ఉప్పెనలు వచ్చినప్పుడు వీటిలో మార్పులు జరిగి మానవులకు, పశు పక్ష్యాదులకు ఎక్కువ నష్టం కలుగకుండు గాక యని భావం.

9. ఓం శం నో అదితిర్భవతు వ్రతేభిః శం
నో భవన్తు మరుతః స్వర్కాః ।
శం నో విష్ణుః శము పూషా నో
అస్తు శం నో భవిత్రం శమ్వస్తు వాయుః ॥ ఋ. 7.35.9

భావము: ఓ సర్వాంతర్యామీ! నీ కృప వలన ఈ అదితి (భూమాత) జీవనం కొరకు వ్రతేభిః - అన్నాది పదార్థాలనిచ్చి (అన్నమపి వ్రత ముచ్యతే - నిరుక్తం (2.23) శాంతి నిచ్చునుగాక. స్తుతించతగు ప్రాణాపానాది మరుత్తులు మాకు శాంతి నిచ్చునుగాక! విష్ణువు (సూర్యుడు) పూషా (పుష్టినిచ్చు మేఘాలు) మాకు శాంతి నిచ్చును గాక. సుఖకారక భవిత్రము (ద్యులోకము) మరియు వాయువు మాకు శాంతిదాయకమగును గాక.

ప్రమాణాలు: భవిత్రమ్ = భవిష్యత్, అసౌ (ద్యులోకః) భవిష్యత్తైత్తిరీయ బ్రాహ్మణం (3.8.1.12.61)

10. ఓం శం నో దేవః సవితా త్రాయమాణః
శం నో భవన్తూషసో విభాతీః ।
శం నః పర్జన్యో భవతు ప్రజాభ్యః
శం నః క్షేత్రస్య పతిరస్తు శంభుః ॥ ఋ. 7.35.10

భావము: ఓ సర్వవ్యాపక సర్వేశ్వరా! నీ కరుణా కటాక్షాల వల్ల అంధకారాన్ని, రోగకారక క్రిములను పోగొట్టు సూర్యుడు ప్రతిదినం ఉదయించి మాకు సుఖశాంతులను కలిగించునుగాక. ప్రభాత ఉషస్సులు మాకు విశేషకాంతిని, స్ఫూర్తిని, ప్రేరణను కలిగించునుగాక. ప్రజల కొరకు, ప్రాణుల కొరకు మేఘాలు సకాల వర్షాలను కురిపించి మమ్ము పోషించునుగాక.

క్షేత్ర పతులు - భూస్వాములు ప్రజలకు వలయు చక్కటి పంటలను పండించి మాకు సుఖశాంతులను కలిగింతురు గాక.

11. ఓం శం నో దేవా విశ్వదేవా భవన్తు
శం సరస్వతీ సహ ధీభిరస్తు ।
శమభిషాచః శము రాతిషాచః శం
నో దివ్యాః పార్థివాః శం నో అప్యాః ॥ ఋ. 7.35.11

భావము: హే దయామయ ప్రభో! నీ కృప వలన మా దేవతలు - దివ్య గుణకర్మ స్వభావాలు గల విద్వాంసులు, గురువులు విశ్వదేవత లగుదురుగాక. సమస్త మానవుల (మానవాళి) కల్యాణము కొరకై ఉపదేశింతురుగాక. విశ్వ గురువు

లగుదురు గాక. మా సరస్వతి – విద్యా విజ్ఞానాలు వివేకవంతములగుగాక. మా అభిషాచులు – తపస్వులు, రాతి షాచులు – త్యాగులు మార్గదర్శకులై మాకు మనఃశాంతి కలుగునట్లు ఉపదేశింతురుగాక. మరియు ద్యు పృథివీ అంతరిక్ష లోకాలకు చెందిన దివ్య ప్రాకృతిక శక్తులన్నియు మాకు సుఖశాంతులను కలిగించును గాక.

12. ఓం శం నః సత్యస్య పతయో భవంతు
శం నో అర్వన్తః శము సన్తు గావః ।
శం న ఋభవః సుకృతః సుహస్తాః
శం నో భవన్తు పితరో హవేషు ॥ ఋ. 7. 35. 12

భావము: హే సర్వవ్యాపక సర్వేశ్వరా! ప్రాకృతిక విపత్తు లేర్పడినపుడు (సత్యస్య పతయః) సత్యవిద్యల – వేదవిద్యల నెరుగు విద్వాంసులు మా అవసరాలను గుర్తించి తగిన విద్యలను బోధించి మాకు శాంతిని చేకూర్తురుగాక. మా (అర్వంతః) శీఘ్రగాములైన అశ్వాలు – వాహనాలు మరియు గావః – భోగ్య పదార్థాల నిచ్చు గో ఆది పశువులు మాకు సహకరించి శాంతిని చేకూర్చునుగాక. (శం నః ఋభవః) మా ఋభువులు – శిల్పవిద్యల నెరుగు యంత్ర నిర్మాణాది విద్యల నెరుగు ఇంజనీయర్లు, అట్టివి నిర్మించగల సుకృతులు, సుహస్తులు – హస్తకళా నైపుణ్యం గల సహాయకులు మాకు సహకరించి శాంతిని చేకూర్తురుగాక. మా పితరులను – అనుభవజ్ఞులైన పెద్దలను, పాలకులను సాదరంగా ఆహ్వానించి వారి సలహాలను కూడా స్వీకరించి శాంతిని పొందుదుము గాక.

13. ఓం శం నో అజ ఏకపాద్ దేవో అస్తు
శం నోఽహిర్బుధ్న్యః శం సముద్రః ।
శం నో అపాం నపాత్ పేరురస్తు
శం నః పృశ్నిర్భవతు దేవగోపా ॥ ఋ. 7. 35. 13

భావము: హే సర్వాంతర్యామీ! నీ కృపవల్ల 'అజః ఏకపాత్' అవి తైత్తిరీయ బ్రాహ్మణంలో నిర్వచింపబడిన ఎన్నెన్నో దివ్యగుణాలు గల సూర్యుడు, మాకు శాంతిదాయకుడగును గాక. 'అహిర్బుధ్న్యః' – అంతరిక్ష స్థానీయ మేఘము సకాలమున వర్షించి మాకు శాంతి నిచ్చును గాక. సముద్రములు, అందు

పయనించు పాదములు లేని వాహనాలు – నౌకలు మాకు శాంతిని కలిగించునవి యగును గాక. దివ్య శక్తులను కలిగిన పృశ్నిః – భూమాత మాకు శాంతినిచ్చును గాక.

ప్రమాణములు:

1. తం సూర్యం దేవమజమేకపాదమ్ – తై. బ్రా. (3.1.2.8)

2. యోహిః స బుధ్న్యః, బుధ్నమన్తరిక్షమ్ తన్నివాసాత్। – నిరుక్తం (10.44)

3. ఇయం (పృథివీ) వై పృశ్నిః । తైత్తరీయ బ్రాహ్మణం (1.4.1.5)

14. ఓం ఆదిత్య రుద్రా వసవో జుషన్తేదం
బ్రహ్మ క్రియమాణం నవీయః ।
శృణ్వన్తు నో దివ్యాః పార్థివాసో
గోజాతా ఉత యే యజ్ఞియాసః ॥ ఋ. 7. 35. 14

భావము: ఓ వేద విద్వాంసులారా! మీలో ఎవరు ఆదిత్యులో, రుద్రులో, వసువులో, దివ్య గుణాలు కలిగిన వారున్నారో, బాగా తెలిసిన అనుభవజ్ఞులున్నారో, సుశిక్షిత వాణి కలవారున్నారో అట్టివారు తరచుగా మా యింటికి విచ్చేసి మా ఆతిథ్యమును స్వీకరించి మా అధ్యయనాన్ని విని పరిశీలించి తగిన విధంగా ఉ పదేశము లివ్వగోరుచున్నాము. మాకు శాంతిని చేకూర్చగోరుచున్నాము.

వివరణ:

1. ఆదిత్యులంటే – 48 సంవత్సరాలు బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ 4 వేదాలను పూర్తిగా అధ్యయనం చేసిన పూర్ణ విద్వాంసులు.

2. రుద్రులంటే – పై విధంగా 2 వేదాలను అధ్యయనం చేసినవారు.

3. వసువులంటే – పై విధంగా 1 వేదాన్ని అధ్యయనం చేసినవారు.

15. ఓం యే దేవానాం యజ్ఞియా యజ్ఞియానాం
మనోర్యజత్రా అమృతాఋతజ్ఞాః ।
తే నో రాసన్తామురుగాయమద్య
యూయం పాత స్వస్తిభిః సదానః ॥ ఋ. 7. 35. 15

భావము: విద్వాంసులలో ఎవరు శ్రేష్ఠ పూజనీయ విద్వాంసులో, మనుష్య

మాత్రులందరూ ఎవరిని ఆదరించగోరుదురో, అమృతులో – జీవన్ముక్తులో, ఋతజ్ఞులో – ప్రాకృతిక నియమజ్ఞులో – సృష్టి నియమాలు బాగా తెలిసినవారో, సత్య పరాయణులో అట్టి వారంతా మాకు మార్గదర్శకులై మమ్ము శాంతి పథమున నడుపుదురుగాక. వారు మాకు చక్కటి ఉపదేశాలు చేస్తూ, మాచే చక్కటి పుణ్యకర్మలు చేయిస్తూ, మాకు ప్రశంసనీయ కీర్తిని ప్రాప్తింపచేయుదురు గాక. సదా శుభములతో మాకు భౌతిక, మానసిక, ఆత్మిక శాంతులను ప్రసాదింతురుగాక. శుభమస్తు. శాంతిరస్తు.

(ఋగ్వేదీయ శాంతి సూక్తం సమాప్తం)

మృత్యు సూక్తము

(మృత్యు దూరీకరణ సూక్తాలు)

1. ఓం పరం మృత్యో అను పరేహి పన్థాం
యస్తే స్వ ఇతరో దేవయానాత్ ।
చక్షుష్మతే శృణ్వతే తే బ్రవీమి మా నః
ప్రజాం రీరిషో మోత వీరాన్ ॥ ఋ. 10. 18. 1

భావము: ఓ మానవులారా! మీరు మృత్యువును దూరం చేసుకుంటూ నిండా నూరేండ్లు జీవించ యత్నించండి. దేవయాన మార్గాన పయనిస్తూ ఈవిధంగా సంకల్పించుకోండి.

ఓ మృత్యువా! మేము దేవతలము – దేవయాన మార్గాన పయనించువారము. సదా సత్కర్మలు చేస్తూ ఆ పుణ్య ఫలాలను భగవదార్పణ చేస్తూ ముక్తిని పొంద యత్నించుచున్నవారము. కనుక ఓ మృత్యువా! కన్నులు, చెవులు గల దాని వలె నున్న నీవు మా నుండి దూరంగా తొలగిపో. మరొక మార్గాన – పితృయాన మార్గాన – కోరికలతో మరల మరల జన్మించాలనీ, ఎన్నెన్నో విషయ సుఖాల ననుభవించాలనే కోరిక గలవారిని పట్టుకో. అట్లే, మా సంతానాన్ని, మా దేశవీరులను కూడా చంపకు, నష్టపరచకు. వారంతా భావిపౌరులు. దయచేసి వారిని కాపాడు.

2. ఓం మృత్యోః పదం యోపయన్తో యదైత
ద్రాఘీయ ఆయుః ప్రతరం దధానా ।

ఆప్యాయమానాః ప్రజయా ధనేన

శుద్ధాఃపూతా భవత యజ్ఞియాసః ॥ ఋ. 10.18.2

భావము: ఓ మానవులారా! మీరు మృత్యు సమానమైన స్వార్థమయ రాక్షస జీవనాన్ని ప్రక్కకు నెట్టివేసి యజ్ఞశీలురై సదా సత్కర్మలు చేస్తూ దేవయాన మార్గాన పయనించండి. ఈ దారి దీర్ఘమైనదైనా మీకు దీర్ఘమైన ఆయువును, ఉత్తమ సంతానాన్ని, న్యాయార్జిత ధనాన్ని, ఆరోగ్యాన్ని, ఆత్మతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తాయి. మీ ఆత్మ శుద్ధము, పవిత్రము అవుతుంది. ప్రారబ్ధం పూర్తియైన తదుపరి ముక్తిని కలిగిస్తుంది.

3. ఓం ఇమే జీవా వి మృతైకావవృత్రన్నభూద్భద్రా

దేవహూతిర్నో అద్య ।

ప్రాంచో అగామ నృతయే హసాయ

ద్రాఘీయ ఆయుః ప్రతరం దధానాః ॥ ఋ. 10.18.3

భావము: ఈ జీవులు (మానవులు) కాలాంతరంలో నశించిపోయే ఈ మరణ ధర్మం గల భోగాలను చూచి చూచి విరక్తులు కావాలి. యజ్ఞశీలురై - పరోపకార పరాయణులు కావాలి. దేవయాన మార్గాన పయనించుచు దీర్ఘాయువును పొందాలి. పుత్ర పౌత్రాదులతో, నృత్య గానాలతో నవ్వుతూ నవ్విస్తూ ఆనందంగా జీవితాన్ని గడపాలి.

4. ఓం ఇమం జీవేభ్యః పరిధిం దధామి

మైషాం ను గాదపరో అర్థమేతమ్ ।

శతం జీవన్తు శరదః పురూచీరన్తన్

మృత్యుం దధతాం పర్వతేన ॥ ఋ. 10.18.4

భావము: ఓ మానవులారా! పరమేశ్వరుడనై నేను నా ఈ వేదం ద్వారా మీ జీవితాన్ని నియమబద్ధం చేస్తున్నాను. మీరు ఈ వేదమార్గాన్నుండి తొలగిపోవద్దు. మీకు నేనిచ్చిన ఆయువు శతశరత్తులు (నూరేండ్లు). మీరు ఆరోగ్య నియమాలను పాటిస్తూ, యోగాభ్యాసం చేస్తూ ఈ ఆయువును ఇంకనూ పొడిగించుకోవచ్చు. మృత్యువును దాటవేస్తూ ఉండవచ్చు. మరి కొంతకాలం జీవించవచ్చు. ప్రయత్నించండి.

5. ఓం యథాహాన్యనుపూర్వం భవన్తి యథ
ఋతవ ఋతుభిర్యన్తి సాధు ।
యథా న పూర్వమపరో జహాత్యేనా
ధాతరాయూంషి కల్పయైషామ్ ॥ ఋ. 10. 18. 5

భావము: ఓ మానవులారా! ఏవిధంగా రాత్రింబవళ్ళు, పూర్వాపరాలు (ముందు వెనుకలు), ఋతుచక్రం క్రమంగా నియమంగా ఒకదాని తరువాత మరొకటి వస్తున్నాయో, అట్లే జీవులకు జనన మరణాల చక్రం నడుస్తూనే ఉంటుంది. ఈ చక్ర బంధనాన్నుండి విముక్తిని పొందాలంటే దేవయాన మార్గాన్ని అనుసరించాలి. యోగసాధనలు చేస్తూ ఆత్మ, పరమాత్మల సాక్షాత్కారం పొందాలి. ప్రారబ్ధం పూర్తయిన తదుపరి దేవుని తృతీయ ధామానికి చేరుకోవాలి.

6. ఓం ఆ రోహతాయుర్జరసం వృణానా
అను పూర్వం యతమానా యతిష్ఠ ।
ఇహ త్వష్టా సుజనిమా సజోషా
దీర్ఘమాయుః కరతి జీవసే వః ॥ ఋ. 10. 18. 6

భావము: ఓ మానవులారా! పూర్వ ఋషులవలె నిత్యం జగత్కర్తయైన పరమేశ్వరుని ఉపాసిస్తూ దీర్ఘాయువును పొందండి. వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా, ఆనందంగా గడపండి. సూర్య చంద్ర నక్షత్రాది ప్రాకృతిక శక్తులు మీకు తోడుగా నుండునుగాక! మీరు వాటికి సన్నిహితంగా గడపండి. సదా సత్కర్మలు ఆచరిస్తూ మోక్షకాంక్షులై గడపండి.

వేదాలలో నారీ సత్కారం

7. ఓం ఇమా నారీరవిధవాః సుపత్నీ
రాంజనేన సర్పిషా సం విశన్తు ।
అనశ్రవో ఉ నమీవాః సురత్నా ఆ
రోహన్తు జనయో యోనిమగ్రే ॥ ఋ. 10. 18. 7

భావము: ఓ నారీమణులారా! మీకు భర్తా వియోగము కలుగకుండును గాక! సదా ముత్తయిదువులై పసుపు కుంకుమలతో నుందురు గాక. నేత్రాలకు అంజనము పెట్టుకుంటూ, ఉత్తమ రత్నాలతో కూడిన ఆభరణాలను ధరిస్తూ,

కన్నీరు కార్చకుండా (దుఃఖితులు కాకుండా) సదా ప్రసన్నంగా నుందురు గాక! ఘృతాది బలకరమైన ఆహారాదులను భుజిస్తూ హృష్ట పుష్టములతో నుందురు గాక! నిరోగులై ఉత్తమ సంతానము నుత్పన్నము చేయుదురు గాక. గృహ సామ్రాజ్ఞులై విలసిల్లుదురు గాక!

8. ఓం ఉదీర్ష్వ నార్యభి జీవలోకం
గతాసుమేతముప శేష ఏహి ।
హస్తగ్రాభస్య దిధిషోస్తవేదం
పత్యుర్జనిత్వమభి సం బభూథ ॥ ఋ. 10.18.8

భావము: ఓ స్త్రీ రత్నమా! ఏ కారణం చేతనైనా పతి మృతి చెందినచో నీవు విలపిస్తూ జీవితాన్ని కోల్పోనక్కరలేదు. మరొక యోగ్యుడైన పతిని చేపట్టి సంతానము నుత్పత్తి చేయుము. పతి నపుంసకుడైనను రెండవ పతిని పొందవచ్చు. దీనినే నియోగ మంటారు. పతి అయోగ్యుడైన అతనిని విడిచి మరొక యోగ్యుడైన పతిని పొందవచ్చు.

వేదాలలో పుత్రుల కర్తవ్యం

9. ఓం ధనుర్హస్తాదాదదానో మృతస్యాऽస్మే
క్షత్రాయ వర్చసే బలాయ ।
అత్రైవ త్వమిహ వయం సువీరా
విశ్వాః స్పృథో అభిమాతీర్జయేమ ॥ ఋ. 10.18.9

భావము: ఓ క్షత్రియ యువకుడా! మృతి చెందిన నీ తండ్రి వద్ద కూర్చొని విలపించి ప్రయోజనం లేదు. లేచి నిలబడి నీ తండ్రి చేతినుండి ధనుర్బాణాలను, రాజ్యాధికారాలను నీవు గ్రహించి రాష్ట్ర రక్షణ కొరకు – దేశరక్షణ కొరకు నడుం కట్టుకొని నిలబడు. అందుకు అవసరమైన బల వర్చస్సులను సంపాదింపుము. వీరులైన పుత్రులను, సైన్యాన్ని పొంది శత్రు మూకలను చండాడి విజయాన్ని వరింపుము. ధర్మ రాజ్యాన్ని స్థాపింపుము. శుభమస్తు.

(మృత్యు సూక్తం సమాప్తం)

వాయు సూక్తం

1. ఓం వాత ఆవాతు భేషజం శంభు మయోభు నో హృదే ।

ప్ర ణ ఆయూంషి తారిషత్ ॥ ఋ. 10.186.1

భావము: వాయువు ఒక భేషజం వంటిది. అది నా హృదయానికి, ఊపిరితిత్తులకు శాంతిని, సుఖాన్ని, ఆరోగ్యాన్ని తెస్తుంది. ఇంతేగాక, ప్రాణాయామం ద్వారా దానిని ఎక్కువగా లోనికి పీల్చుకుంటే ఆయువును కూడా వృద్ధి చేస్తుంది. కనుక, ఓ మానవా! నిత్యం ప్రాణాయామాభ్యాసం చెయ్యి.

2. ఓం ఉత వాత పితాసి న ఉత భ్రాతోత నః ।
సఖా సరో జీవాతవే కృధి ॥ ఋ. 10.186.2

భావము: మరియు వాయువు మనను పితవలె – తండ్రి వలె రక్షించి పోషిస్తుంది. మరియు అది భ్రాతవలె – సోదరుని వలె భరణ పోషణలు చేస్తుంది. మరియు అది మంచి మిత్రుని వలె జీవితాంతం తోడుగా ఉంటుంది. దానిని మనం ప్రాణాయామంతో బలపరచుకుంటే అది మనను ఎక్కువకాలం జీవింపచేస్తుంది.

3. ఓం యదదో వాత తే గృహే3 అమృతస్య ని ధిర్హితః తః ।
తతో నో దేహి జీవసే ॥ ఋ. 10.186.3

భావము: ఓ మానవులారా! ఈ గాలి మీ ఇంటిలో అమరత్వ నిక్షేపంగా ఉంటుంది. మీ ధాతుశక్తిని పెంచి రోగాలు రాకుండా కాపాడుతుంది. దానిని మీరెంత వాడుకున్నా తరగదు. ప్రకృతిలో పరమేశ్వరుడు చేసిన ఏర్పాట్ల వల్ల వదిలిన గాలి శుద్ధమై మరలా మనకు ఉపయోగపడుతుంది.

వివరణ: వృక్షజాతులు మనం వదిలిన గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ని గ్రహించి తమకు ఆహారంగా తయారు చేసుకుంటాయి. ఇంతేగాక, అవి మనకును ఆహారాన్ని నిర్మించి యిస్తాయి. కనుక వృక్షజాతులను మనం ఎంతగా కాపాడుకుంటే అంతగా మనకు మేలు కలుగుతుంది.

ఇట్టి వేదమంత్రాలు నాలుగు వేదాలలోను అక్కడక్కడ చాలానే ఉన్నాయి. వాటిని "ప్రేరక వేదమంత్రాలు" అనే పుస్తకంలో తెలుసుకుందాము.

(వాయు సూక్తం సమాప్తం)

అఘమర్షణ సూక్తము

1. ఓం ఋతం చ సత్యం చాభీద్ధాత్తపసోఽధ్య జాయత ।
తతో రాత్ర్యజాయత, తతః సముద్రోఽర్ణవః ॥
సముద్రాదర్ణవాదధి సంవత్సరో అజాయత ।
అహోరాత్రాణి విదధద్విశ్వస్య మిషతో వశీ ॥
సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వ మకల్పయత్ ।
దివం చ పృథివీం చాంతరిక్ష మథో స్వః ॥

ఋ. 10. 190. 1,2,3

భావము: పై ఋగ్వేద మంత్రాలకు **'ఋషి'** అఘమర్షణో మధుచ్ఛన్దసుడు, దేవత భావ వృత్తమ్. అనగా ఈ వినీలాకాశంలో మన కంటికి కనబడే నక్షత్ర రాసులన్నీ ఒక్క వృత్తంగా గుండ్రంగా బంతిగా కనబడుతుంది. దీనినే జ్యోతిష్య శాస్త్రం కాంతి వృత్తంగా పేర్కొంటుంది. అలాంటి విశ్వగోళ రచనను గురించి ఈ మంత్రాలు వివరిస్తున్నాయి. ఈ మంత్రాలను మననం చేస్తూ సమాధి స్థితుడైన ఆది ఋషి అఘమర్షణో మధుచ్ఛన్దసుడు. ఆ పేరు ఆ ఋషికి నైమిత్తికంగా కలిగి ఉండవచ్చు. అనగా పై మంత్రాలలోని విజ్ఞానాన్ని గ్రహించినచో పరమేశ్వరుని అనంతశక్తి సామర్థ్యాలు అవగతమై, పాపభావనలు మననుండి తొలగిపోయి, మధుమయ జీవితం లభించగలదని అతనికి అవగతమై ఉండవచ్చును. ఆ విషయాన్నే ఆ ఋషి ప్రచారం చేయటం వలన అతనిని ప్రజలు అఘమర్షణో మధుచ్ఛన్దసుడు అనే పేరుతో పిలిచి ఉండవచ్చును. ఇక మంత్రార్థాలు తెలుసుకుందాం.

ఋతంచ సత్యం చాభీద్ధాత్తపసోఽధ్యజాయత =

పరమేశ్వరుని ప్రకాశవంతమైన తపస్సుతో- ఋతం అనగా ప్రాకృతిక నియమాలు మరియు ఆ నియమాలతో క్రమ పరిమాణం చెందుతూ సత్యం (ప్రకృతి) ప్రపంచంగా ఉత్పన్నమైనది.

తతః రాత్రి అజాయత =

ఆ పరిణామ క్రమంలో ముందుగా ప్రళయమను రాత్రి ఉత్పన్నమయ్యింది.

తతః సముద్రః అర్ణవః =

ఆ ప్రళయరూప రాత్రినుండి అర్ణవ సముద్రం అనగా స్థూల పరమాణు సముద్రం ప్రకటమయ్యింది. (దీనినే నేటి వైజ్ఞానికులు న్యూట్రోనియం అంటున్నారు.)

సముద్రాత్ అర్ణవాత్ అధి సంవత్సరః అజాయత =

ఆ అర్ణవ సముద్రము (న్యూట్రోనియం పదార్థం) ఒక దగ్గరకు చేరి అధి సంవత్సరం అనే మహాత్ అండంగా రూపొందినది. అనగా ఆ న్యూట్రోనియాణువులన్నీ కలిసి ఒక ముద్దగా అండాకారంగా ఏర్పడినవి. ఈ ముద్దనే (మహాదండమునే) మన వేదం అధిసంవత్సరం, హిరణ్య గర్భం, మహదండం మొదలైన పేర్లతో పేర్కొన్నది. శతపథ బ్రాహ్మణం (6.1.3.8)లో **"భూతానా మధిపతిః, సంవత్సరః సః"** అని చెప్పబడినది. అధిసంవత్సర నామక మహదండం యొక్క అంతిమ అవస్థకే హిరణ్యగర్భం అని పేరు. మన బ్రాహ్మణ ఆరణ్యక ఉపనిషత్తాదులయందు హిరణ్య గర్భాన్ని గూర్చిన పెక్కు వర్ణనలు కనబడతాయి.

అహోరాత్రాణి విదధద్ విశ్వస్య మిషతః వశీ = సర్వాన్ని తన వశంలో పెట్టుకొనే వశీ నామక పరమేశ్వరుడు పై అధి సంవత్సర అండాన్ని ప్రేల్చి (Big bang) ముక్కలు ముక్కలుగా విశాల ఆకాశంలో విసిరివేసాడు. వాటిని నక్షత్రాలుగా గ్రహ ఉపగ్రహ ఉల్కాదులుగా విభజించి వాటిని తమలో తాము తిరుగుతూ వాటికన్న పెద్దవాటి చుట్టూ తిరుగునట్లు ఏర్పాటు చేసాడు. అందు ప్రకాశించే పెద్ద ముక్కలను (అండాలను) సూర్యులనీ, ఈ గ్రహాల చుట్టూ తిరుగు చిన్న అండాలను ఉపగ్రహాలు లేదా చంద్రులనీ మనం వ్యవహరిస్తున్నాం. మన భూమి ఒక గ్రహం. అది తన చుట్టూ తాను తిరగటం వలన దినరాత్రులు ఏర్పడుతున్నాయి. అందువలన ప్రాణులకు ప్రవృత్తి, నివృత్తి (విశ్రాంతి) కలుగుతున్నది. వాటి మనుగడ హాయిగా సాగుతున్నది.

"సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వ మకల్పయత్" = అన్నిటిని ధరించే ధాతా నామక సర్వవ్యాపక సర్వేశ్వరుడు. పూర్వ కల్పంలో సృజించినట్లే ఇప్పటి సూర్యచంద్రులను కూడా సృజించాడు.

"దివం చ పృథివీం చాంతరిక్ష మథో స్వః" = సూర్య చంద్రుల వలనే

ద్యులోకాన్ని పృథివీ లోకాన్ని వీటి మధ్యన ఉండే అంతరిక్ష లోకాన్ని సృజించాడు. అనంతరం ఉల్కలను కూడా సృష్టికి విఘాతం కలిగించకుండునట్లు వాటి వాటి పరిధులలో త్రిప్పుతున్నాడు.

ఈ మూడవ మంత్రం మరికొంత సృష్టి విజ్ఞానాన్ని మనకందిస్తున్నది. ఇప్పుడు మనకు కనిపిస్తున్న సృష్టి పూర్వ కల్పంలో జరిగిన సృష్టి వలెనే జరిగినదని చెబుతున్నది. కాబట్టి సృష్టి ప్రళయములు దినరాత్రుల వలె చక్ర భ్రమణంగా అనాదికాలం నుండి జరుగుతున్నాయని తెలుస్తున్నది. వీటికి ఆది అంతాలు లేవు. వీటన్నిటిని ఒకే పరమాత్మ చేస్తుండటం వలన, అతని జ్ఞాన సామర్థ్యాలు పరిపూర్ణమై ఉండటం వలన పూర్వ సృష్టిలో ఏఏ పదార్థాలు ఎలా సృజింపబడ్డాయో అలాగే ఈ సృష్టిలోని పదార్థాలునూ సృజింపబడ్డాయి. కాలాంతరంలో ప్రళయం జరిగి మళ్ళీ సృష్టి జరిగినప్పుడు ఇప్పటి సృష్టిలో వలెనే సూర్య, చంద్ర, నక్షత్ర, గ్రహ, ఉపగ్రహాలు నిర్మింపబడగలవు. అలాగే ప్రాణి జాతులన్నీ సృజింపబడతాయి. మానవుడు అల్పజ్ఞుడు కనుక తాను నిర్మించిన యంత్రంలోని లోటుపాట్లను గుర్తించి మరికొన్ని మార్పులు చేసి మరొక యంత్రాన్ని నిర్మిస్తుంటాడు. పరమేశ్వరుడు సర్వజ్ఞుడు కాబట్టి తాను సృజించిన సృష్టిలో అసలు లోపాలే ఉండవు. కాబట్టి ప్రళయానంతరం మళ్ళీ సృజించినప్పుడు మార్పులు చేసుకోవలసిన అవసరమేముంటుంది? పై విధంగా అఘమర్షణ మంత్రాలను అర్థ భావనతో పఠించిన యెడల పరమేశ్వరుని అనంత శక్తి సామర్థ్యాలు తేటతెల్లమవుతాయి. అతడు సర్వాంతర్యామియై మన మనోవాక్కాయకర్మలను సదా వీక్షిస్తూ న్యాయంగా ఫలాలనిచ్చునని నిశ్చయించుకొని పాప కర్మలను సర్వదా విడిచి పెట్టవలెనను ప్రేరణ కలుగును. దీనినే అఘమర్షణం (పాప దూరీకరణం) అంటారు.

(అఘమర్షణ సూక్తము సమాప్తం)

★★★

యజుర్వేదంలో యజ్ఞ మహిమ

యజుర్వేదము యజ్ఞ మహిమను వేనోళ్ళ కీర్తిస్తుంది. తనకు, ఇతరులకు మేలుచేసే సత్కర్మలన్నిటిని యజ్ఞమే అంటుంది. అందులో దేవయజ్ఞమైన

అగ్నిహోత్ర కర్మ పూర్తిగా వైజ్ఞానిక మంటుంది. అందలి మొదటి సూక్తాన్ని గురించి సంక్షిప్తంగా ఇచట తెలుసుకుందాము. వివరాలకు నా రచనలు “అగ్నిహోత్రం 100% వైజ్ఞానికం” మరియు “అగ్నిహోత్ర రాసాయనిక విశ్లేషణ”లు చదువగోరుచున్నాను.

1. ఓం వసోః పవిత్రమసి శతధారం వసోః
పవిత్రమసి సహస్ర ధారమ్ దేవస్త్వా ।
సవితా పునాతు వసోః పవిత్రేణ
శతధారేణ సుప్త్వా కామధుక్షః ॥ – యజు. 1.3

భావము: ఓ మానవులారా! (వసోః పవిత్రమసి శతధారం) వసువు – అగ్నిహోత్రం శతవిధాల పవిత్రమైనది. (వసోః పవిత్రమసి సహస్రధారం) అగ్నిహోత్రం వందల విధాలే కాదు వేల విధాల పవిత్రమైనది.

(దేవస్త్వా సవితా పునాతు వసోః) అందుండి వెడలు వాయువులు సూర్య కిరణాలలో చేరి సూర్యుని వరకు వ్యాపిస్తాయి. సూర్యునిలోని మచ్చలను సరిచేసి భూవాతావరణానికి సహకరిస్తాయి.

(సుప్వాతి కామధుక్షః) ఇది కామధేనువు కూడా. మీమీ కామములను – కోరికలను తీర్చగల కామధేనువు కూడా.

వివరణ: పూర్వం అనేక చికిత్సలు చేసినా తగ్గని వ్యాధులకు ఆయుర్వేద ఋషులు యజ్ఞం ద్వారా కొన్ని మూలికలను ప్రయోగించి వ్యాధిని నివారణ చేసి బాగు చేసేవారట. పుత్రకామేష్టి, వర్షేష్టి మొదలగునవి ఇట్టివే.

2. ఓం సా విశ్వాయుః సా విశ్వకర్మా సావిశ్వధాయాః ।
ఇన్ద్రస్య త్వా భాగమ సోమేనా తనచ్మి విష్ణో హవ్యమ రక్ష ॥
– యజు. 1.4

భావము: ఈ యజ్ఞము (విశ్వాయుః) అన్ని వయస్సులవారును చేయవచ్చు. అది వేదము ద్వారా తెలుపబడిన కర్తవ్య కర్మల నన్నిటిని చేయుమని ప్రేరేపిస్తుంది. (విశ్వధాయాః) విశేషంగా సర్వ జగత్తును ధారణ చేస్తుంది. వేదంలో సర్వ సత్యవిద్యలు బీజరూపంలో ఉన్నాయి. ఇంద్రుడైన జీవునకు దేవుడిచ్చిన జ్ఞాననిధులు

అవి. దానిని ఆశ్రయించిన వారిని సర్వవ్యాపక విష్ణువు రక్షించును గాక. మేము శ్రద్ధతో అర్పించు ఆహుతులను రక్షించును గాక.

3. ఓం అగ్నే వ్రతపతే వ్రతం చరిష్యామి తచ్ఛకేయం తన్మే రాధ్యతామ్ ।
ఇదమహమనృతాత్సత్యముపైమి ॥ – యజు. 1.5

భావము: ఓ అగ్నీ! నీవు వ్రతపతివి. ఉష్ణ ప్రకాశము లనే రెండు దివ్య గుణాలను సదా ధరిస్తూ నీవు వ్రతం చేస్తున్నావు. నేనును సత్యవ్రతము చేయ సంకల్పించితిని. తత్ + శకేయం దానిని శ్రద్ధగా ఆచరించగల శక్తిని నాకిమ్ము. (తత్ + మే రాధ్యతామ్) ఆ వ్రత ధారణ నన్ను ప్రకాశింపజేయును గాక. (ఇదమహం అనృతాత్ సత్యాముపైమి) నేను ఇకనుండి అసత్య మార్గమును విడిచి సత్యమైన వేదమార్గముననే ప్రయాణింతును గాక. సత్య స్వరూపుడైన పరమాత్మను పొందుదును గాక.

ఈ విధంగానే ఈ సూక్తమంతా నిత్యాగ్నిహోత్రులు కమ్మని ప్రేరేపిస్తుంది. అస్తు– మనం అట్లే అగుదుము గాక.

(యజుర్వేద ప్రథమ సూక్తము సమాప్తం)

శుక్ల యజుర్వేదం

షోడశోధ్యాయః (16వ అధ్యాయం)

రుద్ర నమకం

1. ఓం నమస్తే రుద్ర మన్యవ ఉతో త ఇషవే నమః ।
బాహుభ్యాముత తే నమః ॥ – యజు. 16.1

ప్రార్థనార్థం:

నమస్తే రుద్ర మన్యవ ఉతోత = ఓ రుద్రుడా! దుష్టులను దండించి రోదింపజేయు పరమేశ్వరా! నీ కృప వలన మా రాజులు, మా పాలకులు నీ వంటి రుద్రులు అగుదురు గాక!

ఉతోత ఇషవే నమః = మా రాజులకు, సైన్యానికి బలకరమైన అన్న

పానీయాలు లభించును గాక!

బాహుభ్యాం + ఉతతే నమః = వారి బాహువుల నుండి వజ్రాయుధాలు వెడలి శత్రువులను చీల్చి చెండాడును గాక!

2. ఓం యా తే రుద్ర శివా తనూర ఘోరాఽపాపకాశినీ ।
తయా నస్తన్వా శన్తమయా గిరిశన్తాభి చాకశీహి ॥

– యజు. 16.2

ప్రా: యాతే రుద్ర శివా తనూ = ఓ రుద్రా! పరమేశ్వరా! నీ యొక్క వేదజ్ఞాన రూప శరీరము దుష్టులకు భయంకరమును, శ్రేష్ఠులకు సుఖకారకమునై యున్నదో (శరీర రూప వేద జ్ఞానమున్నదో), (అఘోరా + అపాపకాశిని) అది హింసారహితము, పాపరహితము కనుక మేమంతా నీ వేదోపదేశాలనే అనుసరింతము గాక!

తయానః + అస్తన్వా శన్తమయా = ఆ వేద జ్ఞానం మాకు గొప్పదైన సుఖమును, శాంతిని కలిగించును గాక!

గిరిశన్త + అభి + చాకశీహి = అది అంతటా వర్షించు మేఘాల వంటిది. కనుక మేము నీ వేదోపదేశాలనే అనుసరించి అభ్యుదయ నిఃశ్రేయసాలను పొందుదుము గాక!

3. ఓం యామిషుం గిరిశన్త హస్తే బిభర్ష్యస్తవే ।
శివాం గిరిత్ర తాం కురు మా హిం సీః పురుషం జగత్ ॥

– యజు. 16.3

ప్రా: హే రుద్ర పరమేశ్వరా! లోకోపకారం కొరకు మేఘాలు వర్షించునట్లే మా సేనాపతుల చేతులందు ధనుర్బాణముల ధరించి బాణ వర్షాలను కురిపించి శత్రువుల నుండి ప్రజల ప్రాణులను కాపాడుదురు గాక! అట్లే మా విద్వాంసులు ప్రజలకు మేలు కలుగునట్లు వేదోపదేశాలతో మమ్ము కాపాడుదురు గాక! మా సైన్యము అమాయకులను హింసింపకుండును గాక!

4. ఓం శివేన వచసా త్వా గిరిశాచ్ఛా వదామసి ।
యథా నః సర్వమిజ్జగదయక్ష్మ సుమనాఽ అసత్ ॥

– యజు. 16.4

ప్రా: హే రుద్రా! పరమేశ్వరా నీ కృపవలన మా గిరిజన వైద్యులు తమ కళ్యాణకర వచనాలతో రోగులకు స్వాంతనను, నమ్మకాన్ని కలిగింతురు గాక! వారి అనుభవాలతో ఆయా రోగులకు తగిన మూలికలను సేకరించి వాటి రసాలతో రోగ నివారణ చేయుదురు గాక! యథా నః సర్వమ్ + ఇత్ + జగత్ + అయక్ష్మం = మాలోని రోగాలను పోగొట్టుదురు గాక. మాకు ప్రసన్నతను కలిగింతురు గాక!

5. ఓం అధ్యవోచదధివక్తా ప్రథమో దైవ్యో భిషక్ ।
అహీ శ్చ సర్వాఞ్జమ్భయన్త్సర్వాశ్చ
యాతుధాన్యో౽ధరాచీః పరా సువ ॥ – యజు. 16.5

ప్రా: అధి + అవోచత్ + అదివక్తా ప్రథమో + దైవ్యః + భిషక్ = ఓ రుద్రా! పరమేశ్వరా! నీ కృప వలన మా వైద్యులును నీవంటి రుద్రవైద్యులు అగుదురు గాక! అన్ని రకాల రోగకారక క్రిములను ఔషధాలతో నశింప చేయుదురు గాక! వారిలో ముఖ్యుడైన వైద్యరాజు వైద్య విద్యార్థులకు రోగ నిదానాన్ని రోగ నివారణను చక్కగా బోధింతురు గాక! సర్పాల కాటు వంటి ప్రాణాంతక వ్యాధులను కూడా నివారించగల చికిత్సలను బోధింతు గాక!

అహీంశ్చ + సర్వాన్ + జమ్భయన్ + సర్వః + చ = సర్వకాల రోగక్రిములను నశింపజేయుదురు గాక!

యాతు ధాన్యో ధరాచీః పరాసువ = మా వైద్యులు రోగ కారకములైన ఆహార విహారాదులను వ్యభిచారాది మానసిక దోషాలను కూడా వేదోపదేశాలతో పోగొట్టునట్లు అనుగ్రహింపుము.

6. ఓం అసౌ యస్తామ్రో౽అరుణ౽ఉత బభ్రుః సుమంగలః ।
యే చైన రుద్రా౽ అభితో దిక్షు శ్రితాః
సహస్రశో౽వైషా హేడ౽ఈమహే ॥ – యజు. 16.6

ప్రా: ఓ రుద్రా! పరమేశ్వరా! నీ అనుగ్రహం వల్ల **అసౌయస్త్రాః + అమ్ర + అరుణ + ఉత బభ్రుః సుమంగలః =** మా రాజులు, పాలకులు రాగివంటి

దృఢాంగయుక్తులు, శత్రువుల చీల్చి చెండాడువారు, కొంత పసుపు ఛాయ గలవారు, సుమంగలులు... అనగా అందరి మేలు కోరువారు అగుదురు గాక!

యే + చ + ఏనం రుద్రా అభితః దిక్షు శ్రితాః = మరియు వారి భృత్యులైన సేనాధిపతులు, సైనికులు నలువైపులనుండి దండెత్తి వచ్చే శత్రు మూకలను చీల్చి చెండాడగల సమర్థులు అగుదురు గాక!

సహస్రశోఽ వైషాగ్ం హేడఽ ఈమహే = అట్టి ధర్మాత్ముడు, న్యాయకారి రుద్రుడునైన మా రాజుకు భయపడుతూ మేము పాపములను చేయుటకు జంకుదుము గాక! మేమును ధర్మాత్ములమగుదుము గాక!

7. ఓం అసౌ యోఽ వసర్పతి నీలగ్రీవో విలోహితః ।
ఉతైనం గోపాఽ అదృశ్రన్నదృశ్రన్నుదహార్యః స దృష్టో
మృడయాతి నః ॥ – యజు. 16.7

ప్రా: హే సర్వేశ్వరా! నీ కృప వలన మా సేనాపతులు నీలమణుల మాలను ధరించి శత్రుసేనలను దునుమాడుచు మమ్ము చక్కగా రక్షింతురు గాక! ఇంతేగాక మాలోని శ్రేష్ఠ పురుషులకు ప్రియులూ, రక్షకులునై మమ్ము చక్కగా పాలింతురు గాక!

8. ఓం నమోఽస్తు నీలగ్రీవాయ సహస్రాక్షాయ మీఢుషే ।
అథో యేఽ అస్య సత్వానోఽహం తేభ్యో కరం నమః ॥

– యజు. 16.8

ప్రా: హే సర్వవ్యాపక పరమేశ్వరా! నీ కృపవలన మా రాజులు అట్టి సేనాపతులను (శ్రేష్ఠులు, ప్రియులు, రక్షకులు నైన సేనాపతులను) చక్కగా సత్కరించి ప్రోత్సహింతురు గాక! మేమును తగినన్ని పన్నులు చెల్లిస్తూ ఆ సేనాపతులకు వారి భృత్యులైన సైనికులకు రక్షకభటులకు, తగినన్ని అన్నాది పదార్థములనిస్తూ సత్కరింతుము గాక!

9. ఓం ప్రముఞ్చ ధన్వనస్త్వముభయోరార్త్న్యోర్జ్యామ్ ।
యాశ్చ తే హస్తఽ ఇషవఃఽ పరా తా భగవో వప ॥

– యజు. 16.9

ప్రా: ఓ సర్వాంతర్యామీ! మమ్ము రక్షించు. మా సేనాధిపతులకు శౌర్య పరాక్రమాది వీరోచిత భగమును - ఐశ్వర్యమును ప్రసాదింపుము. వారు ధనుస్సులకు ఇరువైపుల నుండి వింటినారిని బిగించి ఒకేసారి అనేక శరములను - బాణాలను ప్రయోగించగల శక్తియుక్తులను వారికి ప్రసాదింపుము. శత్రువుల యొక్క బాణాలను మధ్యలోనే ఖండించగల సామర్థ్యమును వారికి ప్రసాదింపుము.

10. ఓం విజ్యం ధనుః కపర్దినో విశల్యో బాణవాన్ ఉత ।
అనేశన్నస్య యా౽ ఇషవ౽ ఆభురస్య నిషఙ్గధిః ॥

- యజు. 16.10

ప్రా: ధనుర్వేద పారంగతులైన ఓ వీరులారా! జటాజూటమును ధరించి బ్రహ్మ తేజస్సుతో వెలుగొందు మీ సేనాధిపతి సదా మమ్ము ప్రోత్సహించును గాక! మీ అమ్ముల పొదులు ఖాళీ కాకుండా నిరంతరము సేవకులతో నింపించును గాక! మీ రక్షణకును తగిన ఏర్పాట్లు చేయును గాక! (సేనాపతులు అట్టి వ్యవస్థ చేయాలని భావం.)

11. ఓం యా తే హేతిర్మీఢుష్టమ హస్తే బభూవ తే ధనుః ।
తయాస్మాన్విశ్వతస్త్వమయక్ష్మయా పరి భుజ ॥

- యజు. 16.11

ప్రా: అతిశయ వీర్యవంతుడవైన ఓ సేనాపతీ! నీ చేతిలో ధరించిన ధనుస్సు వజ్రతుల్యమగును గాక! వాటితో నీవు నీ సేనలను, ప్రజలమైన మమ్మును అన్నివైపుల నుండి రక్షింతువు గాక! మేము నిన్నే నమ్ముకున్నాము. మమ్ము రక్షించు.

12. ఓం పరి తే ధన్వనో హేతిరస్మాన్ వృణక్తు విశ్వతః ।
అథో య౽ ఇషుధిస్తవారే౽ అస్మన్నిధేమి తమ్ ॥

- యజు. 16.12

ప్రా: ఓ సేనాపతీ! ఓ రాజా! తీవ్రగతిని కలిగిన నీ ధనుస్సుతో మమ్ము అన్నివైపుల నుండి రక్షించుము. సదా ఆయుధములను నీవద్దనే ఉంచుకొని శత్రువుల దొంగదాడి నుండి మమ్ము రక్షించుము. మా వద్దను కొన్ని ఆయుధములుంచి వాటిని ప్రయోగించుట మాకు నేర్పుము. మేమునూ నిన్ను రక్షింప యత్నింతుము

గాక!

(అందరు 1, 2 ఆయుధాలను లేదా ఆత్మరక్షణ సాధనాలను దగ్గర ఉంచుకొని వాటిని తరచుగా సాధన చేస్తూ ఉండాలి.)

13. ఓం అవతత్య ధనుష్ట్వ సహస్రాక్ష శతేషుధే ।
నిశీర్య శల్యానాముఖా శివో నః సుమనా భవ ॥

– యజు. 16.13

ప్రా: అనేక సంగ్రామములు చేసి గెలిచిన ఓ సేనాపతీ! నీవద్ద గల దివ్య శస్త్రాలతో శత్రువుల మదమణిచి మమ్ము కాపాడుము. మా కొరకు నీవు ప్రసన్నచిత్తుడవు, కళ్యాణకారివి కమ్ము. నీకు మా అనేకానేక వందనములు.

(సేనాపతులు, రాజులు సైనికులకు నూతన శస్త్రాస్త్రాలను సమకూరుస్తూ వాటిని ప్రయోగించగల విద్యను నేర్పాలని భావం.)

14. ఓం సమస్తu ఆయుధాయానాతతాయ ధృష్ణవే ।
ఉభాభ్యాముత తే నమో బాహుభ్యాం తవ ధన్వనే ॥

– యజు. 16.14

ప్రా: సభాపతి ఓ రాజా! నీ సేనాపతులకు, సైనికులకు పుష్కలముగా ఆయుధాల నిమ్ము. పుష్టికరమైన ఆహారాదులను సమకూర్చుము. నీ వ్యూహ రచనలను గుప్తముగా ఉంచుము. గుప్తచరులతో శత్రువుల కదలికలను తెలుసుకుంటూ తగిన వ్యూహములను రచింపుము. నీకు మా నమస్సులు.

15. ఓం మా నో మహాన్తముత మా నోu అర్భకం
మానu ఉక్షన్తముతమానu ఉక్షితమ్ ।
మా నో వధీః పితరం మోత మాతరం
మా నః ప్రియాస్తన్వో రుద్ర రీరిష ॥ – యజు. 16.15

ప్రా: ఓ యోధులారా! మీరు మహాంత విద్వాంసులను, సాధు సన్యాసులను వధించవద్దు. అర్భకులైన పూజించతగిన స్త్రీ బాలవృద్ధులను వధించవద్దు. మా మాతా పితరులను, గర్భిణులను, మా భార్యలను వధించవద్దు. మీరు వీరులైతే వీరులతోనే యుద్ధం చేయండి. నిరాయుధులై రణమును చూచువారిని, రణ

ప్రబంధం చేయుచున్నవారిని సహాయకులను చంపకూడదు. వారిని వికలాంగులను చేయకూడదు. ఇదే యుద్ధనీతి.

16. ఓం మా నస్తోకే తనయే మానఉ ఆయుషీ
మానో గోషు మానోఉ అశ్వేషు రీరిషః ।
మా నో వీరాన్ రుద్ర భామినో వధీర్హవీష్మన్తః
సదమిత్ త్వా హవామహే ॥ – యజు. 16.16

ప్రా: ఓ రుద్ర రాజా! మాలోని పసికందులను హింసించవద్దు. ఏడేండ్లు దాటిన పిల్లలను కూడా హింసించవద్దు. (మాన + ఆయూంషి) మా ఆయువులను (జీవితాలను) హింసించవద్దు. (న గోషుః మా) మా ఆవులను, గొర్రెలను, మేకలను మొదలైన వాటిని హింసించవద్దు. (మా వో ఆశ్వేషు రీరిషః) మా గుర్రాలను, ఏనుగులను, ఒంటెలను హింసించవద్దు. (నః భామినః వీరాన్ మా వధీః) క్రుద్ధులైన మా వీరులను చంపవద్దు. (అంటే వారికి లేదా వాటికి ఎట్టి హాని చేయకుండా సుపరిపాలన చేయమని బోధన.) అట్టి న్యాయకారియైన రాజునే మేము (హవామహే) స్వీకరిస్తాము. ఎన్నుకుంటాము.

ప్రజలే తగిన ధర్మాత్ముని ఎన్నుకుని రాజును చేయాలంటుంది వేదం. (వివరాలు సత్యార్థ ప్రకాశం 6వ సముల్లాసంలో).

17. ఓం నమో హిరణ్య బాహవే సేనాన్యే దిశాం చ పతయో నమో
నమో వృక్షేభ్యో హరికేశేభ్యః
పశూనాం పతయే నమో నమః శష్పిఞ్జరాయ త్విషీమతే
పథీనాం పతయే
నమోనమో హరికేశాయోపవీతినే పుష్టానాం పతయే నమః ॥
– యజు. 16.17

ప్రా: ఓ శత్రునాశక సేనాపతీ! నీవు హిరణ్య బాహుడవు– తేజోయుత బాహువులు కలవాడవు. సేనకు చక్కటి శిక్షణ గరుపు నీకు (నమః) నమస్కారము. నీకు వజ్రతుల్య ఆయుధములు లభించుగాక! ఓ దిశాంపతీ! నలుదిక్కులనున్న రాజ్య భాగాలను రక్షించువాడా! నీకు (నమః) బలకరమైన ఆహారాదులు పుష్కలంగా

లభించుగాక! వృక్షేభ్యో హరికేశేభ్యః పశూనాం పతయే నమో నమః – నీవు సూర్య కిరణములను హరించు ఆమ్రాది వృక్షములను రక్షించు. (సేనాపతులు పచ్చని వృక్షాలతో కూడిన వనసంపదను కూడా రక్షించాలని భావం.) శష్పింజ్జరాయ! – ఓ విషయలోలత లేనివాడా! త్విషీమతే! – ఓ న్యాయకారీ! నీకు (నమః) నమస్కారము. నీకు అందరి ఆదరము లభించుగాక! హరికేశాయ ఉపవీతినే నమః – ప్రకాశించే శిఖతో, సుందరమైన యజ్ఞోపవీతంతో వెలుగొందు నీకు నమస్కారము. పుష్టానాం పతయే నమః – ప్రజలందరికి ఆరోగ్యాన్ని ప్రసాదించే నీకు నమస్కారం. (రాజులు లేదా నాయకులు ఇలాంటి రాజ్య వ్యవస్థను చేసి ప్రజలకు ఏ లోటూ లేకుండా చక్కగా పరిపాలించాలని భావం.)

18. ఓం నమో బభ్లుశాయ వ్యాధినేఽన్నానాం
పతయే నమో నమో భవస్య
హేత్యై జగతాం పతయే నమో
నమోరుద్రాయాతతాయినే క్షేత్రాణాం పతయే నమో
నమః సూతాయాహన్త్యై వనానాం పతయే నమః ॥

– యజు. 16.18

ప్రా: **నమో బభ్లుశాయ వ్యాధినే =** ఓ రాజా (ఓ నాయకులారా) సదా రాజ కార్యాలలో నిమగ్నమయే మంత్రులకు, గూఢచారులకు, సేనాపతులు మొదలగువారికి నమః – తగిన విధంగా అన్నాది పదార్థాలనిస్తూ సత్కరించండి. **అన్నానాం పతయే నమః =** అన్నాది పదార్థములను ఉత్పన్నం చేసే రైతులను (నమః) తగిన విధంగా సత్కరించండి. వారి అవసరాలను పూరించండి. **నమో భవస్య హేత్యై =** రాజ్యంలోని లోటుపాట్లను భర్తీ చేస్తూ, మిగిలిన పంటలను విదేశాలకు ఎగుమతి చేస్తూ రాజ్యాన్ని పుష్టివంతం (సమృద్ధం) చేసే వైశ్య వర్గాన్ని (నమః) సత్కరించుచు వారి ఇబ్బందులను సరిచేయండి. **జగతాం పతయే నమః =** ప్రజలకు ఏ లోటు లేకుండా కాపాడుతూ మీరు జగత్పతులు కావలెను. **నమో రుద్రాయ + ఆతతాయినే =** సదా జాగరూకులై సరిహద్దులను కాపాడుచున్న రుద్రులకు – శత్రువుల నేడ్పించు వీరులకు (నమః) తగిన వేతనాలను, ఆయుధాలను ఆహారాదుల నిస్తూ సత్కరించండి. **క్షేత్రాణాం పతయే నమః =** అట్లే పొలములలో

తగిన నీటిని పెడుతూ ఎరువులను వేస్తూ పురుగులు రాకుండా కాపాడు క్షేత్ర పతులకు (నమః) తగిన ఆహారాదులనిస్తూ ఆదుకోండి. అట్లే రాజ్యంలోని మానవులందరిని, వారి భృత్యులను (భార్యాపిల్లలు మొ॥ వారిని), వనపతులను (అడవులను రక్షించువారిని) (నమః) తగిన విధంగా ఆదుకోండి.

19. ఓం నమో రోహితాయ స్థపతయే వృక్షాణాం పతయే నమో నమో భువన్తయే
వారివస్కృతాయౌషధీనాం పతయే నమో నమో మన్త్రిణే వాణిజాయ కక్షాణాం
పతయే నమో నమఉ ఉచ్చైర్ఘోషాయాక్రన్దయతే పత్తీనాం
పతయే నమః ॥ – యజు. 16.19

సృష్టికర్త సందేశం: రాజులు లేదా పాలకులు దేశంలోని అన్ని వర్గాలవారిని తగిన విధంగా సత్కరించాలి. అవసరమైన అన్నాది పదార్థాలనిస్తూ పోషించాలి. **రోహితాయ నమః –** పరిశ్రమల ద్వారా, వ్యాపారాదుల ద్వారా రాష్ట్రీయ సంపదను వృద్ధిచేసే వారిని సత్కరించండి. **స్థపతయే నమః –** గృహ ఆరామాదులను నిర్మించే శిల్పులకు నమః **వృక్షాణాం పతయే నమః –** అటవీ సంపదను రక్షించే వారికి, వృద్ధిచేసేవారికి నమస్కారం. **భువన్తయే –** పరిశుభ్రతను కాపాడేవారికి, సేవలకు నమః – వారికి తగిన వేతనాలనిచ్చి ఆదరించండి. **వారివస్కృతయ నమః –** నీటి పారుదలను వృద్ధి చేస్తూ సేద్యాన్ని విస్తరింపచేసేవారిని, **ఓషధీనాం పతయే నమః –** దేశ ప్రజలకు పశువులకు అవసరమగు ఓషధులను, మూలికలను పెంచేవారికి వందనం. **నమో మంత్రిణే –** చక్కటి ఆలోచనా పరులకు, మంత్రులకు **వాణిజాయ నమః** – ప్రజల అవసరాలను తీర్చే వర్తకులకు వందనాలు. **కక్షణాం పతయే నమః –** ఇంట్లోనే ఎక్కువసేపు ఉండే స్త్రీ బాలవృద్ధులను రక్షించేవారికి నమః **ఉ చ్చైర్ఘోషాయ నమః –** ఉచ్ఛ స్వరంతో వార్తలను, ప్రకటనలను ప్రసారం చేసేవారికి నమః **ఆక్రన్దయతే నమః –** దుష్టులకు తగిన దండన విధిస్తూ వారిని రోదింపచేసే న్యాయాధీశులకు వందనములు. **పతీనాం పతయే నమః –** సేనలోని వివిధ విభాగాలలో పనిచేయువారికి నమః. వారిని ఆదరించండి.

20. ఓం నమః కృత్స్నాయతయా ధావతే సత్వనాం పతయే నమో నమః సహమానాయ
నివ్యాధిన ఆవ్యాధినీనాం పతయే నమో నమో నిషఙ్గిణే కకుభాయ
స్తేనానం పతయే నమో నమో నిచేరవే పరిచరాయారణ్యానాం పతయే నమః ॥ – యజు. 16.20

సృష్టికర్త సందేశం: ఉన్నతి పొందుటకై ఉత్సాహంగా నిరంతరం శ్రమించు కృత్స్నాయతులకు (నమః) వందనము. వారిని ఆదరించి ప్రోత్సహించాలి. అట్లే సత్వనాం పతులు – శ్రమించి సంపాదించిన వాటిని రక్షించు వారిని కూడా ఆదరించాలి. యోధులను – నిరంతరం శత్రువుల దాడినుండి రక్షించే వారిని ఆదరించాలి. అవ్యాధినీపతులను శత్రువుల నణచి పెట్టువారిని ఆదరించాలి. అనేక రకాల ఆయుధ ప్రయోగం తెలిసినవారిని కూడా సత్కరించాలి. సోమరులు కాక నిరంతరం పరోపకారం చేసేవారిని సత్కరించాలి. కుకుభాయులకు – సదా విలాసాలలో ఉండువారికి, స్తేనులకు – దొంగలకు పతయే – ఇతరులను కొట్టి బాధించువారికి నమః – బడితపూజ చేయాలని – దండన చేసి దారిలో పెట్టాలని అర్థం. నమ ఇతి వజ్ర నామ – వజ్రం అంటే కఠిన దండన ఇవ్వాలని అర్థం చేసుకోవాలి.

21. ఓం నమో వఞ్చతే పరివఞ్చతే స్తాయునాం పతయే నమో నమో నిషఙ్గిణఽ
ఇషుధిమతే తస్కరాణాం పతయే నమో నమ సృకాయిభ్యో
జిఘా సద్భ్యో ముష్ణతాం పతయే నమో నమోఽసిమద్భ్యోనక్తం
చరద్భ్యో వికృన్తానాం పతయే నమః ॥ – యజు. 16.21

సృష్టికర్త సందేశం: ఓ ప్రజా పాలకులారా! నాయకులారా! **వఞ్చతే పరివఞ్చతే నమః** – ఛల కపటములతో ఇతరుల ఆస్తులను దోచుకునేవారిని, దొంగలను, దోపిడీదారులను తగిన విధంగా దండించి దారిలో పెట్టాలి. నిషఙ్గిణులను, ఇషుధీమతులను – రాజ్య రక్షణకై నిరంతరంగా శ్రమించువారిని, ఆయుధ ప్రయోగ నిపుణులను తగిన విధంగా సత్కరించాలి. **తస్కరాణాం పతయే నమః** – దొంగల

నాయకులను కఠినంగా శిక్షించాలి.

పూర్వ మంత్రములో తెలిసికొన్నట్లుగా ఇచట నమః అంటే వజ్రతుల్య దండన విధించాలని అర్థం గ్రహించాలి.

22. ఓం నమ ఉష్ణీషిణే గిరిచరాయ కులఞ్చానాం పతయే
నమో నమ ఇషుమద్భ్యో ధన్వాయిభ్యశ్చ వో
నమో నమ ఆతన్వానేభ్యః ప్రతిదధానేభ్యశ్చ వో
నమో నమ ఆయచ్ఛద్భ్యో స్యద్భ్యశ్చ వో నమః ॥

– యజు. 16.22

సృష్టికర్త సందేశం: తలకు మంచి పగిడి చుట్టుకున్న వేదవేత్తలైన గ్రామాధిపతికి... కరణంగారికి నమః – వారిని తగినవిధంగా గౌరవించాలి. సత్కరించాలి. సదాచారాలను వదిలి కులభ్రష్టులైన వారిని నమః – తగిన విధంగా దండించాలి. ధనుర్బాణాలను ధరించి గ్రామాలను దోచుకొను దోపిడీగాండ్రను పడగొట్టు వీరులకు నమః – నమస్కారము – సత్కారము చేయాలి. వారికి తగిన వేతనాలిస్తూ చక్కగా పోషించాలి, గౌరవించాలి. అట్లే గ్రామ పంచాయితీలు నిర్వహిస్తూ దుష్టులను దండిస్తూ ప్రజలను కాపాడు గ్రామ పెద్దలను (నమః) గౌరవించాలి సత్కరించాలి.

23. ఓం నమో విసృజద్భ్యో విద్ద్యద్భ్యశ్చవో నమో నమః
స్వపద్భ్యో జాగ్రద్భ్యశ్చవో నమో నమః
శయానేభ్య ఆసీనేభ్యశ్చ వో నమో నమస్తిష్ఠద్భ్యో
ధావద్భ్యశ్చ వో నమః ॥ – యజు. 16.23

సృష్టికర్త సందేశం: గ్రామస్థులు తమ గ్రామాన్ని కాపాడుతున్న వీరులందరకు తగిన విధంగా అన్నవస్త్రాదులనిచ్చి ఆదుకోవాలి. శత్రువులపైకి బాణాలను, బల్లెములను ప్రయోగించువారికి, నిలబడి దృష్టిని దూరంగా ప్రసరింపజేస్తూ శతృవుల కదలికలను గమనించువారికీ, కూర్చొని పనిచేయువారికి, పరుండి పనిచేయువారికి నమః – అన్న వస్త్రాలనివ్వాలి. కర్తవ్యాన్ని విడిచి నిద్రపోవు వారికి మాత్రం నమః – వజ్ర ప్రహారము – కఠిన దండన విధించాలి. (ఈ విధంగా అందరికి న్యాయం

జరగాలని భావం.)

24. ఓం నమః సభాభ్యః సభాపతిభ్యశ్చ వో నమో నమోఽశ్వేభ్యోఽ
శ్వపతిభ్యశ్చ
వో నమో నమః ఆవ్యాధినీభ్యో వివిధ్యన్తీభ్యశ్చ వో నమో
నమః ఉగణాభ్యసృహతీభ్యశ్చ వో నమః ॥

– యజు. 16.24

సృష్టికర్త సందేశం: సభాభ్య సభాపతిభ్యః నమః – సభా సభ్యులకు సభాపతులకు నమః వారు స్త్రీలైనా పురుషులైనా అందరిని తగిన విధంగా సత్కరించాలి. సేనలోని అశ్వాలకు అశ్వపాలకులకు నమః – వాటికి వారికి అన్నపానీయాలు ఇచ్చి ఆదరించాలి. శత్రు సేనలను చంపు వీరులైన స్త్రీ పురుషులకు అందరికి నమః – నమస్కారము. **ఉగణాభ్య నమః –** వివిధ తర్కముల నెరిగిన విదుషీ స్త్రీలకు నమః – సత్కారము. **బృహతీభ్య నమః –** శత్రు సేనలను చంపు వీరాంగనలకునూ నమః సత్కారము.

25. ఓం నమో గణేభ్యో గణపతిభ్యశ్చ వో నమో నమో వ్రాతేభ్యో
వ్రాతపతిభ్యశ్చ వో నమో
నమో గృత్సేభ్యో గృత్సపతిభ్యశ్చ వో నమో నమో విరూపేభ్యో
విశ్వరూపేభ్యశ్చ వో నమః ॥ – యజు. 16.25

భావార్థము: (గణ సంఖ్యానే) కార్మిక కర్షక గణములకు మా నమః సుమాంజలులు. వారికవసరమైన అన్న వస్త్ర ఆవాసాదులను మేము ఏర్పరుతుము గాక! కార్మిక కర్షక గణాధ్యక్షుల (యూనియన్ ప్రెసిడెంట్, సెక్రెటరీ మొదలైన వారికి) నాయకులకు నమః – వారిని తగిన విధంగా గౌరవింతుము గాక! (వ్రాత ఇతి మనుష్యనామ – నిఘంటువు 2.3.) ప్రపంచంలోని వివిధ సమూహములకు మా నమస్సులు. వారంతా మాతో సమానులేనని గుర్తింతిము గాక! గృత్సేభ్యః – (యే గృణన్తి పదార్థ గుణాన్ స్తువన్తి తేభ్యోః విద్వద్భ్యః) – ప్రపంచ పదార్థాలను పరిశోధించు వైజ్ఞానికులకు మా నమస్సులు. ఆయా విభాగాధ్యక్షులకు మా నమస్సులు.

విరూపేభ్యః (వివిధాని రూపాణి యేషామ్ తేభ్యః) వివిధ రూపాలలో వారు వీరననేల సర్వ రూపాలలో నున్న వారందరికి మా నమస్సులు. వారిని తగిన విధంగా గౌరవింతము గాక! సత్కరింతుము గాక!

26. ఓం నమః సేనాభ్యః సేనానిభ్యశ్చ వో నమో నమో రథిభ్యో౽
అరథేభ్యశ్చ
వో నమో నమః క్షతృభ్యః సంగృహీతృభ్యశ్చ వో
నమో నమో మహద్భ్యో౽ అర్భకేభ్యశ్చ వో నమః ॥

– యజు. 16.26

భావార్థము: ఓ మానవులారా! మీ దేశాన్ని శత్రువుల దాడినుండి రక్షించు అన్నిరకాల భూ జల వాయు సైన్య విభాగాలకు నమస్కరించండి. అన్న పానీయాదులతో ఆదరించండి. అట్లే సేనా నాయకులను రథములతో యుద్ధము చేయు రథికులను, పదాతి దళాలను సంగ్రామమునకు అవసరమైన వస్తుజాలమును సమకూర్చువారిని, నమః – ఆదరించండి. మహద్భ్యః నమః – విద్యా వయోవృద్ధులను విద్యార్థులనందరిని నమః – ఆదరించండి.

27. ఓం నమస్తక్షభ్యో రథవారేభ్యశ్చ వో నమో నమః కులాలేభ్యః
కర్మారేభ్యశ్చ వో నమో నమో నిషాదేభ్యః పుఞ్జిష్ఠేభ్యశ్చ వో
నమో నమః శ్వనిభ్యో మృగయుభ్యశ్చ వో నమః ॥

– యజు. 16.27

భావార్థము: ఓ మానవులారా! పూర్వ మంత్రాలలో చెప్పినట్టే (తక్షభ్యః) సూక్ష్మ పరికరాలను, ఔషధాలను తయారు చేయువారిని (రథకారేభ్య) రథాలను, ఓడలను, విమానాలను నిర్మించువారిని (కులాలేభ్యః) మట్టి పాత్రలను నిర్మించువారిని, (కర్మారేభ్యః) కత్తులు, కటార్లు, బల్లెములు, ఫిరంగులు మొదలగు యుద్ధ పరికరాలను నిర్మించువారిని కూడా (నమః) ఆదరించండి. (నిషాదేభ్యః) పర్వతారణ్య ప్రాంతాలలో వసించు గ్రామాల్లోని ప్రజలను క్రూరమృగాల నుండి రక్షించు నిషాదులకును (నమః) – వారిని ఆదరించండి. (పుఞ్జిష్ఠేభ్యః) వివిధ భాషలు నేర్చినవారిని మరియు మిడతల దండు, పక్షుల గుంపులు మొదలైన

వాటినుండి పంటలను రక్షించేవారిని పంటలను తినివేయు అడవి పందులు వాటినుండి రక్షించేవారిని కూడా ఆదరించాలి. వారి వారి పనులను మనం చక్కగా వినియోగించుకోవాలి.

28. ఓం నమః శ్వభ్యః శ్వపతిభ్యశ్చ వో నమో నమో
భవాయ చ రుద్రాయ
చ నమః శర్వాయ చ పశుపతయే చ నమో
నీలగ్రీవాయ చ శితికణ్ఠాయ చ ॥ – యజు. 16.28

సృష్టికర్త సందేశం: శ్వభ్యః – పోలీసు కుక్కలకు, **శ్వపతిభ్యశ్చ** – ఆ కుక్కలను పాలించే Dog Squads కు నమః – వారిని ఆదరించాలి. **భవాయ చ రుద్రాయ చ నమః** – శ్రేష్ఠ బ్రాహ్మణులకు శ్రేష్ఠ క్షత్రియులకు నమః – వారిని సత్కరించాలి. **శర్వాయ చ పశుపతయాశ్చ నమః** – దుష్టులను సంహరించు వీరులకు, పశు పాలకులకు నమః – వారికి సత్కారము చేయాలి. **శితికణ్ఠాయ చ నమః** – వివిధ విద్యలలో శోభించు నీలగ్రీవులకు – సరస్వతీ పుత్రీ పుత్రులకు మధుర స్వరంతో రంజింపజేసే గాయనీ గాయకులకు నమః – వారిని సత్కరించండి. ఆదరించండి.

29. ఓం నమః కపర్దినే చ వ్యుప్తకేశాయ చ నమః
సహస్రాక్షాయ చ శత ధన్వనే చ
నమో గిరిశయాయ చ శిపివిష్టాయ చ నమో
మీఢుష్టమాయ చేషుమతే చ ॥ – యజు. 16.29

(1) నమః కపర్దినే చ వ్యుప్తకేశాయ చ నమః – ఓ మానవులారా! శిఖాధారియై వేదాధ్యయనం చేయుచున్న బ్రహ్మచారులకు, శిఖాసూత్రాలను తీసివేసి లోక సంచారం చేస్తూ ధర్మోపదేశం చేయు వేద విద్వాంసులైన సంన్యాసులకు నమః – నమస్కరించండి. శ్రద్ధతో అతిథి సత్కారం చేయండి.

(2) సహస్రాక్షాయ చ శతధన్వనే చ నమో – అనేక శాస్త్రాలను అధ్యయనం చేయు బ్రాహ్మణుని మరియు ధనుర్వేదవేత్తయైన క్షత్రియుని సత్కరించండి.

(3) నమః గిరిశాయాయ చ శిపివిష్టాయ చ – పర్వత గుహలలో లేదా వనాలలో కుటీరాలలో వసిస్తూ యోగసాధనలు చేయు వానప్రస్థుని మరియు

పశుపాలకుడైన వైశ్యుని కూడా సత్కరించండి.

(4) నమో మీఢుష్టమాయచ – వృక్షాలను, ఉద్యానవనాలను పెంచు తోటమాలిని, ఇషుమతేచ – ధనుర్బాణములను ధరించి పహారా కాయు వారిని కూడా చక్కని ఆహారాదులను ఇచ్చి సత్కరించండి.

30. ఓం నమో హ్రస్వాయ చ వామనాయ చ నమో బృహతే చ
వర్షీయసే చ నమోవృద్ధాయ
చ సవృధే చ నమోఽగ్ర్యాయ చ ప్రథమాయ చ ॥

– యజు. 16.30

సృష్టికర్త సందేశం: నమ హ్రస్వాయ చ వామనాయ చ – ఓ మానవులారా! మీరు సదాచారపరులు విద్యావంతులైన వారందరిని ఆదరించండి. గౌరవించండి. వారు వయస్సులో చిన్నవారైనా పెద్దవారైనా మధ్య వయస్కులైనా అందరిని గౌరవించాలి. ఆదరించాలి. వారివద్ద మీకు వలయు విద్యల నభ్యసించండి. మీ సందేహాల నడిగి సమాధానాలు తెలుసుకోండి. మానవ సమాజంలో అనేక రకాల ప్రవృత్తులు కలవారుంటారు. కొందరు పరోపకార ప్రియులుగా కొందరు సామాజిక ప్రియులుగా, కొందరు సంఘ సంస్కర్తలుగా, కొందరు అన్యాయాన్ని అధర్మాన్ని ఎదిరించే వీరులుగా ఉంటారు. కనుక వారందరిని యథాయోగ్యంగా గౌరవించండి.

31. ఓం నమఽ ఆశవే చాజిరాయ చ నమః
శీఘ్ర్యాయ చ శీభ్యాయ చ నమఽ
ఊర్మ్యాయ చావస్వన్యాయ చ నమో
నాదేయాయ చ ద్వీప్యాయ చ ॥ – యజు. 16.31

సృష్టికర్త సందేశం: ఓ మనుష్యులారా! **నమ ఆశవే చాజిరాయ చ –** వాయువు వలె వేగంగా పరుగులు తీయు అశ్వాలకు, స్వారీ చేయలేనివారిని క్రింద పడవేయు అశ్వాలకు నమః – నమస్కరించండి. అంటే తగిన ఆహారాదులను ఇచ్చి పోషించండి. ఆదరించండి. అట్లే ఏనుగులకు ఎద్దులు ఒంటెలు మొదలగు వానికి కావలసిన ఆహారాలను ఇచ్చి చక్కగా పోషించండి. **నమః శీఘ్రాయచ శీభ్యాయ చ –** శీఘ్ర గమనము గల వాహనాలను, వార్తావహులను, సాధనాలను సరిగా

వినియోగించుకుని వాటికి తగిన పోషణ (Servicing) చెయ్యండి. **నమ ఊర్మ్యాయ చావస్వన్యాయ** – జల మార్గంలో ఓడలు మొదలగు వాటిని నిర్మించుకుని ఖండ ఖండాంతరములకు ధైర్యంగా పయనించి వ్యాపారాదులతో దేశాన్ని సుసంపన్నము చేయువారికి నమః – సత్కరించండి, ఆదరించండి.

32. ఓం నమో జ్యేష్ఠాయ చ కనిష్ఠాయ చ నమః
పూర్వజాయ చాపరజాయ చ నమో
మధ్యమాయ చాపగల్భాయ చ నమో
జఘన్యాయ చ బుధ్న్యాయ చ ॥ – యజు. 16.32

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! **నమో జ్యేష్ఠాయ చ కనిష్ఠాయ చ** – మీరు అతి వృద్ధులను, పసిపిల్లలను కూడా జాగ్రత్తగా చూడాలి. వారికి సమయానికి ఆహార పానీయాదులను ఇచ్చి పోషించాలి. **నమః పూర్వజాయ చాపరజాయ చ** – వయస్సులో పెద్దవారైన అన్నలను, అక్కలను గౌరవించాలి. ఆదరించాలి. **నమో మధ్యమాయ చ పగల్భాయ చ** – బంధువులను మిత్రులను మీకన్నా చిన్నవర్ణానికి చెందిన పనివారిని కూడా ఆదరించాలి.

చతుర్వేదవేత్తయైన మహర్షి దయానందుల వారు ఈ మంత్రభావాన్ని ఈ క్రింది విధంగా వ్రాసారు.

“మనుష్యులు పరస్పరం కలుసుకున్నప్పుడు సత్కరించుకొనుటకై ‘నమస్తే’ అను వేదవాక్కును పలికి అభివాదం చేసుకోవాలి. రెండు చేతులు జోడించి నమస్కరించుకోవాలి. ఈ విధంగా పిన్నలు పెద్దలను, పెద్దలు పిన్నలను బ్రాహ్మణాది నాలుగు వర్ణాలవారును స్త్రీ పురుషులెల్లరును నమస్కరించుకోవడం శ్రేష్ఠం. ఈ వేదోక్త ప్రమాణంచే శిష్టాచారము నందు ఈ నమస్తే వాక్యాన్ని ఉచ్చరించుకోవడం ఉత్తమం అన్నారు.

వేదమే స్వయంగా పైవిధంగా చెబుతుండగా మనకు సంకోచం ఎందుకు? పెద్దలు చిన్నలకు నమస్తే చెప్పవచ్చును.

33. ఓం నమః సోభ్యాయ చ ప్రతిసర్యాయ చ నమో
యామ్యాయ చ క్షేమ్యాయ చ నమః

శ్లోక్యాయ చావసాన్యాయ చ నమఉ
ఉర్వర్యాయ చ ఖల్యాయ చ ॥ – యజు. 16.33

సృష్ఠికర్త సందేశం: ఓ మానవులారా! **నమః సోభ్యాయ చ ప్రతిసర్యాయ చ –** ఐశ్వర్యవంతులలో మరియు దానశీలతలో ప్రసిద్ధుడైన వారిని మరియు ధర్మాత్ముల కుటుంబంలో జన్మించిన పుణ్యాత్ముని నమః – మీరు సత్కరించండి. గౌరవించండి. **నమః శ్లోక్యాయ చావసాన్యాయ చ –** వేదవాణియందు ప్రవీణులైనవారిని, మరియు ఉత్తమ కార్యాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేయువారిని మీరు సత్కరించండి. **నమ ఊర్వర్యాయ చ ఖల్యాయ చ –** మహా పురుషులలో జ్యేష్ఠుని మరియు శ్రేష్ఠమైన భోజన పదార్థములను సేకరించు ప్రవీణుని వాటిని సద్వినియోగం చేయువారినే సత్కరించండి. గౌరవించండి.

34. ఓం నమో వన్యాయ చ కక్ష్యాయ చ నమః
శ్రవాయ చ ప్రతిశ్రవాయ చ ।
నమఉ ఆశుషేణాయ చాశురథాయ చ నమః
శూరాయ చావభేదినే చ ॥ – యజు. 16.34

సృష్ఠికర్త సందేశం: ఓ మానవులారా! **నమో వన్యాయ చ కక్ష్యాయ చ –** అడవులలో నుండి వాటిని రక్షించువారిని మరియు వన సమీప గుహలలోనుండి రక్షించువారిని మీరు పోషించాలి. **నమః శ్రవాయ చ ప్రతిశ్రవాయ చ –** ప్రతిజ్ఞ యొనర్చు వారిని మరియు ఆ ప్రతిజ్ఞలను నెరవేర్చువారిని మీరు సత్కరించండి. **ఆశుషేణాయ చాశురథాయ చ నమః –** శీఘ్ర గమనం గల పదాతి దళాలను మరియు రథాలను శీఘ్రముగా నడుపు సారథులను మీరు సత్కరించి ప్రోత్సహించండి. **నమః శూరాయ చావభేదినే చ –** శత్రువులను చంపువారికి, శత్రువులను చీల్చి చెండాడువారికి నమః వారిని గొప్పగా సత్కరించాలి.

35. ఓం నమో బిల్మినే చ కవచినే చ నమో
వర్మిణే చ వరూథినే చ నమః ।
శ్రుతాయ చ శ్రుతసేనాయ చ నమో
దున్దుభ్యాయ చాహనన్యాయ చ ॥ – యజు. 16.35

సృష్టికర్త సందేశం: ఓ నాయకులారా! పాలకులారా! రాజులారా! మీ దేశవీరులను, సేనాపతులను, సైనికులను చక్కగా పోషించండి. వారందరికి రక్షణ కవచాలనివ్వండి. వారికి మంచి గృహాలను ఇవ్వండి. వారి భార్యాపిల్లలకు మంచి రక్షణ కల్పించండి. విశేషంగా పరాక్రమాది శుభగుణాలతో ప్రఖ్యాతులైన వారిని, అట్టి సేనను తగిన విధంగా సత్కరించండి. యుద్ధ దుందుభులు మ్రోగిస్తూ, సైనికులను పొగుడ్తూ ఉత్సాహపరుస్తూ ఉండువారిని సత్కరించండి. ఈవిధంగా మీరు సేనను ప్రోత్సాహపరిస్తే మీకు పరాజయము కలుగదు. సదా విజయములే చేకూరగలవు.

36. ఓం నమో ధృష్ణవే చ ప్రమృశాయ చ నమో
నిషఙ్గిణే చేషుధిమతే చ ।
నమస్తీక్ష్ణేషవే చాయుధినే చ నమః
స్వాయుధాయ చ సుధన్వనే చ ॥ – యజు. 16.36

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! నాయకులారా! పాలకులారా! మీ సైన్యంలోని దృఢాంగులను, ఆలోచనాపరులను, కోమల స్వభావం కలిగినవారిని కూడా చక్కగా పోషించండి. ప్రోత్సాహించండి. మీ శస్త్రాస్త్ర భండాగారాలను, కొత్త కొత్త తీక్షణాయుధాలతో శక్తివంతమైన ఫిరంగాదులతో నింపి ఉంచండి. వీటిని చక్కగా ప్రయోగించగల నేర్పును శిక్షణను వారికి ఇవ్వండి. అప్పుడే మీకు వరుస విజయాలు చేకూరును.

37. ఓం నమః స్రుత్యాయ చ పథ్యాయ చ నమః
కాట్యాయ చ నీప్యాయ చ నమః ।
కుల్యాయ చ సరస్యాయ చ నమో
నాదేయాయ చ వైశన్తాయ చ ॥ – యజు. 16.37

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! పాలకులారా! నాయకులారా! పై జాగ్రత్తలతో పాటు "స్రుత్రాయ చ పథ్యాయ చ – జలమార్గాలను, భూమార్గాలను సరిచేసుకోండి. సేనలను అత్యవసరంగా తరలించుటకు మార్గాలు (బాటలు, రోడ్లు) సరిగా ఉండాలి కదా! అట్లే **"కాట్యాయ చ నీప్యాయ చ" –** కూపాలను, తటాకాలను బృహజ్జలాశయాదులను కూడా జాగ్రత్తగా కాపాడండి. వాటిని వృద్ధి పరచండి.

వాటి పనుల యందు నేర్పరులైన వారిని (ఇంజనీర్లు, మెకానిక్‌లను) చక్కగా పోషించండి. తద్వారా ప్రజలకు, సేనకు చక్కటి మేలు జరుగుతుంది.

38. ఓం నమః కూప్యాయ చావట్యాయ చ నమో
వీధ్ర్యాయ చాతప్యాయ చ ।
నమో మేధ్యాయ చ విద్యుతాయ చ నమో
వర్ష్యాయ చావర్ష్యాయ చ ॥ – యజు. 16.38

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! నాయకులారా! **'కూప్యాయ చ ఆవట్యాయ చ'** – మీరు కేవలం సైనికులకే కాదు, దేశంలోని అన్ని ప్రాణులకు కూడా నమః. బావులలో నుండు ప్రాణులకు, గోతులలో నుండు ప్రాణులకు కూడా నమః – హాని కలిగించవద్దు. అంటే మన జీవనశైలి ఆవిధంగా ఉండాలి. నేడు తటాకాదులలోకి హానికారక రసాయనాలను వదులుతున్నారు. అందలి జీవరాశులకు హాని కలిగిస్తున్నారు. తద్వారా పర్యావరణానికి ప్రాణులకు పెనుముప్పు కలుగుచున్నది. కనుక ఇచట నమః అంటే మనం చేస్తున్న తప్పులను సరిచేసుకోవటం అని గ్రహించాలి.

"వీధ్రాయ చ ఆతప్యాయ చ నమః" దేశంలో వివిధ ప్రదేశాలలో నుండు వివిధ వృత్తుల వారి ఆరోగ్యరక్షణకు కృషి చెయ్యాలి. కొందరు మండుటెండలో పనిచేసేవారైతే, మరికొందరు అతిశీతల ప్రదేశాలలో పని చేస్తుంటారు. వారందరికి వారికి తగిన జాగ్రత్తలు ఔషధాలు తెలిపి లేదా వాటిని ఇచ్చి రక్షించాలి. బొగ్గు గనులలో, రసాయన కర్మాగారాలలో పనిచేసేవారిని కూడా రక్షించాలి. **"మేధ్యాయ చ విద్యుత్యాయ చ నమః** – మేఘాల విద్య (వాతావరణ విద్య) నెరిగిన వారిని, విద్యుత్ నెరిగినవారిని ఆదరించాలి. **"వర్ష్యాయ చ అవర్ష్యా చ"** – వర్షపాతం ఎక్కువగా ఉండు ప్రాంతాలవారికి, అరుదుగా వర్షాలు కురిసే ప్రాంతాల వారికి తగిన జాగ్రత్తలు తెలిపి ఆదరించాలి. తగిన సహాయక చర్యలు చేయాలి.

39. ఓం నమో వాత్యాయ చ రేష్మ్యాయ చ నమో
వాస్తవ్యాయ చ వాస్తు పాయ ।
చ నమః సోమాయ చ రుద్రాయ
చ నమస్తామ్రాయ చారుణాయ చ ॥ – యజు. 16.39

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజా పాలకులారా! **నమో వాత్యాయ చ రేష్మ్యాయ చ –** వాయు విద్యల నెఱుగువారిని, శత్రువుల పీచమణుచు వీరులనూ సత్కరించండి. **నమో వాస్తవ్యాయ చ వాస్తుపాయ చ –** వాస్తువిద్యల నెఱుగువారిని (Civil Engineersని) వారి నిర్మాణాలను చక్కగా కాపాడువారిని ఆదరించండి. **నమః సోమాయ చ రుద్రాయ చ –** మిక్కిలి ధనవంతులను, దుష్టుల నేడ్పించు రౌద్రం కలవారిని సత్కరించండి. **నమః తామ్రాయ చ అరుణాయ చ –** అన్యాయ అధర్మాలు ఎక్కడున్నా వెంటనే ఎదిరించు / ఖండించువారిని శ్రేష్ఠ పదార్థాలను వస్తువులను సేకరించువారిని కూడా సత్కరించాలి.

40. ఓం **నమః శఙ్గవే చ పశుపతయే చ నమఉ ఉగ్రాయ చ**
భీమాయ చ నమోఽ గ్రేబధాయ
దూరేబధాయ చ నమో హన్త్రే చ
హనీయసే చ నమో వృక్షేభ్యో
హరికేశేభ్యో నమస్తారాయ ॥ – యజు. 16.40

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజా పాలకులారా! **నమః శఙ్గవే చ పశుపతయే చ –** ఇంద్రియాలను నిగ్రహించుకొని సాత్త్విక సుఖాలను పొందువారిని గవాది పశువులను రక్షించువారిని సత్కరించండి. **నమ ఉగ్రాయ చ భీమాయ చ –** శౌర్య పరాక్రమాది గుణములు గల ఓజస్వంతులను శత్రువుల పాలిట భయంకరులను మీరు సత్కరించండి. గౌరవించండి. **నమః ఉగ్రే బధాయ చ దూరే బధాయ చ –** సేనలో ముందుండి శత్రువులను వధించు వీరాగ్రేసరులను, దూరంగా ఉన్న శత్రువులను కూడా వేగంగా వెళ్ళి పట్టి బంధించు లేదా వధించు శూరులను గొప్పగా సత్కరించండి. **నమః హన్త్రే చ హనీయసే చ –** దుష్ట సంహారకులను, దుష్టతను నిర్మూలించువారిని కూడా సత్కరించాలి. **నమః వృక్షేభ్యః హరి కేశేభ్యః –** శత్రువుల గుండెలను చీల్చు వీరులను, ప్రజల దుఃఖాలను హరించు సంఘ సంస్కర్తలను కూడా మీరు సత్కరించాలి. **నమః తారాయ –** వేదోపదేశాలతో భక్తులను తరింపజేయు ధర్మోపదేశకులను మీరు విశేషంగా సత్కరించండి.

41. ఓం **నమః శమ్భవాయ చ మయోభవాయ చ నమః శఙ్కరాయచ ।**
మయస్కరాయ చ నమః శివాయ చ శివతరాయ చ ॥

– యజు. 16.41

సృష్టికర్త సందేశం: సంధ్యా ప్రకరణంలో **నమః శమ్భవాయ చ మయోభవాయ చ –** సుఖ స్వరూపుడైన అంతర్యామికి నమస్సులు. సర్వోత్తమ సుఖప్రదాత యగు పరమాత్మకు నమస్కారములు. **నమః శంకరాయ చ మయస్కరాయ చ –** అందరికి మేలు చేయు సర్వాంతర్యామికి నమస్సులు. స్వభక్తులను సుఖకర కార్యాలలో ప్రేరేపించు దేవదేవునకు వందనములు. **నమ శివాయ చ శివతరాయ చ –** మంగళ స్వరూపునకు, మోక్ష ప్రదాతకు శత సహస్ర వందనములు.

వ్యావహారిక ప్రకరణములో – **నమః శమ్భవాయ చ మయోభవాయ చ –** మానవులు సుఖప్రాప్తికి హేతువుగ రాజులను, ప్రజా పాలకులను వేదోపదేశకులకు నమః – తగిన విధంగా గౌరవించాలి. సత్కరించాలి. **నమః శంకరాయ చ మయస్కరాయ చ –** ఏ రాజులు, పాలకులు దేశప్రజలను సుఖశాంతులు పొందు సత్కార్యాలలో ప్రేరేపించుచు, ప్రోత్సహించుతారో అట్టి రాజులను, నాయకులను నమః – గౌరవించాలి. సత్కరించాలి. **నమః శివాయ చ శివతరాయ చ –** మంగళకారులను, అత్యంత సుఖకారక మోక్షానందాన్ని పొంద ప్రేరేపించు సాధు, సంతులను, యోగులను సత్కరించి వారి ఉపదేశాలను అనుసరిస్తారో వారు బ్రహ్మానందాన్ని పొందుతారు.

భావార్థం: మానవులు స్తుతి ప్రార్థనోపాసనలలో కేవలం సర్వాంతర్యామినే ఉపాసించాలి. వ్యవహారంలో ఉత్తమ సైన్యాధ్యక్షులను, వీరులను సత్కరించాలి. అలా చేస్తే సర్వకార్యాలు సఫలమవుతాయి.

42. ఓం **నమః పార్యాయ చావార్యాయ చ నమః**
ప్రతరణాయ చోత్తరణాయ చ ।
నమస్తీర్థ్యాయ చ కూల్యాయ చ నమః
శష్ప్యాయ చ ఫేన్యాయ చ ॥ – యజు. 16.42

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజానాయకులారా! **నమః పార్యాయ చ అవార్యాయ చ –** దేశంలో కొందరు కష్టాల కడలి నుండి గట్టెక్కి ఆవలి ఒడ్డుకు చేరినవారుంటారు. మరికొందరు ఈవలి ఒడ్డుననే కష్టాలలో మునిగి

ఉంటారు. వీరిద్దరికి కూడా తగిన సాయం చెయ్యాలి. **నమః ప్రతరణాయ చ ఉత్తరణాయ చ –** కొన్ని నదులను దాటటానికి నావలే ఆధారంగా వుంటాయి. అట్టిచోట్ల ఇరువైపులా ఉన్నవారికి తగిన సదుపాయాలను ఇచ్చి ఆదుకోవాలి. **నమః తీర్థ్యాయ చ కూల్యాయ చ –** వేద విద్యలనభ్యసించు బ్రహ్మచారులకు, స్నాతకులై ఆయా విద్యలందు ప్రవీణులైనవారికి అన్నాది అవసరాలను తీర్చి సాయపడాలి. **నమః శష్ప్యాయ చ ఫేన్యాయ చ –** కొందరు బంజరు భూములను సాగులోనికి తీసుకువచ్చే పనిలో ఉంటారు. మరికొందరు పంటల దిగుబడులను పెంచే ప్రవీణులై ఉంటారు. అట్టి వారందరికి పాలకులు చేయూత నిచ్చి ఆదుకోవాలి.

(మహర్షి వ్రాసిన భావార్థం: మానవులు పెద్ద పెద్ద ఓడలను నిర్మించి దేశ దేశాంతరములకు ద్వీపాంతరాలకు వెడుతూ వ్యాపారాదుల ద్వారా దేశ సంపదను వృద్ధి చేయవలెను.)

43. ఓం నమః సికత్యాయ చ ప్రవాహ్యాయ చ నమః
కిం శిలాయ చ క్షయణాయ చ నమః ।
కపర్దినే చ పులస్తయే చ నమ॒ ఇరిణ్యాయ
చ ప్రపథ్యాయ చ ॥ – యజు. 16.43

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజా పాలకులారా! **నమః సికిత్యాయ చ ప్రవాహ్యాయ చ –** ఇసుక మట్టినుండి బంగారము మొదలగు లోహములను వేరుచేయు నిపుణులను కూడా ఆదరించండి. ప్రవాహాల ద్వారా కొట్టుకొని వచ్చు ఒండ్రు, ఇసుక మొదలగు పదార్థాలను వేరుచేసి వాటితో ఇటుకలు, పెంకులు మొదలగు వస్తువులను తయారుచేయు నిపుణులను కూడా ఆదరించండి. **నమః కిం శిలాయ చ క్షయణాయ చ –** రాతి శిల్పులను, గృహాది నిర్మాణాల నిపుణులను ఆదరించండి. **నమః కపర్దినే చ పులస్తయే చ –** శంఖములు, ముత్యపు చిప్పలు మొదలగు వాటిని సేకరించి వాటితో మందులను వస్తువులను తయారుచేయు నిపుణులను బరువైన పెద్ద పెద్ద వస్తువులను ఒకచోట నుండి మరొకచోటికి తరలించు క్రేనులు మొదలగు వాటితో పనిచేయు నిపుణులను ఆదరించండి. **నమః ఇరిణ్యాయ చ ప్రపథ్యాయ చ –** ఊసర క్షేత్రాలను (బంజరు భూములను)

ఊర్వర క్షేత్రాలుగా (పంట భూములుగా) మలచగల నిపుణులను మీరు ఆదరించి సత్కరించండి. అట్లే పేద అనాథ బాల బాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దు సమాజ సేవాప్రియులను కూడా సత్కరించండి. అప్పుడే మీరు సర్వజన ప్రియులౌతారు.

(మహర్షి భావార్థం: మేము విజ్ఞానము వాటివల్ల ఉత్పన్నమైన గోగ్రాసాలను వివిధ పంటల విజ్ఞానము పెంచుకొని పుష్కలమైన భోగాలను పొందాలి.)

44. ఓం నమో బ్రజ్యాయ చ గోష్ఠ్యాయ చ
నమస్తల్ప్యాయ చ గేహ్యాయ చ ।
నమో హృదయ్యాయ చ నివేష్యాయ చ నమః
కాట్యాయ చ గహ్వరేష్ఠాయ చ ॥ – యజు. 16.44

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజా పాలకులారా! పౌరులారా! **నమో బ్రజ్యాయ చ గోష్ఠ్యాయ చ** – ఉత్తమ గోపాలకులును, విశాలమైన గోశాలలు నిర్మించి గోరక్షణ చేయువారిని మీరు ఆదరించి సత్కరించండి. **నమః తల్ప్యాయ చ గేహ్యాయ చ** – చక్కటి తల్పములు (పరుపులు) హంస తూలికా తల్పాదులను నిర్మించుటలో నేర్పరులను, చక్కటి శయనాగారాలు నిర్మించు నిపుణులను కూడా మీరు సత్కరించండి. **నమో హదయ్యాయ చ నివేష్యాయ చ** – హృదయానికి ఆహ్లాదమును కలిగించు సంగీత సాధనములను నిర్మించు నిపుణులను ఉత్తమ దర్జీలను (దుస్తులు కుట్టే నిపుణులను) కూడా మీరు ఆదరించాలి. **నమః కాట్యాయ చ గహ్వరేష్టాయ చ** – బావులు, దిగుడు బావులు, కోనేరులు మొదలగు వాటిని నిర్మించు నిపుణులను, పెద్ద పెద్ద జలాశయాలు నిర్మించు నిపుణులను కూడా ఆదరించి సత్కరించాలి. (మేఘాల ద్వారా లభించు శుద్ధ జలాలను బాగా పొందుపరిచి ఆ నీటిని మానవులకు పశువులకు వ్యవసాయాదులకు వినియోగించాలని భావము.)

45. ఓం నమ శుష్క్యాయ చ హరిత్యాయ చ నమః పా సవ్యాయ చ
రజస్యాయ చ నమో లోప్యాయ చోలప్యాయ చ
నమ ఉ ఊర్వ్యాయ చ సూర్మ్యాయ చ ॥ – యజు. 16.45

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజాపాలకులారా! ఆర్యులారా! **నమః శుష్క్యాయ చ హరిత్యాయ చ –** ఎడారి భూములందు, వర్షాధార భూములందుండు వారిని మరియు ఎండిన ఖర్జూరం, ద్రాక్ష మొ॥ పండ్ల వ్యాపారులను ఆదరించండి. వారి వారి అవసరాలను గుర్తించి సహాయపడండి. **నమః పాంసవ్యాయ చ రజస్యాయ చ –** ధూళి దూసరాలలో పనిచేయువారిని, దూర దూర ప్రాంతాలలో నుండువారిని కూడా ఆదరించండి. **నమః లోప్యాయ చ ఉలప్యాయ చ –** పంటలను కోయువారిని అరటి, చెరకు మొదలగు వాటిని ఛేదించువారిని, కాయ పప్పుధాన్యాలను పండిన తర్వాత నూర్చి ఆరబోయువారిని కూడా ఆదరించండి. **నమః ఊర్వ్యాయ చ సూర్వ్యాయ చ –** విశాల భూస్వాములను (ఊర్వా భూమౌ భవ) మరియు ఎంతోమందికి ఉపాధిని కలిపించు భూస్వాములను కూడా సత్కరించండి.

(మహర్షి భావార్థం: శుష్కింపజేయు వేడిగాలులను మరియు చిగురింపజేయు వసంత ఋతుగాలులను చక్కగా అధ్యయనం చేసి వాటివల్ల తమ తమ కార్యాలను సిద్ధింప జేసుకోవాలి.)

**46. ఓం నమః పర్ణాయ చ పర్ణశదాయ చ నమ౨ ఉద్గురమాణాయ చాభిఘ్నతే చ నమ౨ ఆఖిదతే చ ప్రఖిదతే చ
నమ౨ ఇషుకృద్భ్యో ధనుష్కృద్భ్యశ్చ్వో నమో నమో వః
కిరికేభ్యో దేవానా హృదయేభ్యో నమో విచిన్వత్కేభ్యో నమో
విక్షిణతేభ్యో నమ౨ ఆనిర్హతేభ్యః ॥** – యజు. 16.46

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజా పాలకులారా! పౌరులారా! **నమః పర్ణాయ చ పర్ణశదాయ చ –** సోమలతాది పత్రముల వ్యాపారము చేయువారిని, పత్రములను సేకరించి తెచ్చువారిని మీరు ఆదరించండి. **నమ ఉద్గురమాణాయ చ అభిఘ్నతే చ –** కట్టెల మోపులను మోయువారిని, కట్టెలు కొట్టువారిని కూడా ఆదరించండి. **నమః అఖిదతే చ ప్రఖిదతే చ –** నిర్ధనులకు అతి దరిద్రులకు అన్న ఔషధాలను ఇచ్చి ఆదుకోండి. **నమః ఇషుకృద్భ్యః ధనుష్కృద్భ్యః చ –** బాణాలను ధనుస్సులను నిర్మించువారిని చక్కగా పోషించాలి. **నమః వః కిరికేభ్యః –** శరాదులను ప్రయోగించు నిపుణులను కూడా ఆదరించాలి. గౌరవించాలి. **నమః దేవానాం**

హృదయేభ్యః – మీరంతా విద్వాంసులను సత్కరిస్తూ వారికి ప్రియులు కావాలి.

"విచిన్వత్కేభ్యో నమో విక్షిణత్కేభ్యో నమ ఆనిర్హతేభ్యః" – విజయులై తిరిగి వచ్చి వీరులను సత్కరించండి. మరియు ఏ కారణం చేతనైనా పరాజయం పొంది తిరిగివచ్చిన వారిని కూడా ఆదరించండి. వారిని కించపరచవద్దు. వారిని ప్రోత్సహించి మరొక యుద్ధానికి పంపండి.

(మహర్షి భావార్థం: సకల ఔషధాలను, వానిలోని ఉత్తమ పదార్థాలను గ్రహించి వాటితో మనుష్యాది ప్రాణులన్నిటికి చికిత్స చేసి అందరిని ఆదరించాలి.)

47. ఓం **ద్రాపేఽ అన్ధసస్పతే దరిద్ర నీలలోహిత ।**
ఆసాం ప్రజానామేషాం
పశూనాం మా భేర్మారోఙ్మో
చ నః కిం చనామమత్ ॥ – యజు. 16.47

సృష్టికర్త సందేశం: ఓ రాజా! ప్రజా పాలకులారా! **ద్రాపే అన్సస్పతే దరిద్ర నీలలోహిత** – మేము నిందనీయ మార్గములోనికి పోకుండా మమ్ము రక్షించు. ఓ అన్నపతీ స్వామీ! మమ్ము అన్నంలేని దరిద్రులం కాకుండా రక్షించు. కరువు సమయాలలో మాకు నీ ధాన్యాగారం నుండి అన్నభాగాలను పంచు. **ఆసాం ప్రజానామేషాం పశూనాం** – మమ్ము మా సంతానాన్ని, గవాది పశువులను కూడా రక్షించు. మేము వేటికి భయపడకుండా, రోగులము కాకుండా రక్షించు.

వివరణ: పూర్వం రాజులు ప్రజలు పండించిన పంటలనుండి 8వ వంతు పన్నుగా తీసుకుని, దానిని ధాన్యాగారాలలో దాచేవారు. అవసరమైనప్పుడు వాటిని తిరిగి ప్రజలకే పంపిణి చేసేవారు. ఎక్కువైన వాటిని విదేశాలకు ఎగుమతి చేసి ఆ డబ్బుతో ఇక్కడ లేనివాటిని దిగుమతి చేసుకునేవారు. ఇంకా అవసరమైన ఔషధాలు మొదలగు వాటిని తెప్పించేవారు. ఆ బాధ్యతను పై మంత్రము గుర్తు చేస్తున్నది.

నీలలోహిత అంటే కంఠముపై నీలమణులను, దేహముపై తామ్ర వర్ణము గల మణులను ధరించిన ఓ రాజా అని అర్థం. వివిధ విద్యలను నేర్చిన మధుర కంఠస్వరము కలిగినవాడా అని అర్థం వస్తుంది అంటారు కొందరు విద్వాంసులు.

(మహర్షి భావార్థం: ధనాఢ్యులు దరిద్రులను ఆదుకోవాలి. రాజు, రాజ పురుషులు ప్రజలను, పశువులను ఎన్నటికీ చంపకూడదు. ఆకలి రోగాలతో ఎవరూ చావకూడదు. అప్పుడే అందరికి సుఖము పెంపొందగలదు.)

48. ఓం **ఇమా రుద్రాయ తవసే కపర్దినే**
క్షయద్వీరాయ ప్ర భరామహే మతీః ।
యథా శమసద్ద్విపదే చతుష్పదే
విశ్వం పుష్టం గ్రామేఽ అస్మిన్ననాతురమ్ ॥

– యజు. 16.48

సృష్టికర్త సందేశం: ఓ రాజా! మంత్రులారా! ప్రజాపాలకులారా! వీరులారా! **ఇమా రుద్రాయ తవసే కపర్దినే –** మీ దేశ సైన్యంలో రుద్రులుండాలి. శత్రు నిరోధకులు, శత్రు భయంకరులైన వీరులుండాలి. అట్లే మీ దేశంలో జ్ఞానాన్ని, వివేకాన్ని పెంచే విద్వాంసులు రోగాది దుఃఖాలను పోగొట్టే వైద్యులు, సాంకేతిక నిపుణులుండాలి. **యథాశమ సద్ద్విపదే చతుష్పదే –** ద్విపాదములు, చతుష్పాదలు ఐన మనుష్య, పక్ష్యాదులకు, గవాది పశువులకు మేలు చేసే వారుండాలి. **విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ అనాతురమ్ –** సమస్త గ్రామాలు, పట్టణాలు, సుఖంగా, సంతోషంగా, రోగరహితంగా, బలవీర్యాదులతో ఉండాలి. మీదేశం ఆదర్శదేశంగా ఉండాలి.

49. ఓం **యా తే రుద్ర శివా తనూః శివా విశ్వాహా భేషజీ ।**
శివా రుతస్య భేషజీ తయా నో మృడ జీవసే ॥

– యజు. 16.49

సృష్టికర్త సందేశం: ఓ రాజా! ప్రజాపాలకా! ప్రజల దుఃఖాలను దూరం చేయు నీ తనువు నీ అద్భుతమైన పాలనా వ్యవస్థ దేశవాసులకు విశ్వభేషజం కావాలి. అన్ని రకాల రోగాలను దుఃఖాలను పోగొట్టేది కావాలి. **శివా రుతస్యభేషజీ –** రోగులకు ప్రజలకు సుఖాన్నిచ్చేది కావాలి. విశేష సుఖాలను పెంచేది కావాలి.

(మహర్షి భావార్థం: రాజు, వైద్యులు, విద్వాంసులు, మేధావులు ప్రజలను రక్షించేవారు కావాలి. ప్రజలకు మూలికా జ్ఞానాన్ని నేర్పాలి. చేతివృత్తుల వారికి

ఆయా వృత్తుల పరిజ్ఞానాన్ని పెంపొందించాలి. సైనికులకు రకరకాల ఆయుధ పరిజ్ఞానం నేర్పాలి. ప్రజలను ప్రసన్నులను చేయాలి.)

50. ఓం పరి నో రుద్రస్య హేతిర్వృణక్తు
పరి త్వేషస్య దుర్మతిరఘాయోః ।
అవ స్థిరా మఘవద్భ్యస్తనుష్వ
మీఢ్వస్తోకాయ తనయాయ మృడ ॥ – యజు. 16.50

సృష్టికర్త సందేశం: ఓ రుద్ర పరమేశ్వరా! మా రాజులు పాలకులు నీవంటి రుద్రులనుగా చేయగోరుచున్నాము. మేము అట్టి మా రాజు ఏర్పరచిన వజ్రతుల్య దండనీతికి భయపడుచు పాపములు అన్యాయములు చేయకుందుము గాక! మా పాలకులు మమ్ము దుష్టుల బారిన పడి దుఃఖాల పాలిట పడకుండా రక్షింతురు గాక! మేము దుష్ట సాంగత్యమున పడకుండా సుసాంగత్యము చేయుదుము గాక! మాలోని పిన్న వయస్కులవారు – బాల బాలికలు మరియు తనయులు – కుమారీ కుమారులు కూడా మమ్ము అనుసరిస్తూ సత్సంగాదులలో గడుపుదురు గాక! ఓ రుద్ర పరమేశ్వరా! మమ్ము నిరంతరము సుఖవంతులను చేయుము.

51. ఓం మీఢుష్టమ శివతమ శివో నః సుమనా భవ ।
పరమే వృక్షఽ ఆయుధం నిధాయ
కృతిం వసానఽ ఆ చరపినాకమ్బిభ్రదా గహి ॥

– యజు. 16.51

సృష్టికర్త సందేశం: ఓ రుద్ర పరమేశ్వరా! **మీఢుష్టమ శివతమ శివో నః సుమనా భవ** – నీ కృప వలన మా రాజులు, పాలకులు నీవంటి రుద్రులే అగుదురు గాక! వారు అత్యంత పరాక్రమవంతులు, అందరి మేలు కోరువారు అగుదురు గాక! వారు సదా సుమనస్కులై మమ్ము కన్నబిడ్డలవలె పాలింతురు గాక! **పరమే వృక్ష ఆయుధమ్ + నిధాయ** – వారు ఖడ్గాలు, బళ్ళెలు, ధనుస్సులు (తుపాకులు, ఫిరంగులు, శతఘ్నులు) మొదలగు ఆయుధాలు ధరించి మాపై దండయాత్రకు వచ్చు శత్రువులను సంహరింతురు గాక! **కృత్తిం వసాన ఆచర పినాకం భిభ్రత్ + ఆగహి** – మృగ చర్మాలతో నిర్మింపబడిన కవచాలను ధరించి ఆయుధాలతో వచ్చి శత్రుసేనలను వధింతురు గాక! మమ్ము రక్షింతురు గాక!

(వివరణ: కొందరు ఆచార్యులు ఈ మంత్రానికి మేఘాలు వర్షించు పరంగా అర్థం వ్రాసారు. గుడ్డపీలికలవలె నుండు చిన్న చిన్న మేఘాలు ఒకటై ఒక పెద్ద నల్లని మేఘమై వర్షించి ప్రజలకు ఆనందాన్ని కలిగించు విజ్ఞానం ఈ మంత్రంలో ఉందన్నారు.)

52. ఓం వికిరిద్ర విలోహిత నమస్తేఽ అస్తు భగవః ।
యాస్తే సహస్ర హేతయోఽ న్యమస్మన్ని వపన్తు తాః ॥

– యజు. 16.52

సృష్టికర్త సందేశం: ఓ రాజులారా! ప్రజా పాలకులారా! శత్రువులపై విశేషంగా బాణాల వర్షాలను కురిపించండి. ఓ (భగవః) ఆయుధ ఐశ్వర్య సంపన్నులారా! (నమస్తే అస్తు) మీకు నమస్సులు, సత్కారములు. మీ అసంఖ్యాక శస్త్రాస్త్రములు ఏవి కలవో అవి మాపైకాక మా శత్రువులపై పడునుగాక! మాపై నీ దయావర్షమును కురిపించ ప్రార్థన.

53. ఓం సహస్రాణి సహస్రశో బాహ్వోస్తవ హేతయః ।
తాసామీశానో భగవః పరాచీనా ముఖా కృధి ॥

– యజు. 16.53

సృష్టికర్త సందేశం: ఓ రాజా! సభాపతీ! నీ బాహువుల నుండి అసంఖ్యాక శస్త్రాస్త్రములు శత్రువులపై పడును గాక! శత్రువులు సమూలంగా నశింతురు గాక! ప్రజలమైన మేము సదా నీ రక్షణను కోరుచున్నాము.

(మహర్షి భావార్థము: రాజ పురుషులు బాహుబలంతో రాజ్యాన్ని పొంది అసంఖ్యాక శూరవీరులను సేనయందు చేర్చాలి. అనేక రకాల ఆయుధాలను వారికివ్వాలి, వాటితో శత్రువులను పారద్రోలాలి.)

54. ఓం అసంఖ్యాతా సహస్రాణి యే రుద్రాఽ అధి భూమ్యామ్ ।
తేషా సహస్రయోజనేఽ వ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.54

సృష్టికర్త సందేశం: ఓ రాజా! సభాపతీ! నీ సేనలో అసంఖ్యాక రుద్రులుండాలి. రౌద్రం కలిగిన సైనికులుండాలి. వారు నీ రాజ్యాన్ని విస్తరింపజేస్తూ

ఈ భూమినంతా ఆక్రమించాలి. నీవు ఏకైక ఛత్రపతివై విరాజిల్లాలి. ఆర్య సార్వభౌమ చక్రవర్తి రాజ్యమేర్పడాలి. అప్పుడే రాజనైతిక సమస్యలన్నీ సమసిపోతాయి. ప్రజలు సుఖ సంతోషాలతో భోగభాగ్యాలతో వర్ధిల్లగలరు.

55. ఓం అస్మిన్ మహత్యర్ణవేఽన్తరిక్షే భవాఽఅధి ।
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.55

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! విద్వాంసులారా! ప్రజా పాలకులారా! ఈ భూమిపై జల సముద్రం ఉన్నట్లే అంతరిక్షంలోనూ ఒకపెద్ద జల సముద్రం ఉంది. అది భూమిపైనున్న నీటివలె కాక మేఘాల రూపంలోనూ, నీటియావిరి రూపంలోనూ, తేమరూపంలోనూ ఉంది. అంతరిక్షంలో వీచుగాలులలోను అనేక రుద్రులున్నారు. అంటే ప్రాణులు జీవులు ఉన్నారు. ఆ గాలులు కూడా ఎన్నో రకాలుగా వున్నాయి. దాని వైశాల్యం అసంఖ్యాక యోజనాలు. వాటి విజ్ఞానాన్ని పొంది మీరు ఎన్నెన్నో సంపదలను పొందవచ్చును. ఆ విశాల అంతరిక్షం నుండి కూడా శత్రువులు మీపై దాడి చేయవచ్చును. కనుక మీ ధనుస్సులను (అంటే... సైన్యాన్ని) అంతరిక్షంలో కూడా విస్తరింపజేయండి. అందు సంచరించుచున్న పక్షి జాతులను కూడా రక్షించండి.

వివరణ: రుద్ర పదము 'రుది – రోదనే' అనే సంస్కృత మూల ధాతువుతో నిర్మింపబడింది. దుష్టులను రోదింపజేసి దారిలో పెట్టువారందరికి ఇది వర్తిస్తుంది. మన శరీరంలో కూడా ఏకాదశ రుద్రులున్నారు. ప్రాణాపాన వ్యానాది దశప్రాణాలు + జీవాత్మ కలిసి ఏకాదశ రుద్రులౌతాయి. ఇట్టి ఏకాదశ రుద్రులు ప్రాణులన్నింటిలోనూ ఉంటాయి. కనుక పై మంత్రాలలో అనేక రుద్రులని చెప్పబడింది. వివరాలకు సత్యార్థ ప్రకాశము సప్త సముల్లాసములో చూడగోరుచున్నాను.

56. ఓం నీలగ్రీవాః శితికణ్ఠా దివ రుద్రాఽఉపశ్రితాః ।
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.56

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! విద్వాంసులారా! వీరులారా! అంతరిక్షంలో ఎగిరే పక్షులు కొన్ని నీలకంఠము కలవి, కొన్ని శ్వేతవర్ణము కలవి ఉంటాయి. అట్లే దివస్పతియైన సూర్యునిలోను సప్తవర్ణాలు ఉంటాయి. వాటి విజ్ఞానాన్ని మీరు పెంచుకొని అనేక లాభాలు పొందవచ్చును. సౌర విద్యుత్తును కూడా పొంది దానితో మరెన్నో లాభాలు పొందవచ్చును. ఈ లాభాలతోపాటు శత్రువులు ఆకాశమార్గంలోనూ దాడి చేయవచ్చును. మీరేర్పర్చుకున్న ఉపగ్రహ వ్యవస్థను విచ్ఛిన్నం చేయవచ్చును. కనుక మీ వాయుసేనను (Air Force) సహస్ర యోజనాల పర్యంతం విస్తృతం చేయాలి.

వివరణ: కొందరు విద్వాంసులు 'నీలగ్రీవా, శీతకణ్ఠా' అనే పదములకు అనేక భాషల నెరుగు విద్వాంసులని, చక్కని కంఠస్వరము కలవారని వ్యాఖ్యానించారు. అట్లునూ చేయవచ్చును.

(మహర్షి భావార్థం: అగ్ని వాయువులలోని విశేష గుణాలను అర్థం చేసుకొని ఆగ్నేయాది అస్త్రాలను నిర్మించుకొని శత్రు సంహారం చెయ్యాలి. పక్షుల సహాయంతో కొన్ని పనులు (ఉత్తర ప్రత్యుత్తరాలు మొ॥) నెరవేర్చుకోవాలి.)

పౌరాణికులు నీలగ్రీవః మొదలగు పదములు చూసి శివపురాణ వర్ణిత శివుని చర్చ వేదాలలోనే ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. కాని వేదం పలుమార్లు దేవుడు 'సర్వ వ్యాపకుడని, నిరాకారుడనీ, అకాయమ్, అవ్రణ అస్నావిరం' అనీ వర్ణిస్తుంది. పరస్పర విరుద్ధ విషయాలు వేదంలో ఉండవు. కనుక ఇట్టి వ్యాఖ్యానాలు భాష్యాలు సరియైనవి కావు. ఆలోచించండి.

57. ఓం నీలగ్రీవాః శితికణ్ఠాః శర్వా౽ అధః క్షమాచరాః ।
తేషా సహస్రయోజనే౽వ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.57

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! ఈ భూమిపై కొన్ని హానికారక క్రిములు, ప్రాణులు తిరుగాడుతూ ఉంటాయి. వాటిలో కొన్ని నీలిరంగు మెడలు కలవి, కొన్ని తెల్లటి గొంతులు కలవి ఉంటాయి. వాటిని మీరు గుర్తించి సంహరించండి. అట్లే శత్రువులు – తీవ్రవాదులు, దేశద్రోహులు మీ మార్గాలలో మందుపాతరలు

పెట్టి హాని కలిగించవచ్చు. కనుక మీరు జాగరూకులై మెలగండి. మీ సేనను సహస్ర యోజనముల పర్యంతం విస్తరించండి. అనేక రకాలుగా ఆలోచించి అందుకు తగిన గూఢాచారులను, కుక్కలు, పక్షులు మొదలగువాటిని నియమించండి. మన సైన్య కదలికలు గుర్తించే శత్రు గూఢాచారులు కూడా వుంటారు కనుక సదా మీరు జాగరూకులై మెలగండి.

58. ఓం **యే వృక్షేషు శష్పిఞ్జరా నీలగ్రీవా విలోహితాః ।**
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.58

భావార్థము: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! వృక్షాలలో సంచరిస్తూ ప్రజలకు హాని కలిగించు రకరకాల రంగులతో నుండు సర్పాదులను మీరు సంహరించండి. వాటిని సహస్ర యోజనాల దూరం వరకు పారద్రోలండి. శత్రువులు వాటిద్వారా కూడా మనకు హాని కలిగించవచ్చు. దాడి చేయవచ్చు. కనుక వేల కండ్లతో వాటిని కనిపెట్టి సంహరించండి. ప్రజలను రక్షించండి.

59. ఓం **యే భూతానా మధిపతయో విశిఖాసః కపర్దినః ।**
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.59

ప్రా: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! **యః + భూతానామ్ + అధిపతయః –** దేశంలోని అజ్ఞానాన్ని అభావాలను దూరం చేయటానికి సర్వభూత హితరతులై సంచరించు, విశిఖాసః కపర్దినః – శిఖారహితులైన సన్యాసులున్నారో మరియు శిఖాసహితులైన నైష్ఠిక బ్రహ్మచారులున్నారో అట్టివారందరిని మీరు సత్కరించండి. అతిథ్యమిచ్చి వారితో సత్సంగం చేయండి. వారి ఉపదేశాలను అనుసరించండి. అప్పుడే మీ రాజ్యము సహస్ర యోజనాల పర్యంతం విస్తరిస్తుంది. ఆర్య సార్వభౌమ చక్రవర్తి రాజ్యమేర్పడుతుంది.

60. ఓం **యే పథాం పథిరక్షయఽ ఐలబృదాఽ ఆయుర్యుధః ।**
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.60

ప్రా: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! ఏవిధంగా బాటలను, బాటసారులను రాజోద్యోగులు కాపాడుచుందురో, వ్యవసాయదారులు భూములను, పంటలను రక్షించుచుందురో ఆవిధంగా పాలకులు ప్రజలను రక్షించాలి. వారి రక్షణకు తగిన ఏర్పాట్లన్నీ చేయాలి. శత్రువులు అనేక మార్గాలలో దాడిచేయ యత్నిస్తారు. కావున రాజులు మార్గాలన్నింటిని రక్షించాలి. ప్రజలు ఆకలితో అలమటించకుండా అన్న సమృద్ధిని సాధించాలి.

61. ఓం యే తీర్థాని ప్రచరన్తి సృకాహస్తా నిషఙ్గిణః ।
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.61

ప్రా: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! తీర్థాలు అంటే తరింపచేసేవని అర్థం. ప్రజలను పాలకులు శత్రుదాడుల నుండి తరింపజేయుటకు వజ్రము వంటి ఆయుధములను హస్తములందు ధరించి కాపాడాలి. అట్లే, అంతః శత్రువులైన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనుండి ప్రజలను తరింపజేయుటకు విరివిగా ధర్మప్రచారం జరగాలి. అందుకు సన్యాసులు, నైష్ఠిక బ్రహ్మచారులు దేశ సంచారం చేస్తూ ధర్మోపదేశాలు చెయ్యాలి. ప్రజలలోని అజ్ఞానాన్ని, అవిద్యను పారద్రోలి వారిని పురుషార్థ పరులుగా, నైతికులుగా, ఆత్మజ్ఞానులుగా తీర్చిదిద్దాలి. అజ్ఞాన అభావం నుండి ప్రజలను కాపాడాలి. ఇట్టి రెండురకాల సైన్యాన్ని సహస్ర యోజనాల పర్యంతం విస్తరింపజేయాలి.

62. ఓం యేఽన్నేషు వివిధ్యన్తి పాత్రేషు పిబతో జనాన్ ।
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.62

ప్రా: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! శత్రువులు, సైనికులను ప్రజలను చంపుటకు వేలాది మార్గాలలో ప్రయత్నం చేస్తారు, కనుక మీరు అన్ని విధాలుగా జాగ్రత్త వహించండి. తినే ఆహారాలలోను, త్రాగే పానీయాలలోను విషాలను కలుపవచ్చును. లేదా హానికారక బ్యాక్టీరియా వైరస్‌లను కలుపవచ్చును. లేదా నెమ్మదిగా హాని కలిగించు రసాయనాలను కలుపవచ్చును. కనుక మీరు **తేషాం**

సహస్ర యోజనేఽవ ధన్వాని తన్మసి – సహస్ర యోజనాల పర్యంతం మీ సైన్యాలను విస్తరింపజేయండి. అంటే సహస్ర విధాల మీరు జాగ్రత్తలు పాటించండి, పరీక్షలు చేస్తూ ఉండండి.

63. ఓం యఽఏతావన్తశ్చ భూయా సశ్చ దిశో రుద్రా వితస్థిరే ।
తేషా సహస్రయోజనేఽవ ధన్వాని తన్మసి ॥

– యజు. 16.63

ప్రా: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! పైన పేర్కొన్న మార్గాలలోనే కాక మరెన్నో విధాల శత్రువులు మనకు హానిని కలిగించవచ్చు. కనుక అప్పటి దేశకాల పరిస్థితులనుబట్టి శత్రువుల దౌష్ట్యాన్నుండి దేశాన్ని రక్షించటానికి శతవిధాల యత్నించాలి. **తేషాం సహస్ర యోజనేఽవ ధన్వాని తన్మసి** – వేలకొలది యోజనాల పర్యంతం సైనిక శక్తులను మోహరించాలి. శత్రువుల ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సైన్యాన్ని ప్రజలను రక్షించాలి.

64. ఓం నమోఽస్తు రుద్రేభ్యో యే దివి యేషాం వర్షమిషవః ।
తేభ్యో దశ ప్రాచీర్దశ దక్షిణా దశ ప్రతీచీర్దశోదీచీర్దశోర్ధ్వాః ।
తేభ్యో నమోఽఅస్తుతే నోఽవన్తు తే నో మృడయన్తు తే
యం ద్విష్మో యశ్చ నో ద్వేష్టి తమేషాం జమ్భే దధ్మః ॥

– యజు. 16.64

ప్రా: ఎవరు ద్యులోకమందలి సూర్య ప్రకాశము వలె జ్ఞానోపదేశము చేస్తూ రుద్రులవలె – దుఃఖనాశకుల వలె ఉన్నారో అట్టి ఆదిత్య బ్రహ్మచారులకు మా అనేక నమఃస్సులు. వారిని మేము సత్కరింతుము గాక! వారు మాపై తమ జ్ఞాన వర్షాన్ని కురిపింతురు గాక! శత్రు మూకలను సంహరించుటకు తగిన మార్గదర్శనం చేయుదురు గాక! మా రాజులు, పాలకులు, సేనాపతులు, సైన్యం (ప్రాచీర్దశ) – దశవిధముల తూర్పు దిశనుండి, (దక్షిణా దిశ) దశ విధముల దక్షిణ దిశనుండి (ప్రతీచీర్దశ) – దశ విధముల పడమట దిశనుండి, (దశ ఉదీచ) – దశ విధముల ఉత్తర దిశనుండి, (దశ ఊర్ధ్వా) – దశ విధముల పైవైపునుండి మమ్ము రక్షింతురు గాక! (తేభ్యో నమో అస్తు తేనః అవన్తు) – అన్నివైపుల నుండి మమ్ము రక్షించు

సేనాపతులకు సైన్యానికి మా నమస్సులు. వారు మమ్ము చక్కగా రక్షింతురు గాక! (తేనః మృడయన్తు) – వారు మాకు విజయమును సుఖశాంతులను ప్రసాదింతురు గాక! (తేనః ద్విష్మ) – సామాజిక జీవనంలో ఎవరిని మేము ద్వేషిస్తున్నామో మరియు (యశ్చనోద్వేష్టి) – ఎవరు మమ్ము ద్వేషిస్తున్నారో (తమేషాం జంబే దధ్మః) – అట్టి మేమిరువురము మా ద్వేషాన్ని సర్వవ్యాపక సర్వేశ్వరుని బాహువులకు అర్పించుచున్నాము. మేమంతా పరస్పర ద్వేషరహితులమై పరస్పరం మిత్రులమై సామాజిక జీవనం గడుపుదుము గాక!

65. ఓం నమోఽస్తు రుద్రేభ్యో యేఽన్తరిక్షే యేషాం వాతఽఇషవః ।
తేభ్యో దశ ప్రాచీర్దశ దక్షిణాదశ ప్రతీచీర్దశోదీచీర్దశోర్ధ్వాః ।
తేభ్యోనమోఽఅస్తు తే నోఽవన్తు తే ఓ మృడయన్తు తే
యం ద్విష్మో యశ్చనో ద్వేష్టి తమేషాం జమ్భే దధ్మః ॥

– యజు. 16.65

సృష్టికర్త సందేశం: (నమోస్తు రుద్రేభ్యో యే అంతరిక్షే) = విమానాదులలో అంతరిక్షంలో సంచరిస్తూ శత్రు మూకలను సంహరించు రుద్రులకు మా నమస్సులు. (యేషాం వాత ఇషవః) వారు వాయువేగ సమానమైన బాణములను ఆయుధాలను ప్రయోగించి శత్రు మూకలను సంహరింతురు గాక! (తేభ్యో దశ ప్రాచీర్దశ... మిగిలిన ఈ మంత్ర భాగమునకు అర్థము పూర్వము (64వ) మంత్రములో వలెనేనని గ్రహించకోరుచున్నాను.

66. ఓం నమోఽస్తు రుద్రేభ్యో యే పృథివ్యాం యేషామన్నమిషవః ।
తేభ్యో దశ ప్రాచీర్దశ దక్షిణా దశ ప్రతీచీర్దశోదీచీర్దశోర్ధ్వాః ।
తేభ్యోనమోఽఅస్తుతే నోఽవన్తు తేనో మృడయన్తు తే
యం ద్విష్మో యశ్చనో ద్వేష్టి తమేషాం జమ్భే దధ్మః ॥

– యజు. 16.66

సృష్ఠికర్త సందేశం: (నమోఽస్తు రుద్రేభ్యో యే పృథివ్యాం) – ఈ విశాలమైన పృథివిపై రథములపై, అశ్వగజాదులపై విహరించుచుండు రాజులకు, సేనాపతులకు, వీరులకు మా నమస్సులు. వారు శత్రు సైన్యాలను సమూలంగా

సంహరింతురు గాక! (యేషామ్ అన్న మిషవః) – అన్నమే ఆహారాదుల వారి బాణములగును గాక! వాటితో వారు మరింత బలమును పొందుదురు గాక! ప్రజల పైనను అన్నము వర్షించును గాక! మిగిలిన మంత్రభాగమునకు 64వ మంత్రములో వలెనే గ్రహించ గోరుచున్నాము.

రుద్ర నమకం సంపూర్ణం... సమాప్తం

ఇతి షోడశోధ్యాయః

యజ్ఞ చమకం - విషయ ప్రవేశం

శుక్ల యజుర్వేదం

అష్టాదశోధ్యాయః (18వ అధ్యాయం)

ఈ 18వ అధ్యాయంలో మొదటి 29 మంత్రాలలో యజ్ఞం వల్ల కలిగే అనేకానేక ప్రయోజనాలు పేర్కొనబడ్డాయి. క్రమంగా మనం ఆ మంత్రాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాము. ఈ మంత్రాల చివర "యజ్ఞేన కల్పంతామ్" అనే వాక్యం మరల మరల వస్తుంది. అంటే యజ్ఞంవల్ల ఇవన్నీ సమర్థవంతములౌతాయని అర్థం. పంచ మహా యజ్ఞాలలో రెండవదియైన దేవయజ్ఞం అగ్నిహోత్రమే. ఆ అగ్నిహోత్రాన్ని విధిపూర్వకంగా శ్రద్ధాభక్తులతో చేస్తే ఆ ఫలితాలు మనకు కలుగుతాయన్నమాట. ఇచట యజ్ఞ పదము పరమేశ్వరునికి కూడా వర్తిస్తుంది. 'యజ్ఞ' ధాతువులో దేవపూజ, సంగతీకరణం, దానం అనే మూడు అర్థాలు ఉన్నాయి. ఈ మూడు అర్థాలు పరమేశ్వరునికిని వర్తిస్తాయి.

దేవతలలో అంటే దివ్యగుణాలు కలిగిన పదార్థాలలో దేవుడే మొట్టమొదట పేర్కొనదగిన దేవత. అతనిలో ఉన్నన్ని దివ్యగుణాలు మాతాపితలలో కాని, ఆచార్య అతిథి విద్వాంసులలో కాని ఉండవు. రెండవదైన సంగతి కరణం అంటే కలపటం. కేవలం మూడు రకాల ప్రకృతి పరమాణువులతో దేవుడు ఈ అద్భుతాద్భుతమైన సృష్టిని చేశాడు. ఇక మూడవదైన దానగుణం. దేవునిలో ఉన్నంత మానవమాత్రులెవ్వరిలోను ఉండదు కదా! కనుక దేవునికి యజ్ఞము అనే నామము (పేరు) ఉంది. వేదాలలోని పురుష సూక్తాలు ఈ విషయాన్నే ఘోషిస్తున్నాయి. సర్వ విద్యానిలయమైన వేదాలు కూడ అతని నుండే జనించినవి కదా!

ఈ మంత్రాలకు దేవాః ఋషయః దేవత – అగ్నిః

అంటే ఈ మంత్రాల అర్థాన్ని సమాధిస్థితులై దర్శించినవారు దేవాః (దేవతలు) దేవత – మంత్రాల విషయం అగ్నిః – అగ్నిహెూత్ర క్రియ.

1. ఓం వాజశ్చ మే ప్రసవశ్చ మే ప్రయతిశ్చ మే ప్రసితిశ్చ మే ధీతిశ్చ మే క్రతుశ్చ మే స్వరశ్చ మే
శ్లోకశ్చ మే శ్రవశ్చ మే శృతిశ్చ మే జ్యోతిశ్చ మే స్వశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.1

భావార్థము: సర్వవ్యాపక సర్వేశ్వరుని ధారణ ధ్యాన సమాధి రూప మానస యజ్ఞం ద్వారాను అగ్నిహెూత్రం ద్వారాను మరియు విధిపూర్వక దేవయజ్ఞం ద్వారాను (వాజశ్చ మే) నాకు పుష్కలమైన అన్నాది పదార్థాలు, తద్వారా కలుగు శక్తి సామర్థ్యాలు లభించును గాక. (ప్రసవశ్చ మే) ధర్మ పూర్వకంగా లభించే ఐశ్వర్యం పుష్కలంగా లభించును గాక. (ప్రయతిశ్చ మే) అందుకు తగిన పూర్ణ పురుషార్థం – పరిశ్రమను నేను చేయుదును గాక! లాటరీల వలన వచ్చే ధనం వద్దు అని అభిప్రాయం. (ప్రశితిశ్చ మే) ఆ ప్రయత్నం నిరంతరం నేను చేయుదును గాక. నేను సోమరిని కాకుందును గాక. విలాసాలవైపు పోకుందును గాక. (ప్రయతిశ్చ మే) నేను ఇంద్రియ నిగ్రహపరుడు అగుదును గాక. (పశితిశ్చ మే) నేను సదా వ్రతశీలుడ నగుదును గాక. ఏదో ఒక మంచి పని చేస్తూనే ఉందును గాక. (ధృతిశ్చ మే) నేను ధైర్యవంతుడనగుదును గాక, ధ్యాన శీలుడనగుదును గాక.

(క్రతుశ్చ మే) నేను జ్ఞాన వృద్ధుడనగుదును గాక. (శ్లోకశ్చ మే) నా కీర్తియు వృద్ధి చెందును గాక. (శృతిశ్చ మే) నా వినికిడి శక్తియు వృద్ధి చెందును గాక. వేదజ్ఞానము పెరుగును గాక. (జ్యోతిశ్చ మే) నాకు బ్రహ్మవర్చస్సు కలుగును గాక. (స్వశ్చ మే + స్వః చ మే) నాకు బ్రహ్మానందము లభించును గాక. సర్వేశ్వర సాక్షాత్కారం కలుగును గాక. నేను ముక్తిని పొందుదును గాక. (యజ్ఞేన కల్పంతామ్) యజ్ఞం వల్ల ఇవన్నీ సమర్థవంతములగును గాక.

నిత్యం బ్రహ్మయజ్ఞ, దేవయజ్ఞాలవల్ల సంధ్య అగ్నిహెూత్రాల వల్ల మనకు అట్టి చక్కని ప్రేరణ కలుగుతుంది. జీవనమార్గం తేటతెల్లం అవుతుంది.

2. ఓం ప్రాణశ్చ మేఽ పానశ్చ మే వ్యానశ్చ
మేఽ సుశ్చ మే చిత్త చ మఽ ఆధీతం చ మే
వాక్ చ మే మన శ్చ మే చక్షు శ్చ మే శ్రోత్రం
చ మే దక్షశ్చ మే బలం చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.2

భావార్థము: యజ్ఞస్వరూప పరమేశ్వరుని ఉపాసనతోను మరియు విధిపూర్వక అగ్నిహెూత్ర క్రియతోను (ప్రాణశ్చ మే అపానశ్చ మే) నాలోనికి జీవితాన్ని దక్షతను తీసికుని వచ్చు ప్రాణవాయువు మరియు మల మూత్రాది దోషాలను బయటకు త్రోసివేసే అపానవాయువు బలపడును గాక. తద్వారా నాకు ఆరోగ్యము, బలము, ఉత్సాహము లభించును గాక. (వ్యానశ్చ మే అసుశ్చ మే) శరీరావయవాలన్నింటికి ప్రాణవాయువును ఆహార రసాన్ని కొనిపోవు వ్యానవాయువు బలపడును గాక. అట్లే ఉదాన సమాన వాయువులు, ఉప ప్రాణాలైన నాగ, కూర్మ, కృకల, దేవదత్త, ధనుంజయ వాయువులు కూడా బలపడును గాక. (చిత్తం చ మే అధీతం చ మే) నా చిత్తము, బుద్ధి, స్మృతిశక్తి వర్ధిల్లును గాక. (వాక్ చ మే మానశ్చ మే) నా వాక్‌శక్తి, సంకల్పశక్తి బలపడును గాక. (చక్షుశ్చ మే బలం చ మే) నాలో దక్షత, మానసిక సామర్థ్యము, శారీరక బలము (యజ్ఞేన కల్పన్తామ్) యజ్ఞము ద్వారా సమర్థవంతమగును గాక.

3. ఓం ఓజ శ్చ మే సహశ్చ మఽ ఆత్మా చ మే
తనూశ్చ మే శర్మ చ మే
వర్మ చ మేఽ జ్గాని చ మేఽ స్థీని చ మే పరూషి చ మే
శరీరాణి చ మఽ ఆయుశ్చ మే జరా చమే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.3

భావార్థము: ఓ ఓజస్సు – శరీర తేజము, మనోబలము, ఆత్మజ్ఞానము, నా సామర్థ్యము, నా శరీరము, శరీరంతో సంధించిన శస్త్రాస్త్రాలు, శరీరాంగాలు ప్రత్యంగములు (మే అస్థీని) నా ఎముకలు, కండరములు అన్నీ (యజ్ఞేన కల్పంతామ్) సంధ్యోపాసన, అగ్నిహెూత్రాల వల్ల సమర్థవంతములగును గాక! మరియు (శరీరాణి చ మే ఆయుశ్చ మే జరా చ మే) నా సూక్ష్మ దేహాంగములు, నా ఆయువు జీవన

సాధనాలు అన్నియు వృద్ధిచెందును గాక. జరా - నా వృద్ధాప్యము కూడా ఆరోగ్యవంతమగును గాక.

4. ఓం జ్యైష్ఠ్యం చ మఽ ఆధిపత్యం చ మే మన్యుశ్చ మే భామశ్చ
మేఽ మశ్చ మేఽ మ్భశ్చ
మే జేమా చ మే మహిమా చ మే వరిమా చ మే ప్రథిమా చ
మే వర్షిమా చ మే
ద్రాఘిమా చ మే వృద్ధం చ మే వృద్ధిశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥
- యజు. 18.4

భావార్థము: నేనుచేయు సంధ్యాగ్ని హెూత్రాలవల్ల (జ్యేష్ఠ్యం చ మే ఆధిపత్యం చ మే) నా ప్రశంస పెరుగును గాక. మరియు ఉత్తమ పదార్థాలు వృద్ధి చెందును గాక. మరియు నాకు అధికారాలు, సంపదలు లభించును గాక. (మనుష్య చ మే భామశ్చ మే) నాకు అభిమానము, క్రోధము (మన్యువు), ఉత్తమ శీలము (భామ ఇతి క్రోధ నామ - నిఘంటువు 2.13) ప్రాప్తించును గాక! (అమ శ్చ మే అంబ శ్చ మే) నాకు లభించిన ఆస్తులు, జలాదులు - జలాశయాలు, దుగ్ధాదులు ప్రాప్తించును గాక. (అమ్బ ఇతి ఉదక నామ 1.12). (జామా చ మే మహిమా శ్చ మే) నా విజయాభిలాష మరియు విజయములు వృద్ధి చెందును గాక. మరియు నా ప్రతిష్ఠ పెరుగును గాక. (ప్రతి మా శ్చ మే వర్షిమా చ మే) నా విస్తరణ విస్తరించిన పదార్థాలు (వర్షిమా చ మే) బాల్య వృద్ధాప్యములు, (ద్రాఘి మా చ మే) నా దీర్ఘ హ్రసత్వాలు, మానావమానాలు సహించు శక్తి (మే వృద్ధమ్) బహు రూపములుగా నున్న నా ఆస్తులు మరియు స్వల్పముగా నున్న పదార్థాలు (యజ్ఞేన కల్పంతామ్) = నా ధర్మాచరణచే అవి సమర్థవంతములు అగును గాక. మరింతగా వృద్ధి చెందునుగాక.

5. ఓం సత్యం చ మే శ్రద్ధా చ మే జగచ్చ మే ధనం చ మే విశ్వం
చ మే మహశ్చ మే క్రీడా చ మే మోదశ్చ మే
జాతం చ మే జనిష్యమాణం చ మే సూక్తం చ మే
సుకృతం చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ - యజు. 18.5

భావార్థము: నేను నిత్యం శ్రద్ధతో చేసే సంధ్యాగ్ని హెూత్రాలవల్ల, ఉపాసన

వల్ల (సత్యం చ మే శ్రద్ధా చ మే) సత్యాన్ని గ్రహించి ఆదరించుట, ఎల్లరకు హితము చేసే భావన, తద్వారా నాలో శ్రద్ధ వృద్ధి చెందునుగాక. నా సంతానంలో యిట్టి భావాలు పెరుగును గాక! నా ధన ధాన్యాల మహోత్వము, క్రీడా మోదములు వృద్ధి చెందును గాక! నా పుట్టబోవు సంతానము, నాకు రాబోవు సంపదలు అన్ని నా ఆశయాల కొరకే అగును గాక! నా సూక్తులు, సుకృతాలు కూడా అందుకొరకే వినియోగపడును గాక! (యజ్ఞేన కల్పన్తామ్) ఇవన్నీ యజ్ఞ స్వరూప పరమాత్ముని ఉపాసన వల్లను, అతని వేదాజ్ఞలను ఆచరించుట వలన నాకు లభించును గాక!

6. ఓం ఋతం చ మేఽమృతం చ మేఽయక్ష్మం చ మేఽ
నామయచ్చమే
జీవాతుశ్చ మే దీర్ఘాయుత్వం చ మేఽ నమిత్రం చ మేఽ
భయం చ మే
సుఖం చ మే శయనం చ మే సూషాశ్చ మే సుదినం చ మే
యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.6

భావార్థము: నేను నిత్యం నియమంగా చేసే సంధ్యాగ్ని హెూత్రాల వల్ల (ఋతం చ మే అమృతం చ మే) నాకు యధార్థ జ్ఞానం సరియైన మార్గం లభించును గాక. ఆ మార్గంలో పయనించి నేను అమృతత్వాన్ని (ముక్తిని) పొందుదును గాక. అకాల మృత్యువు రాకుండా, దేవుడిచ్చిన పూర్ణాయువును అనుభవింతును గాక. (అయక్షం చ మే అనామయత చ మే) యక్ష్మాది కృశత్వ రోగాలు రాకుండును గాక. సామాన్య రోగాలు రాకుండును గాక. (జీవాతుశ్చ మే దీర్ఘాయుత్వం చ మే) అందుకు తగిన పథ్యకర భోజనమే నేను చేయుదునుగాక. నాకు దీర్ఘజీవనం ప్రాప్తించును గాక. (అనమిత్రం చ మే అభయశ్చ మే) నాకు అందరు మిత్రులే అగుదురు గాక. నిర్భయంగా జీవింతును గాక. (సుఖం చ మే శయనించ మే) సాత్విక సుఖాలన్నీ నేను పొందుదును గాక. చక్కటి నిద్ర వచ్చును గాక. (సుషాశ్చ మే సుదినం చ మే) దానితో నేను వేకువఝామునే మేల్కొని ప్రాతఃకాల ఉషస్సుల ఆనందమును అనుభవింతును గాక. దినమంతయు ఉత్సాహంగా గడుపుదును గాక. యజ్ఞాది సత్కర్మలను చేయుదును గాక. (యజ్ఞేన

కల్పన్తామ్) నాకివన్నీ సంధ్యాగ్ని హోత్రాలవల్ల సమర్థవంతములగును గాక.

7. ఓం యన్తా చ మే ధర్తా చ మే క్షేమశ్చ మే ధృతిశ్చ మే విశ్వం చ మే మహశ్చ మే సంవిచ్చ మే జ్ఞాత్రం చ మే సూశ్చ మే ప్రసూశ్చ మే సీరం చ మే
లయశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.7

భావార్థము: యజ్ఞ స్వరూప పరమాత్ముని ఉపాసన వల్ల (యన్తా చ మే ధర్తా చ మే) నేను ఇంద్రియ నిగ్రహపరుడను, స్థిత ప్రజ్ఞుడను అగుదును గాక. మరింత చక్కగా ధారణ ధ్యానములను చేయుదునుగాక. (క్షేమశ్చ మే ధృతిశ్చ మే) దానితో నాకు గొప్ప మేలు జరుగును గాక. ధైర్య సాహసాలు వృద్ధి చెందును గాక. (విశ్వం చ మే మహశ్చ మే) ఆ ధృతితో నేను విశ్వవ్యాపక పరమాత్మను పూజింతును గాక. విశ్వజనుల సంక్షేమం కొరకు యత్నింతును గాక. దానితో నాకు సత్కీర్తి లభించును గాక. (సం విచ్చ మే జ్ఞాత్రం చ మే) నాకు లోతైన వేదజ్ఞానం కలుగును గాక. విజ్ఞాన నేత్రం వికసించును గాక. (సూశ్చ మే ప్రసూశ్చ మే) నాకు చక్కటి ప్రేరణాశక్తి కలుగును గాక. నేను నా బంధుమిత్రులను ప్రేరేపింతును గాక. నాలో ఉత్పాదకశక్తియు పెరుగును గాక. వాటిలో నేను ఊసర క్షేత్రాలను ఊర్వర క్షేత్రాదులుగా చేయుదును గాక!

8. ఓం శం చ మే మయశ్చ మే ప్రియం చ మేऽ సుకామశ్చ మే కామశ్చ మే సౌమనసశ్చ మే భగశ్చ మే ద్రవిణం చ మే భద్రం చ మే
శ్రేయశ్చ మే వసీయశ్చ మే యశశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥
– యజు. 18.8

భావార్థము: నిత్య అగ్నిహోత్రం వల్ల నాకు

(1) శం చ మే మయశ్చ మే = ఐహిక ఆముష్మిక సుఖములు – ఇహపర లోక సుఖములు లభించును గాక!

(2) ప్రియం చ మే అనుకామశ్చ మే = నాకు ప్రియమైనవి మరియు ధర్మానుకూల కామములు ప్రాప్తించును గాక!

(3) కామశ్చ మే సౌమనసశ్చ మే = సాంసారిక సుఖము మరియు మానసిక ప్రసన్నత కలుగును గాక!

(4) భగశ్చ మే ద్రవిణం చ మే = నాకు సదా సౌభాగ్యము మరియు అందుకు అవసరమైన ధనము ప్రాప్తించును గాక!

(5) భద్రం చ మే శ్రేయశ్చ మే = నాకు అత్యంత ఆనందము నొసగు సుఖము మరియు ముక్తి సుఖము లభించును గాక!

(6) వసీయశ్చ మే యశశ్చ మే = వసించదగిన చక్కని గృహము మరియు కీర్తి ప్రతిష్ఠలు మాకు లభించును గాక!

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ మాకు నిత్య అగ్నిహోత్రం వల్ల లభించును గాక!

9. ఓం ఊర్క్ చ మే సూనృతా చ మే పయశ్చ మే
రసశ్చ మే ఘృతం చ మే
మధు చ మే సగ్ధిశ్చ మే సపీతిశ్చ మే కృషిశ్చ మే వృష్టిశ్చ మే
జైత్రం చ మ౾ ఔద్భిద్యం చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.9

భావార్థము: నేను శ్రద్ధతో చేయు సంధ్యాగ్ని హోత్రాలవల్ల

(1) ఊర్క్ చ మే సూనృతా చ మే = బాగుగా సంస్కరింపబడిన అన్న పానీయాదులు కూరగాయలు నాకు లభించును గాక!

(2) పయశ్చ మే రసశ్చ మే = చక్కటి పాలు రసవంతమైన ఫలాలు పుష్కలంగా లభించును గాక!

(3) ఘృతం చ మే మధు చ మే సగ్ధిశ్చ మే = మంచి తేనె, బెల్లము మొదలగు పదార్థములు లభించును గాక! వాటిని నేను ఒంటరిగానే కాక మరికొందరితో కలిసి భుజింతును గాక!

(4) సపీతి శ్చ మే కృషి శ్చ మే = నాకు భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలు అందుకు కావలసిన కృషికి సాధనాలు లభించును గాక!

(5) వృష్టి శ్చ మే జైత్రఇచ్ఛ మే = సమయానుకూల వర్షాలు నా జైత్రయాత్రలు.

(6) ఔద్భిద్యం చ మే = భూమిని చీల్చుకొని వచ్చు వృక్ష సంపద.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ నాకు పర్వ యజ్ఞాల ద్వారాను, విశేష యజ్ఞాల ద్వారాను లభించును గాక! మరియు అవి సమర్థవంతములు అగును గాక!

10. ఓం రయిశ్చ మే రాయశ్చ మే పుష్టం చ మే పుష్టిశ్చ మే విభు చ
మే ప్రభు చ మే పూర్ణం
చ మే పూర్ణతరం చ మే కుయవం చ మేఽ
క్షితం చ మేఽన్నం చ మేఽక్షుచ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥
– యజు. 18.10

భావార్థము: (1) రయిశ్చ మే రాయశ్చ మే = విద్యా ప్రకాశము, పురుషార్థము మరియు ప్రశంసిత ధనము, న్యాయార్జిత ధనము నాకు పుష్కలంగా లభించును గాక!

(2) పుష్టం చ మే పుష్టిశ్చ మే = పుష్టికర ఆహార పదార్థాలు నాకు పుష్కలంగా లభించును గాక. అవి నాకు చక్కగా జీర్ణమై నా శరీరానికి పుష్టి కలిగించును గాక!

(3) విభు చ మే ప్రభు చ మే = నాకు వ్యాపక సామర్థ్యము మరియు ప్రభావ శక్తి వృద్ధి చెందును గాక.

(4) పూర్ణం చ మే పూర్ణతరం చ మే = నాకు ధనము, పుత్రులు, గో, అశ్వాది పశువులు కూడా లభించి నేను పూర్ణతరుడను అగుదును గాక!

(5) కుయం చ మే అక్షితం చ మే = నా ధాన్యాగారాలు ఎంత దానము చేసినా తరుగనంతవిగా అగును గాక!

(6) అన్నం చ మే అక్షుచ్చ మే = నాకు పుష్కలమైన అన్నము ఆహార పానీయములు లభించును గాక. వాటిని నేను జీర్ణం చేసుకొని తృప్తిని పొందుదును గాక!

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ యజ్ఞం వల్ల నాకు లభించును గాక.

ఇంతేగాక అవి సమర్థవంతములగును గాక.

11. ఓం **విత్తం చ మే వేద్యం చ మే భూతం చ మే భవిష్యశ్చ మే**
సుగం చ మే సుపథ్యం చ మఽబుద్ధంఽచ మఽబుద్ధిశ్చ మే
క్లిప్తం చ మే
క్లిప్తిశ్చ మే మతిశ్చ మే సుమతిశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥
– యజు. 18.11

భావార్థము: యజ్ఞరూప పరమాత్ముని కృప వలన

(1) విత్తం చ మే వేద్యం చ మే = నేను శ్రమించి పొందిన వస్తువులు, వ్యర్థము కాకుండును గాక. మరియు నేను తెలుసుకోవలసిన విషయాలను గూర్చి శ్రమిస్తూనే ఉందును గాక.

(2) భూతం చ మే భవిష్యచ్చ మే = భూత భవిష్యత్తులు రెండూ శుభంకరములే అగును గాక.

(3) సుగం చ మే సుపథ్యం చ మే = నా సుగమ మార్గాలు, సుపథ్యాలు యుక్తాహార విహారాలు శుభంకరములే అగుగాక.

(4) బుద్ధం చ మే అబుద్ధిశ్చ మే = మంచి వృద్ధి పొందిన నా ఆస్తులు యోగప్రాప్తమైన నా మంచి వృద్ధి స్థిరముగా ఉండును గాక.

(5) క్లృపం చ మే క్లృప్తిశ్చ మే = నా శక్తి సామర్థ్యాలు, నా సామర్థ్య కల్పన స్థిరంగా ఉండును గాక.

(6) మతిశ్చ మే సుమతిశ్చ మే = నా ఉత్తమ ఆలోచనలు, సుబుద్ధి స్థిరముగా ఉండును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ నా నిత్యాగ్ని హోత్రం వల్ల సమర్థములగును గాక. ఆత్మికోన్నతిని కలిగించును గాక!

12. ఓం **వ్రీహయశ్చ మే యవాశ్చ మే మాషాశ్చ మే తిలాశ్చ మే**
ముద్గాశ్చ మే ఖల్వాశ్చ మే ప్రియఙ్గవశ్చ మేఽ
ణవశ్చ మే శ్యామాకాశ్చ మే నీవారాశ్చ మే గోధూమాశ్చ మే
మసూరాశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.12

భావార్థము: ఓ మానవులారా! మీరు విధిగా శాకాహారమునే భుజించాలి. జంతు సంబంధమైనవి వద్దు. మీ జీర్ణకోశాలు అందుకు అనుగుణంగానే నిర్మించాను.

(1) వ్రీహియశ్చ మే యవాశ్చ మే = వడ్లు, బియ్యము, యవలు

(2) మాషాశ్చ మే తిలాశ్చ మే = మినుములు, నువ్వులు

(3) ముద్గాశ్చ మే ఖల్వాశ్చ మే = పెసర్లు, శనగలు

(4) ప్రియజ్గశ్చ మే అణవశ్చ మే = అరికెలు, సన్నబియ్యం

(5) శ్యామాకాశ్చ మే నీవారాశ్చ మే = సామలు, వరి బియ్యములు

(6) గోధూమాశ్చ మే మసూరాశ్చ మే = గోధుమలు, చిరు శనగలు మొ॥ ధాన్యములే తినాలి. వాటితో రకరకాల భోజనాలు చేసుకోవచ్చు.

(7) యఙ్జ్ఞేన కల్పన్తావ్ = ఇవన్నీ నిత్యాగ్ని హెూత్రం వల్ల సమర్థవంతమవుతాయి.

(మీరు కూడా ఆయా క్రొత్త పంటలు ఇంటికి తెచ్చుకున్నప్పుడు ముందుగా వాటిని కొద్దిభాగం అగ్నిహెూత్రంలో వెయ్యాలి. తదనంతరమే వండుకుని తినాలి. ఇట్టి యజ్ఞాలనే నవసస్యేష్ఠి యజ్ఞాలంటారు. దానికి విధి విధానాలు ఆర్య పర్వ పద్ధతి అను పుస్తకంలో చూడగోరుతున్నాను.)

13. ఓం **ఆశ్మా చ మే మృత్తికా చ మే గిరయశ్చ మే పర్వతాశ్చ మే సికతాశ్చ మే వనస్పతయశ్చ మే హిరణ్యం చ మేఽ యశ్చ మే శ్యామం చ మే లోహఞ్చ మే సీసం చ మే త్రపు చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥** – యజు. 18.13

భావార్థము: నిత్యం నేను చేయు సంధ్య మరియు ఉపాసనలవల్ల

(1) ఆశ్మా చ మే మృత్తికా చ మే = రాతినేలలు మరియు మైదాన భూములు నాకు లభించును గాక. వాటినుండి నాకు ఫలసాయము లభించును గాక.

(2) గిరియశ్చ మే పర్వతాశ్చ మే = చిన్న చిన్న గుట్టలు, పర్వత ప్రాంతములు కూడా లభించును గాక. వాటిలో కొన్ని గనులలో నాకు బంగారము, రత్నాలు

మొదలగునవి లభించును గాక.

(3) సికతాశ్చ మే వనస్పతయశ్చ మే = ఎడారుల వంటి ఇసుక భూములు, వనస్పతులు నాకు లభించును గాక.

(4) హిరణ్యం చ మే అయశ్చ మే = ఆ భూముల నుండి నాకు బంగారము, వెండి, ఇనుము మొ॥నవి లభించును గాక.

(5) శ్యామం చ మే లోహం చ మే = రాగి, ఇత్తడి మొదలగునవి లభించును గాక.

(6) సీసం చ మే త్రపు చ మే = అట్లే నాకు సీసము లక్క తగరములు మొ॥ లభించును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ అగ్నిహోత్రం వల్ల సమర్థవంతములగును గాక. అనేకానేక పనులకు ఉపయోగపడును గాక. వాటిని నేను సద్వినియోగపరతును గాక.

14. ఓం **అగ్నిశ్చ మఽఆపశ్చ మే వీరుధశ్చ మఽఓషధయశ్చ మే**
కృష్టపద్యాశ్చ మేఽకృష్టపద్యాశ్చ మే గ్రామ్యాశ్చ మే పశవఽ
ఆరణ్యాశ్చ మే
విత్తఞ్చ మే విత్తిశ్చ మే భూతఞ్చ మే భూతిశ్చ మే యజ్ఞేన
కల్పన్తామ్ ॥ – యజు. 18.14

భావార్థము: గత మంత్రములలో వివిధ భూ ప్రదేశములు, అందలి పంటల గురించి, లోహాల గురించి చెప్పబడింది. ఈ మంత్రములో వాటి విజ్ఞానాల గురించి చెప్పబడుతున్నది.

యజ్ఞ స్వరూప పరమాత్ముని ఉపాసనవల్ల నాకు

(1) అగ్నిశ్చమే ఆపశ్చమే = అగ్నితత్త్వము, జలతత్త్వము చక్కగా ప్రాప్తించును గాక. ఈ రెండింటి విజ్ఞానాలవల్ల మరిన్ని కార్యాలు నాకు సిద్ధించును గాక. నాకు ఉత్సాహము, శాంతి లభించును గాక.

(2) వీరుధశ్చ మే ఓషధయశ్చ మే = లతా గుల్మాదులు, ఓషధుల, సోమలతాది మూలిక విజ్ఞానము నాకు లభించును గాక.

(3) కృష్ట పచ్యాశ్చ మే కృష్ట పచ్యాశ్చ మే = కృషి విజ్ఞానము, పెంపుడు జంతువులైన ఆవుల, గేదెల, మేకల, గొర్రెల, అశ్వముల, గజముల, ఒంటెల పెంపక విజ్ఞానము నాకు లభించును గాక.

(4) పశవ అరణ్యాశ్చ మే = అరణ్య పశువులైన పులి, సింహము, ఏనుగు, కోతి, ఎలుగుబంటి మొదలగు వాటి జ్ఞానము కూడా నాకు లభించును గాక. ఆ జ్ఞానంతో నేను మరికొన్ని కొత్త లాభాలను పొందుదును గాక.

(5) విత్తం చ మే విత్తిశ్చ మే = నాకు ఇంతవరకు లభించిన విత్తంతోను, లభించబోవు విత్తంతోను మరికొంత ఉన్నతిని పొందుదునుగాక. వాటిని సద్వినియోగం చేసి ఆత్మికోన్నతిని సాధింతును గాక.

(6) భూతం చ మే భూతిశ్చ మే = నా మాతా పితరుల ద్వారా లభించిన ఆస్తులను, లభించబోవు ఆస్తులను కూడా సద్వినియోగం చేసి మరికొంత ఉన్నతిని పొందుదును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = నేను చేయు నిత్యాగ్ని హోత్రం వల్లను, పరోపకారాది సత్కర్మలవల్లను పైవన్నీ మరింత సమర్థవంతములగును గాక. బహు ప్రయోజనకారులగును గాక.

15. ఓం వసు చ మే వసతిశ్చ మే కర్మ చ మే శక్తిశ్చ మేఽర్థశ్చ
మఽఏమశ్చ మఽఇత్యా చ మే గతిశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.15

భావార్థము: యజ్ఞ స్వరూప పరమాత్ముని స్తుతి ప్రార్థనోపాసన వల్ల నాకు

(1) వసు చ మే వసతిశ్చ మే = చక్కటి అనుకూలమైన వసతి, వస్తువులు, సహాయకులు లభింతురు గాక.

(2) కర్మ చ మే శక్తిశ్చ మే = అందు నేను నివసిస్తూ పంచమహా యజ్ఞాది సత్కర్మలను చేయుదును గాక. అందుకు తగిన శక్తి నాకు లభించును గాక.

(3) అర్థశ్చ మే ఏమశ్చ మే = నా కర్మలలో ఒక అర్థము, పరమార్థము ఉండును గాక. మోక్షగామిని అగుదును గాక. అదే ఏకైక లక్ష్యంగా ఉండును గాక.

(4) ఇత్యా చ మే గతిశ్చ మే = సోమరినిగాక నిరంతర గతిని కలిగియుందును గాక. లక్ష్యము చేరువరకు నిరంతరము శ్రమింతును గాక. దానిని పొందుదును గాక.

(5) యజ్ఞేన కల్పన్తామ్ = నేను నిత్యం చేయు యజ్ఞంతో, అగ్నిహోత్రంతో నా కర్మలు సమర్ధవంతమగును గాక.

(దయానంద మహర్షి భావార్థం = ఎవరు తమ సమస్త సామర్థ్యాలను సర్వహితార్థం వినియోగిస్తారో వారే ప్రశంసనీయులవుతారు.)

16. ఓం అగ్నిశ్చ మ ఽ ఇన్ద్రశ్చ మే సోమశ్చ మ ఽ ఇన్ద్రశ్చ మే
సవితా చ మ ఽ ఇన్ద్రశ్చ మే సరస్వతీ చ
మ ఽ ఇన్ద్రశ్చ మే పూషా చ మ ఽ ఇన్ద్రశ్చ మే
బృహస్పతిశ్చ మ ఽ ఇన్ద్రశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.16

భావార్థము: నేను నిత్యం చేయు పరమేశ్వరుని ఉపాసన వల్ల

(1) అగ్నిశ్చ మే ఇంద్రశ్చ మే = నాలో అగ్నితత్త్వం బలపడును గాక. అది నన్ను ముందుకు నడిపించును గాక. బయట ఉండు ప్రసిద్ధమగు సూర్య రూపాగ్ని మరియు వాయువు నాకు బలము నిచ్చును గాక.

(2) సోమశ్చ మే ఇంద్రశ్చ మే = నాలో సోమతత్త్వం కూడా బలపడును గాక. నాకు సాత్త్విక పదార్థాలు, సత్సంగము లభించును గాక.

(3) సవితా చ మే ఇంద్రశ్చ మే = నా ఐశ్వర్యయుక్త పదార్థాలు నాలో అవిద్యను నశింపచేయును గాక. అట్టి అధ్యాపకులు, గురువులు నాకు లభింతురు గాక.

(4) సరస్వతీ చ మే ఇన్ద్రశ్చ మే = నా వాణిలో సరస్వతి నెలకొనును గాక. నేను శుద్ధమైన ప్రశంసిత వాక్కులను పొందుదును గాక. అందుకు తగిన అధ్యాపకులు నాకు లభింతురుగాక.

(5) పూషా చ మే ఇన్ద్రశ్చ మే = నాకు చక్కటి పోషకులు, యుక్తాహార విహార నిద్రాదులు, వైద్యులు లభింతురు గాక.

(6) బృహస్పతిశ్చ మే ఇన్ద్రశ్చ మే = నా పెద్ద పెద్ద వ్యవహారాలు, వ్యాపారాలు సక్రమంగా జరుగును గాక. అందుకు నా రాజులు, సేనాపతులు, కర్మచారులు సహకరింతురు గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ నాకు సంధ్యాగ్ని హెూత్రాల ద్వారా సమర్థవంతములగును గాక. నేను గొప్పవాడిని అగుదును గాక.

(మహర్షి భావార్థం = ఓ మానవులారా! మీరు సదా మంచి ఆలోచనలతో ఉండండి. మీకున్న సకల పదార్థాలను, శక్తి సామర్థ్యాలను దుష్టశిక్షణ శిష్టరక్షణకై వినియోగించండి.)

17. ఓం **మిత్రశ్చ మఽ ఇన్ద్రశ్చ మే వరుణశ్చ**
మఽ ఇన్ద్రశ్చ మే ధాతా చ మఽ ఇన్ద్రశ్చ మే
త్వష్టా చ మఽ ఇన్ద్రశ్చ మే మరుతశ్చ
మఽ ఇన్ద్రశ్చ మే విశ్వే చ మే
దేవాఽ ఇన్ద్రశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.17

భావార్థము: యజ్ఞ స్వరూప పరమాత్ముని ఉపాసన వల్ల

(1) మిత్రశ్చ మే ఇన్ద్రశ్చ మే = నాలో సర్వ ప్రాణులను మిత్రులవలె చూచు మైత్రీభావము బలపడును గాక. అట్లే హృదయస్థ ప్రాణవాయువు, నాభిస్థ 'సమాన' వాయువులు బలపడును గాక. నాలో విద్యుత్ రూపాగ్ని తేజస్సు వర్ధిల్లును గాక.

(2) వరుణ శ్చ మే ఇంద్రశ్చ మే = కంఠస్థ 'ఉదాన' వాయువు, శరీరమంతట ఉండు 'వ్యాన' వాయువు బలపడును గాక. సూర్యశక్తి తద్వారా ధారణా శక్తి బలపడును గాక. నేను దుష్టశిక్షణ శిష్ట రక్షణ చేయుదును గాక.

(3) ధాతా చ మే ఇన్ద్రశ్చ మే = నన్ను చక్కగా ధారణ చేయువాడు, ధైర్యము నింపువాడు అయిన ఆత్మలకు సూర్యుడైన పరమాత్మ నన్ను అనుగ్రహించును గాక.

(4) త్వష్టా చ మే ఇన్ద్రశ్చ మే = నేను శిల్పవిద్యను పొంది నిర్మాణాత్మక

కార్యములను చేయుదును గాక.

(5) మరుతశ్చ మే ఇన్ద్రశ్చ మే = నాలోని దశ వాయువులు, సప్తధాతువులు బలపడును గాక. నాలోని విద్యుతాగ్ని బలపడి చక్కగా పనిచేయును గాక.

(6) విశ్వే చ మే దేవా ఇన్ద్రశ్చ మే = నా సమస్త పదార్థాలు, సర్వస్వము దివ్యగుణ యుక్తములు అగును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ నేను చేయు నిత్యాగ్నిహోత్ర కర్మవల్ల సమర్థవంతములగును గాక. నా లక్ష్యమును చేర్చును గాక.

(మహర్షి భావార్థం: మానవులు ప్రాణవిద్యను, విద్యుద్విద్యను అభ్యసించి అవి అన్నివైపులా వ్యాపించియున్నట్లు గ్రహించి వాటితో దీర్ఘ జీవనాన్ని పొందాలి.)

18. ఓం పృథివీ చ మఽ ఇన్ద్రశ్చ మేఽన్తరిక్షం
చ మఽ ఇన్ద్రశ్చ మే
ద్యౌశ్చ మఽ ఇన్ద్రశ్చ మే సమాశ్చ
మఽ ఇన్ద్రశ్చ మే నక్షత్రాణి చ మఽ ఇన్ద్రశ్చ మే
దిశశ్చ మఽ ఇన్ద్రశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.18

భావార్థము: యజ్ఞ స్వరూప పరమాత్ముని ఉపాసన వలన...

(1) పృథివీ చ మే ఇన్ద్రశ్చ మే = ఈ విస్తారమైన భూమి, అందలి వివిధ పదార్థాల జ్ఞానము మరియు విద్యుత్ జ్ఞానం నాకు లభించును గాక.

(2) అన్తరిక్షం చ మే ఇన్ద్రశ్చ మే = అంతరిక్షం, అందలి వాయువు మొదలగు పదార్థాల జ్ఞానము మరియు అందలి విద్యుత్ జ్ఞానం నాకు లభించును గాక.

(3) ద్యౌశ్చ మే ఇంద్రశ్చ మే = ద్యులోకం అందలి సూర్యాది పదార్థాల జ్ఞానం మరియు అందలి విద్యుత్ జ్ఞానం నాకు ప్రాప్తించును గాక. ఇవి న్ను ఐశ్వర్యవంతునిగా చేయును గాక.

(4) సమాశ్చ మే ఇంద్రశ్చ మే = నాకు సంవత్సరములు మరియు అందలి క్షణ, నిమిష, గడియ విఘడియ, మూర్తాదుల జ్ఞానం నాకు లభించును గాక.

(5) నక్షత్రాణి చ మే ఇన్ద్రశ్చ మే = నక్షత్రాదుల జ్ఞానము మరియు సరియైన

కాలగణన జ్ఞానం నాకు లభించును గాక.

(6) దిశశ్చ మే ఇంద్రశ్చ మే = తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణము మొదలగు దిశాజ్ఞానం మరియు అందలి విద్యుత్ జ్ఞానం నాకు లభించును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఈ జ్ఞానములన్నీ నేను చేయు నిత్యాగ్ని హోత్రాదుల వలన సమర్ధవంతములగును గాక. నేను పూర్ణజ్ఞాని నగుదును గాక.

(**మహర్షి భావార్థం:** మానవులు పృథివీ మున్నగు పదార్థముల గురించియు, అందు స్థిరముగా యున్న విద్యాదులను గురించియు తెలుసుకొననంతవరకు ఐశ్వర్యప్రాప్తిని పొందజాలరు.)

19. ఓం **అంశుశ్చ మే రశ్మిశ్చ మేఽ దాభ్యశ్చ మేఽధిపతిశ్చ**
మఽ ఉపా శుశ్చ మేఽన్తర్యామశ్చ మఽ ఐన్ద్రవాయవశ్చ మే
మైత్రా వరుణశ్చ మఽ ఆశ్వినశ్చ మే ప్రతిప్రస్థానశ్చ మే
శుక్రశ్చ మే మన్థీ చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.19

భావార్థము: నేను నిత్యం సర్వవ్యాపక సర్వేశ్వరుని ఉపాసించుటవల్ల...

(1) అంశుశ్చ మే రశ్మిశ్చ మే = నేను సౌమ్య స్వభావుడను మరియు సూర్యరశ్మి వలె నా జ్ఞానం తేజోవంతము అగును గాక.

(2) అదాభ్యశ్చ మే అధిపతిశ్చ మే = నా జీవనం అపక్షయరహిత మగును గాక. మరియు నేను ఇంద్రియాధిపతిని అగుదును గాక.

(3) ఉపాంశుశ్చ మే అన్తర్యామశ్చ మే = నా ఉపాంశు జపము – పెదవులు మాత్రమే కదిలిస్తూ చేయు మానసిక జపము మరియు అంతర్యామి ఎదుట నా దోషాలను పొరపాట్లను చెప్పుకుంటూ, ఒప్పుకుంటూ చేయు ఏకాంత విచారణ నన్ను పరిశుద్ధ పరచును గాక!

(4) ఐన్ద్ర వాయవశ్చ మే మైత్రావరుణశ్చ మే = విద్యుత్, పవనముల జ్ఞానము నాకు ప్రాప్తించును గాక. వాటితో నేను బలమును పొంది నా కార్యములను చక్కగా నెరవేర్చుకొందును గాక. నా శరీరములో నుండు మైత్రా వరణులు –

ప్రాణ ఉదాన వాయువులు మరియు వాటితో నడుచు వ్యాన వాయువు బలపడును గాక.

(5) అశ్వినశ్చ మే ప్రతి ప్రస్థానశ్చ మే = నాలో అశ్వినీ శక్తులు – సూర్య చంద్ర తత్త్వాలు మరియు ప్రతి ప్రస్థాన శక్తి – ప్రతీ కార్యము చక్కగా చేయు ఉత్సాహము బలపడును గాక.

(6) శుక్రశ్చ మే మన్థీచ మే = (శుక్ గతౌ) – నేను సదా గతిశీలుడనగుదును గాక. కాని అది మంథన – (విచారణ) శీలమగును గాక. ప్రతీకార్యము నేను చక్కగా ఆలోచించి చేయుదును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = నేను నిత్యం చేయు యజ్ఞాదుల వలన ఇవన్నీ సమర్థవంతములగును గాక. నన్ను సద్గుణములతో ప్రకాశింప చేయును గాక.

(మహర్షి భావార్థం: సూర్య చంద్రాదుల జ్ఞానం ద్వారా మనుష్యులు విద్వాంసులై క్రియాకౌశలత్వమును తప్పక పొందగలరు.)

20. ఓం **ఆగ్రయణశ్చ మే వైశ్వదేవశ్చ మే ధ్రువశ్చ మే వైశ్వానరశ్చ**
మఽఐన్ద్రాగ్నశ్చ మే
మహావైశ్వదేవశ్చ మే మరుత్వతీయాశ్చ మే నిష్కేవల్యశ్చ మే
సావిత్రశ్చ మే సారస్వతశ్చ మే
పాత్నీవతశ్చ మే హారియోజనశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.20

భావార్థము: సర్వాంతర్యామియైన పరమాత్ముని ఉపాసనవల్ల...

(1) ఆగ్రయణశ్చ మే వైశ్వదేవశ్చ మే = (అగ్ర + అయనం + యేన) సర్వేశ్వరుని అనుగ్రహం వల్ల నాలో సత్కార్యములన్నింటిలో ముందుండు ప్రవృత్తి కలుగును గాక. దానివల్ల నా జీవనం దివ్యగుణయుక్త మగును గాక.

(2) ధ్రువశ్చ మే వైశ్వానరశ్చ మే = నేను న్యాయమార్గంలో ధ్రువంగా ఉందును గాక. విచలితుడను కాకుందును గాక. నా జీవనం సర్వమానవ హితం కొరకు అగును గాక.

(3) ఐన్ద్రాగ్నశ్చ మే మహా వైశ్వ దేవశ్చ మే = నా జీవనం యజ్ఞమయ

మగును గాక. జితేంద్రియుడనగుదును గాక. తద్వారా నేను గొప్ప ఆదర్శ పురుషుడనగుదును గాక.

(4) మరుత్వతీయాశ్చ మే నిష్కేవల్యశ్చ మే = అందుకు నేను మరుత్వతీయ యజ్ఞం ప్రాణాయామ యజ్ఞం చేయుదును గాక. (నిరంతరం కేవలం సుఖం యస్మిన్ తస్మిన్ భవ) నిరంతరం సుఖం గల ముక్తిని పొందుదును గాక.

(5) సావిత్రశ్చ మే సారస్వతశ్చ మే = నేను ఈ లోకంలో జీవన్ముక్తుడనై చరిస్తూ సావిత్రీ, సరస్వతీ యజ్ఞములు చేయుదును గాక. ఉపాసనా ప్రవచనాలలో గడుపుదును గాక.

(6) పాత్నీవతశ్చ మే హరియోజనశ్చ మే = నా గృహ బాధ్యతలుగా నేను ఏకపత్నీ వ్రతుడనయ్యెదను గాక. గృహస్థ ధర్మములన్నిటిని నేను పాటింతును గాక. మరియు నేను హరియోజనా యజ్ఞం చేయుదును గాక. (హరిణాః అశ్వానాం యోజయతి) నా ఇంద్రియ రూప అశ్వాలను సరియైన దారిలో నడిపి ఉత్తమోత్తమ జీవనం గడుపుదును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = నేను నిత్యం చేయు యజ్ఞాదుల వల్ల నాకివన్నీ ప్రాప్తించును గాక. అన్నీ సమర్థవంతములగును గాక.

21. ఓం స్రుచశ్చ మే చమసాశ్చమే వాయవ్యానీ చ మే ద్రోణకలశశ్చ మే
గ్రావాణశ్చ మేఽధిషవణే చ మే పూతభృచ్చ మఽ
ఆధవనీయశ్చ మే వేదిశ్చమే
బర్హిశ్చ మేఽవభృథశ్చ మే స్వగాకారశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్॥

– యజు. 18.21

భావార్థము: సర్వవ్యాపక సర్వేశ్వరుని అనుగ్రహం వల్ల నాకు యజ్ఞము (అగ్నిహోత్రం) చేయుటకు అవసరమైన వస్తువులు, పదార్థాలు, సాధనాలు అన్నియు లభించును గాక. వాటిని నేను మరొకసారి శుద్ధిచేసి – శుభ్రం చేసి శ్రద్ధతో యజ్ఞం చేయుదును గాక. అవి ఎవ్వియనగా...

(1) స్రుచశ్చ మే చమసాశ్చ మే = అగ్నిలో నేతిని ఆహుతిగా యిచ్చుటకు స్రువలు పొడుగు కాడ కలిగిన గరిటెలు, పాయసాదులను వేయుటకు చమ్చాలు,

(2) వాయవ్యాది చ మే ద్రోణం కలశశ్చ మే = తేలికగా వాయువులో కలియు మూలికాదులు, ద్రోణ కలశములు – యజ్ఞకుండ సమీపమున నాలుగు వైపుల జలముతో నిండిన కలశములు (పొరపాటున అగ్ని దేనిపైనైనా బడి అగ్ని ప్రమాదం ఏర్పడిన వెంటనే చల్లార్చుట కొరకు),

(3) గ్రావాణశ్చ మే అధిషవణే చ మే = సానరాయి, సన్నికల్లు మొదలగునవి మరియు సోమలతను దంచి రసము తీయుటకు సాధనాలు,

(4) పూతభృచ్చ మే అధవనీయశ్చ మే = చీపురు జల్లెడ మొదలగు శుద్ధి చేయు సాధనాలు, పాత్రలు నక్షత్రాలను పరిశీలించు సాధనాలు,

(5) వేదిశ్చ మే బర్హిశ్చ మే = శాస్త్ర విధిననుసరించి నిర్మించిన యజ్ఞకుండములు, కుశలు,

(6) అవభృథశ్చ మే స్వగాకారశ్చ మే = యజ్ఞానంతరం స్నానం చేయుటకు బిందెలతో నీళ్ళు, హోమద్రవ్యాలను అందించుటకు కొందరు సహాయకులు,

(7) యజ్ఞేన కల్పన్తామ్ = పైవన్నీ చక్కగా సమకూర్చుకొని నేను ప్రశాంత చిత్తుడనై యజ్ఞక్రియ యందే మనస్సును లగ్నం చేసుకొని శ్రద్ధతో యజ్ఞం చేయుదును గాక.

22. ఓం **అగ్నిశ్చ మే ఘర్మశ్చ మేఽర్కశ్చ మే**
సూర్యశ్చ మే ప్రాణశ్చఽమేశ్వమేధశ్చ మే పృ
థివీ చ మేఽదితిశ్చమే దితిశ్చ మే ద్యౌశ్చ
మేఽఙ్గులయః శక్వరయో
దశశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.22

భావార్థము: సర్వాంతర్యామియైన పరమేశ్వరుని అనుగ్రహం వల్ల...

(1) అగ్నిశ్చ మే ఘర్మశ్చ మే = నేను సృష్టిలోని అగ్నిని, ఉష్ణాన్ని, ఎండను సదుపయోగం చేసికొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుదును గాక.

(2) అర్కశ్చ మే సూర్యశ్చ మే = నిత్యం నియమంగా ఈశ్వరోపాసన చేయుదును గాక. నాలో జ్ఞాన సూర్యుడు ఉదయించును గాక.

(3) ప్రాణశ్చ మే అశ్వమేధశ్చ మే = నాలో దశవిధ ప్రాణాలు బలపడును

గాక. నేను వాటిని (రాష్ట్రం వా అశ్వః) దేశ హితం కొరకు సమాజ హితం కొరకు వినియోగింతును గాక. అవసరమైతే ఆత్మ బలిదానం చేయుదును గాక.

(4) పృథివీ చ మే అదితశ్చ మే = నాలో దివ్యశక్తులు విస్తరించును గాక. అది అఖండితమగును గాక. నా ఆరోగ్యము, శక్తులు ఖండితము కాకుండును గాక.

(5) దితిశ్చ మే ద్యౌతిశ్చ మే = నాలో స్వార్థ సంకుచిత భావాలు ఖండితమగును గాక. నేను పరిశుద్ధుడనగుదును గాక. నేను ద్యులోకం వలె ప్రకాశింతును గాక.

(6) అఙ్గ లయః శక్వరయో దిశశ్చ మే = నేను సత్కర్మలలో వ్యాపింతును గాక. కర్మయోగిని అగుదును గాక. నేను నలుదిశలా పురోగమింతును గాక.

(7) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ నాకు నిత్యం చేయు అగ్నిహోత్రం వలన సమర్థవంతములగును గాక. నన్ను ప్రేరేపించును గాక.

మహర్షి భావార్థం: సర్వప్రాణ హితం కొరకు యజ్ఞానుష్ఠానం చేయువారే మహాశయులగుదురని గ్రహించండి.

23. ఓం వ్రతం చ మఽఋతవశ్చ మే తపశ్చ మే
సంవత్సరశ్చ మేఽహోరాత్రేఽ
ఊర్వష్ఠీవే బృహ ద్రథన్తరే చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.23

భావార్థము: యజ్ఞరూప పరమాత్ముని అనుగ్రహం వల్ల నేను...

(1) వ్రతం చ మే ఋతవశ్చ మే = నేను వ్రతశీలుడనై జీవింతును గాక. సోమరిని కాకుందును గాక. నియమబద్ధ జీవితాన్ని గడుపుదును గాక. అట్లే ఆయుర్వేదం ఉపదేశించే ఋతుచర్యను పాటించి ఏ ఋతువులో ఏ ఆహార విహారాలు కలిగి ఉండాలో అట్లే చేయుదును గాక.

(2) తపశ్చ మే సంవత్సరశ్చ మే = శీతోష్ణ సుఖ దుఃఖాలను సహిస్తూ తపోమయ జీవితాన్ని గడుపుదును గాక. ప్రతి సంవత్సరాన్ని నేను సద్వినియోగం చేసుకొందును గాక.

(3) అహోరాత్రే ఊర్వష్ఠీవే = సంవత్సరాన్ని నేను సద్వినియోగం చేసుకొందును గాక. వేకువ ఝాముననే మేల్కొని ప్రభాత ఉషస్సుల ఆనందాన్ని పొందుదును గాక. రాత్రి తొమ్మిది గంటలకే నిద్రించి, నిద్రా సుఖాన్ని పొందుదును గాక. ఉదయం వ్యాయామం చేస్తూ నా ఎముకలలోను, ఊరువులలోను (తొడలలోను) ఓజోశక్తిని పెంచుకొందును గాక. ధాతుశక్తిని వృద్ధి చేసుకొని ఆరోగ్యంగా జీవింతును గాక.

(4) బృహద్రథన్తరే చ మే = (బృహీవృద్ధౌ) శారీరకంగా నేను గొప్ప వృద్ధిని పొందుదును గాక. ఈ శరీరరూప రథంపై కూర్చొని నా గమ్యం వైపు పయనింతును గాక.

(5) యజ్ఞేన కల్పన్తామ్ = ఇవన్నీ నాకు నిత్యాగ్ని హోత్రాది కర్మల వల్లను, పంచ మహా యజ్ఞాది కర్మల వల్లను సమర్థవంతములగును గాక.

24. ఓం **ఏకా చ మే తిస్రశ్చ మే తిస్రశ్చ మే పఞ్చ చ మే పఞ్చ చ మే సప్త చ మే**
సప్త చ మే నవ చ మే నవ చ మఉ ఏకాదశ చ మఉ
ఏకాదశ చ మే త్రయోదశ చ మే త్రయోదశ చ మే
పఞ్చదశ చ మే పఞ్చదశ చ మే సప్తదశ చ మే సప్త దశ చ మే
నవదశ చ మే నవదశ చ మఉ ఏకవి శతిశ్చమఉ ఏకవి శతిశ్చ మే
త్రయోవి శతిశ్చ మే త్రయోవి శతిశ్చ మే
పఞ్చవి శతిశ్చ మే పఞ్చవి శతిశ్చ మే సప్తవి శతిశ్చ మే
సప్తవి శతిశ్చ మే నవవి శతిశ్చ మే నవవి శతిశ్చమఉ
ఏకత్రి శశ్చ మఉ ఏకత్రి శశ్చమే
త్రయ స్త్రి శచ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥

– యజు. 18.24

భావార్థము: యజ్ఞ స్వరూప పరమేశ్వరుడు ఈ మంత్రంలో మానవులకు గణిత విద్యను ఉపదేశించాడు.

యజ ధాతువుతో యజ్ఞ పదము నిర్మించబడుతుంది. కనుక దీనిలో దేవపూజ, సంగతీకరణము, దానము అనే 3 అర్థాలున్నాయి. గణిత విద్యా ప్రకరణంలో సంగతికరణం అంటే కలపటం, కూడటం అనీ, దానం అంటే తీసివేయటం అనీ అర్థాలు వస్తాయి. ఈ మంత్రం ఏమంటుందంటే, ఒకటికి రెండు కలిపితే మూడు అవుతుంది. దానికి రెండు కలిపితే 5 అవుతుంది. దానికి రెండు కలిపితే ఏడు అవుతుంది. దానికి రెండు కలిపితే 9, దానికి రెండు కలిపితే 11. 11+2 = 13. 13+2 = 15, 15+2 = 17, 17+2 = 19, 19+2 = 21, 21+2 = 23, 23+2 = 25, 25+2 = 27, 27+2 = 29, 29+2 = 31, 31+2 = 33 ఈవిధంగా కూడికలు ఉపదేశించబడ్డాయి. చివరగా 1 మిగులుతుంది.

రెండవ విధానంగా మరల వెనుకకు పయనిస్తే అంటే దానం చేస్తే 33−2 = 31, 31−2 = 29..... ఈ రకంగా తీసివేతలు ఉపదేశించబడినట్లు గ్రహించాలి. ఇంతేకాక దీనిలో గుణకారం కూడా ఇమిడి ఉంటుంది. ఎట్లన 2×4 = 8, అంటే 2+2+2+2 = 8. రెండు 4 సార్లు కలిపితే 8 కదా, ఇట్లే 4×4 = 16, 4+4+4+4 = 16 కదా! ఈ మంత్రాన్ని మననం చేస్తూ సమాధి స్థితిలోనికి వెళ్ళిన మన ప్రాచీన ఋషులకు పరమేశ్వరుడు – అంకగణితం, బీజగణితం మొ।। కూడా ఉపదేశించాడు. దానితో వారు పెద్ద పెద్ద గణిత శాస్త్రాలు వ్రాశారు. '0' – సున్నాను కనిపెట్టింది కూడా భారతీయ ఋషులే. ప్రస్తుతం కూడా గణిత విద్యలో భారతీయులదే అగ్రస్థానం. మంత్ర చివరి వాక్యం యజ్ఞేన కల్పన్తామ్ = నేను నిత్యం శ్రద్ధతో చేసే బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞాలతో – సంధ్యాగ్ని హెూత్రాలతో నా గణిత విద్యయును సమర్థవంతమగును గాక. నేను లెక్కలలో అగ్రగణ్యుడను అగుదును గాక అనే అర్థం వుంది.

25. ఓం చతస్రశ్చ మేఽ_ష్టౌ చ మేఽ_ష్టౌచ మే ద్వాదశ చ మే ద్వాదశ చ మే షోడశ చ మే
షోడశ చ మే వి శతిశ్చ మే వి శతిశ్చ మే
చతుర్వి శతిశ్చ మే చతుర్వి శతిశ్చమేఽ_ష్టావి శతిశ్చమేఽ_ష్టావి శతిశ్చ
మేద్వాత్రి శచ్చమే ద్వాత్రి శచ్చమే షట్ త్రి శచ్చ మే షట్ త్రి

శచ్చ మే
చ త్వారి శచ్చ మే చత్వారి శచ్చ మే చతుశ్చత్వారి శచ్చ మే
చతుశ్చత్వారి శచ్చమేఽష్టా చతుశ్చత్వారి శచ్చ మే యజ్ఞేన
కల్పన్తామ్ ॥ – యజు. 18.25

భావార్థము: సర్వవ్యాపక సర్వేశ్వరుని అనుగ్రహం వలన నాకు గణితవిద్య బాగా అర్థమగును గాక.

సృష్టికర్త సందేశము: ఓ మానవులారా! నాలుగు మరొక నాలుగుతో కలిసి ఎనిమిది అవుతుంది. దానికి మరొక నాలుగు కలిపితే 12 అవుతుంది. 12+4 = 16, 16+4 = 20, 20+4 = 24, 24+4 = 28, 28+4 = 32, 32+4 = 36, 36+4 = 40, 40+4 = 44. ఈవిధంగా కూడికలు చేయాలని గ్రహించండి. దీనికి వ్యతిరేక దిశలో పయనించి క్రమంగా నాలుగు తీసివేస్తూ పోతే చివరకు సున్నా '0' మిగులుతుంది. ఈవిధంగా తీసివేతలు నేర్చుకోవాలి.

మహర్షి భావార్థం: పూర్వం 24వ మంత్రంలో ఒకటికి రెండు కలుపుచు, తీసివేయుచు విషమసంఖ్యలు చెప్పబడినవి. కనుక అక్కడ వచ్చిన ఒకటి రెండు మూడు సంఖ్యలను వదిలి ఈ మంత్రములో నాలుగును కలుపుచూ తీసివేయుచు సంఖ్యలు చెప్పబడినవి. ఈ రెండు మంత్రాలలో విషమ, సరి సంఖ్యల భేదాన్ని తెలుసుకోవాలి. ఈ విధంగా మీరు బుద్ధితో కల్పన చేస్తూ సమస్త గణితవిద్యను తెలుసుకోవాలి.

26. ఓం త్ర్యవిశ్చ మే త్ర్యవీచ మే దిత్యవాట్ చ మే దిత్యౌహీ చ మే
పఞ్చావిశ్చమే పఞ్చావీచ మే
త్రివత్సశ్చమే త్రివత్సా చ మే తుర్యవాట్ చ మే తుర్యౌహీ చ
మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.26

భావార్థము: హే సర్వాంతర్యామీ! పరమాత్మా! నీ కృప వలన...

(1) త్ర్యవిశ్చ మే త్ర్యవీశ్చ మే = అవిః అంటే గొఱ్ఱె అని సామాన్యార్థం. కాని శాస్త్రాలలో అవిః అంటే ఆరునెలల కాలం 6×3 = 18 నెలల వయస్సు గల వృషభం అని కూడా అర్థం వస్తుంది. ఇచట రెండవ అర్థాన్ని గ్రహిస్తే 1 1/2 సంవత్సరాల ఆవు నాకు ప్రాప్తించును గాక అని అర్థం వస్తుంది.

(2) దీత్య వాట్ చ మే దిత్యౌ హి చ మే = 2 సంవత్సరాల ఎద్దు మరియు 2 సంవత్సరాల గోవు నాకు ప్రాప్తించును గాక.

(3) పఞ్చా విశ్చ మే పఞ్చా వీ చ మే = 2 1/2 సంవత్సరముల వృషభం మరియు 21/2 సంవత్సరాల ఆవు నాకు ప్రాప్తించును గాక.

(4) త్రివృత్సశ్చ మే తుర్యవాట్ చ మే = 3 సంవత్సరాల వృషభం మరియు 3 సంవత్సరాల ఆవు నాకు ప్రాప్తించును గాక.

(5) తుర్య వాట్ చ మే తుర్యౌ హి చ మే = 3 1/2 సంవత్సరాల వృషభం మరియు 3 1/2 సంవత్సరాల ఆవు నాకు ప్రాప్తించును గాక.

(6) యజ్ఞేన కల్పన్తామ్ = నేను ఆవుల పాలతో పుష్కలంగా నేతిని సంపాదించి పెద్ద పెద్ద యజ్ఞాలను చేయుదును గాక. ఆ యజ్ఞాలతో నేను శారీరిక, సామాజిక, ఆత్మికోన్నతిని పొందెదను గాక. నావద్ద 1 1/2 సంవత్సరాల నుండి 2 1/2 సంవత్సరాల వయస్సు గల ఆవులు అనేకం ఉండును గాక.

27. ఓం **షష్ఠవాట్ చ మే షష్ఠౌహీ చ మఽ ఉక్షా చ మే వశా చ మఽ**
ఋషభశ్చ మే వేహశ్చ మేఽ నడ్వా శ్చ మే ధేనుశ్చ మే
యజ్ఞేన కల్పన్తామ్ ॥ – యజు. 18.27

భావార్థము: నేను నిత్యం చేయు బ్రహ్మయజ్ఞ దేవ యజ్ఞాల వల్ల ప్రేరణను పొంది పశుసంపదను ఆదరింతును గాక. పాలింతును గాక.

(1) షష్ఠవాట్ చ మే షష్ఠౌ హీ చ మే = నా వద్ద వీపుపై బరువులను మోయగల ఏనుగులు, ఒంటెలు మొదలగునవి ఆడవి మగవి కూడా ఉండును గాక.

(2) ఉక్షా చ మే వశా చ మే = నా వద్ద వీర్య సేచన సమర్థములైన ఆంబోతులు, వీర్యధారణ సామర్థ్యములు గల ఆవులు ఉండును గాక.

(3) ఋషభశ్చ మే వేహశ్చ మే = భారములు మోయగల ఎద్దులు, గొడ్డుపోయిన ఆవులు మరియు గర్భధారణ చేసిన ఆవులు కూడా నావద్ద ఉండును గాక. ముసలి ఆవులను కూడా నేను పోషింతును గాక.

(4) నడ్వాంశ్చ మే ధేనుశ్చ మే = బరువు బండ్లను లాగగల ఎద్దులు

మరియు ధేనువులు, క్రొత్తగా ఈనిన పాడి యావులు, బండ్లు తోలు పనివారు, గోసేవ చేయు గోపాలురు, పాలను పిండువారు, ఇతర సేవకులు కూడా ఉందురు గాక. వీరందరిని నేను చక్కగా పోషింతును గాక.

(5) యజ్ఞేన కల్పన్తామ్ = వీరందరు నేను చక్కగా యజ్ఞం చేయుటకు సహకరింతురు గాక. అగ్నిహోత్ర వాయువుల వల్ల పశుగణములు, పనివారు మరియు మా కుటుంబము ఆరోగ్యంగా ఆనందంగా ఉండును గాక.

28. ఓం **వాజాయ స్వాహా ప్రసవాయ స్వాహా పిజాయ స్వాహా**
క్రతవే స్వాహా వసవే స్వాహా౭హర్పతయే స్వాహాహ్నేముగ్ధాయ స్వాహా
ముగ్ధాయ వైన శినాయ స్వాహా విన శిన౭ అన్త్యాయనాయ
స్వాహాన్త్యాయ భౌవనాయ స్వాహా భువనస్య పతయే
స్వాహాధిపతయే స్వాహా
ప్రజాపతయే స్వాహా । ఇయం తే రాణ్మిత్రాయ యన్తాసి
యమన౭ఊర్జే త్వా
వృష్ట్యై త్వా ప్రజానాం త్వాధిపత్యాయ ॥ – యజు. 18.28

భావార్థము: నేను నిత్యం చేయు సంధ్యాగ్ని హోత్రాలవల్ల...

(1) వాజాయ స్వాహా ప్రసవాయ స్వాహా = నాకు సంగ్రామము, పోరాటము చేయగల బల ఉత్సాహములు లభించును గాక. నాలో ఐశ్వర్యాన్ని పెంచు, సంతానాన్ని పెంచు సామర్థ్యము కలుగును గాక.

(2) అపిజాయ స్వాహా కృతవే స్వాహా = నాకు జల విజ్ఞానము, కర్మ విజ్ఞానము లభించును గాక.

(3) వసవే స్వాహా హర్పతయే స్వాహా = నాకు గృహ విజ్ఞానము, సమయాన్ని సద్వినియోగం చేయగల శక్తియుక్తులు లభించును గాక.

(4) అహ్నే ముగ్ధాయ స్వాహా = లోకంలో మూఢులు, మూర్ఖులు, సంసార లంపటులు, అజ్ఞానులు కూడా ఉంటారు కదా! వారికి నేను జ్ఞానబోధ చేయుదును గాక.

(5) ముగ్ధాయ వైనంశినాయ స్వాహా = ఆధ్యాత్మిక అంధకారంలో పడి సంసార సుఖాల మోహంలో పడినవారికి నేను సత్యోపదేశం చేసి వారికి సరియైన మార్గం చూపుదును గాక.

(6) వినం శిన ఆన్త్యాయనాయ స్వాహా = వ్యసనాలలో పడి ఆరోగ్యాన్ని నష్టపరచుకొన్న ఆర్తులను రక్షించ యత్నింతును గాక.

(7) భౌవనాయ స్వాహా భువనస్య = భవనాలలో విలాస జీవితం గడుపువారికి దానగుణం, దయాగుణం కలిగింతును గాక.

(8) అధిపతయే స్వాహా, ప్రజాపతయే స్వాహా = ప్రజా పాలకులకు, ప్రజాపతులకు రాజధర్మాలను, రాజ వ్యవహారాలను బోధింతును గాక.

(9) ఇయం తే రాణ్మిత్రాయ యన్తాసి = మిత్రులను బంధువులను గౌరవింతును గాక.

(10) యమన ఊర్జేత్వా వష్టైత్వా = ప్రజలమైన మేము యోగ్యుడైన బలపరాక్రమాది గుణాలు కలవారినే రాజుగా చేయుదుము గాక. (అట్టి రాజే సమయానుకూల వర్షాలు కురియుటకు పెద్ద పెద్ద వర్షేష్ఠి యజ్ఞాలు చేసి ప్రజలను సుఖింప చేయగలడు.)

(11) ప్రజానాం త్వాధిపత్యాయ = అట్టి యోగ్యునే మేము రాజుగా – పాలకునిగా ఎన్నుకొందుము గాక.

29. ఓం ఆయుర్యజ్ఞేన కల్పతాం ప్రాణో యజ్ఞేన కల్పతాం చక్షుర్యజ్ఞేన
కల్పతా శ్రోత్రం
యజ్ఞేన కల్పతాం వాగ్యజ్ఞేన కల్పతాం మనో యజ్ఞేన
కల్పతామాత్మా యజ్ఞేన
కల్పతాం బ్రహ్మా యజ్ఞేన కల్పతాం జ్యోతిర్యజ్ఞేన కల్పతా
స్వర్యజ్ఞేన కల్పతాం
వృష్ఠం యజ్ఞేన కల్పతాం యజ్ఞో యజ్ఞేన కల్పతాం । సోమశ్చ
యజుశ్చ౨ ఋక్
చ సామ చ బృహచ్చ రథన్తరం ద స్వర్దేవా౨ అగన్మామృతా౨

అభూమ

ప్రజాపతేః ప్రజా౨ అభూమ వేట్ స్వాహా ॥

– యజు. 18.29

భావార్థము: నేను నిత్యం నియమంగా చేయు సంధ్యాగ్ని హెూత్రాల వల్ల...

(1) ఆయుర్యజ్ఞేన కల్పతాం = నా ఆయువు దీర్ఘమగును గాక.

(2) ప్రాణీ యజ్ఞేన కల్పతాం = నా ప్రాణశక్తులు బలపడును గాక.

(3) చక్షుర్ యజ్ఞేన కల్పతామ్ = నా దృక్‌శక్తి వృద్ధి చెందును గాక.

(4) శ్రోత్రం యజ్ఞేన కల్పతాం = నా వినికిడి శక్తి బలపడును గాక.

(5) వాగ్యజ్ఞేన కల్పతాం = నా వాక్‌శక్తి బలపడును గాక.

(6) మనో యజ్ఞేన కల్పతాం = నా మానసిక శక్తి వృద్ధి చెందును గాక.

(7) ఆత్మా యజ్ఞేన కల్పతాం = నా ఆత్మజ్ఞానం బలపడును గాక.

(8) జ్యోతిర్యజ్ఞేన కల్పతామ్ = నాకు బ్రహ్మతేజస్సు లభించును గాక.

(9) స్వర్యజ్ఞేన కల్పతాం (స్వర్ ఇతి వ్యానః) = నాలో వ్యానవాయువు బలపడును గాక. ఆనందము లభించును గాక.

(10) పృష్ఠం యజ్ఞేన కల్పతాం = నాలో జిజ్ఞాస పెరిగి స్వాధ్యాయశీలుడనగుదును గాక.

(11) యజ్ఞో యజ్ఞేన కల్పతామ్ = దేవపూజ సంగతీకరణ, దాన ప్రవృత్తులు నిత్యాగ్ని హెూత్రంతో మరింత బలపడును గాక.

(12) స్తోమశ్చ యజుశ్చ ఋక్చ సామ చ బృహచ్చ రథన్తరం చ = స్తుతులచే పూర్ణమైన అథర్వవేదము, యజుర్వేదము, ఋగ్వేదము, సామవేదాల రథంతర నామము గల స్తోత్రములన్నియు నాకు లభించును గాక. వాటన్నింటిలో ఉన్న జ్ఞానము నాకు లభించును గాక.

(13) స్వర్దేవా అగన్మామృతాం అభూమ = విద్వాంసుల సాంగత్యం చేసి, సాధన చేసి, నేను అమృతత్వాన్ని ఈ జన్మలోనే పొందుదును గాక.

(14) ప్రజాపతేః ప్రజాం అభూమవేట్ స్వాహా = ప్రజాపతియైన సర్వేశ్వరుని

అనుగ్రహం వలన నేనును ఉత్తమ నాయకుడనగుదును గాక. ఉత్తమ కార్యశీలుడనగుదును గాక. స్వాహా - ఇవన్నియు సత్యమే యగును గాక.

30. ఓం వాజస్య ను ప్రసవే మాతరం మహీమదితిం
నామ వచసా కరామహే ।
యస్యామిదం విశ్వం భువనమావివేశ
తస్యాం నో దేవః సవితా ధర్మ సావిషత్ ॥

- యజు. 18.30

సృష్టికర్త సందేశం: (1) వాజస్య ను ప్రసవే మాతరం మహీమ్ = ఉన్నతిని కోరు ఓ మానవులారా! మీ కొరకే నేను ఈ భూమిని సృష్టించాను. ఇది మీకు తల్లిలాంటిది. ఇది మీకు పుష్కలమైన అన్నాన్ని ప్రసాదిస్తుంది. ఎన్నెన్నో రకాల జీవనావసరాలను కూడా యిస్తుంది. ధర్మపూర్వకంగా మీరు వాటిని అనుభవిస్తూ శక్తియుక్తులను బలవీర్యాలను పొందండి.

(2) అదితిమ్ + నామ వచసా శరమహే = ఈ భూమాతను అఖండనీయంగా ఉంచుతామని శపథం చెయ్యండి. కేవలం శపథమే కాదు. దానికొరకై మీరు తను మన ధనములతో పరిశ్రమించండి.

(3) యస్యామ్ + ఇదం విశ్వం భువనమ్ + ఆవివేశ = మీ ఈ మాతృభూమి యందే విశ్వమంతా ఆధారపడి ఉండును గాక. మీరు అన్నదాతలు, విద్యాదాతలు సంస్కృతీ సభ్యతా దాతలు అగుదురు గాక.

(4) తస్యామ్ + నః దేవః సవితా ధర్మ సావిషత్ = సర్వాంతర్యామియైన సవితా దేవుడు మా బుద్ధులను సత్కర్మలు చేయ ప్రేరేపించుచు మమ్ము ధర్మాత్ములను చేయుగాక. మాకు ఉన్నతిని కలిగించును గాక.

మహర్షి భావార్థం: ఏ జగదీశ్వరుడు సర్వమున కాధారమగు ఈ భూమిని నిర్మించినాడో, మరియు ఈ సర్వమును ధరించియున్నాడో అట్టి అంతర్యామినే మానవులంతా ఉపాసించాలి. అన్యులను కాదు.

31. ఓం విశ్వేఽ అద్య మరుతో విశ్వఽ ఊతీ
విశ్వే భవన్త్వగ్నయః సమిద్ధాః ।

విశ్వే నో దేవా౽ అవసాగమన్తు
విశ్వమస్తు ద్రవిణం వాజో౽ అస్మే ॥ – యజు. 18.31

(1) విశ్వే అద్య మరుతః విశ్వహూతి = ఓ సర్వవ్యాపక సర్వేశ్వరా! నీ కృపవలనను, మేము నిత్యం చేయు ప్రాణాయామ సాధన వలనను మాలోని దశవిధ ప్రాణములు బలపడును గాక. మా పూర్ణ పురుషార్థం వలన మాకు వలయు అన్ని పదార్థములు లభించును గాక. ప్రాణులన్నియు మాకు అనుకూలముగా నుండునుగాక.

(2) విశ్వే భవన్తు అగ్నయః + సమిద్ధా = మేమంతా మా ఉన్నతికై సమిధలతో అగ్నిని జ్వలింప జేయుదుము గాక. అందు ఘృతంతో – ఆవునేతితో ఆహుతుల నిత్తుము గాక.

(3) విశ్వే నౌ + దేవా అవసా + ఆగమన్తు = సకల వేద విద్వాంసులు, వైజ్ఞానికులు అందరు వచ్చి మమ్ము రక్షింతురు గాక.

(4) విశ్వమస్తు ద్రవిణం వాజ్ అస్మే = అన్న పానీయాలు, ధన ఐశ్వర్యాదులన్నియు మాకు ప్రాప్తించును గాక.

మహర్షి భావార్థం: మానవులంతా సోమరితనమును వదిలి విద్వాంసుల సాంగత్యంలో పురుషార్థం చేస్తూ ఉత్తమోత్తమ పదార్థాలన్నింటిని పొందాలి.

32. ఓం వాజో నః సప్త ప్రదిశశ్చతస్రో నా పరావతః ।
వాజో నో విశ్వైర్దేవైర్ధన సాతా విహావతు ॥

– యజు. 18.32

(1) వాజః + నః సప్త ప్రదిశః + చ త్రిస్రో వా పరావత = సర్వవ్యాపక సర్వేశ్వరుని కృపవలన మాకు లభించిన అన్న బలములు సప్త దిశలలో సప్త ప్రదిశలలో మరియు నాలుగు దూరస్థ లోకాలలో ఉన్న ప్రాణులకు వ్యాపించునుగాక. అందలి ప్రాణులను రక్షించును గాక.

వివరణ: సప్తదిశ అంటే తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణాలు మరియు భూలోక భువర్లోక స్వర్లోకాలు మూడు. పరావత లోకాలంటే – స్వర్లోకాన్ని దాటి ఉన్న మహర్లోక జనర్లోక, తపోలోక సత్యలోకాలు.

వీటన్నిటికి అన్నాదులు లభించాలంటే పెద్ద పెద్ద యజ్ఞాలు చేసి సరియైన ఆహుతులిస్తే వాటిని అగ్ని వాయురూపంలోనే కాక అందలి సూక్ష్మాతి సూక్ష్మ వాయువులుగా - పరమాణు శకలాలుగా మారుస్తూ అవి దూరస్థ లోకాలకు చేరే అవకాశముంది. మరికొంత వివరణకు నా రచనలు - "అగ్నిహోత్రం 100 శాతం వైజ్ఞానికం" నందు అగ్నిహోత్ర రసాయనిక విశ్లేషణలు చదువగోర్తాను.

(2) వాజః + నః విశ్వైః + దేవైః + ధనసాతావిత్ + ధన + సాత్ + ఇహ + అవతు = మా అన్న బలములు మా కొరకే కాక సమస్త ప్రాణులకు సమస్త దైవీశక్తులకు చేరును గాక. మమ్మును రక్షించును గాక.

భావం: మానవులంతా శ్రమించి పుష్కలమైన అన్నాది పదార్థాలుత్పన్నం చేయాలి. వాటినంతా తమకొరకే కాక ప్రాణులన్నింటి కొరకు వినియోగించాలి. పంచ మహాయజ్ఞాలు చేస్తూ, దానధర్మాల చేస్తూ ఉత్తమ కీర్తిని ఆర్జించాలి. సత్ పురుషులను సదా సత్కరిస్తూ ఉండాలి.

33. ఓం వాజో నోఽ అద్య ప్రసువాతి దానం
వాజో దేవాఽఽ ఋతుభిః కల్పయాతి ।
వాజో హి మా సర్వవీరంజజాన విశ్వాఽ ఆశా
వాజపతిర్జయేయమ్ ॥ - యజు. 18.33

(1) వాజః + నః + అద్య ప్రసువాతి దానం వాజః + దేవాన్ + ఋతిభిః కల్పయాతి =కష్టించి మేమార్జించిన అన్న బలములు మమ్మ దానధర్మాలు చేయుమని, ఆపదలో ఉన్నవారిని రక్షించమని ప్రేరేపించును గాక.

(2) వాజః + హి + మా సర్వవీరం జజాన విశ్వాః + ఆశాః + వాజః + పతిః జయేయమ్ = మా ఈ అన్న బలములు నిశ్చయంగా అందరిని వీర పురుషులను చేయును గాక. నన్ను ప్రసిద్ధపరచును గాక. మేము పెద్ద పెద్ద యజ్ఞాలు చేస్తూ వసంతాది షడ్ ఋతువులను సక్రమ పరతుము గాక.

మహర్షి భావార్థం: ప్రపంచ మందలి సర్వ పదార్థాలలోను అన్నము మాత్రమే అతి ప్రశంసాయోగ్యమైనది. ఏలనన పుష్కలమైన అన్నాది పదార్థాలు కలవాడు అన్నిదిశలలోను విజయాన్ని పొందును.

34. ఓం వాజః పురస్తాదుత మధ్యతో నో వాజో
దేవాన్ హవిషా వర్ధయాతి ।
వాజో హి మా సర్వవీరం చకార
సర్వా ఽ ఆశా వాజపతిర్భవేయమ్ ॥ – యజు. 18.34

(1) వాజః పురస్తాత్ + ఉత మధ్యతః + నః = సర్వవ్యాపక సర్వేశ్వరుని కృపవలన మేము పుష్కలమైన అన్న బలములను పొందుదుము గాక. అన్నము మా ఎదుట మరియు మధ్యన ఉండి మాకు ఉన్నతిని కలిగించుగాక.

(2) వాజః + దేవాన్ హవిషా వర్ధయాతి = దానిలో కొద్ది భాగము యజ్ఞాగ్నిలో వేసి బలివైశ్వదేవ ము చేయుదుము గాక. అనంతరం మమ్ము ఆశ్రయించుకొని ఉన్న ప్రాణులకు, పనివారలకు దుఃఖిత దీన ప్రజలకు పంచి మేము పుణ్యభాగులము అగుదుము గాక.

(3) వాజః + హి సర్వవీరం చకార = నా అన్నము తిన్న పుత్ర పుత్రికలు, ఆశ్రితులు అందరు వీరులగుదురు గాక.

(4) సర్వాః + ఆశాః + వాజపతిః +భవేయమ్ = మేము వాజపతులమై అన్న పతులమై అన్ని దిక్కులను జయింతుము గాక. అన్ని దిక్కులలో నున్న శత్రువులను జయించి కీర్తి ప్రతిష్ఠలను పొందుదుము గాక.

35. ఓం సం మా సృజామి పయసా పృథివ్యాః సం మా
సృజామ్యద్భిరోషధీభిః ।
సోఽ హం వాజ సనేయమగ్నే ॥ – యజు. 18.35

భావము: ఓ సర్వాంతర్యామీ! పరమేశ్వర నీచే సృజింపబడిన ఈ పృథివీ మాత మాకు అన్నిరకాల క్షీరాది రసాలను, సోమలతాది ఓషధులను ఇచ్చుచున్నది. నీ వేదజ్ఞానంతో వాటిని చక్కగా ఉపయోగించుకొని మంచి ఆరోగ్యంతో బలవీర్యాలతో దీర్ఘాయుష్మంతులము అగుదుము గాక. నాకు అట్టి జ్ఞానమును విశదపరచి రక్షింపుము. ఆ జ్ఞానంతో నేను తోటివారికి ఉపకారం చేస్తూ కీర్తిని పొందుదును గాక.

36. ఓం పయః పృథివ్యాం పయ౭ ఓషధీషు
పయో దివ్యన్తరిక్షే పయో ధాః ।
పయస్వతీః ప్రదిశః సన్తు మహ్యమ్ ॥ – యజు. 18.36

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! ఈ భూమిపైన త్రాగునీరు నదులు, చెరువులలోనేకాక భూగర్భ జలాలు కూడా ఉన్నాయి. ఇంతేగాక నీరు ఓషధులలో ఒక పంటనిచ్చి ఎండిపోయే ఫల శాఖాదులలోను, చెరకు మొ. వాటిలోను కూడా ఉంది. మీరు ప్రయత్నించి ఆ రసాలను పొందండి. అంతరిక్షంలో మేఘాల రూపంలో ఉంది. అది ఇంకా శుద్ధమైనది. మీకు నలుదిశలలో కూడా గాలిలో తేమరూపంలో నీరు ఉంది. కనుక ఎప్పుడు ఏ నీరు అవసరమో దానిని పొంది సుఖంగా జీవించండి.

(నిఘంటువులలో ఉదకమునకు గల 101 పేర్లలో పయః ఒకటి)

37. ఓం దేవస్య త్వా సవితుః ప్రసవే౭
శ్వినోర్బాహుభ్యాం పూష్ణో హస్తాభ్యామ్ ।
సర్వస్వత్యై వాచో యన్తుర్యన్త్రేణాగ్నేః
సామ్రాజ్యేనాభి షిఞ్చామి ॥ – యజు. 18.37

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! మీరంతా విద్వాంసుడు, బలపరాక్రమ సంపన్నుడునైన క్షత్రియ గుణకర్మ స్వభావాలు కలిగిన ఒకరిని రాజుగా ఎన్నుకోవాలి. అట్టి రాజును రాజ్య పురోహితుడు ఈ మంత్రము చదువుచూ తన రెండు చేతులతో రాజ కిరీటాన్ని అతని శిరస్సుపై ఉంచాలి. ఈవిధంగా ఉపదేశించాలి.

విద్యావంతుడవైన ఓ రాజా! సవితా దేవునిచే సృజింపబడిన ఈ అద్భుతాద్భుత సృష్టిలో నేను ప్రేరితుడనై నా బాహుద్వయంతో నిన్ను మా రాజ్యానికి రాజుగా అభిషిక్తుని చేస్తున్నాను. నీవు సూర్యచంద్రుల వంటి శౌర్య సౌమ్య గుణాలతో కూడిన నీ బాహుద్వయంతో మా ఈ రాజ్యాన్ని ధర్మబద్ధంగా పరిపాలింపుము. ఓ అగ్ని స్వరూప రాజా! నీవు సరస్వతీ వాక్కులైన వేద వాక్కులతో – వేదజ్ఞానంతో మా రాజ్యాన్ని చక్కగా పరిపాలింపుము. సవితా దేవుని ఆశీస్సులు నీకు లభించును గాక.

38. ఓం ఋతాషాడృత ధామాగ్నిర్గన్ధర్వస్త
స్యౌషధయోఽ ప్సరసో ముదో నామ ।
స నఽ ఇదం బ్రహ్మ క్షత్రం పాతు తస్మై
స్వాహా వాట్ తాభ్యః స్వాహా ॥ – యజు. 18.38

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! రాజు దేశ పాలకుడు సత్యభాషణంతో, సత్య వ్యవహారంతో, అగ్ని వంటి దోష నివారక గుణంతో శోభిల్లుతూ ఉండాలి. అట్టివాడే ఈ పృథివిని చక్కగా పాలించగలుగుతాడు. అట్టి రాజే ప్రజలలోని అసత్య వ్యవహారాలను, వ్యసనాలను, సాంఘిక దురాచారాలను పోగొట్టగలుగుతాడు. ప్రజలకు చక్కటి సుఖశాంతులను పంచగలడు. రాజు అప్సరసుడై ఉండాలి. అంటే ప్రజలలో విహరిస్తూ ప్రజల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకోగలగాలి. ఇంతేగాక రాజులలో పాలకులలో బ్రహ్మక్షాత్ర గుణాలు రెండూ వికసించి ఉండాలి. బ్రాహ్మీ శక్తియైన వేదజ్ఞానం, శౌర్య పరాక్రమాది గుణాలు వికసించి ఉండాలి. అట్టి పాలకుడే వేదజ్ఞానాన్ని, క్షాత్రశక్తిని రక్షింపగలడు. వాటిని వికసింపచేయగలడు. ప్రజలకు ముదాన్ని ఆనందాన్ని ఇవ్వగలడు.

తస్మై స్వాహా వాట్ = అట్టి రాజునకు, పాలకులకు తమవంతు బాధ్యతగా (స్వాహా) పన్నుల రూపంగా ధనాన్ని, భూమిని, వస్తువులను అర్పించుకోవాలి.

తాభ్యః స్వాహా = అట్టి పాలకునకును ధన్యవాదాలను, కృతజ్ఞతలను, ప్రశంసలను తెలుపాలి.

వివరణ: దీని తదుపరి మరొక 5 మంత్రాలలో రాజునకుండవలసిన మరికొన్ని గుణాలు తెలుపబడ్డాయి. వైదిక వివాహ సంస్కారంలో ఈ 6 మంత్రాలతో రాష్ట్ర బృహత్ హెూమం చేయిస్తారు. రాష్ట్రోన్నతికి, దేశోన్నతికి వధూవరులు కూడా కృషి చెయ్యాలని ఈ మంత్రాలు బోధిస్తాయి.

39. ఓం స హితో విశ్వసామా సూర్యో గన్ధర్వస్తస్య
మరీచయోఽ ప్సరసఽ ఆయువోనామ ।
స నఽ ఇదం బ్రహ్మ క్షత్రమ్పాతు తస్మై
స్వాహా వాట్ తాభ్యః స్వాహా ॥ – యజు. 18.39

భావము: ఓ మానవులారా! (సంహితః) ఈ సార్వభౌముడు తన ప్రజలతో కలిసేవాడు కావాలి. రాజ్యంలో ప్రజలు వర్ణ జాతి మత భేదాలతో కలహించుకోకూడదు. (విశ్వసామా) అతడు సర్వమానవ హితరతుడై ఉండాలి. (సూర్యః) సూర్యుని వలె సదా గతిమంతుడు కావాలి. అజ్ఞానాంధకారాన్ని పోగొడుతూ ఉండాలి. (గంధర్వః) అందుకొరకై అతడు గంధర్వుడు కావాలి. వేదజ్ఞానాన్ని ధరించేవాడు కావాలి (తస్య అప్సరసః) అప్పుడే అతడు వేదానుసారంగా రాజ్యాన్ని నడుపగలుగుతాడు. (మరీచయః) సూర్య కిరణాలవలె మంచి మంత్రులను, సేనాపతులను, పాలనా వర్గాన్ని నియమించుకొని దేశాన్ని చక్కగా పాలించగలడు, పోషించగలడు. (ఆయువః నామ) ప్రజలతో సంపర్కం పెట్టుకుంటూ మంచి రాజుగా పేరు ప్రఖ్యాతులు పొందగలడు.

సః నః బ్రహ్మ క్షత్రమ్ పాతుః = అట్టి రాజే దేశంలోని బ్రహ్మ క్షత్ర సంపదలను – జ్ఞాన విజ్ఞాలను, శౌర్య పరాక్రమాలను రక్షించగలడు.

తస్మై స్వాహా = అట్టి సమ్రాట్‌కు – ప్రభుత్వానికి ప్రజలు సంతృప్తిగా పన్నులు చెల్లించాలి. దొంగ లెక్కలు చూపించకూడదు.

తాభ్యః స్వాహా = అట్టి ధర్మాత్ముడైన రాజునకు ప్రజలంతా అనుకూలురై సహకరించాలి. అతనిని ప్రశంసించాలి.

40. ఓం సుషుమ్ణః సూర్యరశ్మిశ్చన్ద్రమా
గన్ధర్వస్తస్య నక్షత్రాణ్యప్సరసో భేకురయో నామ ।
స నఽ ఇదం బ్రహ్మ క్షత్రమ్పాతు తస్మై
స్వాహా వాట్ తాభ్యః స్వాహా ॥ – యజు. 18.40

(1) సుషుమ్ణః సూర్యరశ్మిః + చ చన్ద్రమాః = నీ అద్భుతాద్భుత సృష్టిలోని సూర్య చంద్ర కిరణాలు మాకు ఆహ్లాదమును, ఆనందమును ఇచ్చునవి యగును గాక.

(2) గన్ధర్వః + తస్య నక్షత్రాణి అప్సరసో చేకూరయో నామ = సూర్య చంద్ర నక్షత్ర కిరణాలను ధరించు అంతరిక్షము, అశ్విన్యాది నక్షత్ర కిరణాలను ధరించు ఆకాశము మాకు ఆహ్లాదమును కలిగించుగాక.

అట్లే, మా రాజులు, పాలకులు సూర్య చంద్ర నక్షత్ర కిరణాలను ధరించినవారై మమ్ము చక్కగా పాలింతురు గాక. పోషింతురు గాక.

(3) సః నః ఇదం బ్రహ్మక్షత్రమ్ పాతు = అట్టి మా పాలకులును మా దేశ బ్రహ్మ క్షాత్ర సంపదలను శత్రువుల బారిన పడకుండా రక్షింతురు గాక.

(4) తస్మై స్వాహావాట్, తాభ్యః స్వాహా = ఆ సూర్య చంద్ర నక్షత్రాలకు మేము అగ్నిహోత్రంలో ఆహుతులిస్తూ వాటి కాంతిని వృద్ధిపరుస్తూ ఉందుము గాక. మా సంతానమునకును అగ్నిహోత్ర క్రియను నేర్పుదుము గాక.

41. ఓం ఇషిరో విశ్వవ్యచా వాతో
గన్ధర్వస్తస్యాపో౽ అప్సరస౽ ఊర్జోనామ ।
స న౽ ఇదం బ్రహ్మ క్షత్రం పాతు
తస్మై స్వాహా వాట్ తాభ్యః స్వాహా ॥ – యజు. 18.41

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! మీ రాజులు, పాలకులు వేదజ్ఞానంతో గతిశీలురై ప్రజలలో సంచరించెదరు గాక. అప్సరసలవలె – సూర్య చంద్ర నక్షత్ర కిరణాలవలె ప్రజలకు సుఖశాంతులను పంచుదురు గాక. మా బల పరాక్రమములను వృద్ధి చేయుదురుగాక. మమ్ములను గతిశీలుర చేయుదురు గాక.

వారు మా దేశ బ్రహ్మ క్షత్ర సంపదలను – విద్యా విజ్ఞానాలను, సైనిక బలమును రక్షింతురు గాక. అందుకొరకే మేము ఈ ఆహుతులను – అన్నిరకాల పన్నులను చెల్లించుదుము గాక. అవన్నియు మాకు లభించును గాక.

42. ఓం భుజ్యుః సుపర్ణో యజ్ఞో గన్ధర్వస్తస్య
దక్షిణా౽ అప్సరస స్తావా నామ ।
స న౽ ఇదం బ్రహ్మ క్షత్రం పాతు
తస్మై స్వాహా వాట్ తాభ్యః స్వాహా ॥ – యజు. 18.42

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! మీ పాలకుల మొదటి కర్తవ్యం (భుజ్యుః) ప్రజలకు ఆకలి దప్పికలు తీర్చాలి. మంచి పోషకవంతమైన ఆహార పదార్థాలను అందించాలి. ఎవరూ ఆకలి కారణంతో చనిపోకూడదు. కరువు కాటకాలు

రాకూడదు. అట్టి వ్యవస్థను పాలకులు చెయ్యాలి. సుపర్ణులు కావాలి. ఉత్తమ విద్యా విజ్ఞాలనందించాలి.(యజ్ఞః) యజ్ఞశీలురు కావాలి. ప్రజలతో నేరుగా సంపర్కం పెట్టుకోవాలి.

అట్టి రాజుకు మీరు దక్షిణలు + బహుమతులు ఇవ్వాలి. కానుకలను ఇవ్వాలి. వాటిని ఆ రాజు యథాయోగ్యంగా ప్రజలకు పంచాలి. అవసరమైన ప్రాజెక్టులను, బాటలను, ప్రయాణ సాధనాలను ఏర్పాటు చెయ్యాలి.

43. ఓం ప్రజాపతిర్విశ్వకర్మా మనో గన్ధర్వస్తస్యఽ
ఋక్సామానయప్సరసఽ ఏష్టయో నామ ।
స నఽ ఇదం బ్రహ్మ క్షత్రం పాతుం
తస్మై స్వాహా వాట్ తాభ్యః స్వాహా ॥ – యజు. 18.43

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! ప్రజా పాలకులారా! మీ సమ్రాట్ ఎలా ఉండాలంటే – అతడు (ప్రజాపతిః) ప్రజలను పాలించి పోషించి రక్షించేవాడై ఉండాలి. (విశ్వకర్మా) అతడు అన్నిరకాల కర్మలు చేసేవాడై ఉండాలి. ఇది చిన్నపని ఇది పెద్దపని అనే భేదం లేకుండా అన్నిరకాల పనులు చేస్తూ ఆదర్శంగా ఉండాలి. (మనః) అతడు మనన శీలుడై ఉండాలి. ప్రతి పని ఆలోచించి చేస్తూ ఉండాలి. ముఖ్యంగా ఏదైనా క్రొత్త చట్టంగాని, దండనీతి గాని తీసుకు వచ్చేటప్పుడు మంత్రులతో ఆలోచనాపరులతో ఆలోచించి చెయ్యాలి. (గంధర్వః) అతడు వేదజ్ఞానాన్ని ధారణ చేస్తూ దాని ప్రకారం రాజ్యాన్ని పాలించేవాడు కావాలి. (తస్య అప్సరసః) అతని మంత్రులును ఋక్ సామ జ్ఞానాలను ధరించినవారై ఉండాలి. ఋక్ వేదము జ్ఞాన సూచకం, సామవేదం శ్రద్ధాసూచకం. (ఏష్టయః నామ) వారు చక్కటి యజ్ఞశీలురై ఉండాలి. మంచి మంచి కార్యాలు చేయాలనే ఉత్సాహం కలిగినవారై ఉండాలి. (సః నః ఇదం బ్రహ్మ క్షత్రం పాతు) వారు మన బ్రాహ్మీ క్షాత్ర శక్తులను – విద్యా విజ్ఞానాలను, క్షాత్రశక్తిని సురక్షితంగా కాపాడేవాడే కావాలి.

(తస్మై స్వాహా వాట్) అట్టి రాజ్యానికి ప్రజలు ఉదారంగా పన్నులు చెల్లిస్తూ, వారిని గౌరవిస్తూ, సత్కరిస్తూ ఉండాలి. (తాంధ్యః స్వాహా) ఆ విధంగా ఖజానాకు చేరిన ఆ ధనాన్ని వారు సద్వినియోగం చేయాలి. సోమరితనాన్ని వీడి ప్రజలు వారికి సహకరిస్తూ ఉండాలి.

44. ఓం స నో భువనస్య పతే ప్రజాపతే
యస్య త ఉపరి గృహా యస్యవేహ ।
అస్మై బ్రహ్మణేऽస్మై క్షత్రాయ మహి
శర్మ య్చ స్వాహా ॥ – యజు. 18.44

(1) స నో భువనస్య పతే ప్రజాపతే = ఓ సర్వవ్యాపక సర్వేశ్వరా! నీ కృపవలన మా రాజులు, పాలకులు భువనస్య పతులు, ప్రజాపతులు కావాలి. మా గృహాలను, మమ్ములను చక్కగా పాలించి పోషించేవారు కావాలి.

(2) యస్యతే ఉపరి గృహా యస్యవేహ = వారు మాతో ఉత్కృష్టంగా వ్యవహరిస్తూ ఆదరించాలి.

(3) అస్మై బ్రహ్మణే అస్మై క్షత్రాయ = మా దేశ బ్రాహ్మీ క్షాత్రశక్తులను సంపదలను రక్షిస్తూ అభివృద్ధి పరచువారు కావాలి.

(4) మహి శర్మ యచ్చ స్వాహా = మాకు మా గృహాలకు గొప్పదైన సుఖాన్ని కలిగించేవారు కావాలి. మేము అట్టి పాలకులకు పన్నులు సరిగా చెల్లిస్తూ సహకరించెదము గాక.

45. ఓం సముద్రోऽసి నభస్వానార్ద్రదానుః
శమ్భూర్మయోభూరభి మా వాహి స్వాహా ।
మారుతోऽసి మరుతాం గణః
శమ్భూర్మయోభూరభి మా వాహి స్వాహా ।
అవస్యూ రసి దువస్వాఙ్ఛ
మ్భూర్మయోభూరభి మా వాహి స్వాహా ॥

– యజు. 18.45

(1) సముద్రోऽసి నభస్వానా దానుః = ఓ సచ్చిదానంద సర్వేశ్వరా! నీవు ఈ పృథివిపై బహు జలములు గల సముద్రాలను, అంతరిక్షమున ఇంతకన్నను ఎక్కువ జలములను సృష్టించిన దేవదేవుడవు.

(2) శంభూర్ మయోర్ అభిమా వాహి స్వాహా = ఈ జలములు మాకు సదా సుఖశాంతులను ప్రసాదించునవిగా చేసి మమ్ము రక్షించుము.

(3) మారుతో౽సి మరుతాంగణః = నీవు అంతరిక్షమున పయనించు మరుత్ గణములను సృజించిన సృష్టికర్తవు. వాటి జ్ఞానమును మాకు కలిగించి మమ్ము కాపాడుము.

(4) శంభూర్ మయోభూభూర్ అభిమా వాహి స్వాహా = ఇవన్నీ మాకు సదా శాంతులను కలిగించునవిగా చేయుము. అట్టి జ్ఞానాన్ని మాకు ప్రసాదించి రక్షించుము.

46. ఓం యాస్తే౽అగ్నే సూర్యే రుచో దివమాతన్వన్తి రశ్మిభిః ।
తాభిర్నో౽అద్య సర్వాభీ రుచే జనాయ నస్కృధి ॥

– యజు. 18.46

(1) యాః + తే అగ్నే సూర్యే రుచః = ఏ విధంగా సూర్యుడు లోకములను ప్రకాశమొనర్చుచున్నాడో అట్లే మా దేశ విద్వాంసులు ప్రపంచ గురువులై విలసిల్లాలి. అట్టి మహద్భాగ్యము మాకు కలిగించమని సర్వవ్యాపక సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాము.

(2) దివమ్ + ఆతన్వన్తి రశ్మిభిః = ఏవిధంగా సూర్యుడు తన కిరణములతో నలువైపులా నుండు లోకాలను ప్రకాశపరుచుచున్నాడో అట్లే మా విద్వాంసులు సర్వప్రాణిహిత మొనర్చెదరు గాక! వారు రుచులను – దీప్తిని, ప్రీతిని సర్వ ప్రాణులందును కలిగి యుందురు గాక.

(3) తాభిః (రుగ్భిః) నః అద్య సర్వాభీః రుచే జనాయనః + కృధి = హే సర్వవ్యాపక సర్వేశ్వరా! నీవు ఏవిధంగా ఋగాది వేదాలను సర్వ మానవుల కొరకు ఉపదేశించితివో అట్లే మా విద్వాంసులును – సర్వ మానవులకు ఉపదేశింతురు గాక. సర్వజన హితులై ఉందురు గాక. మేమును అట్లే అగుదుము గాక. అట్టి శక్తిని మాకిచ్చి రక్షించుము.

47. ఓం యా వో దేవాః సూర్యే రుచో గోష్వశ్వేషు యా రుచః ।
ఇన్ద్రాగ్నీ తాభిః సర్వాభీ రుచం నో ధత్త బృహస్పతే ॥

– యజు. 18.47

భావము: ఓ బృహస్పతీ! బ్రహ్మాండాధిపతీ! జ్ఞాన స్వరూపదేవా! నాలో సూర్య

సమాన దీప్తిని నింపుము. నీ జ్ఞానంతో నాలో జ్ఞానదీప్తిని కలిగించుము. గోదుగ్ధమును త్రాగుచు నేను నా జ్ఞానేంద్రియాలలో సాత్త్విక దీప్తిని పొందుదును గాక. అట్లే నేను అశ్వాలను సదుపయోగం చేసుకుంటూ నా కర్మేంద్రియాలలో బలమును, ఉత్సాహమును పెంపొందింపచేసుకొందును గాక. ఈ విధంగా బౌద్ధిక శారీరక శక్తులను పెంచుకొందును గాక. వాటిపై అభిరుచిని కలిగియుందును గాక. నీవు ఇంద్ర, అగ్ని శక్తులు గల దేవదేవుడవు కనుక మాకు ఐశ్వర్యమును, జ్ఞానమును ప్రసాదింపుము. వీటితో నేను సర్వప్రాణులకు సేవ చేయుదును గాక.

48. ఓం రుచం నో ధేహి బ్రాహ్మణేషు రుచ రాజసు నస్కృధి ।
రుచం విశ్యేషు శూద్రేషు మయి దేహి రుచా రుచమ్ ॥

– యజు. 18.48

(1) రుచం న ధేహి బ్రాహ్మణేషు = ఓ జగదీశ్వరా! పరమేశ్వరా! మాకు బ్రాహ్మణులపైన జ్ఞాన విజ్ఞానములపైన రుచమును – శ్రద్ధను, ఆసక్తిని కలిగించుము.

(2) అట్లే రుచం రాజసు నస్కృధి = రాజులపైన, పాలకులపైన కూడా శ్రద్ధను, ఆసక్తిని, అభిరుచిని కలిగించుము.

(3) రుచం విశ్వేషు శూద్రేషు = ఇంతేగాక, సర్వ రకాల కర్మచారులపైన – నిపుణులపైన కూడా రుచాన్ని – శ్రద్ధను, అభిరుచిని కలిగించుము.

(4) మయి ధేహి రుచా రుచమ్ = నాయందును, సర్వప్రాణులందును కూడా శ్రద్ధాసక్తులను అభిరుచిని ప్రీతిని కలిగించుము.

మహర్షి భావార్థం: పరమేశ్వరుడు పక్షపాత రహితుడై బ్రాహ్మణులు, శూద్రులు మున్నగు సకల వర్ణములందును సమాన ప్రేమను చూపునట్లే విద్యావంతులందరు సమాన ప్రేమను చూపాలి. పరమేశ్వరుని గుణకర్మ స్వభావానికి విపరీతంగా నడుచువారందరు నీచులు, తిరస్కరించదగినవారు ఔతారు.

49. ఓం తత్త్వా యామి బ్రహ్మణా వన్దమానస్తదాశాస్తే
యజమానో హవిర్భిః ।
ఆహేడమానో వరుణేహ బోధ్యురుశంస మా

న॒ ఆయుః ప్రమోషీః ॥ – యజు. 18.49

భావము: హే సర్వవ్యాపక సర్వేశ్వరా! అగ్నే! నీవు అనేకులచే (ఉరు శంస) ప్రశంసింపబడుచున్నావు. అట్టి నిన్ను నీవిచ్చిన బ్రహ్మవాక్కులతోనే, వేద మంత్రాలతోనే ప్రార్థించుచు నీ శరణు జొచ్చుచున్నాను. (హవిర్భిః) హోమములో వేయదగిన ఉత్తమ పదార్థాలతో హోమం చేస్తూ నిన్ను ప్రార్థించుచున్నాను. నా సాత్త్విక వేదికలు సఫలమగును గాక. నీ యాశ్రయంలో నేను నూరేళ్ళ ఆయువును పొందుదును గాక. నీ వేదవాణిని ప్రచారం చేయుదును గాక. యజ్ఞ యాగాలను చేయుదును గాక.

50. ఓం స్వర్ణ ఘర్మః స్వాహా । స్వర్ణా ర్కః స్వాహా । స్వర్ణ శుక్రః స్వాహా ।
స్వర్ణ జ్యోతిః స్వాహా । స్వర్ణ సూర్యః స్వాహా ॥

– యజు. 18.50

సర్వేశ్వరుని ఉపదేశం: (1) (స్వర్ణఘర్మః అసి) = ఓ మానవులారా! మీరు స్వర్ణ తేజస్సుతో – కీర్తితో వర్ధిల్లాలి. సదా సత్కర్మలు చేస్తూ ప్రపంచ ప్రసిద్ధిని పొందాలి. మచ్చలేని కీర్తిని పొందాలి.

(2) స్వర్ణార్కః స్వాహా = సూర్యుని వంటి తేజస్సుతో బలపరాక్రమాలతో వర్ధిల్లాలి. మచ్చలేని మాణిక్యానివి కావాలి.

(3) స్వర్ణ శుక్రః స్వాహా = (శుచ – దీప్తౌ) = మీరు బ్రహ్మచర్య వ్రతాన్ని పాలిస్తూ బ్రహ్మతేజస్సుతో – ఓజో దీప్తితో వెలుగొందాలి.

(4) స్వర్ణజ్యోతిః స్వాహా = నీవు చక్కటి జ్ఞానదీప్తితో ప్రకాశించాలి. నీవు అంతర్ముఖుడవై పరమాత్మ జ్యోతిని దర్శించాలి. ఆత్మ పరమాత్మల సాక్షాత్కారం పొందాలి.

(5) స్వర్ణ సూర్య స్వాహా = (సూ ప్రసవ + ఐశ్వర్యయోః) = ఓ మానవా! నీవు సూర్యుని వంటి సంతానానికి జన్మనివ్వు. ఉత్తమోత్తమ ఐశ్వర్యాలను పొంది, జన్మను ధన్యం చేసుకో.

51. ఓం అగ్నిం యునజ్మి శవసా ఘృతేన దివ్య
సుపర్ణం వయసా బృహన్తమ్ ।

తేన వయం గమేమ బ్రధ్నస్య విష్టప
స్వో రుహాణా౨ అధినాకముత్తమమ్ ॥

– యజు. 18.51

(1) అగ్నిం యునజ్మి శవసా ఘృతేన = మేము నిత్యం ఘృతంతో ఆవునేతితో అగ్నిహోత్రం చేస్తూ ఈశ్వరాజ్ఞ పాలన చేస్తూ అంతర్యామికి దగ్గరవుదుము గాక.

(2) దివ్యమ్ + సుపర్ణం పయసా బృహన్తమ్ = తద్వారా మేము వాయవాది దేవతలను పవిత్రం చేస్తూ బలపరుస్తూ గొప్ప గొప్ప సుఖములను పొందుదుము గాక.

(3) వయంగమేమ బధ్నస్య విష్టపమ్ + స్వః = ఆ విధంగా ఏము ఇహలోక సుఖాలను అభ్యుదయాన్ని పొందుదుము గాక.

(4) రుహాణాః అధినాకమ్ ఉత్తమమ్ = మేము ఉత్తరోత్తర లోకములను అధిరోహింతుము గాక. ఉత్తమోత్తమ సుఖమైన మోక్షానందాన్ని పొందుదుము గాక.

వివరణ: అగ్నిహోత్రాన్ని మనం జాగ్రత్తగా పరిశీలిస్తే అది మనకు స్వాహాను – త్యాగాన్ని నేర్పుతున్నది. అగ్ని మనం అగ్నిదేవతకు ఆహుతులుగా అర్పించిన ఘృత శాకల్యాదులన్నిటిని అది త్యాగం చేస్తున్నది. గాలిలో కలిపి వేస్తున్నది. అట్లే, మనం కూడా పరమేశ్వరుడిచ్చిన వాటినన్నింటిని లోకహితం కొరకు త్యాగం చెయ్యాలి. అప్పుడు మనకు అభ్యుదయ నిశ్శ్రేయాలు రెండూ ప్రాప్తిస్తాయి.

52. ఓం ఇమౌ తే పక్షావజరౌ పతత్రిణౌ
యాభ్యా రక్షా స్యపహ స్యగ్నే ।
తాభ్యాం పతేమ సుకృతాము లోకం యత్ర౨
ఋషయో జగ్ముః ప్రథమజాః పురాణాః ॥

– యజు. 18.52

పరమేశ్వరుని ఉపదేశం: (1) ఇమౌ తే పక్షావజరౌ పతత్రిణే = ఓ మానవులారా! మీకు నేనిచ్చిన మానవజన్మ ఉత్తమోత్తమమైనది. ఈ మానవ జన్మలో మీకు జ్ఞానము, పురుషార్థము అనే రెండు రెక్కల నిచ్చాను. అవి అజరములు –

ముసలితనం లేనివి. పతత్రిణే = మిమ్ము క్రిందికి పడిపోకుండా కాపాడతాయి. పాపకర్మలు చేసి పతితులు కాకుండా – నీచ జన్మలోనికి పోకుండా కాపాడతాయి.

(2) యాభ్యామ్ రక్షాంసి అపహంసి అగ్నే = వాటితో నీవు నీలోని కామక్రోధాది రాక్షసులను పడగొట్టగలవు. వాటిని జయించగలవు. నీవు అగ్నివి – జ్ఞానం కలవాడవు.

(3) తాభ్యాం పతేమ సుకృతాము లోకం = ఆ రెండు రెక్కలతో – జ్ఞాన కర్మలతో మీరు సుకృతులు – పవిత్రాత్మలు ఏ ఉత్తమ లోకాలకు చేరుకున్నారో – ముక్తి ధామాల్ని చేరుకున్నారో ఆ లోకాలకు నీవు కూడా చేరుకోగలవు.

(4) యత్ర ఋషయః జగ్మః ప్రథమజాః పురాణాః = మానవ సృష్టి ప్రారంభంలో జన్మించిన ఋషులు చేరుకున్న లోకాలకు నీవును చేరుకోగలవు. అక్కడి ముక్తాత్మల ద్వారా నీ జ్ఞానాన్ని ఆనందాన్ని పెంచుకోగలవు.

53. ఓం ఇన్దురక్షః శ్యేనఽ ఋతావా
హిరణ్యపక్షః శకునో భురణ్యుః ।
మహాన్త్సధస్థే ధ్రువఽ ఆ నిషత్తో
నమస్తేఽ అస్తు మా మా హి సీః ॥ – యజు. 18.53

భావము: ఓ మానవులారా! మీ రాజులు, పాలకులు (ఇన్దుః దక్షః) చంద్రుని వంటి శీతల స్వభావం కలవారు (శ్యేనః) డేగవంటి వేగము – పరాక్రమము గలవారు, (ఋతవా) వేదానికి, ప్రకృతి నియమాలకు అనుకూలంగా ఉండువారు కావాలి. (హిరణ్యపక్షః) ఆర్థిక పుష్టిని కలిగించువారు కావాలి. (శకునః భురణ్యుః మహాన్) శక్తిమంతులు, సర్వాన్ని సర్వులను రక్షించువారు, గొప్పవారు కావాలి.

(సధస్థే ఆ నిషత్తః) అందరితో కలిసివుంటూ తన భావాలలో స్థిరంగా ఉండేవారు కావాలి.

(మా మా హింసీః) అట్టి పాలకులారా! అకారణంగా మమ్ము హింసించక మమ్ము పాలించి పోషించండి.

54. ఓం దివో మూర్ధాసి పృథివ్యానాభి
రూర్గపామోషధీనామ్ ।

విశ్వాయుః శర్మ సప్రథా నమస్పృథే ॥ – యజు. 18.54

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! (దివః మూర్ధాసి) మీరు ద్యులోకమే శిరస్సు గలవారు కావాలి. కీర్తి ప్రతిష్టతో వర్ధిల్లాలి. (పృథివ్యానాభిః ఊర్క్ అపామ్ ఓషధీనామ్) ఈ పృథివియే జ్ఞాన జలముయే రసముగా వర్ధిల్లాలి. ఓషధులతో అన్న రసాదులతో బల పరాక్రమములు పొందాలి.

(విశ్వాయుః శర్మ సప్రథా నమ స్పృథే) మీరు వాటితో విశ్వాయువును – నూరు అంతకన్నను ఎక్కువ ఆయువును అనుభవిస్తూ వేదమార్గమున పయనిస్తూ మరెన్నో సుఖశాంతులను పొందాలి.

మహర్షి భావార్థము: ఏ మానవులు న్యాయవంతులు, సహనశీలురు, దివ్య ఔషధాదులు సేవించువారు, యథాయోగ్యముగా ఆహార విహారాదులను సేవిస్తూ జితేంద్రియులౌతారో అట్టి భాగ్యశీలురు నూరు సంవత్సరాలు (అంతకన్నను ఎక్కువగా) ఆనందము ననుభవిస్తారు.

55. ఓం విశ్వస్య మూర్ధన్నధి తిష్ఠసి శ్రితః సముద్రే తే ।
హృదయమప్స్వాయురపో దత్తోదధిం భిన్త ।
దివ్యస్పర్జన్యాదన్తరిక్షాత్ పృథివ్యాస్తతో నో వృష్ట్యావ ॥
– యజు. 18.55

సృష్టికర్త సందేశం: ఓ మానవులారా! మీరు నిత్యం ఈ విధంగా వేద విద్వాంసులను ప్రార్థించండి. ఓ వేద విద్వాంసులారా! (విశ్వస్య మూర్ధన్ + అధి తిష్ఠసి) సమస్త మానవులకు మీరు శిరస్సువలె ఉంటూ మాకు మార్గదర్శనం చేస్తూ ఉండండి. (సముద్రే తే హృదయమ్ అప్సు ఆయుః) మీరు అంతరిక్షం వలె వ్యాపించి ఉన్న పరమేశ్వరుని యందు మీ హృదయమును లగ్నం చేసి ప్రాణశక్తిని దీర్ఘాయువును పొందండి. మమ్మును ఆ మార్గమున నడపండి. సూర్యుడు భూమిపైనున్న జలాన్ని ఆకర్షించి మేఘాలుగా – శుద్ధ జలంగా మార్చి వర్షించునట్లు మీరును వేదోపదేశాలతో మమ్మ పవిత్రపరచి నడిపించండి.

56. ఓం ఇష్టో యజ్ఞో భృగుభిరాశీర్దావసుభిః ।
తస్యన ఇష్టస్య ప్రీతస్య ద్రవిణేహాగమేః ॥ – యజు. 18.56

భావము: ఓ మానవులారా! (ఇష్టో యజ్ఞో భృగుభిః) మీ కామ్య యజ్ఞాలు చేయించుటకు బాగుగా తెలిసిన విద్వాంసులను, వారికి సహాయకులుగా వసు బ్రహ్మచారులును మొదటి తరగతిలో నున్నవారిని ఆహ్వానించి విధి విధానములు తెలిసిన ఒకరిని యజ్ఞబ్రహ్మగా, ముఖ్య విద్వాంసునిగా చేసుకొని యజ్ఞాన్ని నిర్వహించండి. అప్పుడు మీ యజ్ఞాలు సఫలీకృతమౌతాయి. ఆహ్వానించిన వారిని యథాయోగ్యముగా సత్కరించండి. తర్వాత మీకు భగవదాశీస్సులు లభిస్తాయి. మీకును ధనసంపత్తి కలుగుతుంది.

57. ఓం ఇష్టో౩ అగ్ని రాహుతః పిపర్తు న౩ ఇష్ట హవిః ।
స్వగేదం దేవేభ్యో నమః ॥ – యజు. 18.57

భావము: ఓ మానవులారా! మీరు అగ్నిహోత్రం బాగుగా సంస్కరింపబడిన వేయదగిన మంచి పదార్థాలనే ఆహుతులుగా యివ్వండి. తద్వారా జలవాయువులు సంస్కరింపబడి సమయానుకూల వర్షాలతో పుష్కలమైన ఫలసాయముల – మంచి పంటల నిస్తాయి. సమస్త ప్రాణులకు ఎంతో మేలు జరుగుతుంది. కనుక యాజ్ఞిక విద్వాంసులను తగిన విధంగా సత్కరించి వారి ఆశీర్వాదములు పొందండి.

58. ఓం యదాకూతాత్సమసుస్రోద్ధృదో వా
మనసో వా సంభృతం చక్షుషో వా ।
తదను ప్రేత సుకృతాము లోకం
యత్ర౩ ఋషయో జగ్మః ప్రథమజాః పురాణాః ॥

– యజు. 18.58

భావము: ఓ మానవులారా! సత్యాసత్య విచారశీలులారా! ముందుగా మీరు పరమేశ్వరుని గుణకర్మ స్వభావాలను చక్కగా తెలుసుకోండి. దీనితోబాటు అష్టవిధ ప్రమాణాలను, సృష్టిక్రమాన్ని అధ్యయనం చెయ్యండి. అనంతరం (యదాకూత్యా సమసస్రోహృదః) మీరు ఉత్సాహంతో మీ మనో ఋక్కులను ఆత్మ పరమాత్మలతో చక్కగా కలిపి ఆలోచించండి. చక్షు శ్రోత్రాది ఇంద్రియాలతో ఆప్త ఋషులనుసరించిన మార్గాన జీవితం గడుపుతూ ఆ తృతీయధామానికి – ముక్తిధామానికి పయనించండి.

59. ఓం ఏత సధస్థ పరి తే దదామి
యమావహాచ్ఛేవధిం జాతవేదాః ।
అన్వాగన్తా యజ్ఞపతిర్వో౽అత్ర త స్మ
జానీత పరమే వ్యోమన్ ॥ – యజు. 18.59

భావము: ఓ పరమేశ్వర జిజ్ఞాసువులారా! మానవులారా! పూర్వ 58వ మంత్రంలో చెప్పిన విధముగా సర్వాంతర్యామియైన అతడు యజుర్వేదములో తెలిపిన యజ్ఞాలను చేస్తూ ఈశ్వరాజ్ఞాపాలనను అనుసరించాలి. పరమ వ్యోమ స్వరూపుడైన పరమాత్మను చేరుకోవాలి. అట్లే మీరు అనుసరిస్తున్న ప్రాచీన ఋషుల మార్గాన్ని తోటి సామాన్య మానవులకును వివరించి చెప్పాలి.

60. ఓం ఏతం జానాథ పరమే వ్యోమన్
దేవాః సధస్థావిద రూపమస్య ।
యదాగచ్ఛాత్ పథిభిర్దేవయా నైరిష్టా
పూర్తే కృణవాథావి రస్మై ॥ – యజు. 18.60

భావము: ఓ మానవులారా! సర్వాంతర్యామియైన పరమాత్మను చక్కగా తెలుసుకోండి. ఆయన యజుర్వేదంలో తెలిపిన విధంగా ఇష్టాపూర్త కర్మలను – శ్రౌత పూర్త కర్మలను చేస్తూ పూర్వ ఋషులవలె దేవయాన మార్గమున పయనించండి.

వివరణ: యజుర్వేదంలో తెలిపిన వివిధ యజ్ఞాలను ఇష్టకర్మలంటారు. సామాన్య ప్రజల అవసరాలను గుర్తించి వాటికి తగిన విధంగా పరోపకార కర్మలు చెయ్యాలి. వీటిని పూర్త కర్మలంటారు. ఈ రెండును అవసరమే. ఈ రెండు రకాల పరోపకార కర్మలను ఫలాపేక్ష లేకుండా చెయ్యటాన్ని దేవయాన మార్గమంటారు. దీనినే యుగపురుషుడు శ్రీకృష్ణుడు కర్మఫల త్యాగమన్నాడు. అంటే, వేదవిహిత సత్కర్మలను ఆచరిస్తూ వాటివల్ల ఈ లోకంలో పేరు ప్రతిష్టలను కాని, ఉత్తమ జన్మను కాని కోరక కేవలం ముక్తిని మాత్రమే – జన్మరాహిత్యాన్ని మాత్రమే కోరుకోవటం.

దీనిని వివరంగా తెలుసుకోగోరువారు నా రచన "మరణానంతరం జీవుని ప్రయాణం – దేవయాన పితృయాన మార్గాలు" అనే గ్రంథాన్ని చదువగోరుచున్నాను.

61. ఓం ఉద్బుధస్వాగ్నే ప్రతి జాగృహి
త్వమిష్టాపూర్తే స సృజేథామయం చ ।
అస్మిన్త్సధస్థే౽ అధ్యుత్తరస్మిన్ విశ్వే
దేవా యజమానశ్చ సీదత ॥ – యజు. 18.61

భావము: హే అగ్నే! అగ్నివంటి ఋత్విగ్వరా! నీవు లెమ్ము. జాగరూకుడవు కమ్ము. సామాన్య ప్రజలకు జ్ఞానోపదేశం చేయుము. ముఖ్యంగా యజమానుని యజ్ఞకర్తను అవిద్యామోహం నుండి మేల్కొల్పి ఆత్మ పరమాత్మల జ్ఞానాన్ని కలిగించుము. కర్తవ్య కర్మలైన ఇష్టాపూర్త కర్మలు చేయ జాగరూకుని చేయుము.

అనంతరం యజ్ఞకర్త యజ్ఞమునకు విచ్చేసిన సమస్త విద్వాంసులారా! మీ మీ స్థానములందు ఆసీనులై నాచే యజ్ఞ కార్యాన్ని విధిపూర్వకంగా నిర్వహింప చేయండి.

పిమ్మట యజమానియు – యజ్ఞకర్తయు ఆసీనులు కావాలి.

62. ఓం యేన వహసి సహస్రం యేనాగ్నే సర్వవేదసమ్ ।
తేనేమం యజ్ఞం నో నయ స్వర్దేవేషు గన్తవే ॥

– యజు. 18.62

భావము: అగ్నే! ఓ వేద విద్వాంసుడా! ఏ వ్యాకరణాది విద్యల వల్ల నీవు వేదార్థాలను స్పష్టంగా గ్రహించావో వాటిని నీ విద్యార్థులకు బోధించుము. ఈ విధంగా గురుశిష్య పరంపరగా ముందు తరాలకు అందించాలి. ఇది స్వాధ్యాయ యజ్ఞం. దీనివల్ల గురుశిష్యులకు, జిజ్ఞాసువులకు, సామాన్య ప్రజలకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. దీనివల్ల ఎన్నెన్నో సుఖములు ప్రాప్తించగలవు.

63. ఓం ప్రస్తరేణ పరిధినా స్రుచా వేద్యా చ బర్హిషా ।
ఋచేమం యజ్ఞం నో నయ స్వర్దేవేషు గన్తవే ॥

– యజు. 18.63

భావము: ఓ మానవులారా! మీరు ధర్మయుక్తంగా ఆర్జించిన ధనంతో అగ్నిహోత్రంలో వేయదగిన మంచి మంచి పదార్థాలను సేకరించండి. స్వయంగా నిత్యాగ్నిహోత్రం చెయ్యండి. అట్లే, సాంగోపాంగంగా వేదాధ్యయనం చేస్తూ

అధ్యాపనం కూడా చేయండి. దీనిని స్వాధ్యాయ యజ్ఞం అంటారు. ఈ వేదమార్గమే మీకు ఇహలోక సుఖాలను, పరలోక సుఖాలను ప్రసాదిస్తుంది.

64. ఓం **యద్దత్తం యత్పరాదానం యత్పూర్తం యాశ్చ దక్షిణాః ।**
తదగ్నిర్వైశ్వ కర్మణః స్వర్దేవేషు నో దధత్ ॥

– యజు. 18.64

భావము: గృహస్థుడవు కాబోవు ఓ విద్వాంసుడా! నీ గుణకర్మ స్వభావాలకు తగిన వధువును ఎంచుకొని, వివాహమాడి ధర్మయుక్తంగా ఆదాన ప్రదానములు, సన్మానాలు మున్నగునవి ఒనర్చుకొని ఆనందంగా జీవించు.

65. ఓం **యత్రధారా౽ అనపేతా మధోర్ఘృతస్య చ యాః ।**
తదగ్నిర్వైశ్వ కర్మణః స్వర్దేవేషు నో దధత్ ॥

– యజు. 18.65

భావము: గృహస్థులు నిత్యాగ్నిహోత్రంలో మధురములు, సుగంధములునైన హోమ ద్రవ్యాలు మరియు ఘృతము (ఆవునెయ్యి) పుష్కలంగా ఆహుతులిస్తూ ఉండాలి. అట్టివారు సర్వరోగ రహితులై పెక్కు సుఖాలను అనుభవిస్తారు.

66. ఓం **అగ్నిరస్మి జన్మనా జాతవేదా ఘృతం**
మే చక్షురమృతం మ౽ ఆసన్ ।
అర్కస్త్రిధాతూ రజసో విమానో౽ జస్రో
ఘర్మో హవిరస్మి నామ ॥ – యజు. 18.66

భావము: నేను జన్మతోనే జాతవేదాగ్నివలె ఉన్నాను. ఏవిధంగా ఘృతం అగ్నికి మరింత ప్రకాశమునిస్తుందో అట్లే నాకును నిత్యాగ్నిహోత్రం ప్రకాశాన్నిచ్చును గాక. అగ్నిహోత్రంలో సంస్కరించబడిన హోమద్రవ్యాలను హోమ మొనరిస్తే జలవాయువులు, తద్వారా ఆహార పదార్థాల అమృతం లభిస్తుంది. త్రిధాతు నిర్మిత శరీరం బలవీర్యాలను సంతరించుకొంటుంది. విమానాది ప్రయాణ సాధనాలను నిర్మించుకొని దేశ విదేశాలలో యాత్రలు జరిపి విశేష సుఖాలను పొందవచ్చును.

67. ఓం ఋచో నామాస్మి యజూంషి నామాస్మి సామాని నామాస్మి ।
యే౾ అగ్నయః పాఞ్చజన్యా౾ అస్యాం పృథివ్యామధి ।
తేషామసి త్వముత్తమః ప్ర నో జీవాతవే సువ ॥

– యజు. 18.67

భావము: ఓ మానవులారా! వేద విద్వాంసులారా! మీలో ఋగ్వేదము నధ్యయనం చేసినవారిని ఋగ్వేదియని, యజుర్వేదము నధ్యయనం చేసినవారిని యజుర్వేది యని పిలవబడతారు. అట్లే, సామవేదాధ్యయనం చేసినవారిని సామవేది యని, అథర్వ వేదము నధ్యయనం చేసినవారిని అథర్వవేదియని పిలువబడతారు.

అట్లే రెండు వేదముల నధ్యయనం చేసినవారిని ద్వివేదులని, మూడు వేదముల నధ్యయనం చేసినవారిని త్రివేదులని అంటారు. నాలుగు వేదాలను అధ్యయనం చేసినవారిని చతుర్వేదులని అంటారు. ఇవే క్రమంగా ఇంటిపేరులుగా మారాయి. క్రమంగా అవి వేదాలు అసలు చదువకపోయినా వారి కుమారులకు, మనుమలకు, ముని మనుమలకు ఇంటిపేరులుగా స్థిరపడ్డాయి. కులాలు కూడా ఇట్లే ఏర్పడినవి.

68. ఓం వార్త్రహత్యాయ శవసే పృతనాశ్యాహాయ చ ।
ఇన్ద్ర త్వావర్తయామసి ॥ – యజు. 18.68

భావము: ఓ ఇంద్ర సేనాపతీ! విరుద్ధ భావాలు గల శత్రు సైన్యాలను చీల్చి చెండాడుము. వారెంతటి బలవంతులైనా ఎదిరించి నిలువరించు. ధర్మపక్షాన ఉన్న మనకు దైవ సహాయ్యము తప్పక లభిస్తుంది.

"వయం జయేమ త్వయాయుజ" పరమేశ్వర సఖ్యతతో మనకు సదా విజయమే ప్రాప్తించును గాక.

వివరణ: వృత్ర పదమే ఇచ్చట వార్త్రగా చెప్పబడింది.

69. ఓం సహదాను మ్పురుహూత క్షియన్త
మహస్త మిన్ద్ర సంపిణక్ కుణారుమ్ ।
అభివృత్రం వర్ధమానం పియారు
మపాదమిన్ద్ర తవసా జఘన్థ ॥ – యజు. 18.69

భావము: ఓ పురూహూత ఇంద్ర – గొప్ప పేరు ప్రఖ్యాతులు గల సేనాపతీ! పాదాలు లేకనే చిన్న చిన్న మేఘాలన్నీ కలిసి ఒకటైన కారుమేఘాన్నివృత్రున్ని సూర్యుడు వర్షింపజేసి ఛిన్నాభిన్నము చేయునట్లు నీవు శత్రుసైన్యాన్ని ఛిన్నాభిన్నం చేయుము. ధర్మం పక్షాన పోరాడు. మనకు విజయం తప్పక కలుగగలదు.

వివరణ: ఇన్ద్ర పదము **'ఇది పరమైశ్వర్యే'** అను ధాతువుతో నిర్మింపబడినా ప్రకరణాన్నిబట్టి చాలా అర్థాలు తీయవచ్చు. బల వీర్యాలు కూడా ఐశ్వర్యాలే కనుక ఇచట రాజునకు, సేనాపతికి, నాయకునకు, సూర్యునకు పర్యాయ పదాలుగా చెప్పబడ్డాయి.

70. ఓం వి న౨ ఇన్ద్ర మృధో జహి నీచా యచ్ఛ పృతన్యతః ।
యో౨ అస్మాన్౨౨ అభిదాసత్యధరం గమయా తమః ॥

– యజు. 18.70

భావము: ఓ ఇంద్ర సేనాపతీ! నీవు అత్యంత శక్తియుక్తులు గల వీరుడవు. ఎన్నెన్నో యుద్ధములలో విశేషముగా జయించిన వీరాధివీరుడవు. నీవు నీ సైన్యములతో కూడి మా శత్రువులను నీచగతికి గొనిపొమ్ము. ఏ శత్రువు మమ్మ నష్టపరచు కోరికతో ఉన్నాడో వానిని కూడా అధోగతి రూప అంధకారమున పడవేయుము. రాజు మరియు ప్రజల మధ్య మనస్పర్థలు కలిగించు చాడీకోరులకు అతి కఠోర దండన విధించుము.

71. ఓం మృగో న భీమః కుచరో గిరిష్ఠాః
పరావత౨ ఆజగన్థా పరస్యాః ।
సృకం సం శాయ పవిమిన్ద్ర తిగ్మం
వి శత్రూన్తాఢి వి మృధో నుదస్వ ॥

– యజు. 18.71

భావము: ఓ ఇన్ద్ర సేనాధ్యక్షా! ఓ వీరుడా! నీవు పర్వత గుహలందుండు కుటిల నడకలు గల భీకర సింహము వంటివాడవు. నీవు దూర దూర ప్రాంతములందున్న శత్రువులను కూడా నలువైపుల నుండి నీ సైన్యముతో ఆక్రమించి దిగ్బంధనమొనర్చగల సమర్థుడవు. నీ వజ్రము వంటి శస్త్రములతో వారిపై దాడి చేయుము. వారి పీచమణగించి బందీలను చేయుము. వారికి తగిన

విధంగా దండన విధించి బుద్ధి చెప్పుము.

72. ఓం వైశ్వానరో న౨ ఊతయ౨ ఆ
ప్రయాతు పరావతః ।
అగ్నిర్నః సుష్టుతీరుపః ॥ – యజు. 18.72

భావము: ఓ వీర సేనాపతీ! వైశ్వానరాగ్ని సమస్త పదార్థాలకు ప్రాప్తించునట్లే నీవును మాకు సులభ ప్రాప్యుడవు కమ్ము. మా కష్టములను గూఢచారుల ద్వారా తెలుసుకొని కాపాడుము. శత్రు భయము లేకుండా చేయుము.

73. ఓం పృష్టో దివి పృష్టో౨ అగ్నిః పృథివ్యాం
పృష్టో విశ్వా౨ ఓషధీరావివేశ ।
వైశ్వా నరః సహసా పృష్టో౨ అగ్నిః
స నో దివా స రిషస్పాతు నక్తమ్ ॥ – యజు. 18.73

భావము: ఓ మానవులారా! మీరు ఆకాశంలో జ్వలించు సూర్యాగ్నిని పృథివిలో కనబడు రకరకాల అగ్నులను మరియు ఓషధులలో అంటే ఒక పంటనిచ్చి ఎండిపోయే వరి, గోధుమ, కంది, పెసర మొదలగు ధాన్యములలో దాగియుండు శక్తి రూపాగ్నిని, సర్వ పదార్థాలలో వ్యాపించిన వైశ్వానరాగ్నిని విద్యుదాగ్నిని చక్కగా తెలుసుకోండి. వాటితో వివిధ ప్రయోజనాలను సిద్ధించుకోండి. వాటితో మీరు శస్త్రాస్త్రాలను నిర్మించుకొని శత్రువులపై విజయం సాధించుకోండి.

74. ఓం అశ్యామ తం కామమగ్నే తవోతీ౨
అశ్యామ రయిం రయివః సువీరమ్ ।
అశ్యామ వాజమభి వాజయన్తో౨
శ్యామ ద్యుమ్న మజరాజరం తే ॥ – యజు. 18.74

భావము: అగ్నే! యుద్ధవిద్యా కుశలుడవగు ఓ రాజా! సైన్యాధ్యక్షా! మేము నీ రక్షణలో నిశ్చింతగా పెక్కు సుఖములను పొందుదుముగాక. మా కామితములను – కోరికలను తీర్చుకొందుదుముగాక! పుష్కల ధనధాన్యాలతో, బల వీర్యాలతో చిరకాలం జీవింతుము గాక.

75. ఓం వయం తే౽ అద్య రరిమా హి
కామముత్తానహస్తా నమసోపసద్య ।
యజిష్ఠేన మనసా యక్షి దేవానస్రేధతా
మన్మనా విప్రో౽ అగ్నే ॥ – యజు. 18.75

భావము: ఓ వేద విద్వాంసులారా! విజ్ఞానవేత్తలారా! మేము వినయ పూర్వకంగా చేతులెత్తి నమస్కరిస్తూ నీ చెంత చేరుచున్నాము. మీ సాంగత్యంతో – సత్సంగంతో మేము వివిధ విషయాలను తెలుసుకొందుము గాక. శుభ గుణములను పొందుదుము గాక. పూర్ణకాములమై భగవంతుని చేర యత్నింతుము గాక.

76. ఓం ధామచ్ఛదగ్నిరిన్ద్రో బ్రహ్మా దేవో
బృహస్పతిః సచేతసో విశ్వే దేవా
యజ్ఞం ప్రావన్తు నః శుభే ॥ – యజు. 18.76

భావము: ఓ మానవులారా! వేద విద్వాంసులు (ధామచ్ఛత్) జన్మస్థాన నామాలను చక్కగా తెలుసుకొనగలరు. కనుక అగ్ని విద్యుత్‌ల వంటి మంత్రులు రాజులు వేదవాణిని చక్కగా కాపాడాలి. ప్రతి ఊరిలో వేద గురుకులాలు స్థాపించి పఠన పాఠనముల ద్వారా – అధ్యయన అధ్యాపనముల – ద్వారా చతుర్వేదాలను కాపాడుచు భావితరాలకు అందించాలి. యజ్ఞ యాగాదులను నిర్వహిస్తూ ప్రజలకు శుభాలను కలిగించాలి.

77. ఓం త్వం యవిష్ఠ దాశుషో నౄంః పాహి శృణుధీ గిరః ।
రక్షా తోకముత త్మనా ॥ – యజు. 18.77

భావము: పూర్ణ యువావస్థయందున్న ఓ రాజా! సైన్యాధ్యక్షా! నీవు విద్యాదాతవు కావాలి. మానవులను విద్యావంతులుగా, వివేకవంతులుగా చెయ్యాలి. విద్వాంసులను, ఆచార్యులను గౌరవిస్తూ వారి ఉపదేశాలను శ్రద్ధగా వింటూ ఉండాలి. వారి ఉపదేశాలను ఆచరించాలి.

యుద్ధములో మరణించిన వారి పత్నులను, వారి సంతానాన్ని స్వబంధువులుగా ఆదరించి వారికి పాలన పోషణలు చెయ్యాలి.

మహర్షి భావార్థము: సభ మరియు సేనాధ్యక్షులకు రెండు కార్యములు

అవశ్యకర్తములపై యున్నవి.

(1) విద్వాంసులను ఆదరించుట మరియు వారి ఉపదేశాలను ఆచరించుట.

(2) యుద్ధమున మరణించిన వారి స్త్రీలను (పత్నులను) వారి సంతానమును పాలించి పోషించటం.

ఇట్టి సద్గుణ శీలురు సదా విజయులై వివిధ ఐశ్వర్యాలను, సుఖాలను వృద్ధి పరచగలరు.

యజుర్వేద 18వ అధ్యాయం సమాప్తం

★★★

అథర్వవేదీయ విజయ సూక్తం

ఋషిః – వశిష్ఠః దేవత – పురోహితః

(పురానికి మేలుచేసే రాజు గురించి)

యుద్ధవిద్యోపదేశము

1. ఓం సంశితం మ ఇదం బ్రహ్మ సంశితం వీర్యం బలమ్ ।
సంశితం క్షత్ర మజరమస్తు జిష్ణుర్యేషామస్మి పురోహితః ॥

అథర్వ. 3.19.1

భావము: ఈ రాజ్య పురోహితుడనైన నేను – పురానికి (దేశానికి) మేలు చేసే రాజునైన నేను నా రాజ్యంలో బ్రహ్మశక్తిని వేద విద్వాంసులను, విజ్ఞానవేత్తలను సిద్ధంచేసి ఉంచినాను. వారు నా దేశలో ఎట్టి సంకటస్థితి ఏర్పడినను తమ జ్ఞాన విజ్ఞానాలతో రక్షించగలరు. అట్లే, మా రాజ్యంలో వీర్యశక్తిని – పరాక్రమం గల సేనాపతులను, బలశక్తిని – తగిన సైనిక బలాన్ని సిద్ధంగా ఉంచినాను. వారెట్టి ఆక్రమణదారులనైనా జయించగలరు. వారికి తగిన గుణపాఠం చెప్పగలరు.

మా దేశ క్షాత్రశక్తి అజరం, ముసలితనం లేనిది. వృద్ధాప్యం వచ్చినవారిని తొలగిస్తూ యౌవనవంతులను చేర్చుకుంటూ జాగ్రత్త పడ్డాను. వారంతా జయశీలురు – పరాజయం ఎరుగనివారు. అట్టి రాజ్యానికి నేను పురోహితుడనని చెప్పుకొనుటకు గర్వించుచున్నాను.

(రాజులు, ప్రభుత్వాలు అలాగుండాలని భావం)

2. ఓం సమహమేషాం రాష్ట్రం స్యామి సమోజో వీర్యం బలమ్ ।
వృశ్చామి శత్రూణాం బాహూననేన హవిషా హమ్ ॥

అథర్వ. 3. 19. 2

భావము: ఈ దేశ పురోహిత రాజునైన నేను నా వీరుల శారీరక బలాన్ని, వీర్యత్వాన్ని - పరాక్రమాన్ని మరియు సైనికబలాన్ని చక్కని పద్ధతిలో వృద్ధిపరతునుగాక. వీరులను గౌరవిస్తూ, బహుమతులనిచ్చి ప్రోత్సహింతును గాక. శత్రువుల భుజములను నరికివేసి వారిని నిర్వీర్యుల చేయుదునుగాక! సదా జయమునే పొందుదునుగాక.

3. ఓం నీచైః పద్యన్తామధరే భవన్తు యేనః
సూరిం మఘవానం పృతన్యాన్ ।
క్షిణామి బ్రహ్మణామిత్రా
నున్నయామి స్వానహమ్ ॥ అథర్వ. 3. 19. 3

భావము: క్షత్రియ రాజునైన నేను ఎంతటి బలమైన శత్రువునైనా క్రింద పడగొట్టెదను. మరల లేవకుండ అణిచిపెట్టెదను, అట్లని నాకెవరిపైనా శత్రుత్వం లేదు. నా ప్రజలను, రాజ్యమును కాపాడుటకే యుద్ధం చేసెదను. వేదజ్ఞానపు కవచముతో అందరిని మిత్రభావంతో చూచెదను గాక. నా ప్రజల ఉన్నతికై పాటుపడెదను గాక.

4. ఓం తీక్ష్ణీయాంసః పరశోరగ్నేస్తీక్ష్ణతరా ఉత ।
ఇన్ద్రస్య వజ్రాత్ తీక్ష్ణీయాంసో యేషామస్మి పురోహితః ॥

అథర్వ. 3. 19. 4

భావము: నేను ఏ దేశానికి పురోహితుడనో - రాజునో ఆ దేశ రక్షణకు (ప్రజల ధన మాన ప్రాణ రక్షణకు) ఎంతటి బలవంతుడైన శత్రువు దాడికి వచ్చినా జంకను, వెరువను. నేను అనేకానేక పరశువులను - ఆయుధాలను సేకరించి సిద్ధంచేసి పెట్టుకున్నాను.

అవసరమైతే ఇంద్రుని వజ్రాయుధం వంటి ఆయుధాలను ప్రయోగించెదను. అటువంటి అత్యధిక శక్తివంతమైన ఆయుధాలను కూడా సేకరించి పెట్టుకున్నాను.

నేను ఇంద్రుడను - రాజును.

వివరణ: ఇంద్రుని వజ్రాయుధం అంటే మేఘాల నుండి వెలువడే ఉరుములు, మెరుపులు, పిడుగులు. వాటిలో విద్యుత్ చాలా ఎక్కువగా ఉంటుంది. పిడుగుల వంటి బాణాలతో వారిని మట్టుపెట్టెదనని భావం.

5. ఓం ఏషా మహమాయుధా సం స్యామ్యేషాం
రాష్ట్రం సువీరం వర్ధయామి ।
ఏషాంక్షత్రమజర మస్తు జిష్ణ్వేషాం
చిత్తం విశ్వేఽవన్తు దేవాః ॥ అథర్వ. 3. 19. 5

భావము: ఈ దేశ పురోహిత రాజునైన నేను నా వీరుల ఆయుధాలన్నిటినీ మరింత దృఢపరతును. కత్తులు, కటార్లను, బళ్ళెములను మరింత పదునెక్కించెదను. ఆయా ఆయుధాల ప్రయోగాలలో మరికొంత ప్రావీణ్యతను పెంపు చేయుదును. సాహస వీరులను తగినవిధంగా గౌరవింతును. బహుమతులనిచ్చి ప్రోత్సహించెదను. వారి చిత్తాలకు - మనస్సులకు ప్రసన్నతను, ఉల్లాసమును కలిగింతును.

6. ఓం ఉద్ధర్షన్తాం మఘవన్వాజినాన్యుద్
వీరాణాం జయతామేతు ఘోషః ।
పృథగ్ ఘోషా ఉలులయః కేతుమన్త ఉదీరతామ్ ।
దేవా ఇన్ద్రజ్యేష్ఠా మరుతో యన్తు సేనయా ॥

అథర్వ. 3. 19. 6

భావము: ఓ మఘవన్! ఐశ్వర్యశాలివైన రాజా! వివిధ సైన్య దళముల సైన్యాన్ని ఉత్సాహపరుస్తూ శత్రువుల దాడిని ఎదుర్కొనుము. వారిని జయిస్తూ జయకారాలతో, సింహనాదాలతో తిరిగి రమ్ము. ముఖ్య సేనాపతులను, వీరులను సత్కరించుము. సైన్యం యొక్క ఉత్సాహాన్ని మరింత వృద్ధి పరచుము.

7. ఓం ప్రేతా జయతా నర ఉగ్రా వః సన్తు బాహవః ।
తీక్ష్ణేషవోఽ బలధన్వనో హతో గ్రాయుధా అబలా నుగ్ర
బాహవః ॥ అథర్వ. 3. 19. 7

భావము: ఓ వీర నరుడా – సైనికుడా! శత్రు సైన్యాన్ని ముట్టడించుము, జయించుము, మీ భుజములు ప్రచండములగును గాక. మీ ఆయుధాలు తీక్ష్ణమగును గాక. ఓ భయంకర ఆయుధాలు గల వీరులారా! ఉద్యమించండి. నిర్బల ఆయుధాలతో, నిర్బల సైనికులతో నున్న శత్రుసేనపై విరుచుకు పడుడు. వారిని జయించుడు. మీ కీర్తి మరింత ఇనుమడించునుగాక.

8. ఓం అవసృష్టా పరా పత శరవ్యే బ్రహ్మసంశితే 1జయామిత్రాన్
ప్ర పద్యస్వ జహ్యేషాం వరం వరం మామీషాం మోచి కశ్చన ॥
అథర్వ. 3.19.8

భావము: బ్రహ్మ సంశితమైన – వేదజ్ఞానంతో పదును పెట్టబడిన (నిర్మింపబడిన) ఓ బాణమా! ఆయుధమా! నీవు గొప్ప పరాక్రమంతో శత్రుసేనపైబడి వారిని చీల్చి చెండాడుము. శత్రువులను జయించుచు ఓ సైనికులారా! ముందుకు సాగుడు. వారిలోని వీరులనందరిని చంపివేయుడు. మీనుండి ఎవ్వరును తప్పించుకొనకూడదు. శత్రువులను నిశ్శేషముగా చంపివేయుడు. మీరంతా శౌర్య పరాక్రమాలు గల వీరసేన అని ప్రసిద్ధి పొందాలి.

(విజయ సూక్తము సమాప్తం)

అథర్వవేదీయ కృషీవల సూక్తం

ఈ తొమ్మిది (9) మంత్రాల చిన్న సూక్తానికి ఋషి – విశ్వామిత్రుడు, దేవత – కృషీవలా. ఈ సూక్త అధ్యయన మనన చింతనలు చేయటం వల్లనే ఆదిమానవులు వ్యవసాయం చెయ్యటం నేర్చుకున్నారు. డార్విన్‌గారు చెప్పిన వికాసవాదంతోకాదు. జంతువులను అనుకరిస్తూ మానవులు అన్నీ నేర్చుకున్నారు, జ్ఞానవంతులయ్యారనటం హాస్యాస్పదం. ఐతే, ఏ జంతువులను అనుకరించి మానవుడు వ్యవసాయం చేస్తున్నాడు? గృహాలను కట్టుకున్నాడు? వస్త్రాలను నేసి బట్టలు ధరిస్తున్నాడు? అని అడుగవలసి వస్తుంది. మరికొన్ని విషయాలు క్రమంగా తెలుసుకుందాము –

1. ఓం సీరా యుఞ్జన్తి కవయో యుగా వి తన్వతే పృథక్ ।
ధీరా దేవేషు సుమ్నయౌ ॥ అథర్వ. 3.17.1

భావము: కవులు – బుద్ధిమంతులైన మానవులు సీరాలకు – నాగళ్ళకు ఎద్దులను కట్టి భూమిని చక్కగా దున్నవలెను. అనంతరం మంచి విత్తనాలు వేసి, నీరు ఎరువులు అందించవలెను. తాము మంచి పంటలను పొంది, వాటిని తోటి మానవులకు కొంత పెట్టి తాను అనుభవించవలెను.

వివరణ: కృషీవలులంటే కష్టించి వివిధ పంటలను పండించే రైతులని సామాన్యార్థం. వేదాలలో "కృషి, కష్ట" అనే పదములు పెక్కుచోట్ల కనబడతాయి. ఇవి ఆంగ్లపదం Cultureతో సమానం. కనుకనే ఆంగ్లంలో వ్యవసాయాన్ని Agriculture అంటారు. కృషి, కష్ట పదములు Culture కన్నను ఎక్కువ విశిష్ట అర్థాలను కలిగి ఉంటాయి.

వైదిక వ్యాకరణంతో ఈ పదములను లోతుగా ఆలోచిస్తే విశిష్టమైన అర్థాలుంటాయని వ్యాకరణ విద్వాంసులంటారు. వారేమంటారంటే – "భూమిలో గర్భితమైన (దాగివున్న) ఆహార సంపదలను నేర్పుతో బయటకు తీసుకురావటం కృషి. కృషీవలురు అంటే వ్యవసాయదారులు (రైతులు)" అంటారు.

వేదాలలో వికసిత మానవుని (Well Cultured Personని) కృషి పదముతో సంబోధించటం అక్కడక్కడ కనబడుతుంది. సంస్కృతి పదము కన్నను కృషి పదము విశిష్టమైనది. సంస్కృతి, సంస్కారాలు కేవలం దోషాలను పోగొట్టి (సరిచేసి) సద్గుణాలను నింప ప్రయత్నిస్తాయి.

ఉదా: బియ్యంలో రాళ్ళను, ధూళిని, ఇతరాలను తొలగించటం సంస్కృతి, సంస్కారం అయితే – బియ్యాన్ని పండించడం (భూమిలో దాగివున్న ఆహారాన్ని బయటకు రాబట్టడం) కృషి ఔతుంది.

మానవులోని నిగూఢ శక్తులను బయటకు తీసుకువచ్చి వికసింపచేయటం కృష్ట ఔతుంది. రావి, మట్టిచెట్టు బీజాలు చాలా చిన్నగా ఉంటాయి. దానిని చక్కని భూమిలో నాటి పోషిస్తే మహావృక్షాలవుతాయి. అట్లే, మానవులను (జీవులను) మాతాపితలు, ఆచార్యులు, సమాజం, ప్రభుత్వం వారిలో దాగివున్న శక్తులను వెలికితీసి పెంచితే మహాత్ములౌతారు. ఋషులౌతారు. విజ్ఞానవేత్తలౌతారు. కనుక వీరిని కృషకులనవచ్చు.

2. ఓం యునక్త సీరా వి యుగా తనోత
కృతే యోనౌ వపతేహ బీజమ్ ।
విరాజః శ్నుష్టిః సభరా అసన్నో
నేదీయ ఇత్ సృణ్యః పక్వమా యవన్ ॥ అథర్వ. 3. 17. 2

భావము: ఓ శోభాయమాన చతురులైన కర్షకులారా! నాగళ్ళను చక్కగా సిద్ధం చేయండి. వాటికి ఎద్దులను సంయుక్తం చెయ్యండి (కట్టండి). చక్కగా దున్నిన తదుపరి మంచి విత్తనాలను నాటండి – విత్తండి. కంకులు బాగా పక్వమైన తదుపరి కొడవళ్ళతో భూమికి దగ్గరగా కోసి ఎండించండి.

3. ఓం లాఙ్గలం పవీరవత్ సుశీమం సోమసత్సరు ।
ఉదిద్ వపతు గామవిం ప్రస్థావద్
రథవాహనం పీబరీం చ ప్రఫర్వ్యమ్ ॥ అథర్వ. 3. 17. 3

భావము: ఓ కృషీవలులారా! మీ లాఙ్గములకు – నాగళ్ళకు చక్కటి పవీరవత్‌లను – నాగటి కఱ్ఱలను అమర్చండి. గట్టి త్రాడును (మోకును) కట్టండి. పట్టుకునే పిడి నునుపుగా పట్టుకునేందుకు అనువుగా ఉండాలి. అట్టి నాగళ్ళకు బలము గల ఎడ్లను కట్టి భూమిని లోతుగా నాగటి చాలు వచ్చేటట్టు చేయండి. అట్టి భూములే మీకు సంపదలను తెస్తాయి.

4. ఓం ఇన్ద్రః సీతాం నిగృహ్ణాతు తాం పూషాభి రక్షతు ।
సానః పయస్వతీ దుహాముత్తరాముత్తరాం సమామ్ ॥

అథర్వ. 3. 17. 4

భావము: ఇన్ద్రుడు – ఆహార ఐశ్వర్యాన్నిచ్చే కృషీవలుడు (రైతు) సీతకు – నాగటి చాళ్ళతో బాగా దున్నిన భూమికి చుట్టూ ముళ్ళకంచెలు నాటి పశువులు వచ్చి తినిపోకుండా రక్షించాలి. అనంతరం ఆ భూమికి తగినంత నీటిని అందించాలి. అనంతరం కొయ్య పలకతో (గొఱ్ఱుతో) చదును చేయాలి. అనంతరం మంచి విత్తనాలను విత్తాలి. ఆ విధంగా తయారుచేసిన క్షేత్రం (భూమి) ఉత్తమోత్తమ పంటలను అందించగలదు.

5. ఓం శునం సుఫాలా వి తుదన్తు భూమిం
శునం కీనాశా అను యన్తు వాహాన్ ।
శునాసీరా హవిషా తోశమానా
సుపిప్పలా ఓషధీః కర్తమస్మై ॥ అథర్వ. 3.17.5

భావము: సుఫాలాః – (చక్కని కఱ్ఱులు అమర్చిన నాగళ్ళు) **శునం భూమిం వితుదన్తు** (యిబ్బంది లేకుండా భూమిని దున్నునుగాక) **కీనాశాః** (శారీరక శ్రమను సహించగల కర్షకులు – రైతులు) **అనుయన్తు వాహామ్** (ఎడ్లబళ్ళను నిర్మించి అందు సుఖముగా పయనింతురుగాక) **శునాసీరా హవిషా తోషమానా** (పుష్కల వర్షములను కురిపించు ఓ సూర్య వరుణులారా! మీరు ఈ రైతులకు సహకరించి తగినంత జలములను కురిపించెదరుగాక. **సుపిప్పలా ఓషధీః కర్తమస్మై –** చక్కటి పంటలను పొంది రైతులు ఆనందింతురుగాక.

6. ఓం శునం వాహాః శునం నరః శునం కృషతు లాఙ్గలమ్ ।
శునం వరత్రా బధ్యన్తాం శున మష్ట్రాముదిఙ్గయ ॥
అథర్వ. 3.17.6

భావము: శునం వాహాః – బరువులు మోయు ఎద్దులు మొ. పశువులు సుఖముగా నుండుగాక.

శునం నరః – నరులు – కష్టించి పనిచేయు రైతులు, కూలీలు సుఖముగా నుందురుగాక.

శునం కృషతు లాఙ్గలమ్ – లాంగములకు – నాగళ్ళకు ఎద్దులు, **శునం పరత్రా బధ్యన్తాం –** చక్కగా కట్టబడును గాక.

శున మష్ట్రాముదిఙ్గాయ – ఎద్దులను అదలించుటకు వాడు ముళ్ళుగఱ్ఱలు వాటికి ఎక్కువ బాధ కలగకుండునట్లు వాడుదురుగాక.

7. ఓం శునాసీరేహ స్మ మే జుషేథామ్ ।
యద్ దివి చక్రథుః పయ స్తేనేమాముప సిఞ్చతమ్ ॥
అథర్వ. 3.17.7

భావము: ఓ శునాసీరులారా! సూర్య వాయువులారా! మా ప్రార్థనలను

ఆశీర్వదించుడు. మీరు ఏ నీటిని మేఘముల రూపమున ఆకాశమున స్థిరపరచిరో ఆ నీటిని మా పంట భూములపై వర్షింప చెయ్యండి. మా భూములను చక్కగా తడిపి మాకు పుష్కలమైన ధాన్యాలను ప్రసాదించండి.

8. ఓం సీతే వర్ధామహే త్వార్వాచీ సుభగే భవ ।
యథా నః సుమనా అసో యథా నః సుఫలా భువః ॥

అథర్వ. 3.17.8

భావము: హే సీతే! చక్కగా దున్నబడిన ఓ భూమీ! నీవు అన్నము నిచ్చు అమ్మవు. భూమాతవు. అన్న లక్ష్మివి. అందుచే నీకు వందనము లర్పించుచున్నాము. అర్వాచీభవ – ఓ సౌభాగ్యవతీ! ఎప్పుడును మా ఎదుటనే ఉండుము. సదా మాకు బలకరమైన, ఆరోగ్యకరమైన ఆహారము నిచ్చుచు కాపాడుము.

9. ఓం ఘృతేన సీతా మధునా సమక్తా విశ్వైర్దేవై రనుమతా వ ।
సానః సీతే పయసా భ్యావవృత్స్వోర్జస్వతే ఘృతవత్పిన్వమానా ॥

అథర్వ. 3.17.9

భావము: ఆలోచనాపరులై కృషీవలులు (రైతులు) దున్నబడిన భూమిని గోఘృతముతోను, మధువుతోను – తేనె, బెల్లం మొ. వాటితోను ప్రాకృతిక ఎరువులతోను బలపరతురు. పంటలలో మాధుర్యమును చేర్చి విద్వాంసుల, విజ్ఞానవేత్తల ప్రశంసలను పొందుదురు.

ఓ సీతా! చక్కగా దున్నబడిన ఓ భూమాతా! నీవు మాకు మధురమైన, పుష్కలమైన, ఆరోగ్యకరమైన పంటలను ప్రసాదించు. మా గోవులకును గడ్డిగాదములను ప్రసాదించు. వాటిని తిని గోవులు మాకు పుష్కలమైన, ఆరోగ్యకరమైన పాలనిచ్చును గాక.

వివరణ: కొందరు రైతుల అనుభవమేమంటే – విత్తనాలను విత్తే ముందు రోజు పంచగవ్యంలో 2, 3 గంటలు నానబెట్టి ఆరిన తరువాత గోఘృతం కొద్దిగా పైన రాసి ఎండలోపెట్టి నాటితే విత్తనాలు తొందరగా మొలకెత్తుతాయట. ఆ మొక్కలకు చీడలు రాకుండా ఉంటాయట. ఒకవేళ కొద్దిగా చీడ కనబడినా పంచగవ్యాలను నీటిలో కలిపి పిచికారి చేస్తే పోతాయట. ఇంతేగాక, మొక్కలు ఆ

పంచగవ్యాలను పీల్చుకొని బలపడి మంచి పంటలనిస్తాయట.

అనుభవజ్ఞులు ఈ విషయంలో వారి వారి అనుభవాలను పరస్పరము పంచుకోవచ్చును.

కనుక మనం ఇంత మంచి విషయాలు గల ఈశ్వరీయ జ్ఞానమైన వేదమార్గంలో పరిశోధనలను చేద్దాము. లోకానికి మేలు చేద్దాము.

(కృషీవల సూక్తము సమాప్తం)

అథర్వ వేదీయ నక్షత్ర సూక్తం

అథర్వవేద 19వ కాండంలోని 7, 8 సూక్తాలు నక్షత్ర సూక్తాలు. 5+7 మంత్రాలు గల ఈ చిన్న చిన్న సూక్తాలలో 27 నక్షత్రాల గుణగణాలు వర్ణింపబడ్డాయి. వీటికి ఋషి గార్గ్యః, దేవతా నక్షత్రాణి. ఇక్కడ వీటిని గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాము.

1. ఓం చిత్రాణి సాకం దివిరోచనాని
సరీసృపాణి భువనే జవాని ।
తుర్మిశం సుమతి మిచ్ఛమానో
అహాని గీర్భిః సపర్యామి నాకమ్ ॥ అథర్వ. 19.7.1

ద్యులోకంలో ఆకాశ మధ్యన చిత్ర విచిత్రంగా ప్రకాశించు నక్షత్రాలు సరీసృపములవలె వంకర టింకరగా, వేగంగా పయనించుచున్నవి. అవి అనిష్టాలను నశింపచేస్తూ ప్రాణులన్నిటికి మేలు చేస్తున్నాయి. హే సర్వాంతర్యామీ! వాటిని గురించి జ్ఞానాన్ని – సుమతిని నాకు ప్రసాదించమని ప్రార్థిస్తున్నాను. ప్రతిదినము నిన్ను గీర్భిః – వేద మంత్రాలతో సుఖ స్వరూపుడవైన నిన్ను సపర్యామి – సేవింతునుగాక. స్తుతి ప్రార్థనోపాసనలు చేస్తూ నీ వేదాజ్ఞలను పాటింతునుగాక.

భావము: సృష్టిలోని ప్రాకృతిక దేవతలన్నీ – పదార్థాలన్నీ ప్రాణి మనుగడకు అవసరమే. వాటి జ్ఞానాన్ని మనం పొందగలిగితే మనకెన్నో విశేష సుఖాలు లభిస్తాయి. క్రమంగా వాటిని గురించి తెలుసుకొనే ప్రయత్నం చేద్దాము. రండి.

2. ఓం సుహవమగ్నే కృత్తికా రోహిణీ
చాస్తు భద్రం మృగశిరః శమార్ద్రా ।

పునర్వసూ సూనృతా చారు పుష్యో
భానురాశ్లేషా అయనం మఘా మే ॥ అథర్వ. 19.7.2

భావము: (1) సుహవమ్ + అగ్నే కృత్తికా రోహిణీ = ఓ అగ్నీ! ప్రకాశ స్వరూప! పరమేశ్వరా! నీ కృపవలన కృత్తికా రోహిణీ నక్షత్రాలు మాకు సులభముగా లభ్యమై ఉత్తమరీతిలో యజ్ఞము చేయుటకు యోగ్యము లగుగాక.

(2) చ అస్తు భద్రమ్ మృగశిరః శమ్ + ఆర్ద్ర = మరియు మృగశిర, ఆర్ద్ర నక్షత్రాలు మాకు మంగళ ప్రదములు, శాంతినిచ్చునవియగును గాక.

(3) పునర్వసూ సూనృతా చారు = రెండు పునర్వసు నక్షత్రాలు నాకు జ్ఞానమునిచ్చునవి యగుగాక.

(4) పుష్యః భానుః ఆశ్లేషా అయనమ్ + మఘాః = పుష్యమి, ఆశ్లేషలు, మఘా నక్షత్రము అనుకూలములై నాకు చక్కని మార్గము చూపును గాక.

వివరణ: విద్వాంసులు కీ.శే. క్షేమకరణదాసు త్రివేదీ గారు అథర్వ వేదానికి హిందీలో చక్కటి భాష్యం వ్రాశారు. (మహర్షి దయానంద సరస్వతి గారిని దుష్టులు పాలలో విషం కలిపి త్రాగించటం వలన వారు అకాల మృత్యువు నొందుట జరిగింది. అందుచే సామ అథర్వ వేదాలకు ఆయన భాష్యం వ్రాయలేకపోయారు.)

ఈ క్రింది వివరణ త్రివేది గారి భాష్యం లోనిది. దానిని కీ.శే. లోక మల్హారి గారు తెలుగులో అనువదించితే దానిని పం. మట్టి కృష్ణారెడ్డి గారు చక్కగా ముద్రించి మన కందించారు.

1. కృత్తికలు: ఇవి ఛేదించు మరియు చుట్టుకొను గుణము గలవి. ఉగ్ర స్వభావము కలవి. అగ్నిశిఖ ఆకృతి గలవి. 6 తారల సమూహం. అశ్వని నక్షత్రం నుండి మూడవ నక్షత్రము.

2. రోహిణి: ఇది స్వాస్థ్య వంతము. ఉత్పత్తి యొనర్చునది. శుక్ల ఆకృతి గలది. 5 తారల గుంపు. అశ్వని నుండి 4వది.

3. ఆర్ద్రా: తడిసినట్టి లేక జలముతో కూడిన పద్మ ఆకృతి. ఉజ్వలమైనది. ఒకే తారగా ఉంటుంది. అశ్వని నుండి 6వది.

4. రెండు పునర్వసులు: మాటిమాటికి నక్షత్రములలో వచ్చునది. ధనుస్సు

ఆకృతి. 5 తారల సమూహం. అశ్వని నుండి 7వది.

5. పుష్యమి: ఇది పోషణ యొనర్చునది. దీనికి రెండవ పేరు తిష్య. బాణాకృతి. ఒకే తార. అశ్వని నుండి 8వది.

6. ఆశ్లేషలు: రెండవ నామము ఆశ్లేషా. చక్రాకృతి. 6 తారల సమూహం. అశ్వని నుండి 9వది.

3. ఓం పుణ్యం పూర్వా ఫల్గున్యా చాత్ర
హస్తశ్చిత్రా శివా స్వాతి సుఖోమే అస్తు ।
రాధే విశాఖే సుహవానురాధా జ్యేష్ఠా
సునక్షత్రమరిష్ట మూలమ్ ॥ అథర్వ. 19.7.3

భావము: (1) పుణ్యమ్ పూర్వ ఫాల్గునౌ + చ అత్ర = ఇచట పూర్వం పేర్కొనిన ఉత్తర మరియు 2 ఫల్గునీ నక్షత్రాలు (పూర్వ ఫల్గణీ మరియు ఉత్తర ఫల్గుణిలు) పుణ్యమైనవి. పవిత్రమైనవి.

(2) హస్తః + చిత్రా శివా స్వాతి సుఖః + మే అస్తు = హస్త, చిత్ర, స్వాతి నా కొరకు శివకరములగును గాక. మంగళకరం అగును గాక.

(3) రాధే విశాఖే సుహవా అనురాధా = సిద్ధపరచునట్టి విశాఖ, అనురాధ నక్షత్రాలు సుహవములు – సులభముగా పిలువ తగినవి అగుగాక. ఉత్తమరీతిలో యజ్ఞము చేయుటకు అనువైనవి.

(4) జ్యేష్ఠా సునక్షత్రమ్ అరిష్ట మూలము = జ్యేష్ఠా నక్షత్రము మంచి నక్షత్రము. మూల నక్షత్రము హానిరహితమైనది అగును గాక.

ఇవన్నీ మంచి నక్షత్రాలే మేలుచేసేవే. కానీ లోకంలో వీటిలో కొన్ని మంచివి, కొన్ని మంచివి కావంటారు. ఎవరి మాటలు నమ్మాలి. వేద భగవానుని మాటలు నమ్మటమే ఉత్తమం. అతడే కదా సృష్టికర్త. సర్వప్రాణిహితరతుడు. కష్టసుఖాలు మన పూర్వకర్మలనుబట్టి ఉంటాయి కాని నక్షత్రాలు కాదు.

వివరణ: ఈ మంత్రంలో ఈ క్రింది నక్షత్రాల వర్ణన ఉంది.

9. పూర్వ ఫల్గునీ మరియు ఉత్తర ఫల్గుణులు: మంచం (Cot) ఆకారం కలిగిన నక్షత్ర సమూహము. ఇందులో 2 తారా పుంజములున్నవి. ఇది అశ్వనీ

నక్షత్రం నుండి 11వ నక్షత్రము.

10. ఉత్తరా ఫల్గుణి: వెనుక మంత్రంలోని పూర్వ ఫల్గుణులు మంచం ఆకృతి కలిగిన 2 తారా పుంజములు. ఇది అశ్వని నుండి 12వది.

11. హస్త: ఇది చేతి ఆకారాన్ని కలిగి ఉంటుంది. ఇది 5 తారల పుంజము. ఇది అశ్వని నుండి 13వ నక్షత్రం.

12. చిత్ర (చిత్త): ఇది విచిత్రంగా, అద్భుతంగా ఉంటుంది. ఉజ్వలమైనది. ఇది ఒకే తారగా ఉంటుంది. అశ్వని నుండి 14వది.

13. స్వాతి: ఇది స్వయంగా నడచునది. దీని వర్ణము (రంగు) కుంకుమరంగు. ఒకే తార. ఇది అశ్వని నుండి 15వది.

14. విశాఖ నక్షత్రం: విశేష శాఖలు గలది. దీనిపేరు రాధా. సిద్ధమొనర్చునది కూడా. ఇది తోరణము వంటి ఆకారం గలది. ఇది 4 తారల పుంజము. అశ్వని నుండి 16వ నక్షత్రం.

15. అనురాధ నక్షత్రం: రాధా అంటే విశాఖ వెనుక నడుచునది. ఇది అశ్వని నుండి 17వ నక్షత్రం. 7 తారల నక్షత్ర పుంజము.

16. జ్యేష్ఠా: అన్నిటికన్న శ్రేష్ఠమైనది. వరాహదంతము వంటి ఆకారము కలిగి ఉంటుంది. ఇది 3 తారల పుంజము. అశ్వని నుండి 18వది.

17. మూలా నక్షత్రం: జడము వంటి దృఢమైనది. సింహము తోకవలె ఉంటుంది మరియు శంఖం ఆకారం వలె ఉంటుంది. ఇది 9 తారల పుంజము. అశ్వని నుండి 19వది.

4. ఓం అన్నం పూర్వారాసతాం మే అషాఢా
ఊర్జం దేవ్యుత్తరా ఆ వహన్తు ।
అభిజిన్మే రాసతాం పుణ్యమేవ
శ్రవణః శ్రవిష్ఠాః కుర్వతాం సుపుష్టిమ్ ॥

అథర్వ. 19.7.4

భావము: సర్వవ్యాపక సర్వేశ్వరుని కృప వలన నాకు

(1) అన్నం పూర్వారాసతాం మే ఆషాఢ = పూర్వాషాఢ + ఉత్తరాషాఢ

నక్షత్రాలు నాకు పుష్కలమైన అన్నమును – ఆహార పదార్థాలను ఇచ్చును గాక.

(2) ఊర్జేదేవీ ఉత్తరా ఆవహన్తు = వాటివలన నేను బలవంతుడను, దివ్యత్వమును (ప్రకాశమును) పొందుదును గాక.

(3) అభిజిన్మే రాసతాం పుణ్యమేవ = అభిజిత్ నక్షత్రము నాకు పవిత్రతను ప్రసాదించుగాక.

(4) శ్రవణః శ్రవిష్ఠాః కుర్వతాం సుపిష్టమ్ = శ్రవణ, శ్రవిష్ఠా (ధనిష్ఠా) అనే 2 నక్షత్రాలు నన్ను మంచి పుష్టివంతునిగా, ధనవంతునిగా చేయును గాక.

వివరణ:

(18) పూర్వాషాఢ నక్షత్రం: ఇది చేట ఆకృతి గలది. 4 తారల పుంజము (సమూహము). అశ్వని తార నుండి 20వది.

(19) ఉత్తరాషాఢ: ఇదియును చేట ఆకృతిగా కనబడును. 4 తారల పుంజము. అశ్వని నుండి 21వది.

(20) అభిజిత్: అన్నివైపుల నుండి జయించునది. ఇది ఉత్తరాషాఢ వెనుక పదిహేను దండముల (దూరంలో) ఉంటుంది. సింఘాడ (పరికెగడ్డ) ఆకారము. 3 తారల పుంజము.

(21) శ్రవణా నక్షత్రం: వినునది. శరము (బాణము) ఆకృతి. మూడు తారల పుంజము. అశ్వని నుండి 22వ నక్షత్రం.

(22) శ్రవిష్ఠా (ధనిష్ఠా) నక్షత్రం: అత్యంత విఖ్యాతి గలది. అనేక రకాల ధనములు (సంపదలు) గలది. 5 తారల పుంజము. మృదంగం ఆకృతి కలది. అశ్వని నుండి 23వ నక్షత్రం.

5. ఓం ఆ మే మహచ్ఛతభిషగ్వరీయ
ఆ మే ద్వయా ప్రోష్ఠపదా సుశర్మ ।
ఆ రేవతీ చాశ్వయుజౌ భగం మ
ఆ మే రయిం భరణ్య ఆ వహన్తు ॥ అథర్వ. 19.7.5

భావము: సచ్చిదానంద స్వరూప సర్వేశ్వరుని అనుగ్రహం వల్ల నాకు

(1) ఆ మే మహతక్ + శతభిషం వరీయ = మిక్కిలి గొప్పదైన శతభిష

నక్షత్రం నాకు సర్వశ్రేష్ఠమైన ధనమును ప్రాప్తింపజేయును గాక.

(2) ద్వయా ప్రోష్ఠపదా సుశర్మ = ప్రోష్ఠపదయను పేరు గల 2 నక్షత్రాలు (పూర్వాభాద్రా + ఉత్తరాభాద్రములు) నాకు గొప్ప సుఖమును ప్రాప్తింపచేయును గాక.

(3) ఆ రేవతీ చ + ఆశ్వయుజౌ భగం మే = రేవతీ, అశ్వని యను 2 నక్షత్రాలు నాకు భగమును - ఐశ్వర్యమును ప్రాప్తింపచేయును గాక.

(4) భరణ్య ఆ వహన్తు = భరణీ నామక నక్షత్రం కూడా నాకు పుష్కల ధనరాశిని ప్రాప్తింపచేయును గాక.

వివరణ:

23వ శతభిషజ్: 10 తారల పుంజము. వైద్యుల వలె ఆరోగ్యము నిచ్చును. మండలాకార ఆకృతి. అశ్వని నుండి 24వది.

24, 25 రెండు ప్రోష్ఠ పదులు. అంటే పూర్వాభాద్రా, ఉత్తరాభాద్ర నక్షత్రాలు. ఎద్దు మరియు గోవు వంటి పాదాలు గలది. ఈ రెండును మంచము వంటి ఆకృతి గలవి. 8 తారల పుంజము.

(26) రేవతి: ఈదుచుండు చేప ఆకృతి. 32 తారల పుంజము. అశ్వని నుండి 27వ నక్షత్రం.

(27) రెండు ఆశ్వయుజములు. 2 గుఱ్ఱపు రౌతుల ఆకృతి లేదా గుఱ్ఱపు ముఖము వంటి ఆకృతి. 8 తారల పుంజము. ఇది మొదటి నక్షత్రము.

(28) భరణి నక్షత్రం: పాలించి పోషించునదని అర్థం గలది. త్రికోణ ఆకృతి గలది. అశ్వని నుండి 2వది. 3 తారల పుంజము.

రెండవ నక్షత్ర సూక్తం

(అథర్వవేదము 19వ కాండము 8వ సూక్తం)

1. ఓం యాని నక్షత్రాణి దివ్యఽన్తరిక్షే అప్సు
భూమౌ యాని నగేషు దిక్షు ।
ప్రకల్పయంశ్చన్ద్రమా యాన్యేతి

సర్వాణి మమైతాని శివాని సన్తు ॥ అథర్వ. 19.8.1

భావము: ఏ నక్షత్రాలు తమ తారాగణాలతో గూడి ఆకాశములో కనబడుచున్నవో అవి ద్యులోకము నుండియు, అంతరిక్షస్థ వాయుమండలం నుండియు, సముద్రముల నుండియు, పర్వతములపైనుండియు నలుదిక్కుల నుండియు కూడా కనబడుచుండును. ఇవి వాటివాటి పరిధులలో తిరుగుచుండును. చంద్రుడు తన పరిధిలో తాను భ్రమణం చేస్తూ వేరుగా కనబడుచుండును. చంద్రుడు ఏ నక్షత్ర సమీపమునకు వచ్చునో అది ఆనాటి నక్షత్రంగా చెప్పబడుచున్నది. ఇవన్నియు నాకొరకు సుఖమును కలిగించునవే యగును గాక.

2. ఓం అష్టావింశాని శివాని శగ్మాని సహ యోగం భజన్తు మే ।
యోగం ప్ర పద్యే క్షేమం చ క్షేమం ప్ర పద్యే యోగం చ
నమోఽహోరాత్రాభ్యా మస్తు ॥ అథర్వ. 19.8.2

భావము: పూర్వ 7వ సూక్తంలో చెప్పబడిన 28 నక్షత్రాలు కళ్యాణమును కలిగించునవే. అట్లే శగ్మాని సుఖమును కలిగించునవే. ఇవి చంద్రునితో కలిసి (సహయోగం భజన్తుమే) నాకు యోగమును – అలభ్య వస్తువులను, సంపదలను ప్రాప్తింపచేయును గాక.

(యోగం ప్రపద్యే క్షేమం చ) = ప్రాప్తించిన / వస్తువులను నేను క్షేమంగా – సురక్షితంగా ఉంచుకొందును గాక. (క్షేమం ప్రపద్యే యోగం చ) ఈ విధంగా ఈ నక్షత్రాలన్నీ నాకు యోగక్షేమాలను పొందించుచుండును గాక. నమో+అహోరాత్రాభ్యామ్+అస్తు = అట్టి రేయింబవళ్ళకు దినరాత్రులకు నా నమస్సులు. నేను ఈ రెంటిని సద్వినియోగం చేసుకొందును గాక. నా ఆత్మికోన్నతికి యత్నింతును గాక.

3. ఓం స్వస్తితం మే సుప్రాతః సుసాయం
సుదివం సుమృగం సుశకునం మే అస్తు ।
సుహవమగ్నే స్వస్త్యమర్త్యం గత్వా
పునరాయాభినన్దన్ ॥ అథర్వ. 19.8.3

భావము: సర్వాంతర్యామియైన పరమాత్ముని కృప వలన చక్కని

ప్రాతఃకాలము, చక్కని సాయంకాలము, చక్కని దినము నాకు శుభంకరములే అగును గాక. సుమృగం వనాలలో సంచరించు పశువులు నాకు కీడు చేయకుండును గాక. నాతో ఉత్తమంగా వ్యవహరించును గాక. సుశకునం – పక్షులు కూడా నాకు హాని కలిగించకుండును గాక. స్వస్తితం మే – ఇవన్నీ నాకు స్వస్తిని – సుఖ సంతోషాలను కలిగించుగాక. సుహవం + అగ్నే = ఓ అగ్నే! ప్రకాశ స్వరూప పరమేశ్వర! సులభ లభ్యుడవైన నీవు మాకు ఆప్తుడవగుదువు గాక. నీ వేదాజ్ఞలను పాటించు నాకు నీవు అమరత్వమును ప్రసాదింపుము. (పునః + ఆయ అభినన్దన్) నీవు మరల మరల మావద్దకు వస్తూ మాకు ఆనందమును కలిగించుము.

4. ఓం అనుహవం పరిహవం పరివాదం పరిక్షవమ్ ।
సర్వైర్మే రిక్తకు మ్భాన్పరా తాన్సవితః సువ ॥

అథర్వ. 19. 8. 4

భావము: నేను నిత్యం అంతర్యామిని ఉపాసిస్తూ నాలోని దోషాలను, లోపాలను అంగీకరిస్తూ పోగొట్టుకొన యత్నింతును గాక. హే అంతర్యామీ! నాలో అనుహవమ్ – నినాద ప్రవృత్తిని, పరిశ్రవమ్ – అపవాదాలను, పరిక్షవమ్ – బుసలు కొట్టు కోప ప్రవృత్తిని పరాసుత – దూరం చేయుము. హే సవిత – ప్రేరక పరమేశ్వరా! ఇవన్నీ నీరులేని కడవల వంటివి. వీటన్నిటిని పోగొట్టి నన్ను సత్కర్మలయందు ప్రేరేపింపుము.

5. ఓం అప పాపం పరిక్షవం పుణ్యం భక్షీమహిక్షవమ్ ।
శివా తే పాప నాసికాం పుణ్యగశ్చాభి మేహతామ్ ॥

అథర్వ. 19. 8. 5

భావము: హే సర్వరక్షక సర్వాంతర్యామీ! పాపముతో – పాపకృత్యాలతో పొందబడిన అన్నమును మేము తినకుందుముగాక. పుణ్యముతో పొందిన అన్నమునే మేము భుజింతుము గాక. హే పాపమా! పాపభావమా! నీ ముఖంపై కల్యాణకారులైన స్త్రీ పురుషులంతా మేహతాం – మూత్ర విసర్జన చేయుదురు గాక. అంటే నిన్ను అవమానింతురు గాక. ఏవగింతురు గాక. (క్షు – ఇతి అన్ననామ నిఘం. 7. 9)

6. ఓం ఇమా యా బ్రహ్మణస్పతే విషూచీర్వాత ఈరతే ।
సధ్రీ చీరిన్ద్ర తాః కృత్వా మహ్యం శివతమాస్కృధి ॥

అథర్వ. 19.8.6

భావము: హే బ్రహ్మణస్పతే! వేదోపదేశకా! మా రక్షకా! ఏ ప్రతికూల వాయువులు వీచుచున్నవో వానిని నీవు మాకు సానుకూలం చేయుము. (మహ్యం శివతమాః + కృధి) వాటిని మాకు శివతమాః - అత్యంత కల్యాణకారులుగా చేయుము. నీవు సర్వశక్తిమంతుడవు కదా! మమ్ము కాపాడుము.

7. ఓం స్వస్తినో అస్త్వభయం నో అస్తు నమోఽ హోరాత్రాభ్యామస్తు ॥

అథర్వ. 19.8.7

భావము: హే సర్వేశ్వరా! స్వస్తినో అస్తు - మాకు స్వస్తిని కలిగించుము. అభయం నో అస్తు - మాకు అభయము అగుగాక. అహోరాత్రాభ్యామ్ - దివారాత్రములు నమః - మాకు వశమగుగాక. మేము వాటిని చక్కగా వినియోగించుకొని శారీరక, సామాజిక, ఆత్మిక ఉన్నతులను పొందుదుము గాక.

(నక్షత్ర సూక్తము సమాప్తం)

జ్యేష్ఠ బ్రహ్మ సూక్తం
వేదాలలో దేవుని స్వరూపము

1. ఓం యో భూతం చ భవ్యం చ సర్వం యశ్చాధితిష్ఠతి ।
స్వర్యస్య చ కేవలం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥

అథర్వ. 10.8.1

భావము: ఏ పరమేశ్వరుడు భూత భవిష్యద్ వర్తమాన కాలముల నతిక్రమించి విరాజిల్లుచున్నాడో, ఆ మూడు కాలాలలో జరుగు వ్యవహారాల నన్నిటిని సరిగా తెలిసికొనుచున్నాడో, ఎవడు సమస్త జగత్తును తన అనంత జ్ఞాన బల క్రియలతో నడుపుచున్నాడో - పుట్టించి, పోషించి, లయింప చేయుచున్నాడో, విశ్వమందలి పదార్థముల కన్నిటికీ అధిష్ఠాతయై - స్వామియై యున్నాడో, కేవల సుఖమే ఎవనికి స్వరూపమో - లేశమాత్రమైనను దుఃఖము కలుగదో; ఎవడు ప్రాణులకు - జీవులకు భౌతిక సుఖమును, ఆత్మిక సుఖమును ఇచ్చుచున్నాడో అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు

– శ్రేష్ఠ బ్రహ్మకు మా వినయపూర్వక వందనములు.

2. ఓం యస్య భూమిః ప్రమాఽన్తరిక్ష ముతోదరమ్ ।
దివం యశ్చక్రే మూర్ధానం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥

అథర్వ. 10.7.32

భావము: ఏ పరమేశ్వరుని యునికిని, జ్ఞానమును తెలుపుటకు ఈ సృష్టిలోని భూమ్యాది పదార్థాలు జ్ఞాన సాధనాలో, ఎవనికి ఈ భూమి పాదస్థానంగా ఉన్నదో, అంతరిక్షం ఉదరస్థానంగా నున్నదో, సూర్య నక్షత్రాదులు మస్తక స్థానంగా ఉన్నాయో, ఎవడు ఈ సృష్టిని నిర్మించి దానియందు వ్యాపకుడై యుండి నడిపించుచున్నాడో అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు మా నమస్సులు.

3. ఓం యస్య సూర్య శ్చక్షు శ్చంద్రమాశ్చ పునర్ణవః ।
అగ్నిం యశ్చక్ర ఆస్యం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥

అథర్వ. 10.7.33

భావము: ఎవనికి సూర్య చంద్రులు నేత్రముల వలె ఉన్నవో ఎవడు ప్రతి కల్పంలోను (సృష్టిలోను) సూర్య చంద్రాది పదార్థాలను మాటిమాటికి కొత్తవిగా నిర్మించుచున్నాడో, ఎవడు ముఖస్థానంగా (నోరు, జీర్ణావయవాలు స్థానంగా) అగ్నిని సృష్టించినాడో అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు మా వినయ పూర్వక నమో వాకములు.

4. ఓం యస్య వాతః ప్రాణాపానౌ చక్షు రఙ్గిరసోఽభవన్ ।
దిశో యశ్చక్రే ప్రజ్ఞానీస్తస్మై జ్యేష్ఠాయ
బ్రహ్మణే నమః ॥ అథర్వ. 10.7.34

భావము: ఎవడు అంతరిక్షస్థ వాయువును ప్రాణుల కొరకు ప్రాణాపానములుగా చేసెనో, ప్రకాశ కిరణాలను ప్రాణులకు నేత్రేంద్రియంగా చేసెనో, వ్యవహారం కొరకు దశదిశల నేర్పరచెనో అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు – శ్రేష్ఠ బ్రహ్మకు మా అభివందనాలు.

5. ఓం యస్మా దృచో అపాతక్షన్ యజు ర్యస్మా దపాకషన్ ।
సామాని యస్య లోమాన్యథర్వాఽఙ్గిరసో ముఖం
స్కమ్భం తం బ్రూహి కతమః స్విదేవ సః ॥

అథర్వ. 10.7.20

భావము: ఆ సర్వశక్తిమంతుడగు పరమాత్మ నుండియే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వ వేదము ఉద్భవించినవి – ఆది ఋషుల హృదయాలలో ప్రకాశింపబడ్డాయి. వీటిని రూపకాలంకారంలో చెబితే అథర్వ వేదం ముఖం వంటిది. సామవేదం నా వెంట్రుకల వంటిది. యజుర్వేదం నా హృదయంగాను, ప్రాణాన్ని ఋగ్వేదంగాను గుర్తించండి. అట్టి నేనెవరో తెలుసుకోండి. ఈ సమస్త జగత్తుకు ఆధార స్కంభంగా – స్థంభంగా ఉన్న నేనెవరో – నా నిజ స్వరూపమేదో చక్కగా తెలుసుకొని ఉపాసించండి.

(జ్యేష్ఠబ్రహ్మ సూక్తము సమాప్తం)

వేదాలలో కాల సూక్తము

కాలము అంటే సమయం (Time). సృష్టికర్తకు కూడా 'కాలము' అనే పేరుంది. 'కాల–సంఖ్యానే' అనే సంస్కృత ధాతువుతో ఇది నిర్మించబడుతుంది. విశ్వంలో గల సమస్త పదార్థాలను, జీవులను లెక్కించగలవాడు కనుక దేవునకు కాలము అనే పేరు వర్తిస్తుందంటారు వ్యాకరణ విద్వాంసులు. అథర్వవేద 19వ కాండంలోని 53, 54 సూక్తాలు కాల సూక్తాలుగా లోకంలో ప్రసిద్ధి పొందాయి. అందులోని మొదటి 53వ సూక్తంలో 10 మంత్రాలున్నాయి.

ఈ మంత్రాలకు ఋషి భృగుడు. దేవత కాలః.

ఈ సూక్తం కాలం యొక్క విలువ బాగా గుర్తించి దానిని సద్వినియోగం చేసుకోమని బోధిస్తుంది.

అట్లే, కాల నామక పరమేశ్వరుని మహిమను కూడా తెలుపుతుంది.

ఇచ్చట ఈ సూక్తాన్ని గురించి కొద్దిగా తెలుసుకుందాము.

1. ఓం కాలో అశ్వోవహతి సప్తరశ్మిః సహస్రాక్షో అజరో భూరిరేతాః ।
తమా రోహన్తి కవయో విపశ్చితస్తస్య చక్రా భువనాని విశ్వా ॥

అథర్వ. 19.53.1

అర్థం: ఓ మానవులారా! కాలం అశ్వం (గుఱ్ఱము) వంటిది. సూర్యరశ్మల నడకను బట్టి అది తిరుగుచున్నది.

అది సహస్రాక్షః = వేలాది కన్నుల వంటి కిరణములు గలది, అది అజరః

= ముసలితనం లేనిది. సదా ఏకరూప బలం కలది, భూరిరేతాః = మహాబలశాలి.

అట్టి అశ్వాన్ని కేవలం జ్ఞానవంతులే అధిరోహించగలరు. కాలం యొక్క విలువ తెలిసివారే దానిపై ఎక్కగలరు. స్వారీ చేయగలరు. అట్టి కాలరథానికి ఈ సమస్త భువనాలు చక్రములవలె ఉన్నాయి.

వివరణ: సూర్య కిరణాలను Prism (త్రిభుజ ఆకార గాజు పట్టకము) ద్వారా ప్రసరింపచేస్తే మనకు 7 రంగులు కనిపిస్తాయి. వాటిని ఇంగ్లీష్‌లో VIBGYOR అంటారు. అది అప్పుడప్పుడు వానాకాలంలో సూర్యకాంతి నీటి బిందువుల ద్వారా విశ్లేషించబడి ఆకాశంలో ఇంద్రధనుస్సుగా కనబడుతుంది. VIBGYOR – అంటే Violet (ఊదా), Indigo (నీలిమందు రంగు), Blue (ఆకాశనీలం), Green (ఆకుపచ్చ), Yellow (పసుపు), Orange (నారింజపండు), Red (ఎఱ్ఱరంగు) అనబడే సప్త వర్ణాలు పై ఏడురంగుల కలయికే ప్రకాశకిరణం ఔతుందట.

2. ఓం సప్త చక్రాన్ వహతి కాల ఏష
సప్తాస్య నాభిరమృతం స్వక్షః ।
స ఇమా విశ్వా భువ నాన్యఞ్జత్
కాలః స ఈయతే ప్రథమో ను దేవః ॥ అథర్వ. 19.53.2

భావము: పైన వివరించిన కాలాశ్వం 7 చక్రాలను నడుపుతున్నది. వాటినే వేదవేత్తలు 3 కాలాలు (భూత, వర్తమాన, భవిష్యత్తులు), 4 దిశలు (తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణాలు) నని వర్ణించారు. ఈ 7 చక్రాల నాభి అమృతమ్ – అమరమైనది. అద్భుతమైనది (Wonder). అది విశ్వంలోని భువనాలనన్నింటిని నడుపుతున్నది.

ఓ మానవా! అట్టి కాలాశ్వ మహిమను గుర్తించి కాలాన్ని సద్వినియోగం చేసుకో, మానవ జన్మను సార్థకం చేసుకో.

3. ఓం పూర్ణః కుమ్భోఽధి కాల ఆహితస్తం
వై పశ్యామో బహుధా ను సన్తః ।
స ఇమా విశ్వా భువనాని ప్రత్యఙ్
కాలం తమాహుః పరమే వ్యోమన్ ॥ అథర్వ. 19.53.3

భావము: ఓ మానవులారా! ఆ మహిమాన్విత కాలాశ్వంపై సమస్త సంపదల పూర్ణకుంభం ఉంచబడినది. ఆ పూర్ణ కుంభాన్ని అందుకోవటానికి జ్ఞానులు, యోగులు, వివేకవంతులు, విజ్ఞానవేత్తలు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అనేక రకాలుగా దానిని చూస్తున్నారు. తెలుసుకుంటున్నారు. వర్ణిస్తున్నారు. మీరును ఆ ప్రయత్నమే చెయ్యండి. చెయ్యి జారిన కాలం మరల తిరిగి రాదు సుమా!

ఆ కాలం ఎప్పుడూ మనకన్న ముందు నడుస్తూ మనను తొందర చేస్తున్నది. అది ఒక దేవతగా పరమవ్యోమంలో... పరమేశ్వరునిలో విరాజిల్లుచున్నది.

4. ఓం స ఏవ సం భువనాన్యాభరత్ స
ఏవ సం భువనాని పర్యైత్ ।
పితా సన్నభవత్ పుత్ర ఏషాం తస్మాద్
వై నాన్యత్ పరమస్తి తేజః ॥ అథర్వ. 19.53.4

భావము: ప్రారంభంలో చెప్పుకొన్నట్లు సర్వవ్యాపక విష్ణువునకు కాల మనే నామము కూడా ఉంది. అందుచే ఈ 4వ మంత్రం ఈ విధంగా చెబుతున్నది. కాలరూప పరమాత్మ సమస్త సత్తా శక్తులందును వ్యాపకమై ఉంది. ఆ కాలమే సృష్టికి పిత మరియు పుత్రుడును అయి వుంది. కాలము అనాది. అది ఆదినుండి ఉంది. రాబోవు సృష్టియు కాలము చేతనే జరుగును. అంటే కాలము నిత్యం కనుక అది సృష్టికి ముందు వెనుక కూడా ఉంటుంది. అందుచేతనే నిశ్చయంగా ఇది విశ్వంలో మహా ప్రతాపం గలిగిన ఒక దివ్యశక్తి.

(అందుచేతనే “కాలం బలీయమైనది. దాని ముందు అందరూ తలలు వంచవలసిందే” అంటారు పెద్దలు.)

5. ఓం కాలో అమూం దివమజనయత్ కాల ఇమాః పృథివీరుత ।
కాలే హ భూతం భవ్యం చేషితం హ వి తిష్ఠతే ॥
అథర్వ. 19.53.5

వివరణ: మనకు ఆకాశంలో కనబడే నక్షత్రాలన్నీ సూర్యులేనట. వాటి చుట్టూ గ్రహ, ఉపగ్రహాదులతో కూడిన వలయముంటుందట. అన్నీ కలిపి ఒక నక్షత్ర కుటుంబంగా – సూర్య కుటుంబంగా ఉంటాయట. కొన్ని నక్షత్రాలు దగ్గర

దగ్గరగా ఉన్నట్లు కనపడుతున్నాయి కానీ అవి చాలా దూరదూరంగా ఉంటాయట. ఇంతటి బ్రహ్మాండాన్ని సృజించింది కాల పరమాత్మనే. అతను కూడా సరియైన కాలంలోనే సృష్టి ప్రలయాలు చేస్తుంటాడు. భూత భవిష్యత్ కాలాలు రెండింటికీ ముందు వెనుక కాలం ఉంటుంది. సరియైన కాలంలోనే వాటిని చేస్తాడు.

6. ఓం కాలో భూతిమసృజత కాలే తపతి సూర్యః ।
కాలే హ విశ్వా భూతాని కాలే చక్షుర్వి పశ్యతి ॥

అథర్వ. 19.53.6

భావము: (కాలః+భూతిమ్+అసృజతి) తగినంత సమయంతోనే పృథివిపై నున్న ఐశ్వర్యాలన్నీ - బంగారము, వజ్ర వైఢూర్యాలు మొదలైనవన్నీ సృష్టించబడ్డాయి. (కాలే తపతి సూర్యః) సరియైన సమయంలోనే సూర్యోదయ సూర్యాస్తమయాదులన్నీ జరుగుతాయి. మనం తొందరపడినా అవి తొందరపడవు. సృష్టి అవధి పూర్తి అయితే సూర్యుడు కూడా తపించలేదు (కాలే హ విశ్వా భూతాని) అట్లే సమస్త ప్రాణులు గర్భధారణ సమయం పూర్తైన తదుపరినే పుడతాయి. (కాలే చక్షుః విపశ్యతి) మన కన్నులు కూడా వృద్ధాప్యం వస్తే విశేషంగా చూడలేవు. యవ్వనంలోనే అవి విశేషంగా చూడగలవు. తదుపరి చూపు మందగిస్తుంది డాక్టర్లు కూడా పెద్ద వయస్సైపోయింది మేము కూడా ఏమీ చేయలేమంటారు కదా!

కనుక ఓ మానవులారా! కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

7. ఓం కాలే మనః కాలే ప్రాణః కాలే నామ సమాహితమ్ ।
కాలేన సర్వా నన్దన్త్యాగతేన ప్రజా ఇమాః ॥

అథర్వ. 19.53.7

భావము: కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే మనస్సు, ప్రాణము, సకలేంద్రియాలు ఆరోగ్యవంతములై బుద్ధి వికసిస్తుంది. వివేకవంతులు ఆత్మోన్నతికి యత్నిస్తారు. సత్కార్యాలు చేసి (నామ సమాహితమ్) పేరు ప్రతిష్ఠలు పొందుతారు.

కనుక ఓ మానవులారా! కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

8. ఓం కాలే తపః కాలే జ్యేష్ఠం కాలే బ్రహ్మ సమాహితమ్ ।
కాలో హ సర్వస్యేశ్వరో యః పితాసీత్ ప్రజాపతేః ॥

అథర్వ. 19.53.8

భావము: బ్రహ్మచర్యకాలంలోనే – విద్యాభ్యాస కాలంలోనే బ్రహ్మచర్య తపస్సు చేసి శరీరాన్ని, మనస్సును, బుద్ధిని బలపరచుకోవాలి. యవ్వనంలోనే తనకు అభిరుచి గల మంచి విషయాలలో ప్రగతిని సాధించాలి. జ్యేష్ఠత్వాన్ని పొందాలి. ఆయా విషయాలలో ప్రపంచ ప్రసిద్ధిని పొందాలి. వార్ధక్యం ప్రారంభం కాగానే 60వ సంవత్సరం నుండే ప్రాపంచిక మోహాన్ని తగ్గించుకుంటూ వానప్రస్థాశ్రమం తీసుకొని ధ్యాన సాధన చేయాలి. దైవ సాక్షాత్కారాన్ని పొంది ఆనందమగ్నులు కావాలి. ఏ వయస్సులో ఏది చేయాలో అట్లు చేస్తేనే నిజమైన ఆనందం కలుగుతుంది.

9. ఓం తేనేషితం తేన జాతం తదు తస్మిన్ ప్రతిష్ఠితమ్ ।
కాలో హ బ్రహ్మ భూత్వా బిభర్తి పరమేష్ఠినమ్ ॥

అథర్వ. 19.53.9

భావము: (తేన+ఇషితం తేన జాతం) ఈ జగత్తు కాలం చేతనే ప్రేరితమై కాలంతోనే ఉద్భవించినది. (తత్+ఉ+తస్మిన్ ప్రతిష్ఠితమ్) అది కాలమందే ప్రతిష్ఠితమై ఉంది. కాలమే బ్రహ్మయై సర్వోపరి నిలిచియున్నది.

కనుక కాల నియమాన్ని పాటించినవారే ఉన్నతిని పొందగలరు. సృష్టిలో కూడా కాలనియమాన్ని పాటిస్తూ పంటలు పండుతున్నాయి. ఇతర ప్రాణులన్నీ ప్రాకృతికంగా జీవిస్తున్నాయి. కాని, బుద్ధి జీవియైన మానవులు కాల నియమాన్ని అతిక్రమించి తింటున్నాడు, తిరుగుతున్నాడు, నిద్రపోతున్నాడు, ఎన్నెన్నో రోగాలతో సతమతమవుతున్నాడు. ఆలోచించండి.

10. ఓం కాలః ప్రజా అసృజత కాలో అగ్రే ప్రజాపతిమ్ ।
స్వయంభూః కశ్యపః కాలాత్ తపః కాలాదజాయత ॥

అథర్వ. 19.53.10

భావము: 432 కోట్ల సంవత్సరాల సృష్టికాలం ముగిసిన తదుపరి 432 కోట్ల సంవత్సరాల ప్రలయకాలం వస్తుంది. అది ముగిసిన అనంతరం పూర్వ సృష్టిలో వలెనే దేవుడు ఈ సృష్టిని చేస్తాడు. సూర్య చంద్ర నక్షత్రాదులను, భూమి వంటి గ్రహాలను సృజిస్తాడు.

భూమిపై ప్రాణి మనుగడకు అవసరమైన పంచభూతాలను వాతావరణాన్ని,

నీరు, అగ్ని మొదలైన వాటిని సృజిస్తాడు. అవన్నీ ఏర్పడిన తరువాత మాత్రమే. ప్రాణులను సృజిస్తాడు. ఇవన్నీ చాలా నెమ్మదిగా జరుగుతాయి. లక్షల కోట్ల సంవత్సరాలు పడుతుంది. అంతేకాని దేవుడు 'కున్' అంటే అప్పటికప్పుడు పుట్టుకురావు.

"ఋతం చ సత్యం చ అభీద్ధాత్ తపసో అధ్య జాయత" (ఋ. 10.190.1) అని వేదం చెబుతుంది. అతడు స్వయంభువుడు ప్రలయకాలంలో కూడా విద్యమానుడై ఉంటాడు. అతడు 'కశ్యపుడు' కూడా... అన్నింటిని చక్కగా పర్యవేక్షిస్తూ ఏది ఎలా సృజించాలో ఆవిధంగా సృజిస్తాడు.

కనుక ఓ మానవులారా! అందరూ కాల నియమాన్ని పాటించండి. అన్నిటిని చక్కగా (Perfect గా) చేయ యత్నించండి.

(మొదటి కాల సూక్తము సమాప్తం)

రెండవ కాల సూక్తము

1. ఓం కాలాదాపః సమభవన్ కాలాద్ బ్రహ్మతపో దిశః ।
కాలేనోదేతి సూర్యః కాలే ని విశతే పునః ॥

అథర్వ. 19.54.1

భావము: (కాలాదాపః సమభవన్) తగిన కాలములోనే పరమాత్మ ఈ పృథివిపై నీటిని సృష్టించెను. సెలయేర్లు, నదులు వర్షాకాలంలోనే నిండుగా జలపూర్ణములై ప్రవహిస్తాయి.

(కాలాద్ బ్రహ్మతపో దిశః) సరియైన కాలంలోనే... ఆది మానవ సృష్టి జరిగిన సమయంలోనే ఋషుల ద్వారా ప్రజలకు బ్రహ్మను - వేద విజ్ఞానాన్ని మానవులకు యిచ్చాడు. దానినుండే (తపస్సు)... సృష్టి నియమాలు ప్రజలకు తెలిసాయి. దశ దిశల జ్ఞానం కలిగింది. నాలుగు దిశలు + నాలుగు ప్రదిశలు (మూలలు), పైన, క్రింద కలిసి దశ దిశలౌతాయి. సరియైన కాలంలోనే సూర్యోదయ సూర్యాస్తమయాలు మరల మరల జరుగుతుంటాయి. కనుక ఓ మానవులారా! కాల నియమాన్ని పాటించండి.

2. ఓం కాలేన వాతః పవతే కాలేన పృథివీ మహీ ।
ద్యౌర్మహీ కాల ఆహితా ॥ అథర్వ. 19.54.2

భావము: ఓ మానవులారా! సృష్టి నియమాలను పరిశీలించండి. సరియైన కాలంలోనే ఋతు పవనాలు వీస్తాయి. కాల నామక పరమాత్మ ప్రాణుల కొరకే ఈ పృథివిని విస్తరింపచేసాడు. దానిని అన్ని ప్రాణులకు మాతగా గొప్పదిగా చేశాడు.

కాలనామక పరమాత్మనే ద్యులోకాన్ని గొప్పగా విశాలంగా చేశాడు. సృష్టిలోని అన్ని దేవతలు కాలములోనే ఉంచబడినవి. అందుచే మీరంతా కాల నియమాన్ని పాటించాలి.

3. ఓం కాలో హ భూతం భవ్యం చ పుత్రో అజనయత్ పురా ।
కాలాదృచః సమభవన్ యజుః కాలాదజాయత ॥

అథర్వ. 19. 54. 3

భావము: ఓ మానవులారా! కాలం (Time) నిత్యం. ఎల్లప్పుడూ ఉంటుంది. 'భూత వర్తమాన భవిష్యత్'లనే మూడు రకాల కాల వ్యవహారం లోకంలో ఉన్నప్పటికీ – భూతకాలం వర్తమాన కాలానికి తండ్రిగా ఉంటుంది. అట్లే, భవిష్యత్ కాలము వర్తమాన కాలానికి పుత్రునిగా ఉంటుంది. ఈ రకంగా కాలం (సమయం) నిత్యం. కాల నామక పరమాత్మ కూడా నిత్యుడే అయినప్పటికీ సరియైన కాలంలోనే ఋక్కులను – ఋగ్వేదాన్ని అగ్ని నామక ఋషి హృదయంలో ప్రకాశ పరుస్తాడు. యజుః – యజుర్వేదం వాయు నామక ఋషి హృదయంలో ప్రకాశ పరుస్తాడు. అట్లే ఆదిత్య నామక ఋషికి సామవేదాన్ని, అంగిరనామక ఋషికి అథర్వవేదాన్ని వారి బుద్ధులలో ప్రకాశపరుస్తాడు – ఉపదేశిస్తాడు. ఈ నాలుగు వేదాలు ప్రథమ మానవ సృష్టి జరిగిన కాలంలోనే వచ్చాయని మన ఋషుల నమ్మకం. ఈ నమ్మకానికి వేదాలలో ఉన్న కొన్ని ఉపదేశాలే కారణం.

4. ఓం కాలో యజ్ఞం సమైరయద్దేవేభ్యో భాగమక్షితమ్ ।
కాలే గన్ధర్వాప్సరసః కాలే లోకాః ప్రతిష్ఠితాః ॥

అథర్వ. 19. 54. 4

భావము: కాల నామక పరమాత్మ నుండే యజ్ఞం (అగ్నిహోత్రం) పుట్టింది – ఉపదేశింపబడింది. అది సకాలంలో నిర్వహించినపుడే మంచి ఫలితాలనిస్తుంది. దైనిక అగ్నిహోత్రం ఉదయ సాయంకాలాలలో లేత సూర్య కిరణాలున్నప్పుడు

నిర్వహిస్తే మంచి ఫలితాలనిస్తుంది. విద్వాంసులు వేదాల వెలుగులో వివిధ రకాల యజ్ఞాలను రూపొందించి ప్రజలచే నిర్వహింపచేస్తే అక్షయ ఫలితాలు కలుగుతాయి. కాల నామక పరమాత్మలోనే గంధర్వులు, అప్సరసలు ఉన్నారు. అంతరిక్ష ద్యులోకాలన్నీ అతనిలోనే ఉన్నాయి. వాటిని సృజించినదియు అతడే.

వివరణ: గంధర్వ అప్సరస లనే పదాలు వేదాలలో పలుమార్లు వస్తాయి. ఆయా ప్రకరణాలనుబట్టి ఈ పదాలకు వేరు వేరు అర్థాలుంటాయి.

ఈ ప్రకరణంలో...

(1) గంధర్వులంటే పృథివిపై ఉన్న పదార్థాలు. భూమికి గంధర్వ అనే పేరు కూడా ఉంది.

(2) అప్సరసలంటే – ఆకాశంలో సంచరించే గ్రహ ఉపగ్రహాదులు మరియు వాటిలోని పదార్థాలు. ఇవన్నీ కాలనామక పరమాత్మచే సృజింపబడ్డాయి. అవన్నీ కాలనియమాన్ని బట్టే పరిభ్రమిస్తున్నాయి.

5. ఓం కాలేయమఙ్గిరా దేవో అథర్వా చాధి
తిష్ఠతః ఇమం చ లోకం పరమం చ లోకం
పుణ్యాంశ్చ లోకాన్ విధృతీశ్చ పుణ్యాః సర్వాం ల్లోకానభి
జిత్యబ్రహ్మణా కాలః స ఈయతే పరమో ను దేవః ॥

అథర్వ. 19.54.5

భావము: కాల నామక పరమాత్మను దేవతలు – వేద విద్వాంసులు చక్కగా తెలుసుకొని స్పష్టమైన జ్ఞానంతో స్తుతి ప్రార్థనోపాసనలు చేస్తారు. అట్టివారు ఇహలోక, పరలోక ఉన్నతులు రెంటిని పొందుతారు. చక్కటి అభ్యుదయాన్ని సాధిస్తారు. ఇంతేగాక, వారు యోగసాధన చేసి ఆత్మ పరమాత్మల సాక్షాత్కారాన్ని పొందుతారు.

సర్వ లోకాలను జయించి పుణ్య పురుషులు చేరే పరమధామానికి – ముక్తి ధామానికి చేరుకుంటారు. ఇవన్నీ కాల నియమాన్ని పాటించేవారికే లభిస్తాయి. వాటిని పొందటానికి కొంతకాలం పడుతుంది. అకస్మాత్తుగా రావు.

కనుక ఓ మానవులారా! కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. ఈ మానవ జన్మలోనే అవి సాధ్యం. వేరే జన్మలలో ఉన్నతి కలుగదు.

వివరణ: ఇహలోక ఉన్నతి అంటే ఈ జన్మలో పొందే సుఖాలు. పరలోక ఉన్నతి అంటే వచ్చే జన్మలో పొందే సుఖాలు.

(రెండవ కాలసూక్తము సమాప్తం)

వేదాలలో క్రిమి నాశక సూక్తము

1. ఓం ఇన్ద్రస్య యా మహీ దృషత్ క్రిమేర్విశ్వస్య తర్హణీ ।
తయా పినష్మి సం క్రిమీన్ దృషదా ఖల్వాన్ ఇవ ॥

అథర్వ. 2. 31. 1

భావము: వైద్యులు రోగులకు ఈవిధంగా అభయమివ్వాలి. ఓ మానవులారా! మీరు రోగకారక క్రిములకు భయపడకండి. వైద్యులమైన మేము ఇంద్రుడిచ్చిన – పరమాత్మ యిచ్చిన వేదజ్ఞానపు వెలుగులో సమస్త రోగకారక క్రిములను సంహరించగలము. తగిన మూలికలతో చేసిన మందులతోను, ఆ మూలికలను అగ్నిహోత్రంలో ఆహుతులుగా ఇస్తూ వాటిని నిర్మూలించగలము. సెనగలను తిరుగలి రాతిలో వేసి పిండి చేయునట్లు మేము వీటిని నలిపి నాశనం చెయ్యగలము.

2. ఓం దృష్టమదృష్ట మతృహమథో కురూరుమతృహమ్ ।
అల్గణ్డూన్త్సర్వాన్ ఛలునాన్ క్రిమీన్ వచసా జమ్భయామసి ॥

అథర్వ. 2. 31. 2

భావము: వైద్యుడనైన నేను వేద జ్ఞాన వెలుగులో కనపడేవి, కనపడనివియైన అనేక రకాల రోగకారక క్రిములను నాశనం చెయ్యగలను. భూమిపై ప్రాకునట్టి అతినీచముగా బాధించు పాము, తేలు, జెఱ్ఱి మొదలగు విషప్రాణి కాట్ల వల్ల వచ్చే విషాలను నేను నిర్మూలించగలను. తలగడ దిండ్లలో చేరిన అల్గణ్డములను (నల్లులు మొదలైన క్షుద్ర ప్రాణులను) నశింప చేయాలి. వేద వచనాలకును అట్టి శక్తి ఉంది. కనుక సస్వర వేద పాఠాలను శ్రద్ధతో వినండి.

వివరణ: కుక్క మొదలైన జంతువులు వెంటపడినప్పుడు అల్ట్రాసౌండ్ కలిగించే డివైజ్‌లు వినిపిస్తే అవి అశాంతికి గురియై వెళ్ళిపోతాయి. అట్లే, కొన్ని అసాధ్య రోగాలతో బాధపడుతున్న రోగులకు సుస్వర వేదపాఠ శ్రవణం చేస్తే ఉపశాంతి కలుగుతుంది. కనుక ఈ విషయాలపై విస్తృతంగా పరిశోధనలు జరుగవలసి వుంది.

3. ఓం అల్గణ్డాన్ హన్మి మహతా వధేన
దూనా అదూనా అరసా అభూవన్ ।
శిష్టానశిష్టాన్ ని తిరామి వాచా
యథా క్రిమీణాం నకిరుచ్ఛిషాతై ॥ అథర్వ. 2.31.3

భావము: ఓ మానవులారా! తలగడలందు దాగివుండి రాత్రులందు మిమ్ము బాధించు నల్లులు మొదలైన క్రిములను సంహరించండి. అనేక చర్మవ్యాధులను, దురదలను కలిగించు సూక్ష్మ క్రిములను (Fungus etc.) కూడా మందులతో, వేడినీటితో, ఎండలో ఎండించి చంపివేయండి. లేకున్న అవి పెక్కు బాధలను కలిగించును.

4. ఓం అన్వాన్త్ర్యం శీర్షణ్య మథో పార్ ష్టేయం క్రిమీన్ ।
అవస్కవం వ్యధ్వరం క్రిమీన్ వచసా జమ్భయామసి ॥
అథర్వ. 2.31.4

భావము: ఓ మానవులారా! మీ ప్రేగులలో స్థావరమేర్పరచుకున్న Thread worms, Round worms, Tape worms మొదలైన వాటిని మందులతో మట్టుపెట్టండి. ఇవేకాక, కొన్ని రక్తనాళాలలో చేరి కురుపులను కలిగిస్తాయి. కొన్ని అన్నివైపులు ప్రాకుతూ గజ్జి, తామర, ఎలర్జీలను కలిగిస్తాయి. కొన్ని సూక్ష్మక్రిములు ఎముకలలోను, ఊపిరితిత్తులలోను చేరి టి.బి. మొదలైన వాటిని కలిగిస్తాయి. కనుక అన్నిరకాల రోగకారక క్రిములను సంహరించండి. వీటన్నిటికి మందులు వేదాలలో చెప్పబడినవి. వాటిని జాగ్రత్తగా అధ్యయన, మనన, చింతనలు చేసి మందులను కనిపెట్టండి. సస్వర వేదపాఠ శ్రవణం వల్లను కొన్ని క్రిములు నిర్వీర్యమౌతాయి. శరీరంలో రోగనిరోధకశక్తి బలపడుతుంది.

5. ఓం యే క్రిమయః పర్వతేషు
వనేష్వోషధీషు పశుష్వప్స్వన్తః ।
యే అస్మాకం తన్వమావివిశు
స్సర్వం తద్ధన్మి జనిమ క్రిమీణామ్ ॥ అథర్వ. 2.31.5

భావము: ఓ మానవులారా! రోగకారక క్రిములు మీ శరీరాలలోనేగాక పర్వతాలలో, వనాలలో, ఔషధులలో, పశువులలో, నీటిలో కూడా ఉంటాయి.

అవి క్రమంగా మీ శరీరాలలోనికి ప్రవేశించి మిమ్ము బాధించగలవు. కనుక, శరీరం లోపల శుద్ధితోబాటు మీ పరిసరాలను కూడా శుద్ధం చేసుకోవాలి. ఆహార, విహార, వ్యవహారాలలోను శుద్ధతను పాటించాలి. శరీరంలో మనస్సు కూడా ఒక భాగం కనుక దానిని కూడా శుద్ధం చేసుకోవాలి. ఈర్ష్య క్రోధ రాగ ద్వేషాదులను పోగొట్టుకోవాలి. సంకుచిత స్వార్థభావాలను పోగొట్టుకుని సర్వమాన సౌభ్రాతృత్వాన్ని అలవరచుకోవాలి. రోగకారక క్రిములను మాత్రం సమూలంగా నాశనం చేయాలి. Culture కూడా Negative రావాలి తస్మాత్ జాగ్రత్త.

(క్రిమినాశక సూక్తము సమాప్తం)

అమావాస్యేష్టి సూక్తము

1. ఓం యత్ తే దేవా అకృణ్వన్ భాగధేయమమా
వాస్యే సం వసన్తో మహిత్వా ।
తేనా నో యజ్ఞం పిపృహి విశ్వవారే
రయిం నో ధేహి సుభగే సువీరమ్ ॥

అథర్వ. 7. 79. 1

భావము: ఓ అమావాస్యుడా! సర్వకాల సర్వావస్థలయందు మాకు తోడుగా ఉండే ఓ సర్వవ్యాపక సర్వేశ్వరా! ఏవిధంగా దేవతలు (దివ్యగుణాలు కలవారు) తమ తమ కర్తవ్య కర్మలను చక్కగా ఆచరిస్తారో, ఆవిధంగా మేమునూ వేదవిహిత పంచమహా యజ్ఞాది కర్తవ్య కర్మలను చేయుదుము గాక. ఓ విశ్వవారా! అందరిచేత కోరబడు ఓ పరమేశ్వరా! మాకు యజ్ఞములను (సత్కర్మలను) చక్కగా నెరవేర్చగల శక్తినిచ్చి వాటిని పూరింపుము. వాటి ఫలాలను ప్రసాదింపుము. ఓ సుభగా! పరమ సౌభాగ్యవంతుడా! మాకు సువీరులతో కూడిన ధనముల నిమ్ము.

2. ఓం అహమేవాస్మ్యమావాస్యా మామా వసన్తి సుకృతో మయీమే ।
మయి దేవా ఉభయే సాధ్యాశ్చేన్ద్ర జేష్ఠాః సమగచ్ఛన్తి సర్వే ॥

అథర్వ. 7. 79. 2

భావము: అమావాస్య దేవుడు ఏమంటున్నాడంటే - ఓ మానవులారా!

నేనే మీకు సదా తోడుగా ఉండే అమావాస్యుడను. నాయందే సుకృతులు సుఖాల ననుభవిస్తూ వసిస్తారు. ఉభయ రకాల స్థావర జంగమ ప్రాణాలునూ వాటివాటి కర్మఫలాల ననుభవిస్తూ నాయందే వసించుచున్నవి.

3. ఓం ఆగన్ రాత్రీ సంగమనీ వసూనామూర్జం
పుష్టం వస్వా వేశయన్తీ ।
అమావాస్యాయై హవిషా విధేమోర్జం
దుహానా పయసా న ఆగన్ ॥ అథర్వ. 7. 79. 3

భావము: ఓ పరమేశ్వరా! నిన్ను ధ్యానిస్తూ నీ సంయోగం చేయు రాత్రి వచ్చినది. కనుక ఈ రోజు మేము విధేయతతో సత్కర్మ లనే హవిస్సులను అర్పింతుము గాక! నీవు మాకు జ్ఞానంతో కూడిన పరాక్రమాన్ని ప్రసాదించి మమ్ము తృప్తి పరుచుము.

4. ఓం అమావాస్యే న త్వదేతాన్యన్యో
విశ్వరూపాణి పరిభూర్జజాన ।
యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు వయం
స్యామ పతయో రయీణాం ॥

అథర్వ. 7. 79. 4

భావము: ఓ అమావాస్యుడా! ఈ నామ రూపాత్మక జగత్తునంతటిని ఉత్పన్నము చేసి, అన్నివైపుల నుండి కప్పుచు, అన్నిటిని నీ ఒడిలో కలిగియున్న వేరొక దేవుడు లేనేలేడు. కనుక మేము కేవలం నిన్నే ఉపాసింతుము గాక. మేము ఏ ఏ కోరికలతో పూర్ణ పురుషార్థం చేయుదుమో, వాటన్నిటిని మాకు ప్రసాదింపుము. నీ కృపవలన మేము అన్నిరకాల ధనాలకు – ఐశ్వర్యాలకు పతుల మగుదుముగాక. స్వాముల మగుదుము గాక!

వివరణ: 'అమా' అంటే తోడుగా ఉండువాడని అర్థం. పరమేశ్వరుడు సర్వవ్యాపకుడు కనుక అదృశ్యరూపంలో... అత్యంత సూక్ష్మరూపంలో మనకు తోడుగా ఉంటాడు. అనన్య భక్తులు మాత్రమే దీనిని గుర్తించగలరు. అతడు సర్వకాల సర్వావస్థలయందు... జననంలోను మరణంలోను కూడా మనకు తోడుగా

ఉంటాడు. కనుక అతడే నిజమైన అమావాస్యుడు (Dearest and Nearest Friend).

(అమావాస్యేష్ఠి సూక్తము సమాప్తం)

పౌర్ణమాస్యేష్టి సూక్తములు

1. ఓం పూర్ణా పశ్చాదుత పూర్ణా పురస్తా
దున్మధ్యతః పౌర్ణమాసీ జిగాయ ।
తస్యాం దేవైః సం వసన్తో మహిత్వా
నాకస్య పృష్ఠే సమిషా మదేమ ॥ అథర్వ. 7. 80. 1

భావము: పౌర్ణమసీ దేవుడు. మనకు వెనుక, ముందు మరియు మధ్యలో కూడా వ్యాపించి పూర్ణుడై యున్నాడు. సమస్త చరాచర జగత్తునకు ఆధార భూతుడైన పౌర్ణమాసీ దేవుడు వీటన్నిటికన్న గొప్పగా శ్రేష్ఠంగా ప్రకాశిస్తూ ఉన్నాడు. ఆ పరమాత్మయందే సమస్త మహిమాన్విత ప్రాకృతిక దేవతలన్నీ చక్కగా నివసిస్తున్నాయి. అట్టి దేవదేవుని యోగాభ్యాసంతో సాక్షాత్కరించుకొని నాకము యొక్క పృష్ఠముపై – సుఖము యొక్క అత్యంత ఉన్నత స్థానమున ఆనందమును పొందుతూ ఆసీనులమగుదుము రండు.

2. ఓం వృషభం వాజినం వయం పౌర్ణమాసం యజామహే ।
స నో దదాత్వక్షితాం రయిమనుపదస్వతీమ్ ॥

అథర్వ. 7. 80. 2

భావము: సుఖములను వర్షించువాడును, అనంతబలవంతుడును అయిన సర్వశ్రేష్ఠ పౌర్ణమాసీ దేవుని మేము పూజింతుము గాక! అతడు మాకు తరిగిపోని అక్షిత సంపదల నిచ్చునుగాక!

3. ఓం ప్రజాపతే న త్వదేతాన్యన్యో విశ్వా రూపాణి పరిభూర్జజాన ।
యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు
వయం స్యామ పతయో రయీణాం ॥

అథర్వ. 7. 80. 3

భావము: హే ప్రజాపతివైన పరమేశ్వరా! నీవు తప్ప మరెవ్వరును ఈ సంపూర్ణ ఆకారవంతమైన పదార్థాలను సృష్టించలేరు. వాటియందు వ్యాపించి

అసలే ఉండలేరు. కనుక, మేము ఏఏ వస్తువులను కోరుతూ ఆహుతులిస్తున్నామో (పూర్ణ ప్రయత్నం చేస్తున్నామో) వాటన్నిటిని మాకు ప్రసాదింపుము. మేము సంపదలకు స్వాములమగుదుము గాక!

4. ఓం పౌర్ణమాసీ ప్రథమా యజ్ఞియాసీత్ అహ్నాం
రాత్రీణామతిశర్వరేషు ।
యే త్వాం యజ్ఞేర్యజ్ఞియే అర్ధయన్త్యమీ
తే నాకే సుకృతః ప్రవిష్టాః ॥ అథర్వ. 7.80.4

భావము: మేము సదా ముందుగా పౌర్ణమాసీ దేవునే పూజింతుము గాక! స్తుతి ప్రార్థనోపాసనలను చేతుము గాక! పగలు, రాత్రి, కటిక చీకటిలో కూడా అతనినే పూజింతుము గాక! హే పూజనీయ పరమేశ్వరా! ఎవరు నిన్ను యథాయోగ్యంగా (సరియైన విధంగా) పూజిస్తారో, సత్కర్మల నాచరిస్తూ వాటి ఫలాలను నీ కర్పిస్తారో అట్టి సుకృతులంతా నాకమున - ఆనందమయ ముక్తిధామమున ప్రవేశించి చిరకాల మచట ఉంటారు.

(పౌర్ణమాస్యేష్టి సూక్తము సమాప్తం)

గాయత్రి ఆశ్రమ ట్రస్టు

12-10-586/6, ఆర్య సమాజము,
వారాసిగూడ, సికింద్రాబాద్-500 061.
(ఇందిరానగర్ రోడ్డు - 2)
సెల్ : 9848011073,
9908994084

Bill No.:

Date : ....

To : ....

....

....

S.No.	Particulars	copies	Rate	Amount
	డా॥ కోడూరి సుబ్బారావు గారి రచనలు			
1.	గాయత్రీ విజ్ఞానం		100.00	
2.	వేదార్థ విజ్ఞానం		100.00	
3.	వేదాలలో సూర్యకిరణ చికిత్స		80.00	
4.	వేదాలలో సార్వజనిక నియమములు		80.00	
5.	మన ఇతిహాసం		70.00	
6.	మన వేదశాస్త్రాల పరిచయం		70.00	
7.	అగ్నిహోత్రం 100 శాతం వైజ్ఞానికం		60.00	
8.	వేదాలలో జలచికిత్సా విజ్ఞానం		60.00	
9.	జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ		60.00	
10.	వేదాలలో దేశభక్తి		60.00	
11.	పెండ్లినాటి ప్రమాణాలు		50.00	
12.	గర్భాదాన విజ్ఞానం		50.00	
13.	సంధ్యావందనం-వైజ్ఞానిక సమాలోచన		50.00	
14.	వేదామృతం		50.00	
15.	గణపతి రహస్యము, శివరాత్రి రహస్యము		50.00	
16.	వేదాలలో మనోవిజ్ఞానం		50.00	
17.	వైదిక ధర్మం అంటే?		50.00	
18.	అగ్నిహోత్ర రాసాయనిక విశ్లేషణ		40.00	
19.	గోమాత		40.00	
20.	దౌహృదిని		40.00	
21.	మరణానంతరం జీవుని ప్రయాణం		40.00	
22.	మానవ ధర్మము		40.00	

23.	పండుగల పరమార్థం		40.00	
24.	వైదిక క్రాంతి పథం		40.00	
25.	ఈశాస్యమిదం సర్వం		35.00	
26.	గాయత్రీ మహిమ		30.00	
27.	యజ్ఞో వై శ్రేష్ఠతమమ్ కర్మ		–	
28.	దేవుడు – జీవుడు – ప్రకృతి		30.00	
29.	వేదాల వెలుగుచూపే ఆర్య సమాజము		30.00	
30.	వైదిక జన్మదిన వేడుక		30.00	
31.	వైదిక గృహప్రవేశ విధి		30.00	
32.	వేదాలలో వర్షేష్టి విజ్ఞానం		30.00	
33.	వేదాలలో అశ్వనీ దేవతలు		30.00	
34.	పురుష సూక్తము		30.00	
35.	వైదిక శాంతి పాఠం (వైజ్ఞానిక వ్యాఖ్య)		20.00	
36.	సృష్టికథ		20.00	
37.	సరస్వతీ సూక్తము		20.00	
38.	విశుద్ధ లక్ష్మీ సూక్తము		20.00	
39.	వైదిక సంస్కృతిలో వానప్రస్థాశ్రమము		20.00	
40.	స్వతంత్ర సముపార్జనలో దయానందుడు		20.00	
41.	గంగాధర శివుడు		20.00	
42.	చతుర్దశ భువనములు		20.00	
43.	యజ్ఞోపవీత వైశిష్ట్యము		–	
44.	చతుర్వేద మంత్ర రత్నాలు*		–	
45.	విశిష్ట వేద సూక్తములు*		–	
46.	వైదిక విజ్ఞానము*		–	
	ఇతర విద్వాంసుల రచనలు			
1.	మాతా పుత్రికల జ్ఞాన చర్చ		60.00	
2.	వేదాలలో విజ్ఞాన బీజాలు		30.00	
3.	స్వరాజ్య సంగ్రామములో ఆర్య సమాజము		20.00	
4.	మరికొన్ని చిన్న పుస్తకాలు ఒక్కొక్కటి		10.00	
	** పోస్టల్ ఖర్చులు అదనం **		Total	